# మిసిమి

2560 బుద్ధజయంతి ప్రత్యేక సంచిక

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక, మే, 2016 ₹ 25

ISSN 2454–4329



**కూవన్ ఇన్**

(సాంత్వన కూర్చే దేవత)

# మిసిమి

మాసపత్రిక

"All that we are is the product of what we have thought"
- *Dammapada*

సంపుటి 27 | మే | సంచిక 5

*ప్రధాన సంపాదకుడు*

చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*

వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకుడు*

కాండ్రేగుల నాగేశ్వరరావు

సాంకేతిక సహాయకులు

పదవల ఉమాశంకర్, చేపూరి రమేష్,
మహమ్మద్ కుర్రముద్దీన్ జీ షాన్, వెల్దండ రమేష్,
వేముల రాణి, సారిక నిర్మల

*సంస్థాపక సంపాదకులు*

రవీంద్రనాథ్ ఆలపాటి

*Printed & Published by*

**Bapanna Alapati**
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536. Cell : 994 951 6567
E-mail : misimi_monthly@yahoo.in
www.misimimonthly.com
**e-magazine : www.kinige.com/misimi**
**http://facebook.com/misimimaasapathrika**

ప్రతి : ₹ 25/- సంవత్సరానికి : ₹300/-
విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

LIBRARY OF CONGRESS LCCN 91-903060

INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE
ISSN 2454-4329


# ఈ నెల...


కమ్మతెమ్మెరలు ..................... 5

సత్యాన్వేషణ : దుఃఖం ..................... 7
- డి. చంద్రశేఖర్

ధర్మచక్ర ప్రశస్తి శాసనం ..................... 12
- డా. ఈమని శివనాగిరెడ్డి

చరిత్ర పుటలలో... మగధ సామ్రాజ్యం ..................... 14
- వేలూరి కృష్ణమూర్తి

మిళింద ప్రశ్నలు ..................... 17
- బోధచైతన్య

అన్వేషణ ..................... 25
- మోక్షానంద స్వామి

బుద్ధపాద మంగళాలు ..................... 28
- డా. బెల్లంకొండ రమేశ్ చంద్రబాబు

బౌద్ధం - తెలుగు నవల ..................... 34
- లకుమ భూదేశ్వర్రావ్

బుద్ధుడు : మానవతా దృక్పథం ..................... 40
- రావిపూడి వెంకటాద్రి

అతి ప్రాచీన రాజధాని బోధన్ ..................... 48
- కందకూర్తి యాదవరావు

గోవు - గోపాలుడు (జెన్ కవిత) ..................... 50
- వావిలాల సుబ్బారావు

నేటి విజ్ఞాన యుగంలో బౌద్ధ ధర్మం ..................... 53
- డా. జె. లక్ష్మిరెడ్డి

అమరావతి స్తూపము ..................... 59
- మల్లంపల్లి సోమశేఖర శర్మ

అశోక ధర్మశాసనాలు (ఆముఖం) ..................... 63
- డా. సి.వి. రామచంద్రరావు

తెలుగులో బౌద్ధ రూపకాలు ..................... 67
- డా. దామెర వేంకట సూర్యారావు

ప్రపంచ సాహిత్యంలో జాతక కథలు ..................... 69

సురాపాన కథ ..................... 71
- టి. సీతారామి రెడ్డి

శాలిహుండం ..................... 77
- బెందాళం క్రిష్ణారావు

బౌద్ధము - సాధన ..................... 81
- బి.వి. భద్రగిరీష్

'జాగరూకులై' ఉండండి ..................... 83
- ఎఫ్.ఆర్.కె. అలెగ్జాండర్

వేదిక ..................... 93

చదవండి... ..................... 96
- ఎన్నార్కె


*ముఖచిత్రం* : గాంధార శిల్పం
*రెండవ అట్ట* : బోధిసత్త్వ అవలోకితేశ్వరి చైనా సంప్రదాయం
*మూడవ అట్ట* : అజంతా మొదటి గుహ (క్రీ.శ. 4, 5)
*నాల్గవ అట్ట* : ప్రజ్ఞాపారమిత : మహాయాన సంప్రదాయంలో దేవీస్వరూపం (చదువులతల్లి సరస్వతి)

అట్టతో కలిపి 100 పుటలు

## సద్ధర్మ పుండరీకం

వైశాఖ పున్నమినాడు సిద్ధార్థుని జననం, జ్ఞానోదయం, బుద్ధుని మహాపరినిర్వాణం జరిగిందని బౌద్ధ సంప్రదాయం తెలుపుతుంది. మహాపరినిర్వాణం జరిగి ఈ వైశాఖ పున్నమికి 2560 సంవత్సరాలవుతుంది. అప్పటినుంచి బుద్ధశకం మొదలైంది. ఈ దేశంలో ఉన్న అన్ని చారిత్రాత్మక శకాలకంటే ఈ శకం పురాతనమైనది.

ప్రపంచంలోని అన్ని సభ్య సమాజాలలో ముఖ్యంగా ఉత్తర అమెరికాలో, పలు ఐరోపా దేశాలలో బౌద్ధం విస్తరిస్తూంది. చాలామంది బౌద్ధ ధ్యానాన్ని అభ్యసిస్తున్నారు. ధ్యానాసక్తులైన వారందరికి బౌద్ధం మలి మెట్టవుతుంది. ఇప్పటికే యు.ఎస్.ఎ.లో 10 శాతం ప్రజలు బౌద్ధాభిమానులని అంచనా. చైనాలో ఇన్నాళ్ళు "మాకు మతం లేదని" చెప్పుకుంటున్నవారు చాలామంది ఇప్పుడు బౌద్ధులుగా నమోదు చేసుకుంటున్నారు. వారి సంఖ్య 40 కోట్లు దాటిందని, రోజు రోజుకి ఎక్కువౌతుందని గణాంకాలు తెలుపుతున్నాయి.

మనదేశంలో, ముఖ్యంగా తెలుగునాట బౌద్ధ పునరుత్థానం సర్వతోముఖంగా జరుగుతూంది. ఎంతోమంది విపశ్యనా ధ్యానం నేర్చుకుని ధర్మంలో పురోగమిస్తున్నారు. బౌద్ధసాహిత్యం విస్తృతంగా వెలవడుతూంది. "బుద్ధభూమి" పేరుతో ఒక బౌద్ధ సాంస్కృతిక మాసపత్రిక నిలదొక్కుకుంది. ప్రతిజిల్లాలోనూ బౌద్ధ విహారాలు వెలుస్తున్నాయి. తెలుగులో ధర్మబోధన చేయగల భిక్షువులున్నారు. బెంగుళూరు మహాబోధి బుద్ధ విహార వారు "తెలుగు త్రిపిటక ప్రాజెక్ట్"ను ప్రభుత్వ సహాయంతో స్థాపించి మూల బౌద్ధ సాహిత్యాన్ని పాళీ నుంచి తెలుగు చేయిస్తున్నారు. ఇప్పటికే సుత్తనిపాత, పారాజిక పాళీ, పాచిత్తియ పాళీ, జాతక నిదాన కథ, జాతక కథల మొదటి సంపుటం అనువదించారు. బౌద్ధ సాహిత్య అనువాద క్రమంలో కొత్త పదజాలంతో తెలుగు భాష సుసంపన్నమౌతూంది. ఇవన్నీ బౌద్ధానికి శుభసూచికాలే.

మనదేశంలోని కళాస్వరూపాలన్నీ బౌద్ధ సంస్కృతితోనే మొదలైనాయి. ఈ సంచికలోని నాలుగు అట్టమీది చిత్రాలు వాటి ప్రతీకలు. ముఖచిత్రం గాంధార శిల్పం; గాంధారశిల్పాలలో గ్రీకు, రోమన్ శిల్పకళా ప్రభావముంటుంది. రెండవది చైనా సంప్రదాయంలోని బోధిసత్వ అవలోకితేశ్వరుని స్త్రీ స్వరూపం; చైనా సంప్రదాయంలోనే అవలోకితేశ్వరుని స్త్రీ మూర్తిగా చూపుతారు. ఆమెను సంతానప్రాప్తికి ప్రార్థిస్తారు. బౌద్ధం చైనాకు వెళ్ళకముందే వున్న స్థానిక దేవీ ప్రతిరూపమే ఈ బోధిసత్వుడని చరిత్రకారులంటారు. మూడవది ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపబడిన అజంతా గుహ సముదాయంలో మొదటిది. అజంతాలోని మొదటి గుహ చారిత్రకపరంగాను, సౌందర్యపరంగా ప్రథమ స్థానానికి అర్హత పొందింది. మొదట ఒక పెద్ద ప్రాంగణం. దానినానుకొని రెండువైపులా పద్నాలుగు చిన్న గదులు, ఒక నడవి, ఒక గర్భగుడి. ఇది నాలుగు – ఐదు శతాబ్ద కాలంలో తొలచబడింది. దీని కేంద్రస్థానంలో బుద్ధుడు ధర్మచక్ర ప్రవర్తన ముద్రలో శిల్పించబడ్డాడు. పద్మపాణి, వజ్రపాణిలతో పాటు, శిబి, శంకపాలా, మహాజనకా, మహాఉమ్మగ్గ, మారుని మాయాజాలంలాంటివి కుడ్య చిత్రాలుగా చెక్కబడినవి.



జపాన్ వారి సాంకేతిక సహకారంతో అజంతా గుహలలో కొత్త దీపాలను అమర్చారు. ఈ కాంతి వలన గుహలోని చిత్రాలు మసకబారవు.

నాల్గవ చిత్రం, మహాయాన సంప్రదాయసారమైన ప్రజ్ఞాపారమిత సూత్రాలకు దేవీస్వరూపం. మన చదువులతల్లి సరస్వతిని పోలి బహు సుందరమైన ఈ ప్రతిమలకు ఇండోనేషియా ప్రసిద్ధి.

బౌద్ధం తెలుగు జాతికి మూలసంస్కృతి. దాని పునరుద్ధరణ, ఆచరణ జరిగితేనే మనం ముందుకు పోగలం. మనల్ని మూఢ నమ్మకాలనుంచి, కులపంకంనుంచి వెలికి తీసి మంగళకరమైన భవిష్యత్తును ప్రసాదించగల శక్తి సామర్థ్యాలు ఈ సద్ధర్మ పుండరీకానికే ఉన్నాయి.

– సంపాదకులు

# కమ్మతెమ్మెరలు

✧ "*మిసిమి* మార్చిలో వచ్చిన చరిత్రలో చెరగని జ్ఞాపకాలు లాంటి గొప్ప వ్యాసాన్ని అందించినందుకు కృతజ్ఞతలు. వెంకటేశ్వర్లుగారి వివరణాత్మక వ్యాసం – ఆధునిక ఆలయాలు – హృదయాన్ని ఆనందంతోనూ, భావావేశంతోనూ నింపివేసింది. ధన్యవాదాలు..."

*– సి.వి.ఎన్. మూర్తి, హైదరాబాదు*

✧ "...స్త్రీ హృదయపు లోతులు – స్త్రీ అంతరంగం (భవాని) నన్ను ఇంకా వెంటాడుతూనే ఉంది. భాషకందని భావాలకు అక్షరరూపం ఇచ్చిన రచయితకు అభినందనలు. ప్రతీ అక్షరంలో నిక్షిప్తమైన విషాదం, అందులోని గాఢత చాలా కదిలిస్తుంది. మళ్ళీమళ్ళీ మొదటి అక్షరం నుండి చదివాను. అందమైన విషాదం అంటే ఇదేనేమో! ఆత్మీయంగా ఆమెని దగ్గరికి తీసుకోవాలనిపించింది. ఆమెలోని శూన్యాన్ని, అంతులేని ప్రేమని, భావుకతని ప్రతి అనుభూతిని నేను కూడా ఫీల్ అయ్యాను. తెలుగులో తియ్యదనాన్ని, భావవ్యక్తీకరణలోని సౌందర్యాన్ని చాలాసార్లు ఆస్వాదించాను. కవిత్వం కథగా రూపుదిద్దుకుంటే ఎలా ఉంటుందో *భవాని* ని చదివితే తెలుస్తుంది. చలం 'ఓ పూవు పూసింది'. తర్వాత అంత అందమైన కథ ఇదేనేమో అని నాకనిపించింది...."

*– స్వప్న, వరంగల్*

✧ "...కథలో అంతర్లీనంగా ఒక విషాదం పరచుకొని ఉంది. అయితే, అందులో ఒక సౌందర్యం దాగుంది. సౌందర్యం అంటే ఆనందం కదా – విషాదం, ఆనందంగా ఎలా మారుతుంది? అందుకే ఈ గాథ ఒక తీయని బాధ..."

*– అంపశయ్య నవీన్, హైదరాబాద్*

✧ "... ఇది మా చెల్లెలి కథలా అనిపించింది..." *– ఎర్రమెల్లి రోహిణీకుమార్, సాకుర్రు, అమలాపురం*

✧ "... భవాని చదువుతుంటే మా అమ్మాయి కథలా తోచింది..." *– దుర్గాప్రసాద్, తిరుపతి*



✧ "... ఏప్రియల్ సంచికలోని గీతం–సంగీతమ్ వ్యాసం అద్భుతంగా ఉంది. ముఖ్యంగా శాస్త్రీయ సంగీతాన్ని ఆస్వాదించలేకపోతున్నామన్న సంగతీ, "మన అదృష్టం ఘంటసాలవంటి పునీతుడు" అన్న వాక్యాలు పులకరింపచేసాయి. వ్యాసకర్త ఎవరో తెలియదుకాని వారికి అభినందనలు...."

*– డి.ఎస్. శంకర్, వక్కలంక*

✧ "... ఇప్పుడే బస్టాండులో ఏప్రిల్ సంచిక చూశాను. ముఖచిత్రం ముచ్చటగొలుపుతోంది... ఇంత ఎండలో మనసుకు చల్లగా తోచింది..." *– అలెగ్జాండర్, నల్గొండ*

✧ "... *మిసిమి* సంపాదకులుగారికి.... *కథలెందుకు :* కథ యొక్క సమగ్ర రూపాన్ని అద్భుతంగా వివరించారు. కథకున్న శక్తిని, ప్రయోజనాన్నీ సరసమైన పదాలతో సంక్షిప్తంగా పది పంక్తుల్లో వివరించడం రచయితకున్న పూర్తి అవగాహనకు నిదర్శనం. నా మనస్సుకు హత్తుకున్న కొన్ని విషయాలను ప్రస్తావిస్తాను.

... ప్రకృతిలో మనుష్యులకున్న ప్రత్యేకత భాష... కథలు అల్లడం చెప్పడం ఒక కళ... అక్షరాలకు కథ ఆట మైదానంవంటిది... కథలు అన్యోన్యతను సృష్టిస్తాయి... ప్రతి శక్తిలానే కథ కూడా ప్రమాదకారే... వయసు మళ్ళినవారు వయసులోని అనుభూతులను నెమరువేసుకోగలుగుతారు... మంచి కథలు మనల్ని మంచి మనిషిగా బ్రతకడానికి దోహదం చేస్తాయి.. నీ గూడు నీ నాడు వదలకు.. మానసికమైన సమయం, అంతరిక్షం! నిరంతర ప్రవాహం, ఎడతెగని ఆగామి చింతన... విశ్వరహస్యం ఎవడైనా పూర్తిగా అవగాహన చేసుకున్నాను అంటే వాడు పిచ్చివాడైనా అయి ఉండాలి లేక అసత్యవాదైనా అయి ఉండాలి... సాహిత్య ప్రక్రియలపై మరిన్ని వ్యాసాలు రావాలని కోరుకుంటూ....

"....ఉత్తమ పురుషలో రాసిన *భవాని* కథ యుక్తవయస్సులో భర్తను కోల్పోయిన యువతి అంతరంగ మథనం అద్భుతంగా చిత్రీకరించబడింది. కథకుడు భవాని పాత్రలో పరకాయప్రవేశం చేశాడనిపించింది. వయసుతోపాటు వచ్చే శారీరక మార్పులను మామూలు మాటలలో... ఉదాహరణకు కనురెప్పలు బరువెక్కటం, చనుమొనలు పదునెక్కటంగా వర్ణించటం

సహజంగా ఉన్నాయి. కథ గొప్పగా ఉంది. కథనం మరింత గొప్పగా ఉంది. కథకుడు భవానీ యొక్క మనోభావనలను అలవోకగా సరళీకృతమైన పదప్రయోగాలతో చదువరులలో ఆసక్తిని, కుతూహలాన్ని కలిగించ కలిగారు. నేను మెచ్చిన కొన్ని ప్రయోగాలు ఉదహరిస్తాను. "...నేను కాస్త వళ్ళు చేయడానికి, సీనియర్ల కళ్ళు పడడానికి ఆ మాత్రం సమయం పడుతుంది, పట్టింది... శరీరం రంగు బంగారం అనలేనుగాని పసుపు, పాలు కలిసినట్లుంది... ప్రాణం అంత పెలుసా! సబ్బునీటి బుడగా?... ఒంటరితనం కోర్కెలను మంటపెట్టేది, ఋతుక్రమంలో మంటలు రేపేది... తీరే కోర్కెలు కావు, ఇవి ఆరేమంటలూ కావు, అణచుకోవాలి – ఆర్పుకోవాలి... ఎక్కువ వృత్తిసంబంధం – విత్తసంబంధం... ప్రకృతిలో ఒక్కో ఋతువు ఏదో ఒక జీవనానికి పదునుపెడుతుంది... జల్లులు పడితే నేల పదునెక్కుతుంది... వర్షాలు పడితే నదులు పరుగులు పెడుతాయి... పూలు పూసి పిందెలు కాయలవుతాయి... ఎండ పొదలకు కాయలు పండ్లవుతాయి... ప్రాణికోటి తమతమ ఋతువుల్లో పునరుత్పత్తికి పదునెక్కుతాయి... కలల మబ్బుల్ని పిండితే వలపు తేనియలు రాలుతాయా?... నిద్ర లేకపోతే కలలెలావస్తాయి?... నుదురు నదరుగా ఉంది... పదహారేళ్ళ మనసేగాని పడుచు ఈడు కాదు... ప్రేమ ఉన్నచోట అహం ఉండదు, అహం లేని చోట తెరలూ ఉండవు... మంచి కథ చదివిన అనుభూతి కలకాలం ఉంటుంది. ఇలాంటి మంచి కథలు ***మిసిమి*** లో రావాలని ఆకాంక్షిస్తూ...

*– (ఈ-మెయిల్) పాతూరి కోటేశ్వరరావు (ప్రిన్సిపాల్, విజ్ఞాన్), గుంటూరు*

✧ "... ***మిసిమి*** మాసపత్రిక క్రమ తప్పకుండా నెల మొదటి వారంలోనే ప్రవాసాంధ్రులకు అందించడం మీ భాషాసేవా తృష్ణకు నిదర్శనం. ***మిసిమి*** వ్యాసాలు భారతీయ సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తూ తెలుగు భాషా పరిశోధనల్ని లోతుల్లోకి పోయి విశ్లేషిస్తున్న తీరు అభినందనీయం. *క్రోమోసోమ్* కథనాన్ని గత ఆరు నెలలుగా ఇస్తున్న మీరు సైన్స్ విద్యార్థులకే కాకుండా సాధారణ విద్యార్థులకు సునాయాసంగా అర్థమయ్యేరీతిలో గంభీరతను సంతరించుకున్నవి. ఇక వ్యాసం, నాట్యం, సంగీతం, జానపదం, నవల ఆంగ్లసాహిత్య ప్రక్రియల్లో ప్రముఖుల జీవితరేఖల్ని అందించటం ముదావహం. అట్టమీది బొమ్మలు ఆకర్షణీయం. వైద్యశాస్త్రంలో మొదటి భారతీయ మహిళా వైద్యురాలు *ఆనంద్‌బాయి జోషి* జీవిత పరిచయం ఆద్యంతం ఆసక్తిదాయకం. *మొల్ల రామాయణం* విశేషాన్ని విపులంగా వివరించిన డా॥ కసిరెడ్డి వెంకటరెడ్డి గారికి శ్రీరామరక్ష సర్వజగద్రక్ష! స్త్రీల జానపద ప్రదర్శనలు జానపద విజ్ఞానాన్ని క్షుణ్ణంగా వివరించిన తీరు అభినందనీయం..."

***– డా. మొయిలి శ్రీరాములు**, బీహార్*

✧ "... చరిత్రలో చెరగని జ్ఞాపకాలు వ్యాసం బావుంది, కాని ఇందులో ఒక పొరపాటు దొరలింది!
... మాచర్ల నుండి నందికొండకు జీపు నడిపిన వారు శ్రీ పొతకమూరి అంతయ్య. ఆయన తలకుపాగా చుట్టుకొని జీపును, అడ్డదిడ్డంగావున్న తోవలో గమ్యానికి చేర్చారు. ఆయన్ని ఆచార్య రంగా తలగుడ్డ అంతయ్య అని ప్రేమగా పిలిచేవారు. ఇద్దరు అంతయ్యలు లేరు. ఒక్కరే ఆయన పొతకమూరి అంతయ్య... శ్రీ దరువూరి వీరయ్య ప్రచురించిన నాగర్జున సాగర్ సర్వస్వంను వ్యాస రచయిత పేర్కొని వుండవలసింది..."

***– రామమోహన రాయ్**, గుంటూరు*

✧ "... మార్చి నెల సంచిక అద్భుతంగా వున్నది. *చరిత్రలో చెరగని జ్ఞాపకాలు* పేరుతో నాగార్జున సాగరం గూర్చి చాలా మంచి వ్యాసం రాశారు కె. వెంకటేశ్వర్లు గారు. చాలా స్వల్ప కాలం 1957లో అక్కడ వుద్యోగం చేసిన నేను కూడా వారికి రుణపడి వున్నాననిపిస్తున్నది... ఇంత వరకూ నాగార్జున సాగరం గూర్చి సమగ్రమైన పుస్తకం రాలేదనుకుంటాను. Impact of the Project in changing the economic condition of the people, socialogical changes, human relations మొస్తరు అంశాలు కూర్చిన గ్రంథం రాలేదనుకుంటా... వెంకటేశ్వర్లుగారు అటువంటి గ్రంథం రాస్తే చాలా గొప్ప పనిచేసినట్లే. వారి చేత వ్రాయించవలసినదిగా ప్రార్థన..."

***– పున్నవ జగన్నాథం**, హైదరాబాదు*



# సత్యాన్వేషణ : దుఃఖం

– డి. చంద్రశేఖర్

"మనిషి జీవితంలో దుఃఖం ఉంది" అని అంటే చాలమంది సులభంగానే అంగీకరించవచ్చు. ఎందుకంటే, 'ప్రతిఒక్కరూ తమ జీవితంలో ఎంతోకొంత దుఃఖాన్ని అనుభవించక తప్పదు', 'జీవితమంటే సుఖదుఃఖాల కలయిక' అనే మాటలు తరచూ వింటుంటాం. ఇటువంటి అభిప్రాయాలపట్ల పెద్దగా అభ్యతరం వ్యక్తమౌతున్నట్లు కనిపించదు. కానీ, "మానవ జీవితం దుఃఖమయం" అనే భావనను అంగీకరించటానికి చాలమంది తటపటాయిస్తారు, దీన్ని వ్యతిరేకిస్తారు కూడా. ఎందుకంటే, ఎటువంటి మినహాయింపు లేకుండా 'మానవులందరూ దుఃఖాన్ని ఎదుర్కొనక తప్పదు లేక మానవ జీవితం దుఃఖంతో నిండివుంది' అనే సార్వత్రిక భావాన్ని పై వాక్యం ప్రకటిస్తుంది. కనుక, అంగీకరించటానికైనా లేదా తిరస్కరించటానికైనా దీన్ని లోతుగా పరిశీలించక తప్పదు.

జీవితంలో అసలు దుఃఖం అనేదే లేకుంటే, బహుశా, మానవుడికి ధార్మిక అన్వేషణ, తాత్విక చింతన, చివరకు విజ్ఞానశాస్త్ర పరిశోధన సైతం అవసరమై ఉండేదికాదేమో. అందుకే ప్రవక్తలు తత్వవేత్తలు, దాదాపు అందరూ, ఏదోఒక రూపంలో ఏదోఒక స్థాయిలో మానవ జీవితంలోని దుఃఖంతో వ్యవహరించారు. అంతేకాదు ఎవరికివారు, మానవుడు ఎదుర్కొంటున్న దుఃఖాన్ని, దానికి గల కారణాలను తాము దర్శించిన స్థాయి మరియు తీరుకు అనుగుణంగా, పరిష్కారాలనూ సూచించారు. ఉదాహరణకు ఋగ్వేద ఆర్యులు ప్రకృతి శక్తుల నుండి ఎదురవుతున్న ప్రతికూలతను, ఉపఖండంలోని స్థానిక తెగలకు చెందిన ప్రజలను, అంటే ద్రావిడ జాతులను తమ అస్థిత్వపు ప్రధాన సమస్యలుగా భావించారు. అందుకే వారు ప్రకృతి శక్తుల ప్రతిరూపాలైన ఆదిత్య (సూర్యుడు), అగ్ని, వాయువు, వరుణుడు మొదలైన దేవతలను పూజించారు, పశుసంపద, సంతానం, దీర్ఘాయుషు, శక్తినిచ్చే సోమరసం, యుద్ధాల్లో గెలుపు కోసం ప్రార్థనలు చేశారు. ఆధునిక పారిశ్రామిక యుగంలో – పెట్టుబడిదారి వ్యవస్థలోని ఆర్థిక, సాంఘిక అసమానతల్లోనే మానవుని సమస్యలన్నీ యిమిడివున్నాయని కార్ల్ మార్క్స్ తదితర సామాజికవేత్తలు భావించారు; కనుక, ప్రస్తుత వ్యవస్థను మార్చి సామ్యవాద వ్యవస్థను స్థాపించటమే అన్ని సమస్యలకు పరిష్కారమని చెప్పారు. ఇక ఆధునిక విజ్ఞానశాస్త్రం కూడా అంతర్లీనంగా తనదైన 'తాత్విక చింతన' కలిగివుంది. అది ప్రత్యేకంగా దుఃఖం గురించి చర్చించనప్పటికి, "అవసరం ఆవిష్కరణకు తల్లివంటిది" (Necessity is the mother of invention) అని చెప్పిన సూక్తిలో, "అవసరం" లేక "కొరత" అనే రూపంలో సార్వజనీన మానవ సమస్యను విజ్ఞానశాస్త్రం గుర్తించింది. విస్తృతార్థంలో, "మానవ సమస్యల పరిష్కారమే శాస్త్రాన్వేషణ పరమలక్ష్యము"ని, ఎప్పటికప్పుడు సరికొత్త విజ్ఞానశాస్త్ర ఆవిష్కరణలు, వాటి ఆధారంగా టెక్నాలజీని అభివృద్ధిపర్చటం ద్వారా మనిషి ఎదుర్కొనే సమస్యలన్నిటినీ పరిష్కరించగలమనే 'తత్వాన్ని' అది చెప్పకనే చెబుతుంది.

అంతేకాదు, "అందినమేరకు అన్నిరకాల సుఖాలను అనుభవించటమే జీవితపరమార్థం" అని చెప్పే భోగవాదం (hedonism) సైతం, మనిషి జీవితంలో "అసంతృప్తి" అనే సమస్య కొనసాగుతూ ఉందనే సత్యాన్ని పరోక్షంగా అంగీకరిస్తుంది. ఆర్థిక, సాంఘిక, రాజకీయ, శారీరక, మానసిక సమస్యలు ఏవైనా, అంతిమంగా అవి బాధ, నిరాశ, ఆ సంతృప్తి, అభద్రత మొదలైన రూపాల్లో మనకు దుఃఖం కలిగించకపోతే, అసలు వాటిని మనం "సమస్య"గానే గుర్తించం; వాటిని పరిష్కరించాలని ప్రయత్నించం. తరచిచూస్తే, సుఖంకోసం సంతోషంకోసం మనం చేసే ప్రతి

ప్రయత్నం, నిజానికి ఏదోఒక రూపంలో దుఃఖం ఉందని సూచిస్తుంది.

ఇలా వివిధ కాలాల్లో వివిధ తత్వవేత్తలు, ప్రవక్తలు, శాస్త్రవేత్తలు ఏదోఒక రూపంలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యవహరించిన జీవితపు అస్థిత్వ సమస్యలన్నిటిని సూచించటానికి ప్రాచీన భారత దార్శనికులైన శ్రమణులు "దుఃఖ" లేక "దుఃఖం" అనే పదాన్ని ఉపయోగించారు. ఇది "సుఖ" లేక "సుఖం" అనే పదానికి వ్యతిరేకమైన అర్థం కలది. మరోరకంగా చెప్పాలంటే, "దుఃఖం" అనేది మానవుని అస్తిత్వపు సమస్యలన్నిటిని వ్యక్తంచేసే ఒక సార్వత్రిక పదం. దీనిలో యిమిడిపోని లేదా దీని ద్వారా వ్యక్తం చెయ్యలేని సమస్య అంటూ ఏదీ ఉండదని చెప్పటం అతిశయోక్తి కాదు.

ప్రాచీన భారత దార్శనికుల్లో సుప్రసిద్ధుడైన గౌతమ బుద్ధుడు, మానవజీవితంలో ఎదురవుతున్న "దుఃఖం"తో సూటిగా తలపడ్డాడు. దుఃఖం సత్యాన్వేషణకు కేంద్రబిందువని గుర్తించాడు. "లోకం దుఖంతో నిండివుంద"ని ఎటువంటి సందిగ్ధతకు తావులేకుండా బుద్ధుడు సూటిగా, స్పష్టంగా ప్రకటించాడు *(సంయుక్తనికాయ : 40).* దీనిప్రకారం, దుఃఖమనేది జీవితంలో అప్పుడప్పుడు వచ్చిపోయే తాత్కాలిక పరిణామం కాదు; అది మానవ జీవితాన్ని నిరంతరం పట్టిపీడిస్తున్న అత్యంత తీవ్రమైన రుగ్మత, రోగం, వ్యాధి లేక జబ్బు. కనుక, ఈ రుగ్మతను పరిష్కరించటమనేదే సత్యాన్వేషణకు లేక ధార్మిక సాధనకు ఏకైక లక్ష్యంగా వుండాలంటూ, "నేను దుఃఖం గురించి, దుఃఖనిరోధం గురించి మాత్రమే బోధిస్తాను" అని బుద్ధుడు ప్రకటించాడు *(మధ్యమనికాయ :140).* "ఎటువంటి సందిగ్ధతకు తావివ్వని యీ వాక్యాన్ని అర్థంచేసుకోవటం, బుద్ధుని బోధనల మొత్తం సారాన్ని గ్రహించటం వంటిద"ని శ్రీలంకకు చెందిన బౌద్ధభిక్షువు, భదంత పియదస్సి మహాథేర అన్నారు. దుఃఖనివారణతో నిమిత్తం లేనటువంటి, "మౌలిక" తాత్విక సమస్యలుగా ప్రచారం పొందిన ప్రశ్నలతో బుద్ధుడు వ్యవహరించలేదు. విశ్వం శాశ్వతమా లేక అశాశ్వతమా? విశ్వం సాంతమా లేక అనంతమా? జీవం, శరీరం ఒక్కటేనా లేక భిన్నమైనవా? మొదలైన సమస్యలను పరిష్కరించాలని చేసే ప్రయత్నాలు నిరర్థకమేగాక, అటువంటి ప్రయత్నాలు మనిషికి మరింత దుఃఖాన్ని తెచ్చిపెడతాయని బుద్ధుడు హెచ్చరించాడు. అయితే, సర్వకాలసర్వావస్థల్లో మానవ జీవితాన్ని ఆవహించి, ప్రతిఒక్కరికి అనునిత్యం ఎదురయ్యే "దుఃఖం" అందరికీ ఎందుకు అర్థంకావటంలేదు? అర్థంచేసుకున్న కొందరికైనా పాక్షికంగా మాత్రమే ఎందుకు అర్థమౌతుంది? దుఃఖం అనేది అత్యంత విలువైన సత్యమని కనుగొనటానికి మహాజ్ఞాన సంపన్నుడైన ఒకవ్యక్తి అవసరమా? అనేవి సహజంగా తలెత్తే ప్రశ్నలు. వీటికి సమాధానం చెప్పుకోకుండా ముందుకుసాగటం సరికాదు.

మనిషికి బాగా సన్నిహితమైన లేదా నిత్యం అనుభవంలోకి వచ్చే విషయాలను లేక సత్యాలను కనుగొనటం, అర్థంచేసుకోవటం సులభమని చాలమంది అనుకుంటారు. కాని, అటువంటివాటిని కనుగొనటమే అత్యంత కష్టమని విజ్ఞానశాస్త్ర చరిత్ర అనేకసార్లు నిరూపించింది. ఉదాహరణకు, భూమి నిరంతరం కదలికలో వుందని, దానితోపాటు మనం కూడా అనుక్షణం ఎంతోవేగంగా తిరుగుతున్నామని ఈనాడు చాలమందికి తెలుసు. కాని, తాము కదలికలో వున్నామనే విషమే తెలియకుండా చరిత్రలో లెక్కకందనంతమంది గతించిపోయారు; యిప్పటికీ ఈ విషయం తెలియనివారు కొల్లలు (సూర్యుడు మనచుట్టూ తిరగటంలేదని, మనమే సూర్యునిచుట్టూ తిరుగుతున్నామనే విషయంలో కూడా యిదే వర్తిస్తుంది). ఈ సత్యాన్ని కనుగొని, నిరూపించటానికి కోపర్నికస్, గెలీలియో, బ్రూనో వంటి అత్యంత ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలు తమ జీవితాలను ధారపోయవలసి వచ్చింది. సరిగ్గా ఇదేరీతిలో, అందరూ ఒక మామూలు అనుభవంగా పరిగణించే దుఃఖాన్ని, అత్యంత విలువైన సత్యంగా ఆవిష్కరించటానికి ఒక సమ్మాసంబుద్ధుడు (పరిపూర? జ్ఞానసంపన్నుడు) అవసరమయ్యాడు.

మరి, ఇటువంటి గంభీరమైన సత్యాన్ని సామాన్యులు అర్థంచేసుకోవటం సాధ్యమేనా? అనేది మనం సమాధానం చెప్పుకోవలసిన మరొక ప్రశ్న. ఈ ప్రశ్నకు "అవును సాధ్యమే"నని జవాబు చెప్పటానికి రెండు కారణాలున్నాయి. ఒకటి, ఎవరికీ అంతుచిక్కని ఒక విషయాన్ని ఒకరు కనుగొని బహిర్గతం చేసిన తరువాత, అది యిక 'అంతుచిక్కని రహస్యంగా' వుండదని చెప్పటానికి చరిత్రలో అనేక ఉదాహరణలు చూపించవచ్చు. బుద్ధుడు దుఃఖసత్యాన్ని కనుగొనటమేగాక, చిత్తశుద్ధితో ప్రయత్నించేవారందరూ అర్థంచేసుకోగలిగే రీతిలో దాన్ని వివరించాడు. రెండు, పైన

ఉదహరించిన విజ్ఞానశాస్త్ర సత్యాలను సదరు శాస్త్రవేత్తలు కనుగొన్నప్పుడు, కొద్దిమంది మాత్రమే వాటిని గ్రహించగలిగారు; ఎంతోమంది వాటిని తీవ్రంగా వ్యతిరేకించారు కూడా. అయితే, కాలక్రమంలో చాలమంది వాటిని అర్థంచేసుకోగలిగారన్న విషయం మనకు తెలుసు. అలాగే, బుద్ధుడు కనుగొని బోధించిన తరువాత దుఃఖసత్యాన్ని అనేకమంది గ్రహించగాలిగారని గత 2,500 సంవత్సరాల చరిత్ర సాక్ష్యం చెబుతుంది.

పై పేరాలోని విషయాలు, "దుఃఖాన్ని అర్థంచేసుకోవటం చాలా సులభం" అని మిమ్మల్ని మభ్యపెట్టటానికి చెప్పినవి కావు. అప్పుడప్పుడు తీవ్రరూపంలో బహిర్గతమయ్యే దుఃఖాన్ని గుర్తించటం సులభమే. కాని, సూక్ష్మరూపంలో, నిరంతరం ఉత్పన్నమయ్యే దుఃఖం యొక్క నిజస్వరూపాన్ని గ్రహించటానికి తగిన సంకల్పం మాత్రమేగాక, సరైన ప్రయత్నం కూడా అవసరం. బుద్ధుడు దుఃఖాన్ని ఒక వ్యాధి లేక జబ్బుతో పోల్చాడని పైన చెప్పుకున్నాం. దీన్ని ఒక వ్యాధిగా పరిగణించి పరిశీలిస్తే, యిది మనకు స్పష్టంగా అర్థంకావచ్చు. అదెలాగో చూద్దాం. మనకు ఒక స్వల్పకాలిక వ్యాధి సోకినప్పుడు, అది తేలికపాటిదైనా లేక తీవ్రమైనదైనా, "నాకు జబ్బుచేసింద"ని ఒప్పుకోటానికి మనకు అభ్యంతరం ఉండదు. కాని, అది దీర్ఘకాలికమైన లేదా మరణాంతకమైన రోగమైతే, అది మనకు సోకిందనే వాస్తవాన్ని ఒప్పుకోటానికి కూడా మనసు సమ్మతించదు, యితరులకు చెప్పటానికి అసలే అంగీకరించదు. అన్నిటినీమించి, అటువంటి వ్యాధి చాపకింద నీరులా శరీరంలో మెల్లమెల్లగా వ్యాపిస్తుంటే, వ్యాధి సోకిందనే విషయమే మనకు తెలియదు. మానసిక వ్యాధులను గుర్తించటంలో యిది తరచూ ఎదురయ్యే సమస్య. ఇంతకంటే జటిలమైన విషయం ఏమిటంటే, అటువంటి వ్యాధి సమాజంలో అందరికీ వుంటే, అసలు దాన్ని ఒక వ్యాధిగా గుర్తించటమే మనకు దుర్లభమౌతుంది. కొందరు దాన్ని గుర్తించగలిగినా, ఆ విషయాన్ని యితరులకు చెప్పి ఒప్పించటం కూడా కష్టమౌతుంది. దుఃఖాన్ని గుర్తించటంలో సరిగ్గా యిటువంటి సమస్యలే వున్నాయి. శారీరక మానసిక వ్యాధులను గుర్తించి, నిర్ధారించటానికి మనం వైద్యులను సంప్రదించవచ్చు. కాని, యీ ధార్మికమైన వ్యాధిని, అంటే దుఃఖాన్ని ఎవరికివారే స్వయంగా గుర్తించక తప్పదు.

వివిధ తత్వవేత్తలు, ప్రవక్తలు దుఃఖం గురించి చర్చించారని పైన చెప్పుకున్నాం; అలాగే, దుఃఖం దుఃఖనివారణ తత్వచింతనకు కేంద్రబిందువు కావాలని బుద్ధుడు చెప్పాడని తెలుసుకున్నాం. ఈ విషయంలో యితర తత్వవేత్తలు చెప్పినదంతా తప్పు అని తోసిపుచ్చలేం. కాని, "అసలు సమస్య"ను వెదికి పట్టుకోవటంలో యితరులకు, బుద్ధునికి మధ్య రెండు ప్రధానమైన తేడాలున్నయ్. మొదటిది – ఇతరులంతా మానవ జీవితంలోని దుఃఖాన్ని తరతమ స్థాయిల్లో, పాక్షికంగా మాత్రమే చూడగలిగారు; బుద్ధుడు దాన్ని అన్నికోణాల్లో సమగ్రంగా దర్శించగలిగాడు. రెండవది – ఇతరులు ప్రధానంగా మనిషికి బాహ్యంగా వున్న కారణాలు దుఃఖానికి మూలమని భావించగా, మనిషి అంతరగంలోని కారణాలే ప్రధానమైనవని బుద్ధుడు చెప్పాడు. అయితే, బాహ్యకారణాలను ఆయన పూర్తిగా నిరాకరించలేదు; వాటికన్నా అంతర్గత కారణాలే మౌలికమైనవని, దుఃఖాన్ని నివారించేందుకు ప్రధానంగా వాటిపైనే గురిపెట్టాలని చెప్పాడు.

* * *

"దుఃఖం" అనే పదాన్ని బుద్ధుడు ఉపయోగించిన ధార్మిక లేక తాత్విక భావంలో పూర్తిగా అర్థంచేసుకోవాలి. లేదంటే, 'ఇంత చిన్న విషయానికి అంత రాద్ధాంతమెందుకు' అనిపించవచ్చు. అంతకంటే ముఖ్యంగా, దుఃఖసత్యాన్ని దాని గంభీరమైన విస్తృతమైన రూపంలో సమగ్రంగా అర్థంచేసుకోవటంలో విఫలమైతే, బుద్ధుని బోధనల సారాన్ని గ్రహించటంలో, దాన్ని మనజీవితాలకు అన్వయించి ప్రయోజనం పొందటంలో విఫలమవుతాం. కనుక, బుద్ధుడు బోధించిన విస్తృతార్థంలో దుఃఖం గురించి తెలుసుకుందాం.

సాధారణంగా దుఃఖం అనే భావాన్ని శారీరకమైన బాధ, నొప్పి, పీడ, నిస్సత్తువ, అసౌకర్యం మొదలైన వాటితోపాటు మానసికమైన అసంతృప్తి, అలజడి, ఆవేదన, నిరాశ, చికాకు, విచారం, ఒత్తిడి మొదలైన పదాల్లో వ్యక్తం చేస్తుంటాం. అలాగే, తీవ్రమైన దురవస్థ, ఆపద, ప్రమాదం, విపత్తు, సంక్షోభం వంటివి సంభవించినప్పుడు కలిగే శారీరక, మానసిక బాధలు తీవ్రతరమైన దుఃఖాన్ని తెలియజేస్తాయి. చాలాసందర్భాల్లో 'ఇది శారీకం', 'ఇది మానసికం' అని ఖచ్చితంగా విభజించి చూపటం సాధ్యంకాకపోవచ్చు; తరచూ అవి ఒకదానితో మరొకటి కలగలసి వుంటాయి. మొగుడు కొట్టిన దెబ్బలు శారీరకంగా బాధ కలిగిస్తే, అదిచూసి తోడికోడలు నవ్వితే

అవమానంతో మానసికంగా మరింత బాధ కలుగుతుంది. స్థూలమైన ఈ శారీరక మానసిక బాధలను సంప్రదాయ బౌద్ధగ్రంథాలు దుక్ఖ – దుక్ఖతా అని పిలిచాయి. నిత్యజీవిత అనుభవాన్ని గమనించేవారెవరైనా దీన్ని సులభంగానే అర్థంచేసుకోవచ్చు.

సుఖం, సంతోషం లేదా ఆనందం అనేవి స్థిరంగా కొనసాగవు, అవి తరచూ మారిపోతుంటాయి. ఎందుకంటే, అవి మనలో ఉత్పన్నం కావటానికి కారణమైన పరిస్థితులు నిరంతరం మారిపోతుంటాయి. వాటితోపాటు మనకు కలిగిన సుఖసంతోషాలు లేక ఆనందం తరిగిపోవటం, చివరకు పూర్తిగా భగ్నమైపోవటం జరుగుతుంది. వాటి స్థానంలో అసంతృప్తి, నిరాశ, అభద్రతాభావం చోటుచేసుకుంటాయి. వాస్తవంగా బాహ్యపరిస్థితుల్లో తగినంత మార్పు రాకముందే, మన మానసిక స్థితి మారిపోతుంది. ఇప్పుడు పొందుతున్న సుఖసంతోషాలు చేజారిపోతాయనే భయం మనల్ని పీడిస్తుంది. పరిస్థితుల్లో వచ్చే మార్పువల్ల కలిగే ఇటువంటి దుఃఖాన్ని పాలిభాషలో విపరిణామ–దుక్ఖతా అని అంటారు. ఇది పైన ఉదహరించిన దుక?–దుక్ఖత కంటే సూక్ష్మమైన విషయం. కనుక, ఒక ఉదాహరణ సాయంతో దీన్ని అర్థంచేసుకోటానికి ప్రయత్నిద్దాం.

ఎన్నో ఏళ్లుగా రోజూ స్కూటర్ మీద ఆఫీసుకు వెళ్ళివచ్చే ఒక ఉద్యోగికి, కారు కొనాలనేది ఒక రంగులకల. రోజురోజుకూ పెరుగుతున్న వాయుకాలుష్యం, కుటుంబ ప్రయాణ అవసరాలు, తన కలకు అవసరాన్ని జోడించటంతో అతడు తనస్థాయికి తగిన ఒక కారు కొంటాడు. కొత్తకారు ఇంటికి రావటంతో అందరూ చాలా ఆనందపడతారు. ఆఫీసుకు, వారాంతాల్లో షాపింగుకు, శలవురోజుల్లో దూరప్రాంతాలకు వెళ్లిరావటంలో ప్రయాణం చాలాసుఖంగా సౌకర్యంగా వుంటుంది. బంధువులు, మిత్రులు, యిరుగుపొరుగు తమ కారును చూసి మెచ్చుకుంటుంటే, కుటుంబంలో అందరూ ఆనందంతో పొంగిపోతారు.

ఇది ఎల్లప్పుడూ యిలాగే కొనసాగదు. ఈ పరిస్థితి మెల్లమెల్లగా మారుతూ వస్తుంది. కారు గురించి వచ్చే అభినందనల పరంపర ఆగిపోతుంది; కారుమీద కొంచెం దుమ్ము పేరుకున్నా మనసు చివుక్కుమంటుంది; దానిమీద గీతలు పడినా, రంగు వెలిసిపోయినా అది మరింత బాధ కలిగిస్తుంది; కుటుంబమంతా ప్రయాణమైతే, అందరి సామానులు పెట్టటానికి కారులో చోటుచాలక ఇరుకుగా వుంటుంది; ఇక పొరపాటున యాక్సిడెంట్ జరిగి కారు దెబ్బతింటే (ఎవరికీ గాయాలు తగల్లేదని ఆశిద్దాం), మనసు విలవిల్లాడుతుంది. అంతెందుకు, పక్కింటివారొ లేక మిత్రులో లేక బంధువులో, మనకంటే ఖరీదైన కారు కొంటే, మన కారువల్ల కలిగే ఆనందం ఆవిరైపోతుంది. ఇలాంటి సంఘటనలవల్ల, మనలో ఆనందానికి మారుగా అసంతృప్తి, అభద్రత, అసూయ, అవమానం రూపంలో దుఃఖం చోటుచేసుకుంటుంది.

పై ఉదాహరణనుబట్టి తెలిసేదేమంటే, సుఖం సంతోషం ఆనందం కలిగిస్తాయని మనం సొంతంచేసుకునే ప్రతివస్తువులో (లేక వ్యక్తిలో) అనివార్యంగా మార్పువస్తుంది, దాని వెంబడే మనంపొందే అనుభూతిలో మార్పు వస్తుంది. అంతేకాదు, అటువంటి మార్పు యింకా రాకముందే, అది వస్తుందనే ఊహ కూడా మనలో అలజడిని, అభద్రతను రేకెత్తిస్తుంది. ఈ విధంగా, పరిస్థితుల్లో వచ్చే మార్పువల్ల కలిగే దుఃఖాన్ని క్లుప్తంగా విపరిణామ–దుక్ఖతా అంటారు.

ఇక మూడవది చివరిది సంఖార–దుక్ఖతా. పైన చెప్పుకున్న రెండిటికంటే, యిది మరింత తాత్వికమైనది, సూక్ష్మమైంది కూడా. సంఖార అనే పాలి పదానికి సంఘటితం కావటం లేదా రూపొందటం అని అర్థం చెప్పవచ్చు. సంఖార–దుక్ఖతా అంటే ఏమిటో తెలుసుకోవాలంటే, యిక్కడ సంఘటితమైనది లేదా రూపొందినది ఏమిటో తెలుసుకోవాలి. మనిషి లేక వ్యక్తి అనేది శరీరం, వేదన, సంజ్ఞ, సంచేతన, విజ్ఞాన అనే ఐదు స్కంధాల (రాసుల) సమ్మేళనమని బౌద్ధం చెబుతుంది (వీటి గురించి వివరంగా చర్చించటం యీ వ్యాసం పరిధికి మించిన విషయం. వీటిని వివరించే తెలుగు రచనలు, అనువాదాలు లభిస్తున్నాయి). ఇవి నిరంతరం మార్పు చెందుతూ, కొత్తగా రూపొందుతూ వుంటాయి. మనిషి ఒకే వ్యక్తిగా కనిపిస్తున్నా, ఆ వ్యక్తి శారీరక మానసిక స్థితి నిరంతరం మార్పుచెంది, కొత్తవ్యక్తి రూపొందుతూ ఉంటాడు. ఇలా రూపొందిన వ్యక్తి తనలో కలిగిన మార్పుకు అనుగుణంగా తనకు యింకా ఏదో కావాలని, ఏదో పొందాలని ఆరాటపడుతుంటాడు. ఈ ''వెలితి''ని పూరించాలని, ఆరాటాన్ని సంతృప్తిపర్చాలని చేసే ప్రయత్నాలు ఫలించకపోగా, అవి మరింత ఆరాటానికి దారితీస్తాయి. కాలగమనంలో, ఈ ఆరాటం ఎంతకూ తీరటంలేదని తెలియటంతో, అది మనిషిలో అస్థిత్వపరమైన అలజడిని సృష్టిస్తుంది. బాహ్య పరిస్థితులు ఎలా వున్నా, అంతరంగస్థితిలో అనివార్యంగా

చోటుచేసుకునే ఇటువంటి దుఃఖమే సంఖార–దుక్ఖతా. పైన వివరించినట్లు దుఃఖం మూడురకాలుగా ఉన్నప్పటికీ, ఒక సందర్భంలో ఒకేరకమైన దుఃఖం కలుగుతుందని చెప్పలేం. తరచూ అవి కలగలసి ఉంటాయి. సందర్భాన్నిబట్టి ఏదో ఒకరకమైన దుఃఖం ప్రబలంగా ముందుకొస్తుంది. చాలసందర్భాల్లో, దుఃఖంలో వున్న వ్యక్తి దానిలోని అంతరాలను గమనించటం దుర్లభమౌతుంది.

సాధారణంగా మనుషులు తమలో, యితరుల్లో కలుగుతున్న స్థూలమైన దుఃఖాన్ని సులభంగా గుర్తించగలుగుతారు. సూక్ష్మమైన దుఃఖాన్ని ఒకింత పరిశీలనతో గుర్తించవచ్చు. ప్రతిఒక్కరు ప్రతినిత్యం చేసే ఆలోచనల్లో, మాట్లాడే మాటల్లో, చేసే చర్యల్లో అంతర్లీనంగా దుఃఖానికి సంబంధించిన అంశ పనిచేస్తూ వుంటుంది. అయితే, చాలమంది దీన్ని అస్పష్టంగా మాత్రమే గ్రహించగలుగుతారు. మనలో అచేతనంగా సాగే ఈ ప్రక్రియను సచేతనంగా, స్పష్టంగా గుర్తించటం అవసరం. అందుకోసం దీన్ని నిర్దిష్టంగా, లోతుగా అధ్యయనం చెయ్యక తప్పదు. జీవితపు నలుమూలలా ఆవహించివుండే దుఃఖం, మనం ఎంత కాదనుకున్నా, అదనుచూసుకుని మనకు ఎదురుపడి మనల్ని నిలదీస్తుంది. నిజానికి అదంటే మనకు చాలాభయం, దాన్ని ప్రస్తావించటానికే మనసు జంకుతుంది. అనేక సందర్భాల్లో, యితరులకు కలుగుతున్న దుఃఖాన్ని గమనించగలిగినా, మన అంతరంగంలోకి తొంగిచూసి మనలోని దుఃఖాన్ని సూటిగా అర్థంచేసుకోటానికి ప్రయత్నించం. జీవితం నుండి దుఃఖాన్ని తొలగించుకునే దారితెలియక లేదా దాన్ని నివారించలేని అశక్తత వల్ల, అది మనలో లేదని మనకు మనం నచ్చజెప్పుకోటానికి, అలాగే యితరుల్ని మభ్యపెట్టటానికి అనేక రకాలుగా ప్రయత్నిస్తుంటాం. ఎప్పటికప్పుడు మనలోని అసంతృప్తి, ఆవేదన, భయం పైకి పొక్కకుండా రకరకాల వ్యాపకాలు మరియు వినోదాల మాటున ఊరటపొందాలని ప్రయత్నిస్తుంటాం. ఇవన్నీ దుఃఖాన్ని తాత్కాలికంగా అణచివేసినా, అది మరింత శక్తిపుంజుకుని మళ్ళీ మనమీద దాడిచేస్తుంది. రోగాన్ని కప్పిపుచ్చటం వల్ల అది మరింత ముదురుతుందే గాని, నయం కాదు. కనుక రోగాన్ని నివారించ దలచినవారు, ముందుగా రోగం ఉందనే విషయాన్ని నిస్సంకోచంగా అంగీకరించక తప్పదు. "తనకు తానుగా దుఃఖాన్ని అనుభూతి చెందని వ్యక్తికి, దుఃఖం గురించి ఎంత వివరించినా దాన్ని ఒప్పుకోలేడు. దుఃఖాన్ని తనకుతానుగా అనుభూతిచెందిన వ్యక్తి, ఎంత ప్రయత్నించినా దాన్ని మర్చిపోలేడు" అని ఎడ్వర్డ్ కొనే అన్నారు. దీనర్థం ఏమిటంటే, దుఃఖం గురించి ఎంత చదివినా, చర్చించినా లేక ఎన్ని ఉపన్యాసాలు విన్నా అది మనకు బోధపడదు. ఆచార్య బుద్ధదాస మాటల్లో చెప్పాలంటే, "త్రిపిటకాలను మొదటి నుండి చివరి వరకు చదివినా దుఃఖసత్యం మనకు బోధపడదు. దుఃఖం ఎక్కడ ఉత్పన్నమౌతుందో అక్కడే దాన్ని అధ్యయనం చెయ్యాలి, అక్కడే దాన్ని అర్థంచేసుకోవాలి.

దుఃఖం మన అంతరంగంలోనే ఉత్పన్నమౌతుంది. కనుక, మన అంతరంగాన్ని పరిశీలించటం పరిశోధించటం ద్వారా మాత్రమే దుఃఖాన్ని అధ్యయనం చెయ్యగలం, అర్థంచేసుకోగలం". పుస్తకాలు, వ్యాసాలు, ఉపన్యాసాలు, చర్చలు వంటివి 'అంతర్ముఖంగా దుఃఖాన్ని అధ్యయనం చెయ్యటం ఎలా?' అనే విషయాన్ని తెలుసుకోటానికి ఉపకరించే సాధనాలు మాత్రమే.

మన జీవితంలో దుఃఖంకంటే ప్రభావశీలమైన ప్రాధాన్యత కలిగిన వాస్తవం మరొకటి లేదనటం అతిశయోక్తి కాదు. అయితే, "జీవితం దుఃఖమయం" అనే సత్యాన్ని మాత్రమే బుద్ధుడు చెప్పివుంటే, ఖచ్చితంగా అది నిస్పృహకు నిరాశావాదానికి దారితీసేదే. కాని ఆయన, దుఃఖం ఉందనేది ఎంత సత్యమో దుఃఖాన్ని నిరోధించగలమనేది కూడా అంతే సత్యమని చెప్పాడు. దుఃఖ కారణాన్ని, దుఃఖనిరోధ మార్గాన్ని కూడా ఆవిష్కరించాడు. వీటిని బుద్ధుడు "అత్యంత విలువైన (అరియ) సత్యాల"ని అన్నాడు. ఈ నాలుగు సత్యాల పరస్పర సంబంధాన్ని గ్రహించినప్పుడే వాటి సారాంశం, అంటే బుద్ధ ధర్మ సారం మనకు బోధపడుతుంది. ఆ దిశగా చేసే కృషిలో మొదటిమెట్టు దుఃఖాన్ని అనుభవపూర్వకంగా, సమగ్రంగా అర్థంచేసుకోవటం. ఈవిషయాన్ని బుద్ధవచనం *(సంయుక్తనికాయ : 437)* యిలా ప్రకటించింది:

"ఎవరు దుఃఖాన్ని అర్థంచేసుకోగలుగుతారో వారు దుఃఖకారణాన్ని, దుఃఖనిరోధాన్ని, దుఃఖనిరోధ మార్గాన్ని కూడా అర్థంచేసుకోగలుగుతారు."

**డి. చంద్రశేఖర్**
**వేటపాలెం, ప్రకాశంజిల్లా.**
**ఫోన్ : 929 009 1232**

# ధర్మచక్ర ప్రశస్తి శాసనం

- ఈమని శివనాగిరెడ్డి

ఇప్పటి తెలంగాణా రాష్ట్రంలోని నల్లగొండ జిల్లాలో, జనగామ - సూర్యాపేట దారిలో తిరుమలగిరి నుంచి సూర్యాపేటవైపు ఆరు కిలోమీటర్ల దూరంలోనున్న ఫణిగిరి గ్రామానికి ఆగ్నేయంగా ఉన్న విశాలమైన ఆరామాన్ని 1941లో అప్పటి నిజాం ప్రభుత్వ పురావస్తు శాఖ త్రవ్వకాలు ప్రారంభించి, 1944 వరకు కొనసాగించింది. త్రవ్వకాల్లో విహారాలు, శాతవాహన, ఇక్ష్వాకు నాణేలు, మట్టిపాత్రలు, బౌద్ధశిలాఫలకాలు, బ్రాహ్మీ శాసన శకలాలు బయటపడినాయి. పురావస్తురీత్యా ఈ ఆరామం క్రీ.పూ. 2వ శతాబ్ది మధ్యకాలానికి చెందినదిగా తేలింది. ఫణిగిరి చుట్టూ 5 కి.మీ. పరిధిలో వర్ధమానుకోట, తిరుమలగిరి, నాగారం, సింగారం, అరవపల్లి, ఆర్లగడ్డ గూడేల వద్ద కూడా బౌద్ధారామాల ఆనవాళ్ళు, విహారాలు, శిలామండపాలు, బుద్ధవిగ్రహాలు బయల్పడి క్రీస్తుకు పూర్వమే జిల్లాలో బౌద్ధం విశేష ఆదరణకు నోచుకొందని చెప్పొచ్చు.



సారవంతమైన నేలలు, ఎప్పుడూ సెలయేరులాంటి ఆలేరు, వాణిజ్య కేంద్రాలను కలిపే రహదారికి దగ్గరలో మంచి పాడిపంటలతో తులతూగిన ఫణిగిరి చుట్టుప్రక్క గ్రామాలు బౌద్ధానికి ఆలవాలమైనాయి. ఫణిగిరి చుట్టూ ఉన్న అనేక ఆరామాల్లోని బౌద్ధ భిక్షువులు (భిక్ఖులు) ఆలేరు నది ఒడ్డున తిరుగాడటంవల్లనేమో ఆలేరును ఇప్పటికీ భిక్కేరు అని పిలుస్తూనే ఉన్నారు.

ఇటీవల కాలంలో ఫణిగిరి కొండపై జరిగిన త్రవ్వకాల్లో ఆయక స్తంభాలతోనున్న మహాస్తూపం, ఆరు విహారాలు, రెండు చైత్యగృహాలు, రెండు శిలామండపాలు, ఏడు మొక్కుబడి స్తూపాలు బయల్పడినాయి. క్రీ.పూ. 1వ శతాబ్ది శాసనాలు, అష్టమంగళ గుర్తులున్న బుద్ధపాదాలు, బుద్ధుని ప్రతిమలు, 40 సీసపు నాణేలు, ఒకటో రోమను చక్రవర్తి ఆగస్టస్ నాణెం, 42 శాతవాహన నాణేలు, ఇక్ష్వాకుల బ్రాహ్మీ శాసనాలు కూడా దొరికాయి. ఇప్పటివరకు వెలుగు చూసిన ఇక్ష్వాకు శాసనాల్లో ఇక్ష్వాకు రాజైన రుద్రపురుష దత్తుడు 11 సం॥లు మాత్రమే పాలించాడని తెలిపే శాసనాలే దొరికాయి. కానీ ఫణిగిరిలో కొత్తగా దొరికిన ఒక శాసనంలో రుద్రపురుష దత్తుని 18వ పాలనా సం॥ ప్రస్తావించబడింది. ఇక్ష్వాకుల చరిత్రను పునఃసమీక్షించుకోవలసిన అవసరం వచ్చింది. బ్రాహ్మీ సంస్కృత భాషల్లోనున్న ఆ శాసనం సిద్ధార్థుడు, బుద్ధుడైన తరువాత సారనాథ్‌లో పంచవర్గీయ భిక్షువులకు చేసిన మొదటి ప్రవచనాన్ని సాహిత్యంలో ధర్మచక్ర ప్రవర్తనమన్నారు. తాను కనుగొని ఇతరులకు తెలియజెప్పి, మానవాళి అంతటకు తెలియజేయటానికి కారణమైన ఈ ధర్మచక్ర ప్రవర్తనను, శిల్పులు చక్రం ఆకారాన్ని చెక్కారు. తరువాత దీనినే ధర్మచక్రమని పిలిచారు. ఈ శాసనంలో రుద్రపురుష దత్తుని రాజవైద్యుడైన ఖేమసేనుడనే బౌద్ధ అనుయాయి ఫణిగిరిలో ఎత్తించిన ధర్మచక్రం యొక్క గొప్పతనాన్ని ప్రశంసించిన తీరు ఆసక్తిదాయకం.

**ధర్మచక్ర ప్రశస్తి శాసనం**

1. సిద్ధం। సంవత్సరం 18 హేమంత పక్షం 3 దివసం 3 ప్రఖ్యాత దీప్తయ
2. శశో రజ్ఞో శ్రీరుద్ర పురుషస్య అగ్రభిషజి క్రితోయం స
3. ముచ్ఛ్రయెు ధమ్మచక్రస్య । దర్పధ్వజి యెు మకరధ్వజస్యన పతితో
4. గో వృషభ ధ్వజేన తంపదితమ్, సక్యకులోధ్వజేన ఇమేన చక్రేనస
5. ధర్మజెన 2 మహత్మన కంస నిసూదనేన ససుదితో యెు మధుసూదనెన



6. స సుదితొ రాగ నిసూదనెన దోష అసురొ చక్రవర్తిమెన 3. మయాశరీర
7. రాణిసంభవెన తేనోత్తం అధ్యత గుణోత్తనేన (నితొర్విఇర్ష)క్లేశ మహవనమ్
8. దగ్ధ ని చక్రెన ఇమెన తెన 4. తం వరిసం చక్రం మహసెనాపతి సరమేనాని
9. దినొకస దెయ ధమ్మం ముపనొని వతోసం భరధతొయధాపితం భదంత ధొ
10. మసేనేన అమ్మితిధినాం.. నేన (సన)... మనుసో లోకోఇతి ॥

**అర్థం :** సిద్ధం । తన పరిపాలనతో ఎంతో కీర్తిప్రతిష్ఠలను గడించిన శ్రీ రుద్రపురుషుడు (దత్తుడు) అనే రాజు యొక్క అగ్రభిషజి (రాజవైద్యుడు), ఎత్తైన ధర్మచక్రాన్ని ఎత్తించాడు. ఆ ధర్మచక్రం ఎలాంటిదంటే, దర్పధ్వజుడు, మకరధ్వజు (మన్మథుడు)నకు గానీ, గో, వృషభ ధ్వజుడైన శివునికిగానీ, ఛేల్చటానికి వీలు కానిది ఈ శాక్యకుల ధ్వజు (బుద్ధుని)ని చేతియందలి చక్రము. అంతేకాదు, ధర్మరాజుగానీ, కంసని సూదనుడు, మధుసూదనుడైన శ్రీకృష్ణుడు కూడా రాగద్వేషాలు, దోషాలనే అసుర చక్రవర్తులను చంపలేకపోయారనీ, శాక్య కుల ధ్వజుడైన మహానుభావుడు బుద్ధుడు, నా శరీరం నుంచి పుట్టుకొచ్చిన క్లేశములనే మహావనాన్ని తన చక్రం (ధర్మచక్రం) చేత దహించివేశాడనీ, ధర్మాన్ని మహాసేనాపతి సహకారంతో భదంత ధేమసేనుడు ప్రతిష్ఠాపించాడు. ఈ చక్రం మనుష లోకానికి మార్గదర్శి కాగలదు.

శరీరంలో నుంచి, మనసులోంచి పుట్టుకొచ్చే రాగద్వేషాలను, దోషాలను, క్లేశాలను అటు శివుడుగానీ, కృష్ణుడుగానీ, ధర్మరాజుగానీ సంహరించలేకపోయారనీ, వారు చేయలేని పనిని మహాత్ముడు, మహనీయుడు, శాక్య కుల ధ్వజుడైన సిద్ధార్థ గౌతముడు వాటిని పూర్తిగా నిర్మూలించటానికి మానవాళికి బోధించిన ధర్మమనే చక్రాన్ని ప్రవర్తిల్ల చేశాడనీ, ధర్మచక్రాన్ని ప్రశస్తించటం ఈ శాసనం యొక్క విశిష్టత. ఇలాంటి ధర్మచక్ర ప్రశస్తి శాసనం మన దేశం మొత్తంమీద ఏ బౌద్ధస్థావరం నుంచి ఇంతవరకూ వెలుగు చూడనందున ఫణిగిరి ధర్మచక్ర ప్రశస్తి శాసనం చారిత్రకంగా ప్రాముఖ్యతను సంతరించుకొంది.

త్రవ్వకాల్లో వివిధ కట్టడాలేకాక నలుపు - ఎరుపు, నలుపు - గచ్చకాయ, ఎర్ర రంగుల్లో మట్టికుండలు, కప్పుకు వాడిన మట్టి పెంకులు, సున్నపు గార, సున్నపు బొమ్మలు కూడా దొరికాయి. క్రీ.శ. 1 - క్రీ.శ. 4 శతాబ్దాల మధ్య కాలానికి చెందిన తొలి, మలి, శాతవాహన శిల్పాలతోపాటు, ఇక్ష్వాకుల శైలిలో రాతిపలకలు, స్తంభాలు, అడ్డపట్టీలు, బుద్ధపాదాలు వెలుగుచూశాయి. మాంధాత, లోసక, చంపేయ జాతక దృశ్యాలు నాటి శిల్పుల పనితనాన్ని తెలియజేస్తున్నాయి. నిలకడైన మధుర శిల్పంకంటే, గ్రీకు - రోమను సాంప్రదాయాల మేలు కలయికకు గురైన గాంధార శిల్పంకంటే, ఫణిగిరి, బౌద్ధశిల్పాల కథనాల శిల్పం కళ్ళముందు కదలాడుతూ నాటి ఘటనలనూ, సిద్ధార్థ గౌతముని పరమోన్నత ధార్మిక జీవనాన్ని విడమరచి చెబుతూ అమరావతి శిల్ప అత్యున్నత దశకు అద్దం పడుతున్నాయి.

తొలి శాతవాహన కాలంలో వెలసిన ఈ బౌద్ధారామం, మలి శాతవాహన కాలానికి మనోహరమైన బౌద్ధక్షేత్రంగా విలసిల్లి, ఇక్ష్వాకుల కాలంలో, ఆచార్యులు, భిక్షువులు, ఉపాసక, ఉపాసికలతో, వచ్చీపోయే గహపతులతో కళకళలాడింది. ఇక్ష్వాకుల నుంచి అధికారాన్ని అందిపుచ్చుకున్న విష్ణుకుండినుల కాలంలో ఆదరణ సన్నగిల్లి, క్రమేపీ బౌద్ధస్థావరం కాస్తా శివాలయంగా మారింది. ఒక బౌద్ధ శిలాఫలకాన్ని ఉన్నఫళంగా వెనక్కి తిప్పి శివలింగ పానపట్టంగా మలచి, ఆయక స్తంభాన్ని శివలింగంగా మార్చిన ఆనవాళ్ళు ఆనాటి ధోరణుల్లో మార్పును సూచిస్తున్నాయి.



డా॥ ఈమని శివనాగిరెడ్డి (స్థపతి)
మొఘల్ గార్డెన్స్,
విజయవాడ - 10
ఫోన్ : 9848598446




# చరిత్ర పుటలలో...
# మగధ సామ్రాజ్యం

- వేలూరి కృష్ణమూర్తి

మత్స్యపురాణం 271వ అధ్యాయంలోని 12వ శ్లోకం ఈ క్రింది విధంగా ఉన్నది.

*సంజయస్య సుతః శాక్యః శాక్యాచ్ఛుద్ధోదనో నృపః ।*
*శుద్ధోదనస్య భవితా సిద్ధార్థః పుష్కలః స్మృతః ॥*

పై శ్లోకాన్ని మరోమారు బాగా పరిశీలించి చూడండి. అందులో చెప్పబడిన ఎన్నో పేర్లు చిరపరిచితమైనవని అనిపిస్తుంది. సంజయుని కుమారుడు శాక్య, అతని సుతుడు శుద్ధోదన. అతడి సంతానం సిద్ధార్థ మరియు అతనికి జన్మించినవాడు పుష్కల. ఔను, ఇది అక్షరాలా బుద్ధుడి వంశావళే. విష్ణుపురాణం పుష్కలుని పేరును రాహులడని ఉల్లేఖించినది! దాని అనంతరం ప్రసేనజిత, క్షుద్రక, కులక, సురథ, సుమిత్ర ఈ వంశం యొక్క తరువాతి సంతతి. సుమిత్రుడితో ఇక్ష్వాకు వంశం అంత్యమైనదని పురాణాలు అభిప్రాయపడినవి. ఇదే పురాణం ప్రతియొక్క రాజుయొక్క పరిపాలనా కాలాన్ని చాలా స్పష్టంగా చెప్పివున్నందున అనుమానానికి ఎలాంటి అవకాశం లేకుండా బుద్ధుడి కాలాన్ని క్రీ.పూ. 1800 కు సమీపంలో ఉన్నదని గ్రహించవచ్చు. 'ఏది చరిత్ర?' అన్న కృతిలో ఎం.వి.ఆర్. శాస్త్రి గారు తిరువెంకటాచార్యులవారి అధ్యయనాన్ని ప్రస్తావిస్తూ బుద్ధుడి జననాన్ని క్రీ.పూ. 1886 మార్చి 31వ తేదీ అనియూ, అతడి నిర్యాణం క్రీ.పూ. 1807 మార్చి 27వ తేదీ అనియూ నిరూపించారు. దానికి సరిపోయే నక్షత్రం, తిథి, వారాలనన్నిటిని ముందుంచుకొని జరిపిన ఈ అధ్యయనం పురాణాలు మరియు 'రాజ తరంగిణి'లో ఇవ్వబడిన అన్ని సాక్ష్యాలనూ సమర్థిస్తుంది.

పాశ్చిమాత్య చరిత్రకారులకు ఈ విషయాలను జీర్ణించుకోవడం కష్టసాధ్యమైనది. క్రీ.పూ. 19వ శతాబ్దానికి బుద్ధునికి స్థిరీకరించితే మరి కృష్ణుడు ఏ కాలంవాడు? ఇక అతడికంటె పూర్వీకుడైన రాముడి కాల ఘట్టమెప్పటిది? రాముడే అంత పూర్వకాలానికి చెందినవాడైతే ఇక్ష్వాకు వంశపు మూల పురుషుల కథ మాటేమిటి? ఋషులు ఏ కాలంవారు? అలాగే మనువు జీవించిన కాలమేది? అన్న ప్రశ్నలు ఎదురౌతాయి. మన ఇతిహాసం వెనుకకు వెళ్ళేకొద్దీ క్రిశ్చియన్లు నిర్మించిన సౌధం పడిపోతున్నందున్న విషయం వారికి ఖచ్చితంగా విదితమే. అందువల్లనే పురాణాలన్నీబట్టి బడాయి అని తీర్మానించేశారు. రామ-కృష్ణుల కథ దంత కథ అని తేల్చేశారు. రామ-కృష్ణులు జన్మించిన దేశంలోనే వారి జీవితాల యొక్క సత్యాసత్యాలను గురించి ఇప్పటికీ చర్చలు జరుగుచున్నవంటే అది తెల్లవారి చరిత్రకారులను నమ్మిన, వారు చెప్పిన దానిని ఒప్పుకొన్న ప్రభావమే. కాని వారి ఈ సమర్థనకు అడ్డుపడినది బుద్ధుడొక్కడే. ఇతర దేశాల అనేక చరిత్రకారులు బుద్ధుడి అనంతరం భారతదేశానికి వచ్చి, ఇక్కడి జనజీవితాలు, ధర్మం యొక్క రీతి రివాజులను విస్తారంగా లిఖితపరచి వుండడంవల్ల, బుద్ధుడు జన్మించి ఉండలేదని చెప్పే ధూర్తతనాన్ని వారు చూపలేదు. కాని బుద్ధుడి జీవిత కాలాన్ని క్రీ.పూ. 480వ కాలానికి దగ్గరగా త్రోసివేయడంతో 1400 సంవత్సరాల ముందటి బుద్ధలోకాన్నే సంకుచితం చేసివేశారు. అంతేకాదు, ధర్మస్థాపనకై ఎప్పుడూ పరితపిస్తున్న బ్రాహ్మణులను అణచిపెట్టాలన్న ఉద్దేశ్యంతో బ్రాహ్మణులకూ బుద్ధునికీ ఎక్కడ లేని విరోధాన్ని ఆరోపించారు. తీక్షణమైన సాధనవల్ల దేహధారుద్యం పాడైపోతుందని తెలుసుకొన్న బుద్ధుడు మధ్యమ మార్గాన్ని బోధించి, ఉద్ధరించడానికి రహదారి చేసి ఇచ్చినవాడయ్యాడు. అటువంటివాడు ఒక వర్గంవారిపై విరోధపు ద్వేషాన్ని పెంచుకొని, ధర్మస్థాపనను చేయగలడా? ఆలోచించడానికి ఎన్నో అంశాలు ఉన్నవి.

విలియమ్ జోన్స్, విన్సెంట్ స్మిత్, ఇ.జి. రాప్సన్, మాక్స్‌ముల్లర్ మొదలైనవారందరూ భారతదేశాన్ని గురించి కావలసినంత అధ్యయనం చేసి తమవే అయిన సిద్ధాంతాలను

ప్రతిపాదించినదేమో సరి. కాని, దాని వెనుక వారి మిషనరీ బుద్ధి ప్రబలంగా పనిచేయడంవల్లనే వారి వాదన సత్యపరీక్షలో చాలాకాలం బ్రతకడానికి వీలు కాలేదు. బుద్ధుడిని క్రీ.పూ. 5వ శతాబ్దానికి తీసుకొని వెళ్ళి నిలపాల్సిన అవసరం వారికెందుకు కలిగినదంటె అశోకుడికీ, బుద్ధుడికీ, సంబంధం కల్పించాల్సిన అవసరం ఉన్నందువల్ల! వారి దృష్టిలో మౌర్య సామ్రాజ్యం అలెగ్జాండరు భారతదేశ ఆగమనానంతరం స్థాపించబడినందున బుద్ధుడు కూడా అక్కడే, ఆ కాలానికి దగ్గరగా జన్మించి ఉండాల్సిన అవసరం వారికి అనివార్యమైనది. ఈ చరిత్రకారులందరూ బైబిల్‌లోని నమ్మకాలను ప్రక్కకు పెట్టి పరిశుద్ధంగా కూర్చొని ఆలోచించి, వారి చరిత్ర రచనలకు ఉపక్రమించి ఉన్నట్టయితే ఇలాంటి ప్రమాదాలు సంభవించేవి కావు!

విలియమ్ జోన్స్ తన కృతిలో (The works of William Jones) కాల-ఘట్టాల తన ఊహలను ఇచ్చి ఉన్నాడు. అందులో మనువును బైబిల్‌లో చెప్పబడిన ఆడంతో సమీకరించి వీరిద్దరికాలం 5,794 సంవత్సరాలకు పూర్వమని తెలిపాడు. అతడి లెక్కాచారాలన్నీ 1788కి సంబంధించి ఉన్నందున మరి రెండు శతాబ్దాలను మనం చేర్చుకోవాలి. ఆ లెక్కకు, అంతే! వారి ప్రకారం శ్రీరాముడు జీవించిన కాలం క్రీ.పూ. 2029లో! అయితే ఆధునిక అధ్యయనాలు క్రీ.పూ. 5114 అని తెలుపుతున్నవి. అంటే, ఇప్పటికి 7130 ఏళ్ళకు పూర్వం! దాని అర్థమేమిటో తెలుసా? విజ్ఞానం ప్రకారం శ్రీరాముడు బైబిల్‌లో చెప్పబడిన మొదటి మానవుడు ఆడమ్ కంటె ఎన్నో ఏళ్ళ ముందు జన్మించాడని! ఇక మనువుకాలం ఏదై ఉంటుంది? ఈ అన్ని ప్రశ్నలకు ఒకే జవాబేమిటో తెలుసా? పురాణాలు బడాయి, రామకృష్ణులు దంత కథలనడమే! ఈ విషయాలను పునరుచ్చించే చిలుకలకు గింజలు వేస్తే చాలు. మరి కొంతకాలం ఈ తప్పులు రాజ్యం చేస్తాయని. భారతీయులకు ఇతిహాస ప్రజ్ఞే లేదు, దానిని వారికి నేర్పినది తామేనన్న విషయం పాశ్చాత్య చరిత్రకారులు మన తలల్లో దూర్చటానికి నేపథ్యం కూడా ఇదే. లేకుంటే ప్రపంచంలోని ఏ చరిత్ర కృతి కూడా ఇంత సులభ గ్రాహ్యంగానూ, కుతూహలంగానూ ఉండేది కాదు. భారతీయులలో చరిత్రను కాపాడటానికి ఓ రకమైన జనులు ఉండేవారు. వాయు పురాణం వీరిని 'సూతు'లని గుర్తించినది. జి.వి. టాగరే గారు అనువదించిన వాయుపురాణంలో, క్షత్రియ పురుషుడు మరియు బ్రాహ్మణ స్త్రీకి జన్మించిన, అలాగే, పురాణాలను, ఇతిహాసాన్ని మనోజ్ఞంగా చెప్పేవారిని 'సూతు'లని గుర్తించారు. అది ఋషి యాజ్ఞవల్క్యుల మరియు మనువు అభిప్రాయమట. ఇలా ఒక సూతుడు వచ్చి నమస్కరించి, నిలబడినపుడు ఋషి లోమహర్షణులు అతడిని ఆదరించి, పురాణం వినాలన్న కోరికను వ్యక్తపరిచారు. అంతేకాదు, సూతులను స్వతఃవ్యాసులవారే ఈ పనికి నియమించినందున వారిని పొగిడారు. దానికి ప్రతిగా ఆ సూతుడు చేతులెత్తి నమస్కరిస్తూ, 'దేవతల, మహారాజుల, ఋషుల వంశ చరిత్రలను కాపాడడమే తమ బాధ్యతని అన్నాడట. ఇతిహాసం మరియు పురాణాలలో ఉన్న మహాపురుషుల జీవిత చరిత్రను సమాజానికి తెలియజేయడమే తమ కర్తవ్యమని ఆ సూతుడు మరీమరీ తెలిపాడట.

ఉత్తర కర్ణాటకలోని కొన్నిచోట్ల ఇప్పటికీ ఇలాంటి పద్ధతిని మనం చూడవచ్చు. 'హెళవరు' అని పిలువబడే ఈ జాతివారు కొన్ని ఇళ్ళలో వారి వంశీయుల పరంపరను కాపాడుతున్నారు. ఒక తరం నుండి తరువాతి తరానికి ఆ వంశీయుల కథలను రవాణా చేస్తూ పోతున్నారు. సంవత్సరానికొకమారు అలాంటివారి ఇండ్లకు వెళ్ళి వారి పూర్వజుల చరిత్రకు సంబంధించిన విషయాలను జ్ఞాపించి, వారికి అగత్యమైన వస్తువులను దానరూపంలో స్వీకరిస్తుంటారు. బహుశా ప్రపంచంలో మరెక్కడాలేని ఆచారాన్ని, ఒక విధంగా చరిత్రను కాపాడే అపురూపమైన విధానమిది! పురాణ శ్రవణం సక్రమంగా చేస్తే ఎన్నో వేల యేళ్ళ మన పరంపరను మరోమారు జ్ఞాపించుకొన్నట్టే. ఈ మన ఇప్పటి పాఠశాలలోని చరిత్ర పాఠాలవలె నీరసంగా ఉండకూడదనేవాటికి మరిన్ని కథలను చేర్చి ప్రచనాలు ఆ చరిత్ర కథలను చెప్పేవారికి, వినేవారికి ఆసక్తిదాయకంగాను, ఆనందదాయకంగాను ఉండాలని కృషిచేశారు మన పూర్వీకులైన పెద్దలు!

పై విషయాలను గురించి లోతులకు పోకుండా మనం గమనించాల్సినది మగధ సామ్రాజ్యపు అస్తిత్వ విషయం. అలెగ్జాండర్ మన దేశానికి వచ్చినపుడు మగధ సామ్రాజ్యముండినదా లేక దానికన్నా వేల ఏళ్ళ క్రితం నుండే అస్తిత్వంలో వుండినదా అన్న విషయం చరిత్ర శాస్త్రజ్ఞులు దానిని నిర్ణయించనీ, కానీ, అప్పుడున్న మగధ సామ్రాజ్యమంతా బలాఢ్యంగా భరత ఖండాన్ని పరిపాలిస్తూ

ఉండేదన్న విషయంలో అనుమానమే లేదు. మగధ అన్నది పూర్తి భరతఖండం కాదు. అదొక స్వతంత్రమైనదైన ప్రజాప్రభుత్వ రాజ్యంగా ఉండేదని చెప్పవచ్చు. ఇలాంటివి ఎన్నో రాజ్యాలు ఉండేవి ఆ కాలంలో. చరిత్రకారుల ప్రకారం క్రీ.పూ. 6వ శతాబ్ది సమయానికి భారతదేశంలో జనపదాల కల్పనలు ఉదయించినవని తెలుపుతారు. వారి ఈ భావనలకు సమంజసంగా బుద్ధుడి కాలపు సాహిత్యాన్ని ఉదాహరణగా చూపుతారు. కానీ, వీరు సూచించే ఎన్నో పేర్లు మహాభారతంలోనే ఉల్లేఖించబడిన విషయాన్ని మరచిపోతారు. కురుక్షేత్ర యుద్ధ సందర్భంలో ఏఏ దేశపు రాజులు, కురుపాండవుల మహాభారత యుద్ధంలో ఎవరెవరివైపు ఉండిరోనన్న విషయం స్పష్టంగా తెలుపబడినది. దానిని అలా వదలిపెట్టినా, ఋగ్వేదంలోనే తనపై పోరాడడానికి వచ్చిన 10 మంది రాజులను ఓడించిన సుదాస వారిని దశదిక్కులకు పారిపోయేలా చేశాడని ఉల్లేఖించబడినది. ఆ కాలంలోనే కొన్ని గుంపుల జనులు తమ జాతివారి పేరుతో సీమలను నిర్మించుకొని పరిపాలించారన్న విషయం అందరికీ తెలిసినదే. యాదవ, కురు, ద్రహ్య – ఇలాంటి రాజ్యాలు అలా నిర్మించబడిన సీమాప్రదేశాలే. బుద్ధసాహిత్యం ప్రకారం ఇవి జనపదం, మహాజనపదం, రథ, అంతరరథ, తిరోరథ, దేశ, ప్రదేశ, జనపద ప్రదేశ, మహాప్రదేశ, గణం, సంఘాలుగా వింగడించబడినవి.

మగధ ఇలాంటిదే ఒక మహాజన సంపదవలె చివరకు మహాప్రదేశంగా వృద్ధిచెంది నిలచినది. విష్ణుపురాణం ప్రకారం మగధ సామ్రాజ్యం బృహద్రథుడి నుండి ప్రారంభమైనది. ఒక వేయి సంవత్సరాల వరకూ పరిపాలించబడినది. అనంతర కాలంలో ప్రద్యోత మరియు శిశునాగుడి వంశం కూడా మగధ సామ్రాజ్యాన్ని పరిపాలించినది. శిశునాగుడి పరిపాలన ప్రారంభమైనది ఇప్పటికి 4000 ఏళ్ళ క్రితం! ఈ సమయంలో బిందుసారుడు మరియు అజాతశత్రువుల పేర్లు చాలామార్లు వినబడినవి. బింబిసారుడే మగధ సామ్రాజ్యాన్ని స్థాపించాడని కొందరు చరిత్రకారులు అభిప్రాయపడ్డారు. అతడు తన దేశపు ఎల్లలకు అంటుకొని ఉన్న అంగదేశాన్ని మగధలో చేర్చుకొన్నాడట. కోసల మరియు వైశాలి రాజ్యాలతో వివాహ సంబంధం ద్వారా పటిష్టం చేసుకొన్నాడు. ఒకవైపు వివాహ బంధుత్వంతో మరొకవైపు శక్తిసామర్థ్యాలతో తన రాజ్యాన్ని విస్తరిస్తూ ముందుకు వెళ్ళినవాడు బింబిసారుడు. బౌద్ధసాహిత్యాలైన మహావగ్గ, వినయపిటకాల ప్రకారం బింబిసారుడు ఎనభైవేలకంటే ఎక్కువ గ్రామాలకు అధిపతియై ఉండేవాడట. ఈ గ్రామాల ముఖ్యస్థులు మహాసభలలో పాల్గొనడానికి ఎన్నోమార్లు ఒకచోట చేరుతుండేవారని ఈ చరిత్రకారులు తమ రచనలలో తెలిపారు.

బింబిసారుడికి చాలామంది బిడ్డలు ఉండేవారు. వారిలో అజాత శత్రువు ఒకడు. అతడు తన తండ్రిని ఒక మూల పడవేసి ఆహారం, నీళ్ళు ఇవ్వక ఒకచోట బంధించి, రాజ్యాధికారాన్ని కైవశం చేసుకొన్నాడన్న కథ కుతూహలకరమైనది. తండ్రి అలా బంధనలో మరణించినరోజే అజాత శత్రువుకు ఒక కుమారుడి జననం కలిగినది. ఈ రెండు వార్తలతో అతడి మంత్రి వెళ్ళి, కుమారుడు జన్మించిన విషయం మొదట తెలిపాడట. అప్పుడు అజాత శత్రువు మనోఫలకంలో తన పుత్రుడి ముఖం మరియు తన తండ్రిగారి కారుణ్యపు పనులు కనపడి ఎగిరిపోయినవట. తాను తండ్రి అయిన సందర్భంలో అతనికి తండ్రి జ్ఞాపకానికి వచ్చి బింబిసారుడిని బంధనం నుండి వెంటనే విడిపించమని ఆజ్ఞ జారీ చేశాడు. అప్పుడు మంత్రి రెండవ వార్తను అతనికి తెలిపాడు. ఆ విషయం తెలుసుకున్న అజాత శత్రువు తన తల్లి వద్దకు పారిపోయి ఆమె కాళ్ళపై పడి, క్షమించమని ప్రార్థించాడట. కానీ, ఉపయోగమేమిటి? ఆ సమయానికి అంతా ముగిసిపోయినది. మగధ సామ్రాజ్యపు అతి శ్రేష్ఠుడైన రాజుగారి దారుణమైన అంత్యం అప్పటికే జరిగిపోయినది! తరువాతి కాలంలో అజాత శత్రువు కుమారుడు కూడ తన తండ్రిని హతమార్చి రాజసింహాసనాన్ని అధిరోహించాడు. తాతగారు మరణించినంతనే జన్మించిన మనవడు! రాజ్యపదవీ వ్యామోహం ఎక్కువైనకొద్దీ మనోబాధ అనివార్యమనడానికి అజాత శత్రువు జీవితమొక ఉదాహరణ. ఇదే వంశంలో తరువాత ధనవంతులు మొదలుగాగల తొమ్మిదిమంది రాజులు రాజ్యమేలి మగధ సామ్రాజ్యాన్ని ఒక పటిష్ఠమైన కోటగా పరివర్తన చేశారు. కాని వారి అంతరంగాలు చితికిపోయినవి! చరిత్ర దాని మార్గాన్ని మళ్ళించడానికి వేచివుండినది!



కన్నడం : చక్రవర్తి సూలిబెలె
తెలుగు : వేలూరి కృష్ణమూర్తి 'అనన్య'
శ్రీరాంపురం, మైసూరు.
ఫోన్ : 0 944 897 7877

# మిళింద ప్రశ్నలు

– బోధచైతన్య

### గ్రంథ పరిచయం

పాలీ బౌద్ధ సాహిత్యంలో మిలిందపఞ్హది ప్రత్యేకస్థానం. జనరంజకత (popularity), ప్రామాణికత (authoritative) రెండూ కలిగిన గ్రంథంగా ఇది కీర్తింపబడింది. ఆచార్య బుద్ధఘోషుడు (క్రీ.శ. 5వ శతాబ్ది) తాను రచించిన త్రిపిటక వ్యాఖ్యానాల్లోనూ, విసుద్ధిమగ్గ లోనూ తరుచుగా మిలిందపఞ్హ వాక్యాలను ప్రమాణంగా చూపించారు. బర్మాబౌద్ధులకు ఈ గ్రంథం అంటే అమిత గౌరవం. వాళ్ళు దీన్ని ఏకంగా సుత్తపిటకలోని ఖుద్దకనికాయలో ఒక భాగంగా కలిపేసుకొన్నారు!

ఈ గ్రంథరచనా కాలాన్ని పరిశోధకులు క్రీ.శ. మొదటి శతాబ్దంగా ఊహిస్తున్నారు. కాశ్మీరంలో లేదా పంజాబు ప్రాంతంలో రచింపబడియుండవచ్చని కూడా ఊహిస్తున్నారు.

ఆరు కాండములు (parts) కలిగిన ఈ గ్రంథం తొలుత చిన్నదిగా కేవలం ఇప్పటి మొదటి మూడు కాండలజ పరిమితిలోనే ఉండినదని కూడా పరిశోధకుల ఊహ. చైనాభాషలో ఈ చిన్న మౌలికగ్రంథమే నాగసేనభిక్షుసూత్రం అనే పేరుతో అనువదింపబడింది. చైనాభాషలోకి అనువాదం పొందిన గ్రంథాలు సాధారణంగా సంస్కృత బౌద్ధగ్రంథాలే కనుక మిలిందపఞ్హ మూలగ్రంథం సంస్కృతం లేదా ప్రాకృతంగా ఉండవచ్చు అని కూడా ఒక ఊహ. ఏది ఏమైనప్పటికీ ఒకప్పుడు మిలిందపఞ్హ సంస్కృతంలోనూ ఉండినది అని చెప్పవచ్చు. ద్వితీయ బుద్ధుడుగా ఘనకీర్తి గడించిన ఆచార్య వసుబంధు (క్రీ.శ. 5 వ శతాబ్ది) తాను రచించిన అభిధర్మకోశం అనెడి అసమాన బౌద్ధసంస్కృత శాస్త్రగ్రంథంలో అష్టమకోశస్థానంలో ఒకచోట నాగసేన సంవాదాన్ని ఉటంకించారు. ప్రమాణంగా చూపబడిన ఆ భాగంజ సంస్కృతంలోనే ఉంది. మొదట్లో చిన్నదిగానే ఉన్న మిలిందపఞ్హ గ్రంథం కాలక్రమంలో పెంపు పొందిందని పరిశోధకులంటారు.

ఇద్దరి మధ్య జరిగిన సంభాషణే ఈ గ్రంథం. మిలిందుడు అనే రాజు, నాగసేనుడనే భిక్షువు మధ్య జరిగిన సంవాదరూపం. ఇద్దరూ చారిత్రక పురుషులనడంలో సంశయం ఎవరికీ లేదు. మౌర్యసామ్రాజ్య పతనం ప్రారంభం కాగానే (చక్రవర్తి అశోకుని మరణం క్రీ.పూ. 227 తరువాత) భారత ఉపఖండం వాయువ్య భాగాలు (north-west) గ్రీకురాజుల ఏలుబడిలోకి చేరిపోయాయి. ఆ రాజుల్లో ఒకడు మినందర్. ఈ మినందర్ రాజ్యం ఇప్పటి పంజాబు, ఆఫ్ఘనిస్థాన్ ప్రాంతాలుగా చారిత్రికులు నిర్ణయించారు. మినందరే ఈ గ్రంథంలోని మిలిందుడు. నాగసేనుణ్ణి గురించి చారిత్రకంగా మనకేమీ తెలియదు. ఈ ఇద్దరి సంభాషణను కాలాంతరంలో గ్రంథరూపంగా కూర్చినది ఎవరో కూడ మనకు తెలియదు.

బౌద్ధగ్రంథాల్లో (తర్కగ్రంథాలు మినహాయించి) ఒక విశేషం ఏమిటంటే అన్నీ కూడా స్వయూథ్యులను (తమ వర్గంవాళ్ళను = one's own folk) ఉద్దేశించినట్టివే. ఇతరుల గొడవ ఏది పట్టించుకోకుండా తమలో తాము బుద్ధవచనాన్ని వివరించుకొనే రీతిగానే ఉంటాయి. పైకి ఏదో పెద్ద వాదగ్రంథంగా కనిపించినా మిలిందపఞ్హ కూడా స్వయూథ్యగ్రంథమే. ఇందులోని హేతువులు, ఉపమలు, కారణాలు చాలావరకు ఏవీ కూడా బాహ్యులను ఒప్పించగలిగే విధంగా లేవు. కేవలం స్వయూథ్యులు మాత్రమే అంగీకార సూచకంగా తల ఊపగలరు. కనుక ఇది వాదగ్రంథం కాదు. స్వయూథ్యులను ఉద్దేశించిన బోధనాగ్రంథంగా, ప్రేరణాత్మకగ్రంథంగా, ఉత్తేజాత్మక గ్రంథంగా భావించవచ్చు.

రీస్ డేవిడ్స్ అనే ప్రఖ్యాత బౌద్ధపండితుడు ఈ గ్రంథాన్ని యథాతథంగా ఇంగ్లీషులోకి అనువదించి Questions of King Milinda అనే పేరుతో 1890లో ప్రచురించారు. ఆ తరువాత I.B. Horner అనే గొప్ప బౌద్ధపండితురాలు మళ్ళీ ఈ గ్రంథాన్ని యథాతథంగా ఆంగ్లానువాదం చేసి 1969లో

ప్రచురించారు. ఇవి రెండూ చాలా పెద్దవి కనుక ఇంగ్లీషులో సంక్షిప్తీకరణములు కూడా వెలువడినాయి. కానీ తెలుగులో ఇంతవరకు ఎవరూ దీన్ని అనువదించే ప్రయత్నం చేయలేదు. తెలుగు పాఠకులకు ఈ గ్రంథాన్ని పరిచయం చేసి రుచి కలిగించాలనే ఉద్దేశంతో ఒక సంక్షిప్తీకరణ ఆంగ్లగ్రంథాన్ని నమూనాగా తీసుకొన్నాను కాని అనువాదం మాత్రం మూల పాలిగ్రంథంనుండి చేయడం జరిగింది.

మూలంలో ప్రతివాక్యంలోనూ సంబోధనా పదాలున్నాయి. (భంతే నాగసేనా!, మహారాజా!). అనువాదంలో ఈ సంబోధనా పదాలు బాగా తగ్గించుకొన్నాను. పాఠకుల సౌకర్యం కోసం మిలింద నాగసేనుల వాక్యాలను విడివిడిగా చూపించాను. అవసరం అనిపించిన చోటల్లా కుండలీకరణంలో ఆంగ్లభాషాపదాలు ఇచ్చాను. అనువాదం యథాతథమే. ఎక్కడో ఒకటి రెండు చోట్ల ఓపిక నశించి మూలాన్ని కుదించి యుండవచ్చు. తెలుగుభాషలోని మర్యాద ప్రయోగాలను (మీరు, గారు వగైరా) అనువాదంలో ఉపయోగించలేదు. భంతే (venerable Sir), మహారాజా (great king!) అనే సంబోధనా పదాల్లోనే మర్యాద కనిపిస్తున్నది కనుక ఇరువురి మధ్య సంభాషణను ఏకవచనంలోనే (నీవు) నడిపించాను. ఈ పరిచయవాక్యాలకు ముగింపుగా మూలగ్రంథం ప్రారంభంలో ఉన్న "గ్రంథ కథావస్తువు" శీర్షికనుండి కొంతభాగాన్ని జోడిస్తున్నాను.

గంగానది సాగరాన్ని చేరే విధంగా సాగలనగరంలో రాజా మిలిందుడు నాగసేనుణ్ణి కలుసుకొంటాడు. వాక్చాతుర్యం మెండుగా కలిగినవాడు నాగసేనుడు. అవిద్యాంధకారాన్ని పటాపంచలు చేసే జ్ఞానదివిటీని ఎత్తిపట్టుకొన్నవాడు నాగసేనుడు. అటువంటి నాగసేనుని వద్దకు మిలిందుడు వచ్చి జటిలమైన విషయముల మీద నిపుణములైన ప్రశ్నలను చాలా వేసినాడు. ఆ ప్రశ్నలకు నాగసేనుడు చెప్పిన సమాధానాలు అర్థగాంభీర్యమును కలిగియుంటాయి. హృదయాన్ని పరవశింపజేస్తాయి. శ్రవణానందంగా ఉంటాయి. గగుర్పాటును కలిగించే విధంగా అద్భుతంగా ఉంటాయి. సుత్తపిటక, వినయపిటక, అభిధమ్మ పిటక లోతులను స్పృశించే విధంగా ఉంటాయి. ఉపమలతోనూ, చెప్పే విధానంలోనూ వైవిధ్యం కలిగియుంటాయి. అధ్యాత్మికజ్ఞానాన్ని గడించే ఉద్దేశంతో మనస్సును ఉల్లాసపరచుకొని ఈ ప్రశ్నలు- సమాధానాలు వినండి. సంశయస్థానాలనన్నిటిని ఈ ప్రశ్న - జవాబులు మటుమాయం చేస్తాయి.

**విశ్వంతరప్రశ్న :**

మి: భంతే నాగసేనా, బోధిసత్త్వ విశ్వంతరుడు ఒక్కడే భార్యాబిడ్డలను దానం చేశాడా? బోధిసత్త్వులందరూ కూడా ఇలానే చేశారా?

నా: మహారాజా, ఒక్క విశ్వంతరబోధిసత్త్వుడే కాదు, అందరు బోధిసత్త్వులూ భార్యాబిడ్డలను దానం చేశారు.

మి: భార్యాబిడ్డల అనుమతి తీసుకొని దానం చేశారా?

నా: భార్య అనుమతి తీసుకొన్నారు. చిన్నవారు కనుక బిడ్డలు ఏడ్చారు. ఆ దానక్రియలోని పరమార్థం తెలిసియున్నవారైతే వాళ్ళు ఏడ్చియుండరు.

మి: భంతే నాగసేనా, విశ్వంతరుడు ప్రియమైన తన బిడ్డలను బ్రాహ్మణునికి దానం చేయడం అనేది దుష్కరమైన (difficult to do) పని. ఆ బ్రాహ్మణుడు పసిపిల్లలను తీగలతో బంధించి కొట్టి లాక్కుపోవడం చూస్తూ కూడా ఉదాసీనంగా ఉండిపోవడం అనేది విశ్వంతరుని రెండవ దుష్కరతరమైన పని. పసిపిల్లవాడు జాలి బంధనాన్ని తెంపుకొని తన వద్దకు పరుగెత్తుకొని వచ్చేస్తే విశ్వంతరుడు ఆ పిల్లవాణ్ణి మళ్ళీ తీగెలతో కట్టి బ్రాహ్మణుడికి అప్పగించడం అనేది విశ్వంతరుడు చేసిన మూడవ కష్టమైన పని. చిన్నపిల్లలు ఏడుస్తూ "నాన్నా, ఈ యక్షుడు మమ్మల్ని తినడానికి లాక్కెళ్ళిపోతున్నాడు" అని మొరపెట్టుకొన్నా "భయపడకండి" అని ఒక ఓదార్పుమాట కూడా పలక్కుండా ఉండిపోవడం విశ్వంతరుడు చేసిన నాలుగవ అతికష్టమైన పని. కుమారుడు జాలి కాళ్ళమీద పడి ఏడుస్తూ "నాన్నా, కృష్ణాజినిని వదలివేసి నన్ను మాత్రం తీసుకెళ్ళమని చెప్పు'' అని ప్రాధేయపడినపుడు అంగీకరించకపోవడం అనేది విశ్వంతరుడు చేసిన ఐదవ అతి కష్టతరమైన పని. "రాతిగుండె మనిషివి నీవు. యక్షుడు మమ్మల్ని లాక్కుపోతుంటే వచ్చి అడ్డగించకుండా ఊరక నిలబడి చూస్తున్నావు" అని కుమారుడు జాలి ఏడుపు స్వరంతో ఆక్షేపించినపుడు కరుణ చూపకపోవడం అనేది విశ్వంతరుడు చేసిన ఆరవ అతికష్టాతికష్టమైన పని. బిడ్డలు అలా లాక్కొనిపోబడి కనుమరుగయ్యాక తీవ్ర పుత్రశోకంతో తపించినప్పటికీ హృదయం వంద లేదా వేయి ముక్కలు కాకుండా గట్టిగా ఉంచుకోవడం అనేది విశ్వంతరుడు చేసిన ఏడవ అతికష్టాతికష్టమైన పని. భంతే నాగసేనా, పరులకు

దుఃఖాన్ని కలిగించే పుణ్యకర్మలు చేయడం దేనికి? దానంగా తనను తానే ఇచ్చుకోవచ్చుకదా!

నా: మహారాజా, దుష్కరమైనదాన్ని చేయడంవల్ల విశ్వంతరుని కీర్తి పదివేల లోకధాతువులు విస్తరించింది. దేవలోకాల్లో దేవతలు, అసురలోకాల్లో అసురులు, గరుడలోకాల్లో గరుడులు, నాగలోకాల్లో నాగులు, యక్షలోకాల్లో యక్షులు విశ్వంతరుణ్ణి కీర్తిస్తున్నారు. విశ్వంతరుని కీర్తిశబ్దాలు పరంపరాగతంగా వినబడుతూ ఇప్పుడు మన ఇరువురి మధ్య కూడా చర్చకు విషయంగా వచ్చింది– "అది సరియైన పనియా కాదా?"అని. మహారాజా, మహాసత్త్వుడైన ఆ బోధిసత్త్వ విశ్వంతరుని దుష్కరచర్య, అనేక గుణాలను (special qualities) ప్రకాశపరచింది.

మి: భంతే నాగసేనా, పరులకు దుఃఖాన్ని కలిగించే దానం సుఖవిపాకం కలదవుతుందా? స్వర్గప్రాప్తికి అనుకూలమవుతుందా?

నా: అవుతుంది. ఇక ఏమి చెప్పవలెను?

మి: కారణం చూపించు.

నా: మహారాజా, ఒకానొక శ్రమణుడు లేదా బ్రాహ్మణుడు శీలవంతుడుగా కల్యాణధర్ముడుగా ఉన్నాడనుకొనుము. కుంటితనంవల్ల దారిలో నడవలేక నడుస్తున్నాడు. గూడుబండిలో ఆ దారిన వెళ్తున్న ఒక పుణ్యకాముడు అతనిని తన బండిలో ఎక్కించుకొని అతను చేరవలసిన స్థానానికి చేర్చాడు. మహారాజా, దానివల్ల ఆ పుణ్యపురుషుడికి భవిష్యత్తులో సుఖం కలుగుతుందా? కలుగదా?

మి: చెప్పవలసిన పని ఏముంది? ఆ పుణ్యం వల్ల అతడు భవిష్యత్తులో స్థలం మీద హస్తియానంగానీ అశ్వయానంగానీ రథయానంగానీ జలంలో జలయానం, దేవలోకంలో దేవయానం పొంది సుఖపడుతాడు. ఇంకా చెప్పాలంటే ఇద్ధియానం (vehicle of psychic power) కూడా పొంది నిర్వాణనగరం చేరగలడు.

నా: మహారాజా, పరులకు దుఃఖాన్ని కలిగించే పుణ్యకర్మ వల్ల సుఖవిపాకం ఉందని నీవు కూడా అంగీకరిస్తున్నావు. ఆ పుణ్యపురుషుడు గూడుబండిని లాగిన ఎద్దుకు దుఃఖం కలిగించేకదా ఆ సుఖవిపాకం పొందగలిగాడు. మహారాజా, ఒక రాజు తన రాజ్యంలోని ప్రజల మీద ధార్మికంగానే పన్ను విధించి ఆ వచ్చిన రాబడితో దానధర్మాలు చేస్తాడనుకో. అతనికి సుఖవిపాకం కలుగుతుందా? కలుగదా?

మి: చెప్పవలసిన పని ఏమున్నది? అతడు భవిష్యత్తులో రాజులలో అతిరాజవుతాడు, దేవతలలో అతిదేవతవుతాడు, బ్రహ్మలలో అతిబ్రహ్మ అవుతాడు, శ్రమణులలో అతిశ్రమణుడవుతాడు, బ్రాహ్మణులలో అతిబ్రాహ్మణుడవుతాడు. అర్హంతులలో అతిఅర్హంతుడవుతాడు.

నా: మహారాజా, పరులకు దుఃఖాన్ని ఇచ్చే దానం వల్ల కూడా సుఖవిపాకం ఉందని నీవే ఒప్పుకొన్నట్లయ్యింది. పన్ను విధించడం ద్వారా ప్రజలకు ఆ రాజు దుఃఖాన్ని కలిగించాడుకదా!.

మి: అతిదానం నాగసేనా, విశ్వంతరుడు చేసింది! తన భార్యను పరునికి భార్యగా ఇచ్చివేయడం, తన పసిపిల్లలను బ్రాహ్మణునికి దాసులుగా ఇచ్చివేయడం మెచ్చదగినదిగా కనిపించుట లేదు. అతిదానాన్ని విజ్ఞులు నిందిస్తారు, గర్హిస్తారు. అతిభారం వల్ల శకటం ఇరుసు విరిగిపోతుంది. అతిభారం వల్ల నావ మునిగిపోతుంది. అతిభుక్తం వల్ల భోజనం అజీర్ణం అవుతుంది. అతివర్షం వల్ల పంటలు నశిస్తాయి. అతిదానం వల్ల భోగక్షయం జరుగుతుంది. అతిరాగం వల్ల ఉన్మత్తత కలుగుతుంది. అతిద్వేషం వల్ల చంపబడడం జరుగుతుంది. అతిమోహంవల్ల అనయం (calamity) కలుగుతుంది. అతిలోభంవల్ల (greed) చోరుల ముప్పు కలుగుతుంది. అతిభయంవల్ల మరణం కలుగుతుంది. అతిపూరణంవల్ల నది పొంగుతుంది. అతివాతం వల్ల పిడుగు పడుతుంది. అతి అగ్నివల్ల అన్నం చిమిడిపోతుంది. అతిసంచరణం వల్ల చిరకాలం జీవించడు. భంతే నాగసేనా, అతిదానం నిందనీయంగానూ గర్హనీయంగానూ విజ్ఞులు భావిస్తారు. విశ్వంతరుడు చేసింది అతిదానం. కనుక దానివల్ల సుఖవిపాకం కలుగుతుందని చెప్పరాదు.

నా: మహారాజా, అతిదానం లోకంలో విజ్ఞులచే కీర్తింపబడుతుంది. ప్రశంసింపబడుతుంది. ఇంతో అంతో దానం ఇచ్చేవాళ్ళు లోకంలో చాలా మంది ఉన్నారు. అతిదానం చేసినవాడే లోకంలో కీర్తి పొందుతాడు. దివ్య వనమూలిక యొక్క అతిప్రభావంవల్ల దానిని పట్టుకొనియున్న వ్యక్తి మూరడు దూరంలో ఉన్నా ఇతరులకు కనిపించడు. అగదం (antidote) తన అతిశక్తి వల్ల బాధను, రోగాన్ని అంతమొందిస్తుంది. అతిజ్యోతి వల్ల అగ్ని దహించగలుగుతుంది. అతిశీతలంవల్ల నీళ్ళు దప్పికను పోగొట్టుంది. అతిపరిశుద్ధత వల్ల పద్మం నీళ్ళను బురదను అంటుకోనీయదు.

అతిగుణం వల్ల మణిరత్నం కామదదంగా (granter of desires) ఉంటున్నది. వజ్రం అతితీక్ష్ణంగా ఉన్నందువల్ల మణులను ముత్యాలను స్ఫటికములను తొలిచివేయ గలుగుతుంది. అతిమహాంతత వల్ల పృథివి నర, ఉరగ, మృగ, పక్షి, జల, శిల, పర్వత, వృక్షాలను భరిస్తున్నది. అతిమహాంతత వల్ల సముద్రం పూరింప వీలుకానిదిగా ఉంటున్నది. అతిభారం వల్ల సుమేరువు అచలంగా ఉంటున్నది. అతివిస్తారత వల్ల ఆకాశం అనంతంగా ఉంటున్నది. అతిప్రభ వల్ల సూర్యుడు చీకటిని పారద్రోలుచున్నాడు. అతిజాతి వల్ల సింహం భయం లేనిదిగా ఉంటున్నది. మల్లుడు అతిబలం వల్ల ప్రతిమల్లుణ్ణి క్షణంలో మట్టి కరిపిస్తాడు. అతిశీలం వల్ల భిక్షువు నాగ యక్ష నర అమరులచే నమస్కరణీయుడుగా ఉంటున్నాడు. అతి అగ్రత (foremost) వల్ల బుద్ధుడు అనుపముడుగా (unrivalled) ఉన్నాడు. ఇలాగే అతిదానం కూడా లోకంలో విజ్ఞులచే స్తుతింపబడుతుంది. ప్రశంసింపబడుతుంది. అతిదానం వల్ల విశ్వంతరుడు పదివేల లోకధాతువులలో స్తుతింపబడుచున్నాడు.

ఆ అతిదానం వల్లనే విశ్వంతరుడు తరువాతి జన్మలో మన బుద్ధుడుగా అవతరించాడు. మహారాజా, యోగ్యుడైన యాచకుడు ప్రాప్తించినప్పటికీ ఇవ్వకూడనిదానం ఏదైనా లోకంలో ఉన్నదా?

మి: భంతే నాగసేనా, అదాన వస్తువులుగా పది ఉన్నాయి. వీటిని దానం చేసేవాడు అధోగతి చెందుతాడు. అవి ఏవనగా 1. మద్యపానదానం, 2. వినోదాలకు దానం, 3. స్త్రీదానం, 4. వృషభదానం, 5. చిత్రకర్మ (paintings) దానం, 6. శస్త్ర (weapons) దానం, 7. విషదానం, 8. సంకెలదానం, 9. కోడి, పంది దానం 10. తప్పు తూనికలు, కొలతల దానం.

నా: నేనడిగింది అదానములు ఏమిటి? అని కాదు. నేనడిగింది దాన యోగ్యుడయిన దాత ప్రాప్తించినపుడు ఇవ్వకూడనిది ఏదైనా ఉన్నదా? అని.

మి: లేదు భంతే. చిత్తప్రసాదం కలిగినపుడు దక్షిణీయులైనవారికి (దాన స్వీకార యోగ్యులకు) కొందరు భోజనం పెడతారు, కొందరు వస్త్రాలు ఇస్తారు. కొందరు శయనోపయోగ వస్తువులు ఇస్తారు. కొందరు ఆవాసములు (dwellings) ఇస్తారు. కొందరు శాలువలు, దుప్పట్లు ఇస్తారు, కొందరు దాసీదాసులను ఇస్తారు. కొందరు క్షేత్రములను (fields and sites), కొందరు ద్విపద చతుష్పదములను (bipeds and quadrupeds), కొందరు శతకార్షాపణములు, కొందరు వేయి, కొందరు లక్ష ఇస్తారు. కొందరు రాజ్యమే ఇచ్చేస్తారు. కొందరు జీవితమే ఇచ్చేస్తారు.

నా: కొందరు జీవితమే ఇచ్చేస్తారని చెప్పావు! మరి దానపతి విశ్వంతరుణ్ణి నీవెందుకు తీవ్రంగా విమర్శిస్తున్నావు? మహారాజా, ఋణగ్రస్తుడయిన తండ్రి లేదా ఆజీవిక (livelihood) కోల్పోయిన తండ్రి తన కుమారుణ్ణి ఆవాపణంగా (pledge) అప్పగించడమో లేదా విక్రయించడమో లోకంలో ఆచారంగా ఉన్నదా?

మి: అవును, ఆ ఆచారం ఉన్నది.

నా: విశ్వంతరుడు కూడా సర్వజ్ఞత్వం పొందలేకపోవడం వల్ల కుమిలిపోయినవాడై దుఃఖించినవాడై ఆ ధర్మధనం పొందడం కోసం భార్యాబిడ్డలను ఆవాపణంగా సమర్పించాడు. లోకంలో ఇతరులు చేసినట్లే చేశాడు. దానపతి విశ్వంతరుణ్ణి మాత్రం నీవెందుకు తీవ్రంగా విమర్శిస్తున్నావు?

మి: దానపతి విశ్వంతరుడు చేసిన దానాన్ని నేను గర్హించడం లేదు. భార్యాబిడ్డలను ఇతరులు యాచించినపుడు తనను తానే ఇచ్చుకొనియుండవలసింది అంటాను.

నా: మహారాజా, అడిగింది ఇవ్వడమనేది సత్పురుషులు పాటిస్తారు. భార్యాబిడ్డలను అడిగినపుడు తనను ఇచ్చుకుంటాననడం అనుచితమైనట్టిది. నీళ్ళు కావాలని అడిగితే భోజనం ఇవ్వడం చేయదగిన పనియేనా?

మి: కాదు అడిగినది ఇస్తేనే కృత్యకారి (doing a service) అవుతాడు.

నా: మహారాజా, అలాగే బ్రాహ్మణుడు అడిగినది విశ్వంతరుడు ఇచ్చాడు. అతడు శరీరాన్ని అడిగియుంటే విశ్వంతరుడు తప్పించుకొనియుండడు, వణికిపోయి యుండడు, దిగులు చెందియుండడు. తనను తాను నిశ్చయంగా ఇచ్చుకొని యుండేవాడు. "నా దాసుడవు కమ్ము" అని ఎవరైనా విశ్వంతరుణ్ణి కోరియుంటే ఏ చీకూచింతా లేకుండా దానపతి విశ్వంతరుడు తనను తాను దాసుడుగా సమర్పించుకొనియుండేవాడు. మహారాజా, విశ్వంతరుడు తన కాయాన్ని బహు సాధారణంగా (common property of all beings) భావించిన మహోన్నతుడు. ఫలించిన వృక్షం నానా పక్షులకు ఎలా సాధారణం అవుతుందో అలానే మహారాజా, విశ్వంతరుని కాయం బహుసాధారణం.

"బహుసాధారణుడను కాగలిగినప్పుడే సమ్యక్ సంబోధికి అర్హుడనవుతాను" అని ఆ మహాత్ముని దృష్టి.

మహారాజా, ఒక దరిద్రుడు ధనార్జన కోసం తిరుగాడుతూ అజపథం, శంకుపథం, వేత్రపథంజ వెళ్తాడు. జల స్థల వాణిజ్యం (trade on land and water ways) చేస్తాడు. కాయేన వాచా మనసా ధనతత్పరుడై యుంటాడు. ధనం కోసం ఎంతో శ్రమకు సిద్ధపడతాడు. మహారాజా, అలానే దానపతి విశ్వంతరుడు బుద్ధధనం లేకపోవడం అనే అధనత్వాన్నుండి (దారిద్ర్యం) బయటపడదలచి సర్వజ్ఞజ్ఞాన రత్నాన్వేషణకు దిగి దాన్ని సంపాయించే ప్రయత్నంలో భాగంగా అడిగినవారికి, ధనధాన్యాలు, యానవాహనాలు, ఇంకా ఇతర ఆస్తిపాస్తులు, భార్యాబిడ్డలు సర్వం ఇచ్చివేశాడు.

మహారాజా, భార్యాబిడ్డల మీద ద్వేషంతో (repulsion) దానపతి విశ్వంతరుడు వాళ్ళను ఇచ్చివేయలేదు. వాళ్ళను చూడడమే కంటగింపుగా తలచి ఇచ్చివేయలేదు. "ఇందర్ని పోషించే శక్తి నాకు లేదు" అని ఇచ్చివేయలేదు. "ఈ అప్రియులను వదిలించుకొంటే హాయి" అని భావించి దానం చేసివేయలేదు. సర్వజ్ఞతాజ్ఞానరత్నం మీద ప్రేమతో ఆ రత్నసంపాదనకోసం ప్రాణసమానులు ప్రియులు ఇష్టులు ఆహ్లాదకరులు అయిన భార్యాబిడ్డలను దానంగా ఇచ్చివేశాడు. ఈ విషయాన్నే దేవాతిదేవుడైన భగవానుడు చర్యాపిటకంలో ఇలా చెప్పాడు:

*న మే దేస్సా ఉభో పుత్తా మద్దీ దేవీ న దేస్సియా*
*సబ్బఞ్ఞుతం పియం మయ్హం తస్మా పియే అదాసహం*

మహారాజా, పుత్రదానం ఇచ్చాక విశ్వంతరుడు పర్ణశాల ప్రవేశించి శోకభారంతో కూలబడినాడు. బిడ్డల ఎడల అతిప్రేమ కలిగియున్న అతని హృదయం తీవ్ర శోకతాపంతో తపించిపోయింది. వేడి నిట్టూర్పులను నాసిక భరించలేకపోవడంతో ఆశ్వాస ప్రశ్వాసలు నోటి ద్వారా జరిగాయి. కన్నులనుండి రక్తకన్నీరు కారింది. ఎంతో దుఃఖానికి లోనయినప్పటికీ "నా దానపథానికి లోపం రాకూడదు" అనుకొని విశ్వంతరుడు పుత్రదానం చేశాడు. మరియూ మహారాజా, విశ్వంతరుని పుత్రదానం వెనుక రెండు ఆశయాలు ఉన్నాయి. అవి ఏవనగా 1. "నా దానపథానికి లోపం కలుగకుండుగాక", 2. "బిడ్డలను వాళ్ళ తాత విడిపించుకొంటాడు". మహారాజా, విశ్వంతరునికి తెలుసు, తన బిడ్డలను దాసభావంలో చిరకాలం ఉంచడం ఎవరికీ సాధ్యం కాదని. "తాత విడిపించుకొంటాడు, మళ్లీ తనకు బిడ్డలతో సమాగమం జరుగుతుంది" అని విశ్వంతరుడు భవిష్యత్తును సరిగ్గా ఊహించాడు.

మి: భంతే నాగసేనా, నా ప్రశ్నకు చక్కగా సమాధానం చెప్పావు. దృష్టిజాలం (net of false views) ఛిన్నాభిన్నం అయ్యింది. పరప్రవాదములు తుత్తునియలు అయ్యాయి. స్వీయపక్షాన్ని చక్కగా ప్రకాశపరచావు. వ్యంజనములను (details) చక్కగా చెప్పావు. అర్థవిభజనం (analysis of meaning) చక్కగా చేశావు. కనుక నేను సమ్మతిస్తున్నాను.

***

## విశ్వంతర జాతకమ్

సంజయుడు శిబిగణతంత్రానికి రాజు. గణతంత్రాన్ని పాలించడం చాలా కష్టం. రాజుకు సర్వాధికారాలుండవు. అవసరమనిపిస్తే గణతంత్రంలోని పెద్దలకు అతణ్ణి నిలదీసి శాసించే అధికారం ఉంది. సంజయుని కుమారుడు విశ్వంతరుడు ఆ గణతంత్రానికి యువరాజు.

అతడు యువకుడైనా ఉపశమనశోభితుడు. బలశాలియైనా క్షాంత స్వభావుడు. విద్వాంసుడైనా జ్ఞానమదశూన్యుడు. ధనవంతుడైనా నిగర్వి. ఒక విషయంలో మాత్రం అసహనశీలుడు. సాటి మానవుల కష్టాలను, బాధలను, దైన్యాన్ని చూసి సహించలేడు. కరుణ అనే మహావింటిని ఎక్కుబెట్టి దానమనే బాణాలను సంధించేవాడు. ప్రతిదినం పట్టపుటేనుగు మీద నగర సంచారం చేస్తూ తాను కట్టించిన సత్రాలు, చేసిన ఏర్పాట్లు ఎలా జరుగుతున్నాయో పర్యవేక్షణ చేసేవాడు. అతని పట్టపుటేనుగు గంధహస్తి అసాధారణమైన లక్షణాలను కలిగినట్టిది. అట్టిది జంబూద్వీపంలో మరొకటి లేదు.

పొరుగున ఉన్న ఒక రాజు చపలుడు. ఆ గంధహస్తిని తనదిగా చేసుకోవాలను కొన్నాడు. అతనికొక ఉపాయం తట్టింది. తన పురోహితులకు ఇద్దరికి ఆ ఉపాయం చెప్పి శిబిదేశ రాజధానికి పంపాడు. విశ్వంతరుడు గంధహస్తి మీద నగర సంచారం చేస్తున్న సమయంలో వీరిద్దరూ దారికి అడ్డంగా నిలబడి ఎత్తి సాచిపెట్టిన దక్షిణ హస్తాలతో జయాశీర్వాద వచనాలు పలికారు. "మీరేమి అభ్యర్థనతో వచ్చారో సెలవివ్వండి" అన్నాడు విశ్వంతరుడు. "రాజా, నీ దానశూరత్వం, కైలాసశిఖరంలాంటి ఈ గంధహస్తి – రెండూ ఆకర్షించగా వచ్చాము. లోకం ఆశ్చర్యపోయేవిధంగా నీ

దానశూరతను ప్రకటించి ఈ గంధహస్తిని మాకివ్వండి" అన్నారు పురోహితులు. "ఆహా! ఇన్నాళ్ళకు ఇంత గొప్ప దానాన్ని కోరేవాళ్ళు వచ్చారు" అనుకొని పరమప్రీతితో అతడు గంధహస్తినుండి క్రిందకు దిగి దాన్ని వారికి ధారాదత్తం చేశాడు.

ఈ వార్త దావానలంలా నగరమంతా వ్యాపించింది. నగరంలోని బ్రాహ్మణవృద్ధులు, మంత్రులు, సేనాపతులు, పురప్రముఖులు కోపోద్రిక్తులయ్యారు. హుటాహుటి సంజయుని సభకు వెళ్ళారు. "రాజా ఈ రాజ్యానికి, ముంచుకొస్తున్న అపాయాన్ని గుర్తించకుండా ఎందుకు ఉపేక్షిస్తూ కూర్చున్నావు? మన దేశంలోని అమూల్యమైన, అపురూపమైన, అజేయమైన గజరాజును దానం చేయడానికా మీ కొడుకును యువరాజుగా కట్టబెట్టింది? బ్రాహ్మణులడిగితే గోవులివ్వండి, బంగారం ఇవ్వండి, బట్టలివ్వండి, భోజనం పెట్టండి మేము కాదంటామా? మన రాజ్యలక్ష్మి, మన జయలక్ష్మి ఏ గజరాజును ఆశ్రయించియున్నదో దానిని ధారాదత్తం చేయడం మేము క్షమించము" అని ఏకకంఠంతో చాలా కటువుగా చెప్పారు. సంజయుడు వాళ్ళను శాంతపరచే ప్రయత్నంగా ఇలా అన్నాడు: "సభాసదులారా, విశ్వంతరుని ధోరణి నాకు కూడా సమ్మతం కాదు. రాజనీతిని అతిక్రమించిన ధార్మికత పనికిరాదు. కానీ ఇచ్చివేసిన గజరాజు ఇక మనకు కక్కిన అన్నంతో సమానం. దాన్ని మళ్ళీ ఎలా వెనక్కి తీసుకొందాము చెప్పండి. నేను విశ్వంతరుణ్ణి మందలిస్తాను. మీరు శాంతించండి. మళ్ళీ ఇలాంటి పొరబాట్లు జరుగరాదని అతణ్ణి గట్టిగా హెచ్చరిస్తాను."

ఈ సానునయ వచనాలు సభ్యుల కోపాన్ని చల్లార్చలేదు. "రాజా, విశ్వంతరుడు మీ హెచ్చరికలు పాటిస్తాడనే నమ్మకం మాకు లేదు. అతడు కరుణామృదుస్వభావుడు. యువరాజుగా తగడు. తపోభూమియే అతనికి తగిన చోటు. వెంటనే అతణ్ణి దేశబహిష్కృతుణ్ణి చేయండి. వంకపర్వతానికి వెళ్ళి తపస్సు చేసుకోమని ఆదేశించండి. రాజనీతికి బద్ధుడైన మరో వీరకుమారుణ్ణి యువరాజుగా నియమించండి." రాజు వాళ్ళ శాసనానికి తల ఒగ్గక తప్పలేదు.

దేశబహిష్కరణ శాసనం విశ్వంతరునికి వెంటనే అందింది. అతడు విచారపడలేదు. "బాహ్యద్రవ్యత్యాగమేమిటి అర్థిజనులు నా నయనాలు కోరినా ఇస్తాను, శిరస్సును అడిగినా ఇస్తాను" అనుకొన్నాడు. అతని భార్య మద్రికి విషయం తెలిసి భర్తతో ఇలా అన్నది: "క్షత్రియా, నేనూ నీతో వస్తాను. నీ సమీపంలో మృత్యువు కూడా నాకు ఉత్సవమే. నీవు దూరమైతే మృత్యువుకన్నా ఎక్కువ బాధాకరమౌతుంది నా జీవితం."

జాలి అనే చిన్ని కుమారుణ్ణి, పసిపాప కృష్ణాజినిని, మద్రిని రథం మీద ఎక్కించుకొని విశ్వంతరుడు తపోభూమికి బయలుదేరాడు. దేశం ఎల్లలు దాటాక దారిలో ఒక బాటసారి ఎదురుపడి "శిబి రాజధాని ఇంకా ఎంతదూరం? అక్కడ యువరాజు విశ్వంతరుడు అడిగినవాళ్ళకు లేదనకుండా ఇస్తాడట. ఆయన దగ్గరకు వెళ్తున్నాను. కుటుంబభారం ఈడ్వలేక సతమతమౌతున్నాను" అన్నాడు. "విశ్వంతరుడను నేనే. ఈ రథం, గుర్రాలే ఇప్పుడు నా దగ్గరున్న ఆస్తి. తీసుకోండి" అని అతణ్ణి ఒప్పించి తాను కాలినడకన ప్రయాణం సాగించాడు.

వంకపర్వతం చేరాక అక్కడ సెలయేటి ఒడ్డున ఒక కుటీరాన్ని స్వహస్తాలతో నిర్మించుకొని ఆ అడవిలో లభించే ఆకులు, దుంపలు, కాయలు, పండ్లతో సంతృప్తజీవనం సాగిస్తుండగా అర్ధసంవత్సరం కాలం గడిచింది.

ఒకనాటి మధ్యాహ్నం విశ్వంతరుడు ఒంటరిగా కుటీరంలో ఉన్నాడు. మద్రి శాకములు ఫలముల సేకరణ కోసం అడవికి వెళ్ళింది. పిల్లలు ఆడుకొంటున్నారు. ఆ సమయంలో ఒక వృద్ధబ్రాహ్మణుడు అక్కడికి వచ్చాడు. అతిథిని చూడగానే విశ్వంతరుడు పరమానందభరితుడై అతణ్ణి సాదరంగా ఆహ్వానించి అతిథి మర్యాదలు చేసి, రాకకు కారణం అడిగాడు. ఆ బ్రాహ్మణుణ్ణి అక్కడికి అతని భార్య పురమాయించి పంపింది. వారికి సంతానం లేదు. సేవలు చేసే పరిజనులు లేరు. "అడిగిందేదైనా సరే ఇచ్చే విశ్వంతరుణ్ణి అల్లంత దూరంలో పెట్టుకొని గోళ్ళు గిల్లుకు కూర్చుంటావేమి, పోయి అడగరాదూ ఆ పిల్లల్ని? మనం బ్రతికినన్నాళ్ళు సేవకు పనికివస్తారు. మనం చచ్చాక శవసంస్కారం చేయడానికీ పనికివస్తారు." అని ఆమె తన భర్తను పురమాయించి పంపించింది.

"విశ్వంతరా! వెలుగు, సమమైన దారి ఉంటే నడిచే జనానికి కష్టం ఉండదు. కానీ ఈ లోకం మాత్సర్యం (పిసినారితనం) అనే చీకటితో నిండియున్నది. నా కోరికను తీర్చే నాథుడు కనబడలేదు. నీ దానశౌర్యకీర్తి విని ఈ యాచనా శ్రమకు పాల్పడి వచ్చాను. నిన్ను అర్థిస్తున్నాను.

పరిచారకులుగా నీ పిల్లల్ని ఇవ్వు" అన్నాడు నిర్లజ్జగా. "ఇవ్వను" అనే మాట నోటరాని మహాసత్త్వుడైన బోధిసత్త్వుడు పిల్లలు తనకు చాలా ఇష్టులైనప్పటికీ సాహసంతో "ఇస్తాను" అన్నాడు. ఆ వాగ్దానం విన్నంతనే బ్రాహ్మణుడు మిక్కిలి తొందర చూపించుతూ "స్వస్తి అస్తు, మరి ఇక ఆలస్యం దేనికి? దానక్రియ పూర్తి కానిచ్చి పంపించు" అన్నాడు. అతని ఆత్రాన్ని తొందరను గమనించిన విశ్వంతరుడు "మీ ఇష్టం ప్రకారమే ఇప్పుడు..." అని అసంపూర్ణ వాక్యం పలికి పరిగ్రహం కోసం ఆత్రంగా చేతులు సాచిపట్టుకొనియున్న సిగ్గులేని అతని చేతుల మీద కమండలాన్ని వంచినాడు.

*తస్య యత్నానురోధేన పపాతాంబు కమండలోః*
*పద్మపత్రాభితామ్రాభ్యాం నేత్రాభ్యాం స్వయమేవ తు*

విశ్వంతరుని ప్రయత్నాన్ని అనుసరించి కమండలం నుండి నీళ్ళు పడినాయి. పద్మపత్రాల్లాంటి అతని అభితామ్ర నేత్రాలనుంచి కన్నీళ్ళు స్వయంగానే జలజల రాలిపడినాయి.

"బ్రాహ్మణోత్తమా, పిల్లలు ఇక మీవారే. కానీ నా మనవి ఆలకించండి. అడవికి పోయిన వీరి తల్లి సాయంకాలానికి వచ్చేస్తుంది. ఆమె వచ్చి బిడ్డలను చివరిసారిగా తనకిష్టమైన విధంగా అలంకరించి ముద్దాడి ఆనందించే అవకాశం ఇవ్వండి. ఈ రాత్రికి మీరిక్కడే ఉండి రేపు ప్రొద్దున పిల్లల్ని తీసుకెళ్ళండి" అని ప్రాధేయపడ్డాడు. "తల్లి ఈ దానానికి సమ్మతించదు. ఇతను కూడా పుత్రవాత్సల్యంతో మనస్సు మార్చుకోవచ్చు" అనే భయంతో ఆ బ్రాహ్మణుడు అటు ఇటు వెదకి కొన్ని తీగలు సంపాయించి, బిగ్గరగా ఏడుస్తున్న ఆ పసిపిల్లల మృదుహస్తాలను చేర్చి కట్టి లాక్కొనిపోవడం చేశాడు. విశ్వంతరునికి హృదయాన్ని గట్టిగా పిండివేసినంత బాధ కలిగింది. గద్గదస్వరంతో "బ్రాహ్మణోత్తమా, ఈ పసికూనలు తల్లిచాటు బిడ్డలు. మీకేమి సేవలు చేయగలరు? మీకేమి సుఖం కలుగుతుంది? నా మాట వినండి. వీళ్ళను శిబిరాజు దగ్గరకు తీసుకెళ్ళండి. మీకు కావలసినంత ధనం బదులుగా ఇచ్చి పిల్లలను ఆయన తీసుకొంటాడు" అన్నాడు. "శిబిరాజు కోపంతో నన్ను శిక్షిస్తే దిక్కెవ్వరు? నేను ఆ సాహసం చేయను" అని అతడు పిల్లలను బరబరా లాక్కెళ్ళాడు. చిన్నపిల్ల కృష్ణాజిని "నాన్నా నాన్నా" అని బిగ్గరగా కేకలు పెట్టూ ఏడ్చింది. జాలి కూడా బిగ్గరగా ఏడుస్తూ "నాన్నా మేము లేకుంటే అమ్మ ఏడుస్తుంది. నా జ్ఞాపకంగా నా మట్టిబొమ్మలు సగం అమ్మకు ఇవ్వు. సగం నీవుంచుకో" అని వెక్కిళ్ళు పెట్టూ గద్గదస్వరంతో పలికినాడు. తనవైపు తలలు త్రిప్పి చూస్తు పిల్లలు పలికిన ఆ ఏడ్పు మాటలు బోధిసత్త్వుని హృదయాన్ని తీవ్రంగా కంపింపజేశాయి. "ఇచ్చిన పిమ్మట ఇక విచారించి ఏమి ప్రయోజనం?" అనుకొన్నాడు. కాని విరుగుడు లేని ఆ శోకాగ్ని అతని హృదయాన్ని కాల్చడం మానలేదు. విషం, దేహం అంతా వ్యాపించి చైతన్యాన్ని పోగొట్టిన విధంగా ఆ తీవ్రదుఃఖం అతని చైతన్యాన్ని పోగొట్టి మూర్ఛిల్లజేసింది. కొంతసేపటికి చల్లని గాలుల స్పర్శకు మెల్లగా అతనికి స్పృహ వచ్చి పుత్రశూన్యమై నిశ్శబ్దంగా ఉన్న కుటీరంలోకి వెళ్ళి కూలబడ్డాడు.

అడవికి పోయిన మద్రికి ఏవో అపశకునాలు తోచాయి. ఆదుర్దాగా కుటీరానికి బయలుదేరింది. దారిలో భీకర మృగాలు కనబడితే వేరే చుట్టు దారినబడి వేగంగా అడుగులు వేసుకొంటూ వచ్చింది. కుటీర పరిసరాలు నిశ్శబ్దంగా ఉండడంతో ఆమె గుండె గుబేలుమంది. చాలా దూరానికి కూడా వినిపించే పిల్లల గోల వినపడలేదు. తను వస్తున్న అలికిడి విన్నంతనే ఆనందంగా ఎదురువచ్చే పిల్లలు ఎదురు రావడం లేదు. "నిదురబోతున్నారా? ఇప్పుడేమి నిద్ర? ఆలస్యమైందని నా మీద అలిగినారా? లేక నన్నాట పట్టించడానికి ఏ పొదమాటునైనా దాక్కున్నారా?" అని పరిపరి విధాల ఆందోళనపాలై గట్టిగా ఒక్కొక్కరి పేరు పెట్టి పిలిచింది. బదులు లేదు. ప్రక్కనే ఉరకలు వేస్తూ వేగంగా ప్రవహిస్తున్న సెలయేరును చూచి ఆమె మనస్సు కీడును శంకించింది. "భగవంతుడా! అపశకునాలు నా దేహానికే తగలనీ. నా బిడ్డల్ని క్షేమంగా చూడు దేవుడా" అని ప్రార్థిస్తూ కుటీరంలోకి ప్రవేశించింది. కన్నీటి చారలతో వేదనావదనంతో మౌనంగా ఉన్న భర్తను చూడగానే తన శంక నిజమే అనిపించి పుత్రశోకం భరించలేక స్పృహ కోల్పోయి నేలకు వాలింది. ఆమెను పడనీయకుండా విశ్వంతరుడు పట్టుకొని చాపపై పరుండబెట్టి మళ్ళీ స్పృహ వచ్చేవిధంగా శైత్యోపచారాలు చేశాడు. ఆమె మూర్ఛనుండి తేరుకొన్నాక జరిగిన విషయం చెప్పాడు. పుత్రవినాశాన్ని శంకించిన ఆమెకు ఒక విధంగా అది సంతోషవార్తే అయ్యింది. భర్త ఔన్నత్యానికి, దానపారమితకు ఆమె చకితురాలై కన్నీళ్ళు తుడుచుకొని విస్మయంగా అతణ్ణి చూస్తూ "ఆశ్చర్యం, ఆశ్చర్యం" అన్నది.

విశ్వంతరుని దానపారమితకు భూదేవి హర్షం పట్టలేక కంపించింది. దేవతల నివాసమైన సుమేరు పర్వతం కూడా

కంపించింది. కంపన కారణాన్ని దిక్పాలకులు తెలుపగా ఇంద్రుడు విని పరమాశ్చర్యపరవశుడై మరునాడు బ్రాహ్మణరూపంలో విశ్వంతరుని ముందు ప్రత్యక్షమై "మహా సరస్సులలో నీరు ఎప్పటికీ ఇంకిపోనివిధంగా సత్పురుషుల్లో దానశీలత ఎప్పటికీ ఇంకిపోకుండా ఉంటుంది. దేవకాంతలాగా ఉన్న నీ భార్యను దానంగా అడుగుతున్నాను" అన్నాడు. దేహంలో సగం కోసి ఇమ్మని అడిగినట్లనిపించినా మహాసత్త్వుడైన బోధిసత్త్వుడు చలించలేదు. ఎడమచేతితో భార్యను, కుడిచేతితో కమండలాన్ని పట్టుకొని అర్ఘిచేతిలో ధారగా నీళ్ళు వదలి దానక్రియను పూర్తి చేశాడు. భర్త అత్యుదార స్వభావం తెలిసిన మద్రి కోపించలేదు. కనీవినీ ఎరుగని ఈ దుఃఖం ఆమెను మ్రాన్పడజేయగా భర్తను తదేకంగా చూస్తూ శిలాప్రతిమలా ఉండిపోయింది.

శక్రుని హృదయం పరమవిస్మయంతో నిండిపోయింది. మహాసత్త్వుడైన బోధిసత్త్వుణ్ణి స్తుతిస్తూ "దుష్కరమైన నీ బోధిచర్య ఇతరులు చేయగలగడం మాట అటుండనీ. అసలు జరిగిందనైనా నమ్మగలరా? హృదయశుద్ధి లేనివాళ్ళకు ఆ నమ్మకం కూడా కష్టమే. భార్యాబిడ్డల మీద ప్రేమానురాగాలు మిక్కుటంగా కలిగియున్నప్పటికీ నిస్సంగానికి నిలయుడవుగానూ ఉన్నావు. ఊహకు అందని మహోన్నత వ్యక్తిత్వం నీది" అని నిజరూపంలో ప్రత్యక్షమై "మద్రిని నీకే అప్పగిస్తున్నాను. చంద్రిక చంద్రుణ్ణి వదలియుండజాలదు. నీ పుత్రవియోగం, రాజ్యవియోగం కూడా తొలగుతుంది" అని దీవించి అదృశ్యమైనాడు.

ఇంద్రుని సంకల్ప ప్రభావం వల్ల ఆ బ్రాహ్మణుడు పిల్లలను శిబి రాజధానికి తీసుకొనిపోవడం, సంజయుడు వారిద్దరిని తన స్వాధీనంలోకి తీసుకోవడం జరిగింది. విశ్వంతరుని విషాదభరితగాథను విన్న వారందరూ జలజల కన్నీరు కార్చారు. రాజసభ సభ్యులందరూ పశ్చాత్తాపంతో తపించిపోయి విశ్వంతరుణ్ణి మళ్ళీ వెనక్కు పిలిపించి రాజ్యాధికారంలో నిలబెట్టారు.

ఫోన్ : 900 016 3048

## ధర్మ పరిమళం

పల్లవి : ధమ్మము... బుద్ధుని ధమ్మము – ఇది
మానవాళి మహామార్గము
సంఘము... బుద్ధుని సంఘము – ఇది
సమత మమతల గంధము
యుగయుగాలుగా వాడనిది
ఈ... బుద్ధుని ధర్మ పరిమళం
జగజ్యోతిగా నిలచినదీ..
సంబుద్ధుని ధమ్మప్రకాశం
॥ ధమ్మము ॥

చరణం – 1 : వికసించెడి పూల వాసన
గాలి వీచు దిక్కుకేగును
నీటి మీది నావ జోరున
ఏటి వాలు కేసి సాగును
ఈ బుద్ధుని ధమ్మ పరిమళం
ఏ దిక్కుకైన వెళ్ళి చేరును
సంబుద్ధుని ధమ్మ తేజం
నలుదిక్కుల వెలుగు నింపును
॥ ధమ్మము ॥

చరణం – 2 : మనిషిని మనిషిగ ఎంచని
మతవాదములెన్నో యున్నవి
హింసాప్రతిహింసను పూని
నెత్తురు పారించు చున్నవి
ఈ బుద్ధుని ధమ్మ మానసం
మానవీయ మహాసాగరం
సంబుద్ధుని మైత్రీచిత్తం
కసి తెలియని కరుణ మందిరం
॥ ధమ్మము ॥

– బొర్రా గోవర్ధన్

# అన్వేషణ

– మోక్షానంద స్వామి

*By ourselves is evil done*
*By ourselves we pain endure*
*By ourselves we cease from wrong*
*By ourselves become we pure.*
*No one saves us but ourselves*
*No one can and no one may*
*We ourselves must tread the path*
*Buddhas only show the way.*

"తప్పులు చేస్తూ బాధపడేది మనమే. తప్పులను సరిదిద్దుకొని పవిత్రులమయ్యేదీ మనమే. మనని మనమే రక్షించుకోవాలి. ఇంకెవరూ మనని రక్షింపజాలరు. బుద్ధులు మార్గాన్ని చూపుతారు. త్రోవవెంట నడవాల్సింది మనమే". విన్సెంట్ స్మిత్ వ్రాసిన 'అశోకా' అనే పుస్తకంలో మొదటిసారి చూసినప్పుడు పై గీతం నన్నమితంగా ఆకర్షించింది. అది ధమ్మపదంలోనిదే కాని అప్పటికి నేనింకా ధమ్మపదాన్ని చూడలేదు.

బుద్ధధర్మము మానవున్ని ఇతర ఏ శక్తులపై అవి మానవీయమైనవిగానీ, దివ్యమైనవిగానీ ఆధారపడక తనమీద తననే ఆధారపడమంటుంది. నీ ముక్తికిగానీ, నీ బంధానికిగానీ నీవే కారకుడవు. ముక్తికై ఏ దేవీ దేవతనో ప్రార్థించమనికాక నీ శీలాన్ని, సత్ప్రవర్తనని కాపాడుకోమని చెపుతుంది. ముక్తి అంటే ఏమిటో, బంధం ఎలా తొలగుతుందో వివరిస్తూ, అందుకు హేతుసమ్మతమైన మార్గాన్ని మన ముందుంచాడు బుద్ధుడు. అందుకే అది ప్రతీత్య సముత్పాదము (దీని వలన ఇది కలిగింది అనే కారణ కార్య సంబంధాన్ని వివరించేది) అని పిలువబడింది. మహానిదాన సూత్రంలో బుద్ధుడు ఆనందునికి ఈ విషయాన్ని విపులంగా వివరించాడు.

"ఆనందా! వృద్ధాప్య మరణాలకు కారణమేమిటని అడిగిన జన్మమని చెప్పాలి. ఆ జన్మకు కారణము భవము (కామలోక, రూపలోక, అరూపలోకాల్లో జన్మించటానికి తగిన సంస్కార సమూహం). భవానికి కారణం ఉపాదానం (సుఖానుభూతులను పట్టుకొని వ్రేలాడటం), ఉపాదానానికి కారణం తృష్ణ (శబ్దాది సుఖాల అనుభవానికి మనస్సు పడే ఆరాటం). తృష్ణకు కారణం వేదన (అనుభూతి). వేదనకు కారణం స్పర్శ (మనస్సుకు జ్ఞానేంద్రియాలద్వారా ప్రపంచంతో కలిగే సంబంధం). స్పర్శకు కారణం నామరూపాలు. నామరూపాలకు కారణం విజ్ఞానం (గర్భవాసం చేసే చిత్తధార). విజ్ఞానానికి కారణం నామరూపాలు. విజ్ఞాన, నామరూపాలు పరస్పరాధారితాలు. దీనిని వివరిస్తూ అశ్వఘోష మహాకవి బుద్ధచరితములో చక్కని ఉదాహరణనిచ్చాడు. "మండే ఇనుపగుండు గడ్డిలో పడటం వలన గడ్డి కాలుతుంది. గడ్డి కాలటం వలన ఇనుపగుండు ఎర్రబడుతుంది". అలాగే "మనుష్యుడు పడవను నడుపుతాడు, పడవ మనుష్యుని ముందుకు కొనిపోతుంది.'' అదేవిధంగా విజ్ఞాన, నామరూపాలు ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. ఈ విజ్ఞానమే తల్లిగర్భంలో ప్రవేశించి జన్మిస్తుంది. అదే దుఃఖాలన్నిటికి కారణమౌతుంది.

ఇక్కడ సహజంగా ఒక ప్రశ్న తలెత్తుతుంది. పైన చెప్పబడిన గొలుసుకంతటికి వెనుక ఆత్మ ఉండి దీనినంతటినీ భరిస్తుందని వేదాంతులు చెపుతున్నారు కదా! మరి ఈ ఆత్మ గురించి బుద్ధునికి తెలియదా? అని.

బుద్ధుడు అనాత్మను చెపుతాడు కాని ఆత్మను గురించి చెప్పడు. అందుకు కారణమిలా వివరిస్తాడు. ఆత్మవాదులలో ఒకడు వేదన (అనుభూతి) నే ఆత్మ అంటాడు. వేదన ఉన్నప్పుడు అది సుఖంతోనో, దుఃఖంతోనో, అసుఖ, అదుఃఖాలతోనో కూడి ఉండాలి కదా! అందులో ఏది ఆత్మ? ఒకటి ఉన్నపుడు మరొకటి ఉండదు కదా! సుఖవేదనను ఆత్మ అంటే ఆ సుఖానుభూతి అనిత్యము, ప్రతీత్యసముత్పన్నము, క్షీణించేది కావటం వలన ఉత్పత్తి, నాశనాలు దానికి అంటుకొంటాయి. అలాగే తక్కిన రెండు వేదనలు కూడా.

వేదనానుభవం లేనపుడు నేనున్నాననటం ఉంటుందా? ఉండదు. ఉండనప్పుడు వేదనలు లేకపోవటమే ఆత్మ అనెడి

వాదం చెల్లదు. తెలిసేదంతా అశాశ్వతం. పరిణామ శీలం. దుఃఖమయం. తెలివికతీతమైన దానిని తెలుపలేము. కనుకనే బుద్ధుడు నిర్వాణాన్ని వర్ణించలేదు. ఈ కారణాల వలన బుద్ధుడు దేనిని నేనని గాని, నా ఆత్మ అనిగాని అనలేదు. ఆయన కేవలం తార్కికుడు కాదు. తాను సాక్షాత్కరించుకున్న ధర్మాన్నే ఇలా వివరించాడు. ఆ సాక్షాత్కారానికి సాధనాలు శీల–సమాధి–ప్రజ్ఞలు. శీలం వలన దేహశుద్ధి, సమాధి వలన చిత్తశుద్ధి, ప్రజ్ఞ వలన అవిద్యానాశనం సిద్ధిస్తాయి.

బుద్ధుడు గొప్ప ధ్యానయోగి. యోగం వలననే ఆయన నిర్వాణాన్ని పొందాడు. కృష్ణదాసులు, శివదాసులు, క్రీస్తుదాసులు, గులామ్ మహమ్మదులు ఉన్నట్లుగా బుద్ధదాసులు ఉండే అవకాశం లేదు. ఎందుకంటే బుద్ధుడు ఎవరికీ 'నేను చెపుతున్నాను కాబట్టి నీవు నమ్మాలి' అనిగాని, ఇది శాస్త్రంలో ఉంది. ఇది గురుపరంపరాగతంగా వచ్చింది, అనేకులకు ఇది సమ్మతము, ఇది దేవునిచే చెప్పబడిది కాబట్టి నమ్ముమని ఏ విషయాన్నీ చెప్పలేదు. "నీ బుద్ధితో నీవు విచారించు! అది నీకు యుక్తమైనదిగా తోచినపుడే దానిని అనుసరించు'' అన్నాడు. 'నా మాటలను నమ్మకపోతే నీవు శాశ్వతంగా నరకానికి పోతావ'ని భయపెట్టలేదు. నమ్మితే శాశ్వతంగా స్వర్గంలో నివసిస్తావని, స్వర్గసుఖాలను వర్ణించి ప్రలోభపెట్టలేదు. మానవస్వేచ్ఛా వాదానికి ఆకాశమంత ఎత్తైన బావుటా బుద్ధుడు.



*అత్తాహి అత్తనో నాథో కోహినాథో పరోసియా ।*
*అత్తనాహి సుదన్తేన నాథం లభతి దుల్లభం ॥*

– *ధమ్మపదం*

నీకు నీవే యజమానుడవు. ఇతరులెవ్వరు నీకు యజమానులు కాగలరు? తనను తాను చక్కగా నిగ్రహించుకున్నవాడే దుర్లభమైన అట్టి స్వామిత్వాన్ని పొందుతాడు. స్వేచ్ఛను కాపాడుకోవాలంటే అప్రమత్తత అవసరం. ఆ అప్రమత్తతను గురించి బుద్ధుడు నొక్కి చెప్పాడు.

*అప్పమాదో అమతపదం పమాదో మచ్చునో పదం।*
*అప్పమత్తా న మీయన్తి యే పమత్తా యథా మతా॥*

అప్రమత్తతే అమృతపదవి. ప్రమత్తతే మృత్యుపదవి. అప్రమత్తులెన్నడూ మరణించరు. ప్రమత్తులు జీవన్మృతులే.

బౌద్ధధ్యానం ఆనాపానసతితో మొదలౌతుంది. ఆ తర్వాత మనస్సులో కలిగే ఏకాగ్రతాస్థాయిని బట్టి ధ్యానాన్ని ప్రథమధ్యానం, ద్వితీయధ్యానం, తృతియధ్యానం, చతుర్థధ్యానం అని నాలుగు రకాలుగా విభజించి చెప్పారు. ఆపైన ఆకాశానంత్యాయతనము, విజ్ఞానానంత్యాయతనము, అకించన్యాయతనము, నైవసంజ్ఞానాసంజ్ఞాయతనము, సంజ్ఞావేదయిత నిరోధాలు ఉన్నాయి. సంజ్ఞానిరోధం తర్వాత ఉన్నదే నిర్వాణం. నాలుగవ ధ్యానాన్ని సాధించిన తర్వాత ఇద్ధుల (సిద్ధుల) గురించి చెప్పబడింది. అందులో ఒక్కడు అనేకులుగా కనిపించటం, అనేకులుగా మారినవాడు తిరిగి ఒక్కడు కావటం, ప్రత్యక్షం కావటం, అదృశ్యం కావటం, పరచిత్తజ్ఞానం, దివ్యశ్రోత్రం, నీటిమీద తేలటం, భూమిలోనికి చొచ్చుకుపోవటం మొదలైన ఎన్నో సిద్ధులు వివరంగా చర్చింపబడినాయి.

బుద్ధునికి ముందు వైదిక సాహిత్యం ఈ విషయాల్ని చర్చించినట్లు కనిపించదు. కాని బుద్ధుని తర్వాత వచ్చిన పతంజలి మహర్షి యోగ దర్శనంలో ఇదే ప్రణాళికతో సవితర్క, సవిచార, ఆనంద, అస్మితలనే నాలుగు విధాల సంప్రజ్ఞాత సమాధులను, సంయమాన్ని బట్టి ఎన్నో రకాల సిద్ధులను వివరించాడు. యోగదర్శనాన్ని అనుసరించి కూడా స్వరూపస్థితి అని చెప్పబడే అంతిమస్థితిలో తెలివి ఉండదు. తెలివి లేనపుడు అది స్వరూపమని ఎలా చెప్పగలవు? నేను ఆత్మను అనే తెలివి ఉంటుందని చెప్పబడే అస్మితానుగత సంప్రజ్ఞాత సమాధి ఆత్యంతిక దుఃఖనివృత్తిస్థితి కాదు. బుద్ధుని యోగమార్గంయొక్క వైదికీకరణమే పాతంజల యోగదర్శనము. యోగదర్శనంలోని భాషవల్ల ఇది స్పష్టంగా తెలుస్తుంది. పతంజలి బుద్ధునికన్న కనీసం రెండు మూడు వందల సంవత్సరాల తర్వాతివాడు.

దార్శనికంగా ఇంత సామీప్యత కలిగిన బౌద్ధం, ఈ దేశంలో ఎందుకు పరాయిదైందో విచారిస్తే అందుకు బుద్ధుడు బ్రాహ్మణుల పశుహింసాత్మకమైన యజ్ఞాదులను నిరసించటం,

నాలుగు వర్ణాల వారికి జ్ఞానసాధనకు అర్హత కలదని చెప్పటం, బ్రాహ్మణులు రాజుల సాంగత్యము వలన భోగలాలసులై తమ తపోవృత్తిని మరచిపోయినారని విమర్శించటం కారణాలు కావచ్చు. అన్నిటికి మించి ఆధ్యాత్మిక నాయకత్వంలో బ్రాహ్మణుల గుత్తాధిపత్యాన్ని దెబ్బతీయటం. ఉపనిషత్తుల్లో బ్రహ్మజ్ఞానులైన రాజుల గురించి చెప్పబడింది కాని అది ఒక సామాజిక ఉద్యమంగా రూపుదిద్దుకున్నట్లు కనిపించదు. కాని బుద్ధుని కాలంలో, ఆ తర్వాత బింబిసారుడు, అశోకుడు మొదలైన చక్రవర్తుల, రాజుల సహాయం వలన బౌద్ధం గొప్ప సామాజిక ఉద్యమంగా రూపుదిద్దుకొని, దేశమంతా వ్యాపించింది. దీనిని సహించలేని బ్రాహ్మణులు మౌర్య రాజైన బృహద్రధుని వద్ద సేనాపతిగా ఉన్న పుష్యమిత్రుని నాయకత్వంలో తిరుగుబాటు చేసి, బృహద్రధుని చంపి రాజ్యాధికారాన్ని చేపట్టారు. ఆ తర్వాత దేశాన్ని తిరిగి బ్రాహ్మణీకరించే కృషి ప్రారంభమైంది. శూద్రులపై దారుణంగా వివక్ష చూపే మనుస్మృత్యాదులు వ్రాయబడినాయి.

మరల పశుహింసతో కూడిన అశ్వమేధాది యాగాలు మొదలైనాయి. బౌద్ధంలో జాతకకథల్లో బీజప్రాయంగా ఉన్న కథల్ని తీసుకొని మార్పులు చేర్పులతో రామాయణ, మహాభారతాలు వ్రాయబడినాయి. నివృత్తిధర్మ ప్రాధాన్యాన్ని తగ్గించి, ప్రవృత్తిధర్మాన్ని, కర్మప్రాధాన్యాన్ని భారతంలో, భగవద్గీతలో నొక్కిచెప్పారు. బి.సి. రెండవ శతాబ్దంలో ప్రారంభమైన ఈ ఉద్యమం సుమారు వెయ్యేళ్లకు పైగా కొనసాగింది. పంచతన్త్రం కూడా ఈ విధంగా రూపుదిద్దుకున్నదే. ఇందులో జాతక కథల్లోని పశుపక్ష్యాది పాత్రల్ని ఆదర్శంగా తీసుకొని కాకి, ఎద్దు, సింహము, నక్క మొదలైన పాత్రల్ని కల్పించి, మనుస్మృతి మొదలైన గ్రంథాల నుండి ఆయా నీతి ప్రబోధకమైన శ్లోకాలను చేర్చారు. ఇందులోని కాకోలూకీయము వర్షాకారబ్రాహ్మణుడు లిచ్ఛవీ రాజుల మధ్య కలిగించిన భేదనీతి ఉదంతానికి అచ్చం కాపీ. సరియైన తోడు దొరకనపుడు ఒంటరిగా పయనించటం మంచిదికాని మూర్ఖుని తోడు మంచిది కాదు అనే ధమ్మపదంలోని గాథను తిరస్కరించే కథ, జాతక కథల్లోని వేయిబుద్ధులవాని కథను హేళన చేసే కథ ఇందులో కనిపిస్తాయి. ఇవన్నీ చెప్పి అపరీక్షితకారకములో ఇంటికి భిక్షకు వచ్చిన బౌద్ధభిక్షువులను కర్రతో కొడితే స్వర్ణముద్రలు దొరుకుతాయనే కథను కల్పించటం విష్ణుశర్మయొక్క కుటిలనీతికి నిదర్శనం. ఈ కాలంలోనే భక్తి ఉద్యమాలు, దాని సాహిత్యమూ రూపుదిద్దుకుంది. దేశీభాషలు ఏర్పడిన తర్వాత సంస్కృతంలోని ఈ సాహిత్యాన్ని ఆయా భాషల్లోకి దిగుమతి చేసుకోవటంతోనే సరిపోయింది.

1981లో అనుకోకుండా రాహుల్ సాంకృత్యాయన్ హిందీలో వ్రాసిన బుద్ధచర్యకు తెలుగు అనువాదం నా చేతికి వచ్చింది, దానిని మళయాళస్వామి ఆదేశంతో శ్రీరామకృష్ణ బ్రహ్మచారిగారు అనువదించారు. ధ్యానముద్రలో ఆసీనుడైన బుద్ధుని మూర్తిని చూచి ఆకర్షితులు కాని వారు అరుదు కదా! బాల్యంనుండీ నాలో అటువంటి ఆకర్షణ ఉండేది కాని, బుద్ధచర్యను అధ్యయనం చేసేవరకు ఆయన బోధ ఎంత లోతైనదో తెలియలేదు. బుద్ధచర్యలో రాహూల్‌సాంకృత్యాయన్ మాట ఒక్కటీ ఉండదు. పిటకాల్లోని ఆయా సూత్రాలనే ఉన్నది ఉన్నట్లుగా బుద్ధుని జీవితక్రమాన్నిబట్టి ఇందులో చేర్చాడు. త్రిపిటకాల్లోని అనేక గ్రంథాలను చదవలేనివారు ప్రామాణికమైన బౌద్ధధర్మాన్ని గ్రహించటానికి ఈ పుస్తకంపై ఆధారపడవచ్చు. అనువాదం చక్కగా ఉంది అయితే ఇప్పటివారికి ఆ భాష గ్రాంథికం అనిపింపవచ్చు. పాలీ త్రిపిటకాలను చూచేవరకూ నేను దీనినే నిరంతరం అధ్యయనం చేశాను. 82 నుండి ధ్యానంలో ఆనాపానసతితో పాటు చేసే అద్వైతమంత్రాన్ని విడిచి కేవలం అనాపానసతినే చేయసాగాను. బుద్ధానుస్సతిలో ఉండటానికి కొంతసేపు బుద్ధునికి సంబంధించిన జపం చేసేవాన్ని.

మరి మీరు కృష్ణునికి సంబంధించి, జగన్మాతకు సంబంధించి చాలా అనుభవాలను పొందారు కదా! అవన్నీ భ్రాంతులా అని ఎవరైనా అడుగవచ్చు. మనస్సుకు ఉండే శక్తులు అపరిమితమైనవి. పరిశుద్ధమైన మనస్సుపై మనం ఏ రూపాన్ని ఆరోపిస్తే అది ఆ రూపాన్ని ధరిస్తుంది. ఆ రూపంతో మనతో వ్యవహరిస్తుంది. అందువలన వాటిని భ్రాంతులు అనటం వీలుకాదు. అయితే దుఃఖాన్ని పూర్తిగా నిర్మూలించాలంటే మానవీయమైనవి గాని, దివ్యమైనవి గాని అన్ని రకాల బంధనాలనుండి విముక్తం కావలసిందే. భార్యాపిల్లలమీద చిక్కుకున్న మనస్సు బంధానికి కారణమైనట్లే, దేవతలమీద చిక్కుకున్న మనస్సు కూడా సత్య సాక్షాత్కారానికి, ముక్తికి ఆటంకంగా మారుతుంది.

మోక్షానంద స్వామి

*(నా సాధన కథ)*

# బుద్ధపాద మంగళాలు

*- బెల్లంకొండ రమేశ్ చంద్రబాబు*

బుద్ధదేవుని జీవితంలోని ముఖ్యఘట్టాలను అమరావతి, గాంధార, మధుర శిల్ప శైలులలో మహోన్నతంగా చెక్కబడి భారతీయ శిల్పకళను అత్యున్నత స్థానంలో నిలబెట్టాయి. థేరవాదుల పర్యవేక్షణలో రూపొందిన శిల్పాలలో అంతఃసౌందర్యానికి ప్రాధాన్యత ఇస్తూ తథాగతుని చిహ్నరూపంలో సూచించబడటం మూడు బౌద్ధ శిల్పశైలులలోనూ జరిగింది. మహాసాంఘికులు కూడా బుద్ధదేవుని చిహ్నరూపంలోనే ఒకప్రక్క శిల్పీకరిస్తూనే గౌతమబుద్ధుని భౌతిక రూపానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి చైత్యం ముందు నిలబడివున్న, కూర్చుని ఉన్న భంగిమలలో అజంతా, అమరావతి శిల్పాలలో మలచడం జరిగింది. క్రీస్తుశకారంభంలో ఉత్తర భారతాన్ని ఏలిన కుషాణుల కాలంలో గాంధార, మధుర, సాంచి, సారనాథ్, బార్హుత్, సంగోల్ ప్రాంతాలలోను, దక్షిణ భారతాన్ని ఏలిన శాతవాహనుల కాలంలో తూర్పు కృష్ణాతీరంలోని అమరావతి, ఘంటసాల, జగ్గయ్యపేట ప్రాంతాలలోను, పడమటి కనుమల్లోని అజంతా, కార్లె, భాజ, నానెఘాట్ గుహలలోను బయల్పడిన శిల్పాలలో నాటి బౌద్ధశిల్పి ప్రదర్శించిన నైపుణ్యం అనిర్వచనీయం. అందుకే అవి భారతీయ శిల్పకళా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి.

గౌతమబుద్ధుడు మంగళ చిహ్నాలైన జ్వాలాస్తంభం రూపంలోను, పాదముద్రికల రూపంలోను, బోధివృక్షం రూపంలోను ఎంతో నిపుణత కలిగిన బౌద్ధ శిల్పి చేతులలో అత్యంత సుందరాకృతులను పొందాడు.

**అమరావతి అంగులీమాల శిల్పంలోని**
**జ్వాలాస్తంభం - 1**
**(క్రీ.శ. 2వ శతాబ్దం)**

జ్వాలా స్తంభం అడుగున పద్మంపైన బుద్ధ పాదుకలు, పైభాగాన ధర్మచక్రం, ఆపైన తిరత్న చిహ్నాలు చెక్కబడ్డాయి. ప్రముఖ శాసన, శిల్పకళా పరిశోధకులు శ్రీ చెలంబూర్ శివరామమూర్తి ఇచ్చిన వివరణను ఇక్కడ గమనిద్దాం. ఇది వైదిక త్రిమూర్తులనేకాక సూర్య, అగ్నిదేవులపై బుద్ధదేవుని ఆధిపత్యాన్ని సూచనప్రాయంగా తెలియజెప్పే శిల్పవిన్యాసం. పద్మం పద్మసంభవుడైన బ్రహ్మదేవుని, పాదముద్రికలు విశ్వాన్ని ఆక్రమించిన అంగతో విష్ణువుని, స్తంభం అగ్ని లేదా రుద్రుని అనగా లింగోద్భవమూర్తి ముఖ్యలక్షణమైన అగ్నికీలల బంధాన్ని సూచిస్తుండగా, చక్రం వైదిక ఆదిత్య మండలాన్ని, త్రిరత్నచిహ్నం బుద్ధదేవున్ని, ధర్మాన్ని, సంఘాన్ని సూచిస్తూ అన్నింటికి పై స్థానంలో ఉండి తన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నది. అయితే వైదిక దేవుళ్లతో మూర్తిగారు చేసిన పోలిక మనం అంగీకరించకపోయినప్పటికి చివరగా వారు చెప్పిన ధర్మచక్రం ఆధిపత్యాన్ని ఒప్పుకొనితీరాలి.

**బలవస్తె బుద్ధభగవానుని కుడ్యచిత్రం**
**(క్రీ.శ. 4 వ శతాబ్దం)**

ఈ జ్వాలా స్తంభాన్ని మరోరూపంలో రెండు శతాబ్దాల తరువాత మధ్య ఆసియాలోని బలవస్తెలో లభించిన బుద్ధభగవానుని కుడ్యచిత్రంలో చిత్రించబడటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. కుషాణుల పాలానాంతర కాలంనాటి ఈ కుడ్యరేఖాచిత్రంలో బుద్ధభగవానుని వక్షస్థలంపై శ్రీవత్స చిహ్నం చిత్రించబడింది. మహాపురుషుడైన బుద్ధభగవానుడు ఈ గుర్తును కలిగి ఉండటం మనకు తెలిసిన విషయమే. అయితే అది వస్త్రంమాటున దాగి వుండటంవలన చూడలేము. ఈ విధమైన తాత్వికతతో కూడిన తథాగత చిత్రం భారతదేశంలో ఇంతవరకు ఎక్కడ ఆవిష్కరించబడలేదు.

ఇక్కడ బుద్ధుడు విరాట్ పురుషునిగా తీర్చిదిద్దబడ్డాడు. బుద్ధదేవుని శరీరంపై ఉన్న చిహ్నాలలో చెప్పుకోదగ్గవి అతడి రెండు భుజదండాలపై ఉన్న జ్వాలాస్తంభం, క్రిందున పద్మం, పైన తిరత్నం. ఇది అమరావతిలోని అంగులిమాల శిల్పంలోని జ్వాలాస్తంభంతో పోలుతూనే స్తంభం అటునిటు ఉండే అగ్నికీలల స్థానంలో ఇక్కడ ఆకులు సూచించబడ్డాయి.

క్రీ.శ. 2వ శతాబ్ధికి చెందిన మరో అమరావతి శిల్పంలో కూడా యశుడు అతని మిత్ర బృందంతోసహా శాక్యమునిని

శరణుజొచ్చే దృశ్యంలో కూడా బుద్ధదేవుడు జ్వాలాస్తంభం రూపంలోనే కనబడతాడు.

అమరావతి చైత్యానికే చెందిన మరొక శిల్పంలో జ్ఞానసముపార్జన తరువాత కపిలవస్తు సందర్శించిన బుద్ధదేవునికి శాక్యసంఘీయులు అంజలి ఘటిస్తున్న శిల్పంలో కూడా జ్వాలాస్తంభం రూపునే తథాగతుడు పొందాడు.

లండన్ బ్రిటీష్ మ్యూజియంలోని క్రీ.శ. 2వ శతాబ్దికి చెందిన అమరావతి స్థూపఫలకంలో కూడా వలయాకారంగా తీర్చిదిద్దిన శిలపై ఎత్తైన స్వస్తికాసనంపై జ్వాలాస్తంభం, త్రిరత్న కిరీటాన్ని కలిగివుంది. మంగళ చిహ్నమైన ఈ స్వస్తికాసనం బుద్ధదేవుని సూచిస్తున్నది. జ్వాలాస్తంభానికి అటునిటు చామరధారులు, చుట్టూ బౌద్ధబిక్షువులు, ఉపాసకులు భిన్న భంగిమలలో మోకరిల్లుతున్నారు. బుద్ధదేవుని స్వస్తికాసనం రూపంలో కొలుస్తూనే జ్వాలస్తంభ కిరీటంలోని త్రిరత్నం అత్యున్నత స్థానాన్ని పొందింది.

క్రీ.శ. 3వ శతాబ్దికి చెందిన నాగార్జునకొండ నలగిరిదమనం శిల్పంలో కూడా బుద్ధుడు జ్వాలాస్తంభం రూపులోనే కన్పిస్తాడు.

**సారనాథ్ ఛత్రం - మంగళచిహ్నాలు :**

క్రీ.శ. 1 వ శతాబ్దికి చెందిన సారానాథ్ చైత్య-ఛత్రం ఇప్పటివరకు భారతదేశ బౌద్ధారామాలలో వెలుగుచూసిన ఛత్ర శిలలన్నింటికంటె అత్యంత అందంగా తీర్చిదిద్దబడింది. అష్టమంగళ చిహ్నాలైన స్వస్తిక, శ్రీవత్సం, పుష్పస్రక, త్రిరత్నం, జంటచేపలు, పూర్ణఘటం, శంఖం, చక్రములతోపాటు పండ్లబుట్ట, అశోకస్థంభ కిరీటంలో కన్పించే నాగపుష్పాలు సారనాథ్ ఛత్రంపై అలంకరించబడినాయి.

**బౌద్ధసాహిత్యంలో బుద్ధపాద వందనం :**

పాలీ సాహిత్యం, భక్తితో బుద్ధుని పాదాలను తాకి వందనం చేయాలని చెప్పే అనేక సంఘటనలను పొందుపరచింది. మహాపరినిబ్బాణసుత్త గ్రంథంలో (8) "ఓ బ్రాహ్మణా! మహత్తు కలిగిన తథాగతుని వద్దకు వెళ్ళి అతడి పాదాలను తలతో తాకి నమస్కరించి (భగవతో పదే సిరస వందతి) నా తరుపున బుద్ధదేవుని ఆరోగ్యం గురించి, సుఖసంతోషాలను గూర్చి అడుగు" అని పేర్కొనబడింది. అలాగే దివ్యావదానం గ్రంథంలో (9) ఒకచోట "అతడు వెళ్ళి దివ్యమూర్తి పాదాలకు నమస్కరించి, ఓ మూలకు వెళ్ళి కూర్చున్నాడని ప్రస్తావించబడింది. బుద్ధపాదారాధన గూర్చి అపదాన గ్రంథం నిర్దుష్టంగా పేర్కొంటున్నది. థేరపదసఞక పౌరాణిక బుద్ధుడైన తిస్సను సందర్శించినంతనే తనలో కలిగిన ఆత్మస్వరూపమైన జ్ఞానాన్ని గురించి తెలుపుతూ, "తేజఃస్సూర్య సోదరుడైన తిస్సను చూచినంతనే నాలో ఏదో కాంతి ప్రవేశించింది. నా మనసు ఎంతో తేజోమయమైంది. బుద్ధపాద ముద్రలను అత్యంత శ్రద్ధాసక్తులతో చూచినంతనే నాకు ఎంతో గొప్ప జ్ఞానం సంప్రాప్తమయింది'', అన్న మాటలు పదసఞకథేర నోటి నుండి అప్రయత్నంగా వెలువడినాయి.

అశ్వఘోషుని బుద్ధచరితం గ్రంథంలో, జ్యోతిష పండితుడైన అసితుడు మంగళ చిహ్నమైన ధర్మచక్రాన్ని బాలగౌతముని పాదాలలో ఉండటం చూచి విస్మయానికి గురి అయ్యాడు అని పేర్కొనబడింది ("చక్రాంగ పాదం సతతో మహర్షిర్ జాలా వనద్ధాంగుళ పాణిపాదం... సవిశ్మయం రాజసుతం దదర్శ"). అశ్వఘోషుడు తన గ్రంథంలో చేసిన వర్ణన నాగార్జునకొండలో శిల్పంగా రూపొందడం ఆంధ్రశిల్పి ఊహకు పరాకాష్టగా పేర్కొనవచ్చు. ఈ శిల్పంలో జ్యోతిష పండితుడైన అసితుడు శుద్దోదన మహారాజ కొలువుకు వచ్చి పట్టువస్త్రాలలో పొదివిన బాలబుద్ధుని పాదముద్రలను చూచి విస్మయం చెందే దృశ్యాన్ని కళ్ళకు కట్టినట్లు రూపొందించిన శిల్పి, ఇదే శిల్పఫలకంలో తొలుత శుద్ధోధన మహారాజు వద్దకు తప్పెట్లు, తాళాలతో, వింజామరలు విసురుతూ ఊరేగింపుగా వచ్చిన స్త్రీలు బాల బుద్ధుని పాదుకలను సమర్పించే దృశ్యం అద్భుతంగా మలచబడింది.

పాహియాన్ (క్రీ.శ. 399), సాంగ్‌యున్ (క్రీ.శ. 518)లు సంఘాశి బౌద్ధారామంలో ఒక స్తంభం నిలబెట్టారు. దానిపై భిన్నబుద్ధుల పాదాలపై కొన్ని గుర్తులు, ముద్రలు వదలి వెళ్ళారని పేర్కొన్నారు.

హుయాన్‌త్సాంగ్ (క్రీ.శ. 7 శ॥) పాటలీపుత్రంలో తాను బుద్ధదాతు స్తూపం చెంత బుద్ధ పాదముద్రలను ప్రతిష్టించిన ఆలయాన్ని చూచానని వ్రాశాడు. బౌద్ధ సాంప్రదాయం కూడా



దీన్ని ధృవపరుస్తున్నది. తథాగతుడు చివరిసారిగా మగధను వీడి కుశనగరం వెళ్తూ ఒక రాతిపై నిలబడి చుట్టూ తిరిగి చూచి మగధ నుండి శెలవు తీసుకొన్నాడు. అప్పుడు తన పాద ముద్రలను అక్కడ ఒక రాతిపై వదలి వెళ్ళగా ఆ ప్రాంతం ఆ తరువాత తీర్థయాత్రాస్థలంగా మారింది. ఆ పాదముద్రలు 18 అంగుళాల పొడవు, 6 అంగుళాల వెడల్పుతో వుండి పాదం మధ్యన ధర్మచక్రాలు, కాలివేళ్ళపై మంగళ చిహ్నాలు కలిగి స్పష్టంగా, ఎంతో తేజోవంతంగా కన్పిస్తున్నాయని వాటి ప్రాశస్త్యం తెలిసిన అశోకమౌర్యుడు, పవిత్ర పావనమూర్తి యొక్క పాదముద్రికల శిలను పాటలీపుత్రానికి తెప్పించి ఆలయం నిర్మించాడని హుయాన్‌త్సాంగ్ పేర్కొన్నాడు.

మహావంశ గ్రంథం శ్రీలంకలోని ఆడమ్స్‌పీక్ పైనున్న బుద్ధపాదాలనుగూర్చి రెండుమార్లు ప్రస్తావించింది. సర్వోన్నతుడు, దివ్యబోధకుడు, మహాదేవుడు ఇక్కడ తన బోధనలు వినిపించి సుమేరుకూట పర్వతంపై తన పాదముద్రలను వదలివెళ్ళాడని, ఈ పాదముద్రలను శ్రీలంక రాజైన రాజావలగమ్ బాహు క్రీ.పూ. 90 లో వేటకు వెళ్ళినపుడు కనుగొన్నాడని మహావంశ గ్రంథం పేర్కొంటున్నది.

గాంధారలో దొరికిన అనేక బౌద్ధ కట్టడ అవశేషాలను లాహోర్ మ్యూజియంలో భద్రపరిచారు. వాటిలో కొన్ని బుద్ధపాద ముద్రికలు కూడా వున్నాయి. అలా అని చెప్పి ప్రాచీన కాలంలో బుద్ధపాదారాధన ఒక గొప్ప శాఖగా అభివృద్ధి చెందినదనీ అనలేము. స్వాత్‌నది ఉత్తరతీరం ఒడ్డున ఒక పెద్ద రాతిపై బుద్ధపాద ముద్రలున్నాయని, వాటిపై ఆలయం నిర్మించి అక్కడి ప్రజలు పూజలు నిర్వహించేవారని, అదేకాకుండా ఆ దగ్గరలోని మహావన విహారంలో నలుపలకల రాతిపై బుద్ధపాదముద్రలు చూచానని హుయాన్‌త్సాంగ్ తన గ్రంథంలో పేర్కొన్నాడు.

తొలిసారిగా అమరావతిలోను, ఆ తరువాత కాలంలో నాగార్జున కొండలోను లభించిన బుద్ధ పాద ముద్రికలనుబట్టి ఒ.సి.గంగూలి అశోకుని తరువాత కాలంలో బుద్ధపాదారాధన ఒక శాఖగా రూపొంది వుండవచ్చునని అభిప్రాయపడ్డారు.

**అమరావతి బుద్ధపాదవందన శిల్పం :**

ఒక అమరావతి శిల్పఫలకంలో తథాగతుని పాదముద్రలకు భిన్న భంగిమలలో మ్రొక్కుతున్న యువతులను అతిసుందరంగా మలచినతీరు ప్రాచీనాంధ్ర శిల్ప చరిత్రలోనే అపూర్వంగా భావించవచ్చు. విశేషమేమంటే ఈ శిల్పంలో స్త్రీల సౌందర్యం ముందు బుద్ధ పాదమంగళాల ప్రాధాన్యత తరగిపోయినట్లయింది. క్షేమేంద్ర కవి వయ్యారంగా వంగి పూజలు చేస్తున్న స్త్రీలను తుఫాను గాలికి అందంగా వంపులు తిరుగుతున్న లేత మొక్కలతో పోల్చిన సంఘటనను అమరావతి శిల్పకారుడు ముందుగానే ఊహించడం గొప్ప విషయం అన్న ఒ.సి. గంగూలి మాటలు అక్షరసత్యం. ఈ శిల్పాన్ని గురించి ఒ.సి. గంగూలి వివరిస్తూ ఇక్కడ పురుషులు లేకుండా స్త్రీలు మాత్రమే కన్పించడానికి కారణం స్త్రీల బౌద్ధసంఘంలో ప్రవేశాన్ని సూచిస్తున్నదని, ఆ స్త్రీలు భిక్షుణి సంఘానికి చెందినవారై వుండవచ్చని అభిప్రాయపడ్డారు. కాని వారు భిక్షుణిల వస్త్రధారణలో కన్పించడం లేదు, కాబట్టి వారిని ఉపాసినులుగానే భావించాల్సి వుంటుంది. ఇదేవిధంగా స్త్రీలు భిన్న భంగిమలలో నమస్కరించే శిల్పం సాంచీ తోరణంపై కూడా కన్పిస్తుంది. దీన్నిబట్టి ఆంధ్రశిల్పి ప్రభావం ఎంతదూరం ప్రయాణించిందో గ్రహించవచ్చు.

**ఆంధ్రదేశంలో బుద్ధపాద మంగళాలు :**

ఆంధ్రదేశంలో బుద్ధపాద మంగళాల ఆరాధన ఎక్కువగానే సాగిందనడానికి ఇక్కడ దొరికిన పాదముద్రికల శిల్పాలే నిదర్శనం. ఇవి అమరావతి బావికొండ, తొట్లకొండ, ఘంటసాల నాగార్జునకొండ, కేసనపల్లి, ఫణిగిరిలలో వెలుగుచూశాయి. నాగార్జునకొండ, ఫణిగిరిలలో దొరికిన పాదముద్రికల శిల్పాలపై బ్రాహ్మీలిపిలో శాసనాలు లిఖించబడ్డాయి. గాంధార, మధురలలో కుషాణుల కాలంలోను, ఆంధ్రదేశంలో సాతవాహనుల కాలంలోను అష్టమంగళ చిహ్నాలతో కూడిన బుద్ధపాదారాధన సాగినట్లు వాటిపైనున్న శాసనాల ద్వారా తెలియవస్తుంది.

1. అమరావతిలో క్రీ.పూ. 1 వ శతాబ్దికి చెందిన పాదమంగళ శిల్పాలు రెండు వెలుగుచూశాయి. ఈ పాదముద్రలకు పూజలందించేవారు ఒక శిల్పంలో పాదముద్రలకంటే పెద్దరూపులోను, మరొక శిల్పంలో చాలా చిన్నిరూపంలోను చెక్కబడటం విశేషం. పాదముద్రలపై మంగళ చిహ్నాలయిన ధర్మచక్రం, శ్రీవత్సం చిహ్నాలుండగా కాలివ్రేళ్ళు బొటనవేలు దగ్గరకు చేర్చి చక్రసమ్మిళితమైన త్రిరత్న చిహ్నం చిత్రించబడింది.

2. థేరవాద బౌద్ధానికి చెందిన బావికొండ (తిమ్మాపురం, విశాఖ జిల్లా) బౌద్ధవిహార శిథిలాలలో

బయల్పడిన రూపశిల్పాలలో ముఖ్యమైనవి పాదమంగళ శిల్పాలే అయితే అవి రెండూ కూడా పగిలిపోయి లభించాయి. ఇసుకరాతిలో చెక్కబడిన ఈ పాదముద్రలపై అరికాలులో ధర్మచక్రం, మడమభాగంలో త్రిరత్న చిహ్నాలు మాత్రమే కలిగి ప్రాచీనతను కనపరుస్తున్నది.

3. తొట్లకొండ (మంగమారిపేట, విశాఖజిల్లా)లో బయల్పడిన బుద్ధపాదశిల్పంలో కూడా బావికొండ పాదమంగళాల మాదిరిగానే పాదముల మధ్యన ధర్మచక్రం చెక్కబడింది. మడమపై త్రిరత్నచిహ్నం కాకుండా స్వస్తిక గుర్తును, వ్రేళ్ళపై స్వస్తిక, జంటచేపల గుర్తులు ఉండగా ధర్మచక్రానికి కాలి వ్రేళ్ళకు మధ్యన పూర్ణఘటం చిహ్నాలు వరుసగా చిత్రించబడినాయి.

4. అ. క్రీ.శ. 3వ శతాబ్దికి చెందిన నాగార్జునకొండ బుద్ధపాద శిల్పంలో పాదం మధ్యన పెద్ద ధర్మచక్రం, దాని పైభాగాన శ్రీవత్సం, బలిపీఠం, స్వస్తిక, పూర్ణఘటం, క్రింది భాగాన ధ్వజం, ఆసనం, త్రిరత్నం జంటచేపలతోకూడిన అష్టమంగళ చిహ్నాలు, పదివ్రేళ్ళపైన త్రిరత్న చిహ్నాలు చక్కటి నైపుణ్యంతో శిల్పీకరించబడ్డాయి.

ఆ. నాగార్జునకొండ త్రవ్వకాలలో మొట్టమొదటగా వెలుగుచూచిన బుద్ధపాద శిల్పం కొంత ప్రత్యేకతను కనపరుస్తున్నది. ఈ శిల్పఫలకంలో బుద్ధపాదాలకు కుడివైపున బోధివృక్షం సింహాసనంపై ప్రతిష్టించబడి ఉండగా వృక్షానికి ఇరువైపుల విజామరధారులు కనిపిస్తున్నారు. బుద్ధపాదాలలో మధ్యన పెద్ద ధర్మచక్రం, మడమ భాగంలో అకుశం, సింహాసనం, త్రిరత్నం, జంటచేపలు, ప్రక్కనే శంఖం ఉండగా, చక్రం ముందుభాగాన నాగసింహాసనం, స్వస్తిక, శ్రీవత్సం, పూర్ణఘటం ప్రక్కన చిట్టి శంఖం చెక్కబడింది. కాలి వ్రేళ్ళపై ధర్మచక్ర కిరీట స్తంభం, అకుశం, సింహాసనం, చేపలజంట, త్రిరత్న చిహ్నాలు మలచబడినాయి. ఈ చిహ్నాలకు దిగువన గవ్వలు సగం మాత్రవే కన్పిస్తున్నాయి. వ్రేళ్ళకు ముందుభాగాన బ్రాహ్మీశాసనం చెక్కబడింది. ఈ శాసనాన్ని పరిష్కరించిన డి.సి. సర్కార్, ఎ.ఎన్. లహరీ లు నాగుల అలంకరణతో ఉన్న సింహాసన చిహ్నాన్ని తమ వ్యాసంలో నాగచిహ్నాలుగా పేర్కొన్నారు.

**శాసన పాఠం :**

1. సిద్ధం ఆచారియనం థేరియానం విభజ్జవాదానం కాశ్మీర గాంధార యవన వనవాస తంబపని దిప పసాదకనం

2. మహావిహారవాసినం నవ(ం)గ సథు ససన అథ వజన వినిచ్ఛయ వసరదనం అరియ వ(ం)స పలుని ధరనం

3. విహారె భగవతో పాద సంఘుడాని పతితాపితో సవ సతానం హిత సుఖ అథనాయతి ।

**అర్థం :**

విజయోస్తు। మహావిహారవాసులైన ఆచార్యులు, విభజ్జవాదులు, థేరవాదులు, కాశ్మీర, గాంధార, యవన, వనవాస, తామ్రపర్ణి ద్వీప యావత్ ప్రజల సుఖ సంతోషాల కోసం బుద్ధపాదయుగళాన్ని ప్రతిష్టించి ప్రార్థించడమైనది.

5. ఘంటసాల బుద్ధపాదశిల్పం నాలుగు మూలలు విరిగిపోయినప్పటికి అమరావతి బుద్ధపాద శిలను పోలివుండి పాదం మధ్యన చక్రం కలిగివుంది. మడమపై స్వస్తిక గుర్తు స్పష్టంగా కనిపిస్తుండగా, త్రిరత్న చిహ్నం లీలామాత్రంగా కనిపిస్తున్నది.

6. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పురావస్తుశాఖ వారు నిర్వహించిన ఫణిగిరి బౌద్ధవిహార త్రవ్వకాలలో ఎన్నో అపురూప శిల్పాలను వెలుగులోకి తీసుకువచ్చారు. వాటిలో రెండు బుద్ధపాద మంగళ శిల్పాలు కూడా బయల్పడినాయి.

అ) సాతవాహనుల (క్రీ.శ. 2 శతాబ్దం) కాలం నాటి బ్రాహ్మీశాసనం కలిగిన తథాగతుని నలుచదరపు పాదమంగళశిలపై పాదాల మధ్యన పెద్దధర్మచక్రం మడమలపై జంటమీనాలు, ఆసనం, త్రిరత్నం, చామరం కలిగి, ధర్మచక్రానికి కాలివ్రేళ్ళకు మధ్యన స్వస్తిక, శ్రీవత్సం, చేపలజంట, బలిపీఠంతో కూడిన అష్టమంగళ చిహ్నాలుండగా నాగార్జునకొండ శిల్పంలో మాదిరిగా పది కాలివ్రేళ్ళపైన త్రిరత్న చిహ్నాలున్నాయి. వ్రేళ్ళముందు భాగంలో బ్రాహ్మీశాసనం ఉండగా వాటి ముందు అంచు వెంబడి వరుసగా అశ్వం, సింహం, ఎద్దు, ఏనుగు, పులి, ఒంటెలు సహజమైన రూపంలో మలచబడినాయి.

**శాసనపాఠం :**

*"సిద్ధం భయ(ంత)(ద)స(న) తుకస బోధికస దేయధమ పద సంఘదో"*

అర్థం : బయత, బోధికలు బుద్ధపాదాలను ధర్మదానం కావించారు.

ఆ) ఇక్ష్వాకు కాలంనాటి (క్రీ.శ. 3 శతాబ్ది) బ్రాహ్మీలిపిలో వున్న ప్రాకృత శాసనం కలిగిన సిరిపాద శిల పై పాదాల మధ్యన పెద్దధర్మచక్రం మడమలపై త్రిరత్నానికి

అటునిటు స్వస్తికలతోను, ధర్మచక్రం పైభాగాన కాలివ్రేళ్ళ దిగువన చామరం, శ్రీవత్సం, బలిపీఠం, జంటచేపలను చెక్కగా, బొటనివ్రేలుపై త్రిరత్న చిహ్నం మిగిలిన వ్రేళ్ళపై శ్రీవత్సం, స్వస్తిక, చామర, బలిపీఠాలను కలిగివుంది. వ్రేళ్ళకు ముందునున్న అంచుపై బ్రాహ్మీశాసనం చెక్కబడింది.

అయితే ఈ సిరిపాదంపై చేపల జంటలు రెండు కన్పించడం విశేషం. బలిపీఠం సాతవాహన కాలంనాటి పాదముద్రలపై ఉన్నట్లుగాకాక త్రికోణాకారంలో కన్పించడం, ధర్మచక్రం ఆకులు బొద్దుతేలి ఉండటం గమనిస్తే – ఇక్ష్వాకుల కాలంనాటి పాద మంగళ శిల్పానికంటే సాతవాహన సిరిపాద మంగళ శిల్పనైపుణ్యం మిన్నగా ఉండటం విశేషం.

**శాసనపాఠం :**

***"సి(ధ)ం(భగ)వతో అపన-నివనసం భరతో కరపిత మితి"***

అర్థం : భరతుడు బుద్ధభగవానుని పాదముద్రలను రూపొందించి ఇచ్చాడు.

7. కేసనపల్లి (దాచేపల్లి మండలం, గుంటూరు జిల్లా) బౌద్ధస్తూప త్రవ్వకాలలో బుద్ధపాద మంగళశిల్పఫలకం బయల్పడింది. పాద మధ్యభాగంలో చిన్న గవ్వతో కూడిన స్వస్తిక, త్రిరత్నం, సింహాసనం, అకుశం గుర్తులుండగా, చక్రం ముందుభాగంలో గవ్వతో కూడిన స్వస్తిక, శ్రీవత్సం, బలిపీఠం, చేపలజంట, బొటనివ్రేలుపై త్రిరత్నం మిగిలిన వ్రేళ్ళపై స్వస్తిక గుర్తులు వాటి క్రింద మూడు వరుసలలో మూడేసి గవ్వలు అత్యంత అందగా చెక్కబడినాయి. సాధారణంగా బుద్ధపాదాలలో కన్పించే శంఖానికి బదులుగా ఇక్కడ గవ్వలు చెక్కబడటం విశేషం.

ప్రముఖ పురాశాస్త్రవేత్త మహ్మద్ అబ్దుల్ వహీద్‌ఖాన్‌గారు కేసనపల్లి మోనోగ్రాఫ్‌లో బుద్ధపాద మంగళాలపై అప్పటికి అందుబాటులో ఉన్న అమరావతి బుద్ధపాద మంగళాల ఆధారంగా చేసుకొని త్రిరత్నం, శ్రీవత్సం, అంకుశం, ధర్మచక్రం గుర్తులను మాత్రమే పేర్కొనడం జరిగింది. వారు బాదంకాయ ఆకారంలో ఉన్నాయని చెప్పిన గుర్తులు శంఖం జాతికి చెందిన గవ్వలుగా గర్తించాలి. వారు గుర్తించకుండా వదలివేసిన గుర్తు శాఖ్యసింహం యొక్క ఆసనం లేదా బుద్ధాసనం ముందు వంపులు తిరిగిన కాళ్ళతో పైన గుడ్రటి పీఠంతో కన్పిస్తున్నది. బలిపీఠచిహ్నం అష్టమంగళాలలో వివిధ రీతులలో చెక్కబడింది. ఇక్కడ నాలుగు సువ్వాలుగా కన్పించే గుర్తులను వేరుచేస్తున్న గీతలతో బలిపీఠం చెక్కబడింది. బుద్ధపాద శిల్పం నలువైపులా అంచున అకన్తస్, రొసిట్టా లతలను గమనిస్తే ఈ శిల్పంపై గాంధారశిల్ప ప్రభావం కనిపిస్తున్నదని, అయితే గొప్ప నైపుణ్యం కలిగిన భారతీయ శిల్పిపై విదేశీ ప్రభావం పడినప్పటికి తన స్వీయపద్ధతి వీడలేదని మహ్మద్ ఖాన్ అభిప్రాయపడ్డారు.

8. జగ్గయ్యపేటలోని ఒక పెద్ద రాతిపలకపై గుండ్రని శిఖరం కలిగిన దేవాలయం లోపల పూలచెండులు వ్రేలాడుతున్న ఛత్రం క్రింద సిరిపాదుకలు చెక్కబడ్డాయి. పాదుకలకు మ్రొక్కుతూ పూజాసామాగ్రితో స్త్రీలు ప్రక్కన నిలబడివున్నారు.

ఆంధ్రదేశంలోనేకాక ఉత్తర భారత ప్రముఖ బౌద్ధారామాలలో వెలుగుచూసిన బుద్ధపాద మంగళాలను గూర్చి కూడా ఇక్కడ తెలుసుకుందాం.

అ) కలకత్తాలోని ఇడియన్ మ్యూజియంలో వున్న క్రీ.పూ. 2వ శతాబ్దికి చెందిన బార్హుత్ శిల్పఫలకంలో సిద్ధార్థుడు జన్మించాడని విన్న దేవతలు శుద్ధోధనుని భవనానికి వచ్చి తథాగతుని పాదమంగళాలను ఆసనంపై వుంచి అంజలి ఘటిస్తున్నారు.

ఆ) కౌసాంబిలో కుషాణుల కాలంనాటి విరిగిపోయి కుడిపాదం ముందుభాగం మాత్రమే మిగిలిన సిరిపాద ముద్రికల శిల్పంలో పాదాలపై మధ్యన ధర్మచక్రం, కాలివ్రేళ్ళపై స్వస్తిక చిహ్నం, బొటనవ్రేలిపై త్రిరత్న చిహ్నం కన్పిస్తున్నాయి. పాదముల చుట్టూ శ్రీవత్స, స్వస్తిక చిహ్నాలను పూలు, ఆకుల రూపాలలో చెక్కబడినాయి. ఈశిలపై క్రీ.శ. ఒకటవ శతాబ్దికి చెందిన బ్రాహ్మీలిపిలో శాసనం వ్రాయబడింది. ఘోషితారామంలో సర్వబుద్ధుని పూజకోసం సిరిపాద మంగళాలను దానం చేసినట్లుగా శాసనం పేర్కొంటున్నది.

ఇ) సాంచీ తూర్పుతోరణ అడ్డపట్టీపై ఉన్న మహాభినిష్క్రమణ దృశ్య ఫలకం అద్భుతమైన రూపశిల్ప విన్యాసంగా చెప్పుకోవచ్చు. ఈ అడ్డపట్టీలో కపిలవస్తు నగరం నుండి బయలుదేరిన కంటకి (అశ్వం) గిట్టల శబ్దం వినిపించకుండా అశ్వాన్ని చేతులపై మోస్తున్న సేవకులు, ఛత్ర, చామర, కమండలాలు పట్టుకుని సేవకులు వెంటరాగా, పాదముద్రికలపై ఛత్రచామరాలు మాత్రం చెక్కబడినాయి. కపిలవస్తు తిరిగి వెళ్తున్న కంటకి అశ్వంపై ఛత్రచామరాలు లేకపోవడం, అంటే గౌరవ చిహ్నాలను తథాగతునికి వదలి

పరిచారకులందరూ వట్టి చేతులతో తిరోముఖం పట్టే దృశ్యాన్ని ఎంతో అందంగా అర్థవంతంగా చెక్కిన మలిసాతవాహనకాలం నాటి ఆంధ్రశిల్పి నిపుణతకు పరాకాష్టగా భావించాలి.

**ఆగ్నేయ ఆసియా దేశాలలో**
**బుద్ధపాద మంగళాలు :**

పాళీ బౌద్ధ సాహిత్య గ్రంథాలు భారతదేశంలోని రెండు ప్రాంతాలలో బుద్ధుడు పాదముద్రలు వదలి వెళ్ళాడని పేర్కొంటున్నవి. ఒకటి నర్మదా నదీతీరంలోనూ, మరోటి శ్రావస్తి దగ్గరలోని సచ్చబంద పర్వతం మీద ఉన్నాయని పేర్కొంటున్నారు. అయితే బర్మా సాంప్రదాయం నర్మదానదీ ఒడ్డున ఉన్న పాదమంగళాలాన్ని బర్మాలోని స్వెజెత్తావ్ గ్రామం (సగుపట్టణం, మింబు జిల్లా)లోను, రెండో బుద్ధపాద మంగళాల్ని మధ్య థాయలాండ్‌లోని సువణ్ణపబ్బత (సువర్ణ పర్వతం) మీద ప్రతిష్ఠించబడినాయని చెప్తుంది.

మహావంశ గ్రంథం సుమనకూట పర్వతంపై బుద్ధపాద ముద్రలున్నాయని ప్రస్తావిస్తున్నది. ఈ సిరిపాద శిల్పం ప్రత్యేకమైనది కావడంతో దీని ప్రతిరూపం ఆగ్నేయాసియా దేశాలకు ప్రయాణించింది. సుఖోథాయ్‌రాజైన మొదటి మహాధర్మరాజు వీటికి మూడు ప్రతిరూపాలను రూపొందించి మూడు పర్వతాలపై ప్రతిష్ఠించాడు. శ్రావస్తి దగ్గరలోని పాదముద్రలను గూర్చిన వివరాలు తెలియరావడంలేదు. కాని థాయ్ సాంప్రదాయ గ్రంథం సువణ్ణమాలిక శ్రీలంకలోని అనురాధపురంలోని హేమమాలిక మహాస్తూపం నుండి తీసుకురాబడిందని పేర్కొంటున్నది.

వాస్తవానికి ఆగ్నేయాసియా దేశాలకు బుద్ధపాద మంగళాలు క్రీ.శ. 11వ శతాబ్దానికిగాని చేరుకోలేదు. ఇక్కడకు వచ్చాక అష్టమంగళ చిహ్నాలు అష్టాశత (108) మంగళ చిహ్నాలుగా పరిణితి చెందాయి. నేటికి ఆగ్నేయాసియాలో పాదమంగళారాధన బహుళ జనాదరణతో కొనసాగుతున్నది. 16వ శతాబ్దం నాటి కాంబోడియా శిల్పులు రూపొందించిన బుద్ధపాద మంగళాలు పగాన్ (మయన్మార్), సుఖోథాయ్ (థాయ్‌లాండ్)లలో కన్పిస్తాయి. మయన్మార్‌లో పిల్లలు నిద్రించేముందు బుద్ధపాద మంగళ శ్లోకాలను పటిస్తారని పండిత ఒ.సి. గంగూలి పేర్కొన్నారు.

మంగళ చిహ్నాలతో చక్రం బుద్ధజీవితంలోని మహోన్నత ఘట్టమైన ధర్మచక్ర పరివర్తన ఘట్టాన్ని సూచిస్తుంది. 32 మహాపురుష లక్షణాలలో ఒకటైన చక్రం బుద్ధపాదాలలో కలిగి వుండటం బుద్ధ ధర్మాన్ని, బోధనలను తెలియజేస్తుంది. ఇక్ష్వాకు రాజైన వీరపురుషదత్తుని నాగార్జునకొండ శాసనంలో సర్వమంగళకర పాదాలపై ధర్మచక్రం కలిగి వుండటాన్నిగూర్చి వివరిస్తుంది. "శతాధిక మునులు, ప్రఖ్యాత రాజులు జన్మించిన ఇక్ష్వాకు వంశంలో పుట్టి, మారుడు ప్రయోగించిన కామ, క్రోధ, మద, మాత్సర్యాలను జయించి, సకల జీవకోటి శ్రేయస్సుకు దారిచూపిన సర్వమంగళకర పాదాలపై ధర్మచక్రం కలిగి, ఉదయించే సూర్యుని తేజస్సుతో శరత్‌చంద్రునిలాంటి చల్లనిచూపులతో, ప్రపంచం గురించిన అద్భుత ఆలోచనలు కలిగిన బుద్ధదేవునికి వందనాలు". బార్హూత్, సాంచి, సారనాథ్, అమరావతి, కొసాంబి, అనురాధపురాలలో బుద్ధపాదాలలో ఎన్నో మంగళ చిహ్నాలు చిత్రించినప్పటికి క్రీ.శ. 6–8 శతాబ్దాల మధ్య శ్రీలంకలో, మిగిలిన చిహ్నాలన్నీ కనుమరుగయ్యి ధర్మచక్రం మాత్రం నిలచి తన ఆధిక్యతను చాటుకొంది.

పట్టసంబోధి, సుమంగళ విలాసినీ, లీనతప్పకాసినీ వంటి ఆగ్నేయాసియా పాళీ గ్రంథాలు అష్టాశత (108) మంగళాలను గూర్చి ప్రస్తావిస్తున్నాయి. ఈ మంగళ చిహ్నాలన్నీ బుద్ధపాద ముద్రికలలో ధర్మచక్రం చుట్టూ మాత్రమే శిల్పీకరించబడతాయి. క్రీ.శ. 18 వ శతాబ్దం నాటి 108 మంగళ చిహ్నాలు కలిగిన బుద్ధుని ఏకపాద శిల ఆస్ట్రేలియాలోని దక్షిణ ఆసియా ప్రదర్శనశాలలో ప్రదర్శించబడుతున్నది. ఈ మంగళ చిహ్నాలు ఎలా రూపొందాయని చెప్పే ఒక బర్మా సాంప్రదాయ కథనం ఆసక్తి గొలుపుతుంది. "ఒక ఉపాసిక కన్నీటి చుక్కలు బుద్ధపాదాలపై పడటంతో అవి అద్భుతమైన మంగళ చిహ్నాలుగా రూపుదాల్చాయి. వాటినే బుద్ధదేవుడు ఈ భూమిపై వదలివెళ్ళాడు".

హిందూ దేవతలకు జంతువాహన ప్రాభవం, రాజులకు పల్లకీల వైభవం ఉంటే తథాగతుడు నిరాడంబర జీవితాన్ని గడుపుతూ తన పాదాలను నమ్మి నలభైయైదు సంవత్సరాలపాటు దేశమంతటా తిరిగి ధర్మప్రబోధం చేశాడు. అందుచేతనే రాబర్ట్‌బ్రౌన్ మహాశయుడు బుద్ధపాద ముద్రలకు "నడచే బుద్ధుడు" అని పేరు పెట్టాడు.

**డా. బెల్లంకొండ రమేశ్ చంద్రబాబు**
**రేపల్లె, గుంటూరు జిల్లా**
**ఫోన్ : 944 151 9781**

# బౌద్ధం - తెలుగు నవల

*- లకుమ భూదేశ్వరరావ్*

తెలుగు చారిత్రక నవలల్లో బౌద్ధం ప్రస్తావన అక్కడక్కడా ఉన్నప్పటికీ అది పాక్షికమే. బౌద్ధం ఇతివృత్తంగా పూర్తి నిడివితో ఉన్న నవలలు/నవలికలు చాలా తక్కువలో తక్కువగా ఉన్నాయి. ఓ సగటు పాఠకుడిని దృష్టిలో ఇప్పటికి వచ్చిన నవలల్లో ఎక్కడెక్కడ బౌద్ధం ప్రస్తావన పాక్షికంగా ఉందో, పూర్తి నిడివి బౌద్ధం ఇతివృత్తంగా నవలలెన్ని వచ్చాయో ఒక పరిశోధనాత్మక పత్రం వెలువడాల్సి ఉంది.

నా ఎరుకలో, పూర్తి నిడివితో ఉన్న నవలలు ప్రస్తుతం మూడు కనిపిస్తున్నాయి. అవి *సిద్ధార్థ* (వల్లభనేని అశ్వినీకుమార్) *యశోధర* (డా. గూటం స్వామి), *శ్రమణకం* (డా. నందమూరి లక్ష్మీపార్వతి). ఇక్కడ విచిత్రం ఏమంటే *సిద్ధార్థ* పురుష భిక్షువులు మొదటి శాఖకు, *యశోధర* స్త్రీ భిక్షువుల రెండవ శాఖకు, *శ్రమణకం* దంపతుల మూడో శాఖకూ ప్రాతినిథ్యం (ప్రతీకలు)గా వహించడం యాధృచ్ఛికమైన ఒక చెప్పుకోదగిన గొప్ప విషయం.

**సిద్ధార్థ :**

హెర్మెన్ హెస్సె జర్మన్ మూలానికి తెలుగు సేత ఈ *సిద్ధార్థ.* దీనిని అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి 'నవల' అన్నప్పటికీ దీనిని 'నవలిక' అనటమే సమంజసం. ఈ తెలుగు సేత వల్లభనేని అశ్వినీకుమార్‌ది.

*సిద్ధార్థ* ఒక విలక్షణమైన బుద్ధిజీవుని తపన. ఈ బుద్ధిజీవుడు బుద్ధునికి సమకాలికుడు కావటం యాధృచ్ఛికము కావచ్చు. ఒక విశేషమూ కావచ్చు.

సంక్షిప్తంగా 'బ్రాహ్మణ నిత్యకర్మలలో పెరిగి, అరణ్యాలలో సన్యాసి జీవనం నుంచి బుద్ధుని బోధనలను కూడా వదలి మనోమార్గంలో పయనించి, కోర్కెల నిప్పుల దారిలో త్రొక్కినలాడి, చివరికి శాంతిని, ఆనందాన్ని ఒక నదీప్రవాహంలో అంతర్లీనంగా ఒక పడవ సరంగు జీవనంలో ప్రకృతిని పరమాత్మను అద్వైత రూపంలో దర్శించి, నిర్వాణ పథంలో నడచిన ధీరోదాత్తు కథ' ఇది.

*సిద్ధార్థ* బ్రాహ్మణ కుమారుడు. గోవిందుడు సహచరుడు. 'నిద్రావస్థలో ఆత్మను దర్శింపగలిగిన మహాత్ములు జాగరూకులై ఉన్నప్పుడు ఈ ఆత్మదర్శనం ఎందుకు పొందలేకపోతున్నారు?' ఇదీ స్థూలంగా సిద్ధార్థుడి నిరంతర చింతనం.

....అప్పటికి అర్థమయ్యింది. సిద్ధార్థుడు అప్పటికే తనని, ఇంటిని వదలివేశాడని. అతనిని ఆపడం ఇక సాధ్యం కాదని! అతని తండ్రికి. తండ్రి చెప్పినట్లు తల్లి దగ్గరకు వెళ్ళి అక్కడినుంచి అప్పుడే రక్తప్రసరణ మొదలయిన పాదాలతో ఇంకా నిద్ర లేవని ఈ ఊరిని వదలి అడవిలోకి పయనమైనాడు. ఊరి చివర, ఒక ఆకారం అతన్ని వెన్నంటి అనుసరించింది. 'గోవింద?' 'అవును మిత్రమా'తో 'బ్రాహ్మణ కుమారుడు' విభాగం పూర్తవుతుంది. పరివ్రాజకత్వం స్వీకరించే ముందు ఆ గౌతముడికీ, ఈ సిద్ధార్థుడికీ చాలా దగ్గర సామ్యముంది. లేనివి ఈ సిద్ధార్థునికి రాజ్యమూ, భార్యా, బిడ్డ, అశ్వము. తర్వాత విభాగం 'శ్రమణులతో', 'నాకలా అనిపించటంలేదు, మిత్రమా! ఇన్నాళ్ళు ఇక్కడ నేర్చిన విద్యలు విన్యాసాలు మనం ఏ వేశ్యాగృహంలోనైనా లేక, జూదగృహంలోనైనా నేర్వగలిగేవాళ్ళమే' అంటాడు సిద్ధార్థ. ఈ వ్యాఖ్య తీవ్రంగా అనిపించవచ్చు. కానీ వాస్తవం. గోవిందుడి ప్రశ్నకు సమాధానంగా 'ఏమిటి ఈ ధ్యానం? ఈ తపస్సు? ఈ శరీర వైరాగ్యం? ఏమిటీ ఉపవాసాలు? ఏమిటీ శ్వాస నియంత్రణ? ఇదంతా పలాయనం' అంటాడు. అంతటితో ఊరుకోక దాన్ని విశ్లేషిస్తాడు చక్కగా.

కొంత చర్చ తర్వాత 'నీ మిత్రుడు త్వరలోనే ఈ మార్గం నుంచీ వెళ్ళి సాంగత్యం నుంచి, ఇప్పటివరకూ నీతో ప్రయాణించి,న ఈ మార్గం నుంచీ వెళ్ళిపోతున్నాడు' అంటాడు. ఇది ఒక ప్రకటనను తలపించిటం ఇక్కడ విశేషం. గత మూడు సంవత్సరాలలో మిత్రులిద్దరూ శ్రమణులతో గడిపిన సమయంలో బుద్ధుని గురించిన ఎన్నో వార్తలూ, కథలూ వారి వరకూ చేరేవి. నమ్మినవారూ, నమ్మనివారూ ఈ కాలంలో ఉన్నట్లే ఆ కాలంలోనూ ఉన్నారు. అట వృద్ధుణి మంత్రముగ్ధుణ్ణి చేయటం చూసి 'నీవు ఇక్కడే మరి కొంతకాలం

ఉన్నట్లయితే తప్పక నీటిమీద నడిచేవాడివే సుమా! అన్న గోవిందుడితో 'నాకా కోరికలేదు మిత్రమా! ఆ తంత్రాలను శ్రమణులకే వదలివేద్దాం' అంటాడు సిద్ధార్థ. ఒకే ఒక ఏక వాక్యంతో చర్చను ముగించటంతో ఈ విభాగం పరిపుష్టమైంది. మూడో విభాగం గౌతముడు. ఈ యువ సన్యాసులిద్దరితో ఆ గృహిణి అంటుంది 'మీరు రావలసిన చోటికే వచ్చారు నాయనా. గౌతముడు జేతవనంలో శిష్యగణంతో ఉన్నాడు. మీరు రాత్రికి అక్కడే బస చేయవచ్చు' అని. సిద్ధార్థుడు 'గోవిందా, చూడు ఆయనే బుద్ధుడు' అంటాడు. గోవిందుడు వెంటనే గుర్తించలేకపోయినా తర్వాత తెలుసుకోగలుగుతాడు. గోవిందుడు బుద్ధుని శిష్యునిగా ఉండిపోతాడు. సిద్ధార్థుడు తన యాత్ర కొనసాగించాలనుకోవడం ఇక్కడ ఒక విశేషం. అందుక్కారణమూ చాలా సహేతుకంగా చెప్పాడు. 'కాని, మీరు పొందగలిగిన, కేవలం మీరు మాత్రమే చేరుకోగలిగిన ఆ అలౌకికా సానుభూతిని ఈ బోధనలు మాకందించలేవు కదా!'

ఇక్కడ ఈ ఇరువరి మధ్యా జరిగిన సంభాషణ అంతా ఉదహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కానీ ఆ పనిని చేయడం అంటే మొత్తం విభాగాన్ని ఎత్తి రాయటమే అవుతుంది. ఈ ఇద్దరి అభిప్రాయాలతోనూ పాఠకుడు ఏకీభవించలేక తప్పని ఒక విచిత్ర పరిస్థితిని ఈ విభాగంలో మనం గమనిస్తాం. 'మేల్కొలుపు'లో 'ఈ ప్రపంచంలో అన్నింటికంటే నాకు తక్కువ తెలిసింది నా గురించే అనేది పరమ సత్యం!'గా అంగీకరిస్తాడు సిద్ధార్థుడు. పరిపరి విధాలుగా తలపోసినా ముందుకు తన ఇంటికి, తండ్రికి, తన గతానికి దూరంగా, ముందుకు సాగుతాడు. ఇంక వెనుదిరిగి చూడడు.

'కమల'లో సిద్ధార్థుడు ప్రపంచంపట్ల తన దృక్పథం మారటంతో ప్రకృతి సౌందర్యానికి బంధీయై తన బాటలో అన్నీ కొత్తగా తెలుసుకుంటాడని. భావమూ, భవమూ రెండూ ముఖ్యమైనవే. తన మనోజ్ఞానమే తన గురువు. అది చూపిందే తన దారి అనుకుంటాడు. సరంగూ, సిద్ధార్థుని మాటలు మనల్ని తీరం చేరుస్తాయి. సరంగులో గోవిందుని దర్శిస్తాడు సిద్ధార్థుడు. మధ్యాహ్నానికి ఒక గ్రామంలో ప్రవేశిస్తాడు. అక్కడ బట్టలు ఉతుకుతూ ఓ చిన్నది, నగరానికి మార్గమెంత దూరమో అడగటం, ఆమె ఎడం పాదం అతని కుడి పాదంపై మోపటం, ఆపై చాలాచాలా కెమిస్ట్రీ చకచకా జరగటం, ఎక్కడో అతనికి 'వద్దు' అని వినిపించటంతో అక్కణ్ణుంచి నిష్క్రమించటి నగరానికి చేరతాడు.

పల్లకీలోని ఆమె కమల అనీ, వేశ్య అనీ తెలుసుకుంటాడు. అది అతన్ని క్షురకుని వద్దకు వెళ్ళేంతగా చేస్తుంది. తర్వాత వారిద్దరి సంభాషణా మొదట మామూలుగా అనగా ఒక వేశ్య, ఆ వేశ్యను పొందగోరే యువకుడి మధ్యనలా ఉంటుంది. సిద్ధార్థుడి కవితలో అది ముద్దుకు దారితీస్తుంది. ఆ దారి 'జనం'తో సాగుతుంది. 'ప్రతి ఒక్కడూ తీసుకుంటాడు. ప్రతి ఒక్కరూ ఇస్తారు. జీవితమంటే, లోకమంతా అంటే కదా.' ఈ విభాగంలో సిద్ధార్థ, కామస్రాల మధ్యనే సంభాషణ సాగుతుంది. పోనుపోను అది చర్చగా రూపాంతరం చెందుతుంది. సిద్ధార్థకు కమల మృదువైన వేళ్ళు ఎన్నో కామకేళీ కలాపాల్ని నేర్పుతాయి. ఆమె ఎన్నో ప్రేమపాఠాల్ని చెబుతుంది. 'ప్రేమికులు రత్యనంతరం, వెంటనే విడిపోరాదు. ఈ మధ్య కథనంలో జయాపజయాలు కాక పరస్పర అభినందనలే ఉంటాయి. ఒకరిని ఒకరు తక్కువచేసి చూడకూడదు' అని. 'ఎంతోమంది రాలే ఆకుల్లా గాలికి కొట్టుకుపోతూ ఉంటారు. కొంతమందే నక్షత్రంలా ఒక నిర్దిష్ట మార్గంలో ప్రయాణం చేస్తారు. వారిని ఏ గాలీ తాకలేదు' ఇది సిద్ధార్థుడు గౌతముని గురించి తెచ్చిన ప్రసక్తి.

చివరిలో కమల అంటుంది '....కానీ నీవు ఎవరినీ ప్రేమించవు. మానసికంగా నీవు సన్యాసివే. అవునా' అని. ఈ మాటలకు కొంచెం ముందుగా అంటుంది 'నీలాంటి ప్రియుడు ఎవరూ ఉండరు. నీవు ఎంతో గొప్ప రసికుడివి' అని. 'కావచ్చు, కమలా. నీ లాగానే, లేకపోతే ప్రేమను, విద్యగా, కళగా నీవు నేర్పగలవా? మనలాంటివాళ్ళు ప్రేమించలేరు. మామూలు జనం ప్రేమిస్తారు. అదే వాళ్ళ రహస్యం' విప్పి చెప్తాడు సిద్ధార్థ. 'సంసారం' సారభరితంగానూ, సారహీనంగానూ సిద్ధార్థుడికి స్వీయ అనుభవమౌతుంది. 'నది'లో, ఎంతో తిరిగి ఒకప్పుడు తాను దాటి వచ్చిన నది ఒడ్డుకు చేరతాడు. ఓంకార నిస్వనంతో తాను విస్మరించిన ఆత్మజ్ఞానాన్ని, అభావమూ, అశరీరమూ, నాశవిహీనమూ అయిన ఆత్మజ్ఞానాన్ని తిరిగి



పొందగలిగాడు. లేచి అటు గోవిందుని గుర్తుపట్టాడు. ఇద్దరూ చాలాసేపు చాలా విషయాల గురించి మాట్లాడుకుంటారు అనడంకంటే చర్చించుకుంటారు అంటే బాగుంటుంది.

'నా ధనవే పోయిందో, ఆ ధనవే నన్ను పోగొట్టుకున్నదో, ఇదమిత్థంగా చెప్పలేను. కనిపించేవన్నీ త్వరత్వరగా తిరిగిపోతున్నాయి. ఎక్కడి బ్రాహ్మణ కుమారుడు, ఎక్కడి శ్రమణుడు, నిన్న మొన్నటి ధనవంతుడు, సిద్ధార్థుడేడి? ఈ పరిణామం ఎంతో వేగంగా జరిగిపోతోంది' 'నీ ధనమంతా పోయిందా?' అన్న గోవిందునికి సమాధానమిది. ఇతను పూర్వం జలసమాధి కావాలనుకున్న సిద్ధార్థ, నదిని ఎంతో ప్రేమగా, ఇష్టంగా చూశాడు. ఒక సిద్ధార్థ, అహంకారి, అతి తెలివి సిద్ధార్థ నదిలో కలిసిపోయాడు. ఇప్పుడు ఈ నది తనకేదో, తనకు తెలియని, ప్రత్యేక జీవితమేదో వేచి ఉందని పిలుస్తోందిగా తలపోస్తాడు. 'పడవ సరంగు'లో 'ఎంత వింత! ఎప్పుడూ ప్రవహిస్తూనే ఉంటుంది. నీరు కదిలిపోతూనే ఉంటుంది. కాని, నది ఇక్కడే ఉంటుంది. క్షణక్షణం మారుతూ అనుక్షణం అక్కడే ఉండటం ఎంతటి గొప్ప రహస్యం? ఇది ఎలా అర్థం చేసుకోవాలి? తనకు దీని అర్థం తెలిసిందా? తన అంతరంలో ప్రతిధ్వనించే దివ్యమైన స్వరాలే! ఈ నదిలోనే ఉండాలని, ప్రవాహపుటంచుల్లో నివసించాలని నిర్ణయించుకుని కదిలాడు. దహించుకుపోయే ఆకలితో ఆ ఛాయల్లోనే తిరిగాడు. అలా తిరుగుతూనే బల్లకట్టు దగ్గరకు చేరాడు. అందులో ఉన్న సరంగును గుర్తుపట్టాడు. అతనికీ ఎంతో వయసు పైబడినట్లు గమనించాడు సిద్ధార్థుడు. తనను గతంలో నది దాటించిన సరంగు వాసుదేవకు ఆ విషయం గుర్తుచేస్తాడు. ఇద్దరూ సరంగు కుటీరంలోకి ప్రవేశిస్తారు.

సిద్ధార్థుడు తన ఇరవై ఏళ్ళ జీవితాన్ని, ఆ పై తన చిన్నతనాన్ని వివరిస్తాడు. సిద్ధార్థ అతనితో ఉండిపోతాడు. వర్షాకాలం వస్తుంది. ఎన్నో ఋతువులు నదీప్రవాహంలో కలిసిపోతాయి. ఒక దినం కమల కూడా కొడుకుతోపాటు గౌతముని దర్శించేందుకు పయనమౌతుంది. వాడు తల్లిని విసిగిస్తుంటాడు. ఆ బాలుడు తన సంతానం అని తెలుసుకుంటాడు సిద్ధార్థుడు. నల్లని సరీసృపం కాటుతో కమల పరిస్థితి విషమిస్తుంది. నీలో గౌతముని చూశానని చెప్పేలోగానే కమల మరణించటం విషాదం. ఆమెకు తన భార్య సమాధి ప్రక్కనే ఖననం చేద్దామంటాడు వాసుదేవుడు. పదకొండేళ్ళ 'కొడుకు'లో క్రమంగా ఒక ఆకతాయిని చూస్తాడు సిద్ధార్థుడు. బాలుడు చిన్నచిన్న దొంగతనాలు కూడా చేస్తాడు. చివరికి ఒకనాడు తండ్రికి పూర్తిగా ఎదురుతిరుగుతాడు. చిల్లర నాణాలు తీసుకుని అడవిలోకి పారిపోతాడు, తనను వెంబడించకుండా తెడ్డును నీళ్ళలో మరీ పడేసి, తన శ్రమణ జీవితం, కమల పరిచయం, సంపద, సౌఖ్యాలు, జూదం, మద్యపానం చివరికి ఏవగింపు, కుహూపిట్ట, బంగారు పంజరం, వార్ధక్యం, నదీప్రవాహం, నిశ్శబ్ద ఓంకారం స్వనం, మళ్ళీ అతనికి వినిపిస్తోంది. చివరికి కుటీరంలో సిద్ధార్థ ప్రశాంతంగా నిద్రపోవటం చూస్తాడు వాసుదేవుడు.

'ఓమ్'లో జ్ఞానులకంటే, మౌనులకంటే ఈ జనులు దేనిలో తక్కువ! ఒక అద్వైత స్పృహ ఏకైక విశ్వాత్మ అనే అవగాహనలోనా? అయినా ఆ ఆలోచన ఎంతవరకు అవసరం? ఈ ఆలోచనలో సిద్ధార్థకు ఆత్మజ్ఞానం, తన సుదీర్ఘ అన్వేషణా మార్గం, తన అనంత గమ్యం, ఇవన్నీ తేటతెల్లమయ్యాయి. అన్నింటికీ ఆత్మను సన్నద్ధం చెయ్యగలగాలి. ఆలోచనలు, అనుభూతి, శ్వాస, ధ్యాస – ఇవన్నీ ప్రతీక్షణం జీవన ప్రవాహంలో ఏకమైపోవాలి. విశ్వ శక్తిలో మమేకం కావాలి. ఈ ఆలోచనే సిద్ధార్థునితో పరిపక్వస్థాయికి చేరింది. మళ్ళీ నది దాటి కుటీరం చేరతాడు. తన హృదయావేదన, పుత్రవియోగపు దుఃఖాన్ని వాసుదేవునికి చెప్పుకోవాలని వచ్చాడు. వాసుదేవ బుట్ట అల్లుతూ కూర్చున్నాడు. వర్షంలో చెట్టులా వాసుదేవుడు అతని బాధామయ గాథను తనలో మమేకం చేసుకున్నాడు. అతని కర్మలన్నిటినీ నదిలో కడిగినట్లు అతను అవగాహన చేసుకున్నాడు. 'సిద్ధార్థ నీవు వినవలసింది ఇంకా వుంది వెళ్దాం రా, విందాం పద' అన్నాడు వాసుదేవుడు. ప్రవాహపుటంచులో ఇద్దరూ నిలబడి ఉన్నారు. 'శ్రద్ధగా విను సిద్ధార్థ' అంటాడు. అవును, ఇప్పుడు అన్నీ అందరూ ఒకటిగా కలగలసి ఏకాకృతిలో ప్రవహిస్తున్నారు. కమల, గోవింద అందరూ నదిలో భాగమైన ప్రవాహంలో కలిసిపోతున్నారు. తరగని వాంఛలతో, తీరని కోరికలతో, అంతులేని దుఃఖంతో గాయాల పచ్చిలో తమ గమ్యంవైపు ప్రవహిస్తున్నారు. వాసుదేవుడు నెమ్మదిగా అస్తమించే సూర్యునివైపు కదలిపోయాడు. సిద్ధార్థ ఆవేదన, ఆనందం కలగలిసిన భావనలో వాసుదేవుని నిష్క్రమణ చూశాడు. అతని ప్రతీ అడుగు ఎంతో ప్రశాంతంగా, అతని దేహం ఎంతో తేజస్సుతో కదిలింది.

'గోవింద' తన నిరంతర సంచారంలో ఒక దినం కమల

వసంత వనంలో విశ్రాంతికై ఆగినపుడు వృద్ధ సరంగుని గురించి చాలా విన్నాడు. సరంగుని సహాయంతో అవతలి గట్టుకు చేరిన తర్వాత నుండీ వారిరువురి సంభాషణా చాలా ఆసక్తికరంగానూ, విశ్లేషణాత్మకంగానూ ఆలోచింప చేసేదిలానూ సాగుతుంది. ప్రతి వాక్యమూ పోటీ చేయతగినదిగానూ ఉంటుంది. మచ్చుకు– 'ఎవరైనా ఏదైనా అన్వేషించే సమయంలో వారికి గమ్యం మీదే దృష్టి ఉంటుంది. వారు దారిలో ఏమి చూడలేకపోతున్నారో తెలియదు. దృష్టంతా గమ్యంమీదే ఉంటుంది. అందుకే మరేమీ చూడరు. స్వతంత్రంగా స్వేచ్ఛగా పయనించేవారికి అన్నీ దర్శనమిస్తాయి. అన్ని అంశాలు ద్యోతకమౌతాయి' అంటాడు సిద్ధార్థుడు. గోవింద ప్రశ్నకు సమాధానంగా 'నీకు తెలుసు మిత్రమా, నాకు సిద్ధాంతులన్నా, అవి చెప్పే గురువులన్నా అంత నమ్మకం లేదని; కాని నేను ఎందరి దగ్గరో ఎన్నో నేర్చుకున్నాను. ఈ జీవన గమనంలో, తండ్రి దగ్గర, శ్రమణుల నుండి, కమల సాంగత్యంలో, కామస్వామి వ్యాపారంలో, జూదగాళ్ళ జిత్తులలో, నేను నిద్రపోయినప్పుడు నాకు కావలిగా ఉన్న బౌద్ధసన్యాసి దగ్గర అందరినుంచీ నేర్చుకున్నాను' అంటాడు సిద్ధార్థుడు. 'ఎంతో ఆలోచించాను గోవిందా! అవన్నీ తాత్కాలికమే. కానీ ఒక్క విషయం. వివేకం, జ్ఞానం ఒకరినుండి వచ్చేది కాదు. విద్య మాత్రమే నేర్పదగినది. ఎవరైనా జ్ఞానాన్ని బోధిస్తున్నానని అంటే అది అసంబద్ధమే' అని కూడ.

'గౌతముడు అందుకనే ఈ ప్రపంచాన్ని రెండుగా విభజించాడు. ఒకటి సంసార జీవితం. రెండోది సన్యాసి మార్గం. అందులోనే నిర్వాణ మార్గం బోధించాడు.' 'ప్రతి వ్యక్తిలోనూ అన్నీ, అందరూ ఉంటారు. ఏదయితే భవిష్యత్తులో ఉందని భ్రమిస్తున్నామో అది అప్పటికే ఉన్నది.' 'చిన్నపిల్లలో వార్ధక్యం దాగి ఉన్నట్లు, పాలుతాగే పసివాడిలో మృత్యువు కూడా పొంచి ఉంటుంది. అలాగే మరణించేవారందరూ అనాశకరమైనవారే. ఇది అనంత భ్రమణం! 'అది యాదృచ్ఛికమే గోవిందా, ఈ శిలలో, ఈ నీరూ, ఈ చెట్లు, ఈ లతలూ అన్నీ ప్రేమించదగినవే. కానీ మాటలను ప్రేమించలేము కదా! అందుకే బోధనలు నాకేమీ రుచించలేదు. అవి కేవలం మాటలుగానే మిగిలిపోతున్నాయి. వాటిలో వస్తురూపం, పదార్థ విధానం, రంగుల కలయికలు, రుచుల బేధాలు, గంధ వైవిధ్యాలూ ఏమీ ఉండవు కదా!'

'గోవిందా, ఇక్కడే మనం మాటల వలయంలో, అర్థాల నీడల్లో సంక్లిష్ట సమాసాలో పడిపోతున్నాం. గౌతముని బోధనలకు నా ప్రేమ విచారానికి వ్యత్యాసం లేదని అనుకోకు.'

ఇక్కడ సిద్ధార్థ నుండి ఇంత వివరణ రాబట్టిన గోవిందుని ప్రశ్నలను మనం ఊహించుకోవచ్చును. అందుకు గోవిందుని అభినందించే తీరాలి. గౌతముని నిర్వాణం తర్వాత తాను ఇంతటి ప్రశాంత మూర్తిని ఎవరినీ కలవలేదనుకుంటాడు గోవిందుడు. సిద్ధార్థుని కోరికమేరకు గోవిందుడు అతని ఫాల భాగాన్ని తన ఎండిన పెదవులతో తాకగానే ఓ అద్భుతానికి లోనవుతాడు. ఇది ఎవరికి వారు చదవాల్సిందే తప్ప మాటలతో చెప్పేది కాదు. వాస్తవానికి పేజీల పరంగా, పరిమాణపరంగా చూస్తే ఈ సిద్ధార్థ 92 పేజీల చిన్న పుస్తకం. విషయపరంగా, సర్వమూ వర్తమాన సమానమైన ఓ సంరంభపరంగా చూస్తే చాలా పెద్ద పుస్తకం. ఒక తల పండిన తత్వవేత్త జీవితమంత. అందుకే ఇంత వివరణ. ఈ తెలుగు రచనలో వాక్యనిర్మాణం, పదాల కూర్పు అన్నపరెడ్డి అన్నట్లు కొండపైనుంచి దూకే వాగు!

**యశోధర :** యశోధర కేంద్రబిందువుగా ఈ నవల ఆసాంతం కొనసాగుతుంది. యశోధర కాలం చేయటంతోనే నవల ముగుస్తుంది. 'శతకోటి సూరీళ్ళు ఒకేసారి ప్రభవించినంతటి వెలుగు ఆమె ముఖంలో తాండవిస్తోంది. ఇప్పుడు చంద్రుడు కూడా ఆమె ముఖారవిందాన్ని చూసి అసూయపడవలసిందే. పాలిపోయిన చెక్కిళ్ళు కాంతివంతమయ్యాయి. కాంతివిహీనమైన కళ్ళు ప్రకాశిస్తున్నాయి. ఇన్నాళ్ళూ యశోధర ముఖంలో ఇంతటి వెలుగును చూసి ఎరుగని చెలికటిలు, నిశ్చేష్టులై అలా చూస్తుండిపోయారు. అంతఃపురంలో ఉన్న నెమళ్ళు పురివిప్పి నాట్యం చేస్తున్నాయి. లేళ్ళు ఆనందంతో దుప్పుల చెవుల్లో గుసగుసలాడుతున్నాయి. తుమ్మెదలు మకరందాన్ని గ్రోలడం మాని ఝుంకార నాదం చేస్తున్నాయి. సీతాకోకచిలుకలు విప్పారిన యశోధర ముఖాన్ని పద్మం అని భ్రమించి ఆమె చుట్టూ తిరుగుతున్నాయి. ఇన్నాళ్ళూ నిశ్శబ్దం తాండవించిన రాజంతఃపురంలోని వాతావరణం పూర్తిగా మారిపోయింది.

'రాజగృహ'లో ఉన్న బుద్ధ భగవానుడు కపిలవస్తు నగరానికి విచ్చేస్తున్నాడన్న వార్తే ఈ సంతోషాలకు కారణం. ఒక్కొక్క ఘడియ యశోధరకు ఒక్కొక్క యుగంలా ఉంది. ఈ దుఃఖం ఇంకెన్ని ఘడియలు భరించాలో...! అంటూ నవల

ప్రారంభమౌతుంది. సరిగ్గా సిద్ధార్థుడు పరివ్రాజకుడైన ఏడేళ్ళకు అని ఇక్కడ కాలాన్ని పరిగణనలోనికి తీసుకోవాలి. ఇక్కణ్ణుంచి రచయిత మనల్ని గతంలోకి (ఫ్లాష్‌బ్యాక్‌లోకి) తీసుకెళతాడు. యశోధర జననం, నాట్యాభ్యాసం, ఆశ్రమవాసం, ఆటపాటలు, నాట్యప్రదర్శనం, తిరిగి నగరి ప్రవేశం, చెకచెకా జరిగిపోతాయి. యుక్తవయస్సులో ఉన్న యశోధర వర్ణనం మరియు వివిధ సందర్భాల్లోని వర్ణనలూ రచయితలోని కవిని సాక్షాత్కరింప చేశాయి. ఒక వాల్మీకినీ, ఒక కాళిదాసునూ గుర్తుకు తెస్తాయి. 'నేను నెరవేర్చవలసిన కార్యక్రమాలు అనేకం ఉన్నాయి. మనం కొంతకాలం సుఖంగా జీవించినా నేను చేయవలసిన పనులు నిమిత్తం నిన్ను ఎడబాయవలసి ఉంటుందేమో!' అని కలలో దివ్యపురుషునితో అనిపించటం నాటకీయతకు నిదర్శనం. వివాహం విషయమై సిద్ధార్థుడు శుద్ధోధనునితో వెలిబుచ్చిన అభిప్రాయాలు సైతం దివ్య పురుషుని మాటలకు దగ్గర దగ్గరగా ఉంటాయి. ఇప్పటి సగటు ఆడపిల్ల తండ్రిగా, సిద్ధార్థుడిపట్ల ఆనాడే దండపాణి వ్యవహరించటం చూస్తాం. శృంగారం సిద్ధార్థుడి, యశోధరల మధ్య రాజ్యమేలినపుడు చంద్రుడు, పవనుడు, నేతి దీపం, కడిమిపూలు, మొగలిరేకులు, చకోరపక్షులు, ఎలా ఉదహరించాయో తెలుసుకోవాలంటే స్వయంగా చదివేతీరాలి. ఆ నాటకీయతకు కొనసాగింపుగానే 'యశోధరా... మనం దేనిపైనా ఇష్టతను పెంచుకోకూడదు. ఆ తర్వాత అది దూరమైపోతే చాలా బాధపడాలి. మనకు లభించిన దానితోనే తృప్తిపడటం, దానిపైనే ఇష్టతను చూపడం మంచిది. ఏమంటావ్....' అని సిద్ధార్థుడు అనటం.

పన్నెండు సంవత్సరాలు పన్నెండు రోజులు యశోధరకు, పన్నెండు యుగాలు సిద్ధార్థుడికని నవల సగం చదివేసరికి మనకూ అవగతమైపోతుంది. వారి వైవాహిక జీవితం మొత్తం పదమూడు సంవత్సరాలే అంటే మనకూ కాస్త బాధగానే ఉంటుంది. యశోధరకు ఆ రహస్యం కాస్తా మహాప్రజాపతి చెప్పేశాక వారిద్దరి మానసిక పరిస్థితినీ రచయిత రెండు వాక్యాలు ఆవిష్కరించటం 'అల్పాక్షరాలతో అనల్పార్థ రచన'కు గావించటమే. అవి ఇవి– 'యశోధర ముఖంలో బాధ పోయి ఇప్పుడు భయం పట్టుకుంది, మహాప్రజాపతికి మాత్రం ఇప్పుడు బాధ పోయి ఆనందంగా ఉంది.' యశోధరకు అర్థమయినట్లే 'సకల ప్రాణులకూ ఏదో ఒక దుఃఖం, భయం ఆవరించి ఉన్నట్లు' మనకూ అర్థమైపోతుంది. రోహిణీ నదీ జలాల వివాదమే సిద్ధార్థుడు పరివ్రాజకుడవడానికి కారణంగా ఈ రచయిత చెప్పటం వాస్తవానికి దగ్గరగా ఉంది. ఇదే విషయాన్ని డా. నందమూరి లక్ష్మీపార్వతి *శ్రమణకం*లోనూ చెప్పటం మనం గమనిస్తాం. 'దేవీ.... నువ్వు నీ ఒక్కదాని గురించి ఆలోచిస్తున్నావు. నేను ఈ లోకంలోనున్న ప్రజలందరికోసం ఆలోచిస్తున్నాను. వారందరి విముక్తి కోసం, తాపత్రయపడుతున్నాను' అని సిద్ధార్థుడనటం కార్ల్‌మార్క్స్‌ను గుర్తుకు తెస్తోంది. *విముక్తి* అన్న విషయంలో ఇక్కడ ఒక సామ్యమూ, ఒక వ్యత్యాసమూ రెండూ ఉన్నాయి. ఏమైనా మార్క్స్‌కంటే సిద్ధార్థుడు ముందుండటం ముదావహం. రచయిత 'చివరి విందు' అని ప్రస్తావించటం క్రీస్తు చివరి విందును గుర్తుకు తెచ్చింది. ఈ రెండు చివరి విందులూ లోకకళ్యాణం కోసమే కదా!

'మానవాళిని ఈ ప్రాపంచిక విషయాల నుండి విడుదల చేయడానికి ఆయన వెళుతున్నారు' అని యశోధరతో ప్రజాపతికి చెప్పించటం ఆమె మానసిక సమాయత్తతకు నిలువెత్తు దర్పణాన్ని పట్టింది. అసితుడితో యశోధర 'మహామునీ... గతంలో సన్యసించే ముందు ఇలా కనీసం భార్యకు చెప్పకుండా ఎవరైనా అడవులకు వెళ్ళిన సంఘటనలు ఉన్నాయా? ఆయన కరుణ రహితుడై ఏదో ధర్మాన్ని దర్శించటానికి గృహస్థ ధర్మాన్నే త్యజించాలా? అని అడగటం ఒక సమాచార హక్కునూ, ఆనాడు ద్రౌపది ప్రతీహారికి సంధించిన రెండు ప్రశ్నలలాంటివే నర్మగర్భంగా మనముందు ఉంచాడు రచయిత. ఆ తర్వాత కంథకాశ్వం వీపును బుద్ధుడు ఆప్యాయంగా నిమరటం చూస్తాం. శుద్ధోధనుడు, మహాప్రజాపతి బుద్ధుని సమక్షంలో 'దుఃఖంలోనే ఆనందం పొందటం, ఆనందంలోనే దుఃఖించటం' చూస్తాం. మనమూ అటువంటి ఒకానొక చిత్తస్థితికి లోనవుతాం. మాయావతి బిడ్డను ప్రసవించిన ఏడవరోజున చనిపోవటం, రాహులుడు ఏడు సంవత్సరాలకే యశోధరకు దూరమవటం, ఏడు సంవత్సరాల తర్వాత సిద్ధార్థుడు (బుద్ధుడు) తిరిగి కపిలవస్తు నగరానికి రావటం చూస్తే ఏడు సంఖ్య ఇక్కడ ఒక ప్రాధాన్యాన్ని సంతరించుకోవటం చూస్తాం. 'నా బోధనలు వినాలంటే కేవలం సన్యాసులుగా మారనవసరంలేదు. మామూలు ప్రజల్లా కూడా వినవచ్చు' అని బుద్ధుడు మహాప్రజాపతితో అనటం చూస్తే ఇప్పటి ప్రజానీకానికీ ఆనాడే ఒక సంకేతాన్ని పంపినట్లుగా ఉంది. ధర్మదీక్ష తీసుకున్న

యశోధర తన పేరును భద్రకాంచనగా మార్చుకుంటుంది. 'స్వచ్ఛమైన జీవితం గడపటమే గమ్యం' అని బుద్ధుని ద్వారా తెలుసుకుంటుంది. యశోధర డెబ్భైఎనిమిది ఏళ్ళకు శ్వాసను బంధించటం ద్వారా చనిపోతుంది. చివర్లో 'ఆమె కన్నుల కాంతులు కలువలను చేరాయి' (ఆశ్రమంలోని) అనటం ద్వారా రచయిత గురజాడను స్ఫురణకు తెచ్చినా 'ఆమె మేని కాంతులు నక్షత్రాలను చేరాయి' అని క్రొత్తగా చెప్పారు.

**శ్రమణకం :**

పండిత సభలో జరిగిన చర్చ
గొల్లింటి ఆడపడుచు సుజాతలో చర్చ
వివిధ సందర్భాల్లో జరిగిన సుందరీ నందుల మధ్య చర్చ
సుందరీ యశోధరల మధ్య సాగిన చర్చ
యజ్ఞవాటికలో జరిగిన చర్చ
కిసగౌతమితో గౌతముడు కావించిన చర్చ
రోహిణీ నదీ జలాలపై చర్చ
చించిత అభియోగంపై బహిరంగ చర్చ
వసంతోత్సవం విషయమై మైత్రేయుడు, సుందరీల చర్చ
శ్రమణకుల విషయమై సుందరీ గౌతముల చర్చ

సారవంతమైన పలు చర్చావేదికల సమాహారమే *శ్రమణకం* నవల. ఉదాహరణకు ఒక్క క్లిష్టమైన చర్చకు తెరతీసి నవలలో (అందునా చారిత్రక) పాఠకుల్ని ఆకట్టుకోవటమే చాలా కష్టతరమైన విషయం కాగా, పలు చర్చల్ని పలు సందర్భాల్లో సునాయాసంగా, అర్థవంతంగా చేసి పాఠక హృదయాన్ని గెలవటం చూస్తే నందమూరి లక్ష్మీపార్వతి ఎంతటి ప్రతిభాపాటవాలుగల రచయితో అవగతమవుతుంది. అందులోనూ ఆద్యంతం బౌద్ధసిద్ధాంతం ఇతివృత్తంగా సాగిన ఒక చారిత్రక నవలలో ఆధ్యాత్మికమైన వాతావరణంలోనూ, గొప్ప ఎత్తుగడలో మంచి కొనసాగింపులో అద్భుతమైన ముగింపునివ్వటం సాదాసీదా విషయం కాదు. ముందుగా రచయిత్రికి అభినందనలు. అసలు *శ్రమణకం* అంటే ఏమిటి? అందరిలాగే నాలోనూ ఆ పేరు విన్నంతనే, కవరుపేజీపై చూసినంతనే తలెత్తిన ప్రశ్న. ప్రముఖుల ముందుమాటలు చదివాక అర్థమైంది, నవల ఆసాంతం ఏకబిగిన చదివాక అవగతమూ అయ్యింది. ఏ భార్యాభర్తలు బౌద్ధం స్వీకరించి, ఆ ధర్మానుసారం జీవితం సాగిస్తారో వారు శ్రమణకులని విపులంగా నవలలో విశదీకరించారు రచయిత్రి. 'ప్రజాయై గృహ మేధినాం' అని నానుడి. సంతానాభివృద్ధి, పాడిపంటలు, సర్వసంపద సృష్టికి గృహస్థులే మూలం. బ్రహ్మచర్యం, వానప్రస్థం, సన్యాసం వలన సంపద కలుగదు. ఈ కారణమే శ్రమణకులను బౌద్ధసిద్ధాంతం అంగీకరించటానికి ప్రధానంగా దారితీసింది. 'అమ్మా! తమరికి ప్రాణప్రదమైన రాజహంసలు సరోవరం విడిచి, ఎక్కడికో పారిపోయాయి' అని మధుపాలికతో చెప్పించిన ఘటనలో నాటకీయత పండింది. అయితేఇక్కడి నాటకీయతలో ఓ క్రొత్త పోకడ ఉంది. వాస్తవానికి రాజహంసలు ఎగిరిపోయాక, నందుడికి దీక్షను ఇవ్వాలి గౌతముని శిష్యులు. అదీ నాటకీయంగా చెప్పటం. అయితే ఇక్కడ తనదైన చిన్న టెక్నిక్ ద్వారా వెనుకను ముందుకు, ముందును వెనుకకు జరిపాడు రచయిత్రి. నందుడి చేతిలోని అద్దం సుందరి ముఖాన్ని ఎంతగా ప్రతిబింబించిందో నాకు తెలియదుకానీ (పుట. 170), ఈ *శ్రమణకం* నవల లక్ష్మీపార్వతి బహుముఖ ప్రతిభకు నిలువెత్తు అద్దంపట్టిందనటంలో అతిశయోక్తి ఏమీ లేదు. ఈ శతాబ్దిలోని దశకంలో వచ్చిన ఒకే ఒక గొప్ప చారిత్రక నవలగా శ్రమణకాన్ని పేర్కొనవచ్చును. రానున్న దశాబ్దాలలో రాకపోనూవచ్చును.

ఇవాళ చెప్పుకుంటున్న స్త్రీవాదం నవల అంతటా వెల్లివిరిసింది. సుందరి సందర్భం వచ్చినప్పుడల్లా స్త్రీవాదానికి, స్త్రీ అభ్యుదయానికి నడుంబిగించింది. అది ఎంతదాకా పోయిందంటే బౌద్ధంలో మూడోశాఖగా శ్రమణకులను గౌతముడు అంగీకరించే దిశగా. ఇది కేవలం సుందరి విజయమే కాదు – ఆనాటి స్త్రీలందరిదీ. ఇవాళ 121 కోట్ల ప్రజల్లో సుందరీ లేదు, గౌతముడూ లేడు. స్త్రీలకు ఒక ప్రత్యేక శాఖ కూడా ఒక స్త్రీమూర్తి, పుణ్యామానే వచ్చింది. ఆమె ఎవరో కాదు. సాక్షాత్తూ గౌతముని భార్య యశోధర. గౌతముడు తొలి శాఖను (పురుష భిక్షువులు) ప్రారంభిస్తే దానికి కొనసాగింపుగా రెండు, మూడు శాఖలు ప్రారంభించటానికి స్త్రీలు కీలక పాత్ర పోషించటం అందునా మూడు వేల సంవత్సరాల క్రితం విశేషాల్లోకెల్లా గొప్ప విశేషం. ఇవాళ 33 శాతం సాధించలేని దుస్థితి స్త్రీలది. 'మాలికా! ఏమిటా కలకలం'తో మొదలైన నవల '...... అనే శబ్దంతో దూరదూరంగా సాగిసాగి కలావనికల్లా ఎక్కడో ఆగిపోయింది.

**లకుమ భూదేశ్వరరావ్**
**నాగార్జున సాగర్, నల్లగొండ జిల్లా.**
**ఫోన్ : 08680 - 276454, 898 592 4948**



# బుద్ధుడు మానవతా దృక్పథం

*- రావిపూడి వెంకటాద్రి*

బుద్ధుణ్ణి విష్ణువు యొక్క 9వ అవతారంగా వర్ణించడంలో హైందవం యొక్క పలాయనవాదం, కుటిల బుద్ధి వ్యక్తమవుతుంది. మిగతా 8 అవతారాలూ హంతకులు, హత్యల ద్వారా విష్ణువు లోకాన్ని రక్షించాడని పురాణాల కథనం. బ్రహ్మసృష్టికర్త, శివుడు లయకర్త కాగా, విష్ణువు లోక రక్షకుడని సనాతన పురాణ వాదం అందునా రామావతారంలో, కృష్ణావతారంలో విపరీతంగా భజిస్తారు. అదే వారి 'అహింసా పరమోధర్మ.' కాగా, అహింసను బోధించిన బుద్ధుణ్ణి, మరో లోక రక్షకావతారం ఎత్తడానికి విష్ణువుకు అవకాశం కల్పించడంకోసం పాపం పెంచడానికి అవతరించినట్లుగా పురాణాల వర్ణన. అంటే విష్ణువు పాపం హరించడానికేకాక, పెంచడం కోసం కూడా అవతారాలెత్తుతాడన్నమాట. హత్యలకూ, హింసకూ వ్యతిరేకంగా బోధించిన బుద్ధుణ్ణి నిష్క్రియాపరుడుగా 'బుద్ధావతారం'గా హిందూసాహిత్యం ప్రచారం చేసింది.

అయితే, మనం పరిశీలిస్తున్న బుద్ధుడు చారిత్రక వ్యక్తి, చారిత్రక బుద్ధుడు మనకు తెలిసిన ప్రపంచ చరిత్రలోనే ప్రప్రథమ సామాజిక విప్లవకారుడు. మానవ సమస్యల్ని పరిష్కరించడానికి మిషనరీ సంప్రదాయాన్ని ప్రవేశపెట్టిన మొట్టమొదటి వ్యక్తి కూడా బుద్ధుడే. అంతేకాదు, విప్లవం రక్తప్లావితం కాకుండా, ప్రచార ప్రబోధాల ద్వారా, లోకుల అంగీకారం ద్వారా సామాజిక పరివర్తన సాధ్యమనే విషయం మొదటిసారి గుర్తించిన వ్యక్తి బుద్ధుడు. దైవాన్ని ప్రార్థించడం ద్వారానో, మరో అతీత శక్తికి మోకరిల్లటం ద్వారానో కాక, మనుషులు తమ సమస్యల్ని తమ ప్రయత్నాల ద్వారా తామే పరిష్కరించుకోగలరని మొదటిసారి గుర్తించిన వ్యక్తి కూడా బుద్ధుడే. బుద్ధుడు తాను దేవుణ్ణనికానీ, దైవప్రతినిధిని - ప్రవక్తను అని కానీ యెన్నడూ చెప్పలేదు. మతాలకూ, బౌద్ధానికీ మధ్య గల ఆ ప్రత్యేకమైన తేడాను మనం గుర్తించాలి. అప్పుడప్పుడే వికృత స్వరూపం తాలుస్తున్న వర్ణవిభేదాన్ని బుద్ధుడు ఆమోదించలేదు. వేదప్రమాణాన్నికానీ, మరో గ్రంథాధికారాన్ని, వ్యక్తి అధికారాన్ని కానీ ఆయన ఆమోదించలేదు. మనిషి తన జీవిత విధానాన్ని ఎంపిక చేసుకోడానికి హేతుత్వాన్ని (వివేకాన్ని), అనుభవాన్ని సారథులుగా ఆయన సూచించాడు. అలా బుద్ధుడు హ్యూమనిస్టు మార్గంలో సమాజ పునర్నిర్మాణ పద్ధతిని ప్రతిపాదించి, ఉద్యమరూపంలో నిర్వహించాడు.

బుద్ధుని సమకాలంలో ఉత్తర భారతదేశమంతా వైజ్ఞానిక సంక్షోభంలో మునిగి ఉంది. వేద వ్యతిరేకమైన వైజ్ఞానిక ఆలోచనాధోరణులు ఆనాడు కనీసం 60కి పైగా ఉన్నట్లు భోగట్టా. వాటిమధ్య ఎన్ని తేడాలున్నా, ఆ శాఖలన్నీ ఎంతో కొంత నాస్తిక దృక్పథానికి చేరినవే. అవి అన్నీ నిత్యమూ, తాత్విక - ఆధ్యాత్మిక చర్చలలో మునిగి తేలుతూ ఉండేవి. ఈ సమాజంలో మానవుడి స్థితిగతులేమిటి అనే విషయం వారికి పట్టలేదు. అలాంటి వాతావరణంలో బుద్ధుడు సాంఘిక విప్లవకారుడుగా బయలుదేరాడు.

మనిషిపైన దేవుడి అధికారాన్ని రుద్దబూనడం మనిషి పరువు తీయడమే, మనిషిగా అతన్ని కించపరచడమే. కాగా, ఒక మనిషిమీద మరో మనిషిని ఎక్కించడం మరీ అన్యాయం. హిందూ మతం మనుషుల్ని వర్ణాలుగా, కులాలుగా విడగొట్టి ఒకదానిపైన మరోదాన్ని ఎక్కించింది. ఒకదాని క్రింద మరోదాన్ని దూర్చింది. బుద్ధుడు కులాల్ని పరిగణనలోకి తీసుకోలేదు. పైగా వర్ణవ్యవస్థను అమానుషమైనదిగా భావించారు. ఆయన భిక్షుక సంఘాలలోని వారంతా

ఒకరికొకరు సమానమే. వారంతా స్వచ్ఛందంగా బౌద్ధ జీవన విధానాన్ని ప్రచారించినవారే.

మనిషికి తన మీద తనకు నమ్మకం ఉండాలనీ, తన మీద తాను ఆధారపడాలనీ (self-reliance) బుద్ధుడు బోధించాడు. హ్యూమనిజం ప్రధానంగా పట్టించుకొనేది (concern) మనిషినే. బుద్ధుడు ప్రధానంగా పట్టించుకొన్నది కూడా మనిషినే. అలా హ్యూమనిస్టు సంప్రదాయానికి ప్రారంభోత్సవం చేసిన తొలి విప్లవకారుడుగా బుద్ధుణ్ణి పరిగణించవలసి ఉంటుంది. పుట్టుకతో ఏ మనిషీ దుర్మార్గుడు కాడని బుద్ధుని ప్రవచనం. దుశ్చర్యలు మాత్రమే మనిషిని దుర్మార్గుడుగా లెక్కలోకి తీసుకువస్తాయి. "అథాదోషాయం అగంతుక, సత్యప్రకృతి పేశల" అని ఆయన సిద్ధాంతం. అంటే, మనిషి స్వభావ సిద్ధంగా మంచివాడే. చెడు అనేది అగంతుకంగా మధ్యలో వచ్చిపడుతుంది అని దాని అర్థం. బౌద్ధ సంఘీయులలో బ్రాహ్మలు, చండాలురు, రాజులు – సేవకులు అందరూ ఉన్నారు. బౌద్ధులుగా మారినవారిలో అంగులిమాలుడు, పరమాంస భక్షకుడు ఆళవకుడు, దొమ్మరి ఉగ్రసేనుడు, మంగలి ఉపాలి, పాకీవాడైన సునీతుడు ఉన్నారు. మనిషి గుణగణాలను కులం గజం బద్దతో బుద్ధుడు కొలవలేదు. బౌద్ధం నచ్చి, శీలవంతమైన బౌద్ధ మార్గానికి మారిన తర్వాత గతంలో ఒక మనిషి ఎలా ప్రవర్తించాడనే దాన్ని బౌద్ధం పరిగణనలోనికి తీసుకోలేదు.

బ్రాహ్మణమతం నీతి అనే విషయాన్ని ఎన్నడూ తాకి తలవలేదు. వారి నీతి కులనీతి, వారి ధర్మం వర్ణాశ్రమాచార ధర్మంతో సరిపెట్టుకుంది. సామాజిక మానవవాద తాత్వికుడుగా తన విధానంలో నీతికి తొలిసారిగా తగిన స్థానం ఇచ్చిన ఘనత బుద్ధుడికి దక్కుతుంది. "శీలం" అనే మాటను నీతికి బదులుగా మొట్టమొదటిసారిగా వాడిన వ్యక్తి బుద్ధుడేనని కూడా అంటారు. ఆయన దృష్టిలో నీతి, విజ్ఞానం అనే అంశాలు పరస్పర ఆధార ఆధేయాలు. సరైన జ్ఞానం ఆర్జించిన మనిషి నైతికంగా తప్ప మరోవిధంగా ప్రవర్తించలేదు. బౌద్ధ సంఘీయులు సాంఘికసేవ, ప్రబోధం స్వచ్ఛందంగా చేస్తారంటేనే, వారు నైతిక స్ఫూర్తితో, చైతన్యంతో ఆ పని చేస్తున్నారని భావించాలి. అందు నిమిత్తం పైనుంచి ఆజ్ఞలు అవసరంలేదు. నీతితో సహా పై విషయాన్ని గురించి కూడా బుద్ధుడు ఆజ్ఞలు జారీచేయలేదు. ఆయన వైఖరి నియంతృత్వం కాదు. బుద్ధుని కాలంలో బ్రాహ్మలు యజ్ఞాలు చేస్తూ జంతువుల్ని బలి ఇవ్వటం ఒక సరదా. ఒక్కోసారి యజ్ఞాలలో నరబలులు కూడా ఇస్తుండేవాళ్ళు. అప్పుడు బుద్ధుడు 'అహింస' నినాదాన్ని చేపట్టాడు. జీవులపట్ల కరుణ వహించాలన్న ఆయన అహింసోద్యమం సమాజంలో చాలామందిని ఆకట్టుకుంది. చివరకు బ్రాహ్మణ మతమే దిగివచ్చింది. 'అహింసా పరమోధర్మః' అన్న బౌద్ధ సూత్రాన్ని కాపీ కొట్టి, అది తన స్వంత సూత్రంగా, వేద సూత్రంగా ప్రచారంలో పెట్టింది.

'ఎస్సెన్స్ ఆఫ్ బుద్ధిజం' అనే పుస్తకంలో బుద్ధుడి బోధల్ని సమీక్షిస్తూ ప్రొ. పి. లక్ష్మీనరసు ఇలా అంటాడు : "బౌద్ధం ప్రమాణం స్థానంలో హేతువును ఉంచింది : ఆధ్యాత్మిక ఊహల్ని విసర్జించి ఆచరణాత్మక జీవిత వాస్తవికతలకు చోటు కల్పించింది. స్వయం సంపూర్ణత సాధించిన వివేకాశాలుల్ని ఆస్తికుల తాలూకు దేవుళ్ళ స్థాయికి పెంచింది. వంశానుగత పౌరోహిత్యం స్థానంలో మానసిక వికాస స్థాయి సోదరత్వాన్ని నెలకొల్పింది. వ్యర్థ పాండిత్యం స్థానంలో సచ్ఛీలతను ప్రవేశపెట్టింది. ఏకాంత సన్యాసి జీవితం స్థానంలో ఆరామ సామాజిక జీవితాన్ని ప్రవేశపెట్టింది. జాతుల వేర్పాటు భావం స్థానంలో విశ్వ మానవ స్ఫూర్తిని చొప్పించింది."

ఒకప్పుడు పాత్రపాదుడనే సన్యాసి బుద్ధుని చేరి "ప్రపంచం వాస్తవమా, భ్రమా? సాంతమా, అనంతమా? దేహం, ఆత్మ ఒకటేనా, వేర్వేరా? మనిషికి మరణానంతరం జీవితం ఉందా?" అని ప్రశ్నించాడు. వాటికి బుద్ధుడు సమాధానం చెప్పలేదు. ఎందుకంటే అవి సచ్ఛీలతకు, పాపరాహిత్యానికీ, ప్రశాంతికీ, సత్యమైన జ్ఞానానికీ సంబంధించినవి కావు. బుద్ధుడు సచ్ఛీల జీవనం మీద నొక్కిపెట్టాడు. చాలామంది ఆధ్యాత్మిక సమస్యల పేరుతో సర్కసు చేస్తూ కాలం వృథాపుచ్చుతారు. ఇలా అన్నంత మాత్రాన, బుద్ధుడు తాత్విక సమస్యల జోలికి పోలేదని అర్థం చేసుకోనవసరం లేదు.

శూన్యం నుంచి ప్రపంచం సృజించబడిందనే అంశాన్ని బుద్ధుడు నమ్మలేదు. "అజాతివాదాన్ని" (ఏదీ సృష్టించబడలేదు) చాలా విస్తృతంగా వివరించడానికి ప్రయత్నించిన మొదటి వ్యక్తి బుద్ధుడేనేమో! "నచ నిరోధోస్తి నచ భావోస్తి సర్వదా అజాతం అనిరుద్ధంచ తస్మాద్ స్వరం ఇయంజగత్" అన్నాడు. సృష్టి లేదు, వినాశమూ లేదు, ఆదీ లేదు, అంతమూ లేదు. "విచారణే నాస్తికించిత్ అహేతుతః" అన్నాడు. అయినా, కారణం లేకుండా ఏదీ జరగదు. ఈ కార్యకారణ బంధం

లేని చోటు లేదు. అది ప్రతిచోటా ఉంది. అదే ధర్మం, బౌద్ధులు దానికిచ్చిన సాంకేతిక నామం "ప్రతీత్య సముత్పాదం". ఆ ధర్మాన్ని అవగాహన చేసుకోవడమే ప్రతీత్య సముత్పాదవాదం. విశ్వాన్ని బుద్ధుడు అవిరత కార్యకారణ క్రమంగా అర్థం చేసుకున్నాడు. అలా బోధించాడు. కాలామరాజకుమారుల సంశయాలు తీర్చేటప్పుడు "ఏ విషయాలన్నీ గ్రుడ్డిగా నమ్మవద్ద"ని వారికి చెప్పాడు, పరిశీలించండి, విశ్లేషించండి, అది హేతుబద్ధంగా ఉండి, మంచికి మార్గమై ఉండి, ప్రతి ఒక్కరికీ లాభదాయకమైతే దానిని ఆమోదించండి, దాని ప్రకారం జీవించండి" అని వారికి వివేచనా మార్గాన్ని సూచించాడు. ప్రొ. పి. లక్ష్మీనరసు బుద్ధుణ్ణి చాలా ఘనంగా శ్లాఘించాడు. "బుద్ధుని అంతగా దేవుడితో నిమిత్తం లేని బోధకుడు లేడు, అయినా, అంతగా దేవుడివలె ఎదిగినవాడూ లేడు" అంటాడు. బౌద్ధతత్వం విస్తృతంగా వ్యాపించడంపట్ల బ్రాహ్మణమతం భయకంపితమైంది. బుద్ధుని మానవతా బోధలకు వ్యతిరేకంగా ప్రతిస్పందించడం బ్రాహ్మలు ప్రారంభించారు. బుద్ధుని బోధనలు ఆకర్షణీయంగా ఉన్నాయి, ప్రయోజనకరంగా ఉన్నాయి, మానవత నిండి ఉన్నాయి, బౌద్ధులుగా మారడానికి కులాలు, ఆచారాలూ అడ్డుగోడలు కావు. అయితే, అనంతరం వచ్చిన వేదపండితులు బౌద్ధ ముఖ్య సూత్రాలను కొన్నిటిని ఉన్నవి ఉన్నట్లుగా కాపీ చేసుకున్నారు. చివరకు హిందువులు బుద్ధుని నీడలోనే విశ్రాంతి తీసుకున్నారు. బుద్ధుణ్ణి విష్ణువు యొక్క 9వ అవతారంగా ఫోర్జరీ చేశారు. అలా చేయడంలో బుద్ధుడికి హిందూ మసి కొంత పూశారు. వేదాలకు విరుద్ధంగా పాపాన్నీ, దుర్మార్గాన్నీ పెంచడానికి విష్ణువు బుద్ధావతారం ఎత్తాడన్నారు. అంటే బుద్ధుడు బోధించిన సచ్ఛీలత, అహింస, భూతదయవంటి సూత్రాలు హిందువుల దృష్టిలో పాపపంకిలాలన్నమాట. విష్ణువు ఎత్తిన మిగతా అవతారాలు, చేసిన హత్యలు, సాగించిన సంహారకాండ పుణ్యశోభితాలన్నమాట.

బుద్ధుని అనంతరం ఐదారు శతాబ్దులలో బౌద్ధం విస్తృతంగా వ్యాపించింది. శక్తిమంతంగానూ పెరిగింది. ఆ వ్యాప్తిని చూచి హిందూ పురోహితులూ, రాజులూ సహించలేకపోయారు. అశోకుని ముమ్మనుమడైన బృహద్రథుణ్ణి చంపి పుష్యమిత్ర శుంగుడనే బ్రాహ్మణుడు సింహాసనమెక్కిన తర్వాత, పురోహిత వర్గం బౌద్ధాన్ని నాశనం చేయడానికి పూనుకొంది. వాళ్ళు వేలాది స్తూపాలను, సంఘారామాలను విధ్వంసం చేశారు. ఆ విధంగా బౌద్ధం ఏ దేశంలో పుట్టిందో ఆ దేశం నుంచి చివరకు తరిమివేయబడింది. అది చారిత్రక వాస్తవం. అయినా, "హిస్టరీ ఆఫ్ ఇండియన్ ఫిలాసఫీ" అనే గ్రంథంలో డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఒక పచ్చి అబద్ధాన్ని ఆడాడు. "బౌద్ధం హింసాత్మకంగా భారతదేశం నుంచి తొలగించబడిందనేది కట్టుకథ" (Vol.1, P. 608) అని వ్రాశాడు. ఇలాంటి అబద్ధాలు ఆయన చాలా వ్రాశాడు. చరిత్రను గురించిన ఆయన భావాలే పెద్ద కట్టుకథ అని ఆయనకు తట్టలేదు. బౌద్ధులపట్ల విద్వేషంతో మునగానాం తేలానాంగా ఉన్న హిందూ మనస్తత్వం నిష్పాక్షిక తీర్పు చెప్పడం అసాధ్యం. వేదాంత పునరుజ్జీవనవాది వివేకానందుడు మద్రాసులో ఒకసారి లక్ష్మీనరసు గారి ముందు తన కుళ్ళు ఇలా వెళ్ళబోసుకున్నాడు : "ఈనాడు బౌద్ధాన్ని గురించీ, బౌద్ధ అజ్ఞేయవాదాన్ని గురించీ మాట్లాడటం ఒక ఫ్యాషనైంది – ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో, ఈనాడు మనం అనుభవిస్తున్న అవమానానికి మూలం బౌద్ధమేనన్న విషయం కలలో కూడా వారికి తట్టదు" అంటూ పచ్చి అబద్ధాన్ని వెల్లడించారు.

బౌద్ధాన్ని భారతదేశం నుంచి వెళ్ళగొట్టాక హిందూ రాజులు దాదాపు 1000 సంవత్సరాలు భారతదేశాన్ని పరిపాలించారు. భారత సమాజాన్ని కూడా పాలించారు. ఆ తర్వాత మాత్రమే హిందూ రాజుల మాళ్ళు పగలగొట్టి, వారినుంచి రాజ్యాధికారాన్ని ముస్లిములు వశం చేసుకున్నారు. ఆ తర్వాత ముస్లిం రాజుల మాళ్ళు, అవశేషంగా ఉన్న హిందూ రాజుల మాళ్ళు పగలగొట్టి పాశ్చాత్యులు ఈ దేశంపై రాజకీయాధికారం చలాయించారు. ఇది చారిత్రక వాస్తవం ఐనపుడు, భారతదేశం అవమానం పొందడానికి మూలం బౌద్ధం ఎలా అవుతుంది? ఈ ప్రశ్న ఆ బ్రహ్మచారి సన్యాసికి రాలేదు. హిందూ మనస్తత్వం అది చేసిన పాపాలకు ఎన్నడూ పశ్చాత్తాపం చెందదు. హిందూ పునరుజ్జీవనవాది ఎన్నడూ సత్యాన్ని వెలుగులో చూడలేదు. బుద్ధుడి జీవితకాలంలోనే భారత ప్రజలు చాలామంది ఆయన ప్రబోధాలవల్ల ప్రభావితమయ్యారు. ఆ తర్వాత ఐదారు శతాబ్దుల్లో దాదాపు ప్రాచ్యదేశాలన్నిటిలో బౌద్ధం వ్యాపించింది. అనతికాలంలోనే అది శక్తివంతమైన భావోద్యంగా పెరిగింది. ఆ భావాలు ఆచరణ సాధ్యమయ్యాయి. బౌద్ధంలో చాలా శక్తివంతమైన

హ్యూమనిస్టు బీజం ఉంది. అది ప్రజాభిమతమైంది. దాన్ని మతమని అనుకుంటే అది "ప్రజామత"మైంది.

బౌద్ధం భారతదేశం నుంచి తరమివేయబడింది. ఆ సంఘటనల నుంచి ఈనాటి హ్యూమనిస్టు ఉద్యమం నేర్చుకోవలసిన పాఠం ఉంది. హిందూ ప్రతీఘాతం భారతదేశంలోని బౌద్ధాన్ని నాశనం చేసింది. ఆధునిక వైజ్ఞానిక యుగం ఆవిర్భవించిన తర్వాత మతం వెనకడుగు వేస్తున్నట్లు కనిపించింది. అదొక దృశ్యభ్రమ, భావభ్రమ. ఈనాడు మత ప్రతీఘాతం బలం పుంజుకుంటున్నది. మత పునరుజ్జీవన వాదం, ఫండమెంటలిస్టు - కమ్యూనలిస్టు రూపం తాలుస్తున్నది. అవినీతిపరులైన అధికార రాజకీయ వాదులు జాతీయ సంప్రదాయం, సంస్కృతి పేరుతో దాన్ని సమర్థిస్తున్నారు. ఈ విచిత్ర పరిస్థితిని జీర్ణించుకోలేక ఆధునిక మానవుడు క్రిందుమీదులవుతున్నాడు. బౌద్ధం నాశనం కావడం ఒక పాఠం, ఫండమెంటలిస్టు శక్తులు చెలరేగటం మరోపాఠం. ఈ రెండు పాఠాలూ నేర్చుకొని, మేలుకొని, హ్యూమనిస్టులు, జాగ్రత్తపడాలి అని హెచ్చరిస్తున్నాయి.

**హేతువాదం :** మానవుడికి ప్రాయికంగా సంక్రమించిన హేతుత్వం జీవలక్షణాల్లో అత్యంత ముఖ్యమైనది. అది ప్రకృతిలో నియమబద్ధత రూపంలోనూ, దాని పరిణామంలో అవతరించిన జీవజాలంలో సహజాతవాసన రూపంలోనూ, మరింత పరిణామం చెందిన మానవుడిలో వివేకం రూపంలోనూ వ్యక్తమవుతున్నది. తనలో వ్యక్తమవుతున్న వివేకాన్ని, హేతుత్వాన్ని, విచక్షణాశక్తిని వినియోగించుకొని సత్యాసత్యాలను, యుక్తాయుక్తాలను విడమరచి జీవనతత్వాన్ని ఏర్పరచుకోవడానికి మానవుడు అనుసరించే విధానాన్నే హేతువాదమంటారు. నిజానికి, హేతువాదం వాదం కాదు. సిద్ధాంతం కాదు. తత్వం కూడా కాదు. నిత్యాభివృద్ధి చెందే విజ్ఞానానికి వాస్తవిక మదింపువేసే పద్ధతిని హేతువాదమంటాం. అందువల్ల అదొక మెథడాలజి.

హేతువాదాన్ని కార్యకారణవాదమని కూడా అనేది కద్దు. కార్యాలకు కారణాలుంటాయి. కాన, ఒక కార్యాన్ని సాధించాలంటే ఏ కారణాన్ని ఆశ్రయించాలో లేక ఏ కారణంవల్ల ఏ కార్యం జరగబోతున్నదో ముందుగా అంచనా వేసుకోవచ్చు. కారణం లేని కార్యం ఉండదు. దీన్నే 'కారణాభావాత్ కార్యాభావః' అన్నది వైశేషికం (1-2-1). అలానే కార్యం ఉన్నప్పుడు కారణం ఉండక తప్పదు. కార్యకారణాల్లో ఏదీ ఒంటరిగా ఉండటం సంభవం కాదు. ఈ కార్యకారణాల సంబంధాన్ని అర్థం చేసుకొని నిర్ణయాలు తీసుకొనే పద్ధతినే హేతువాదమంటాం. కారణం లేకుండా కార్యం జరగదు. అలా జరిగినట్లు కనపడి, మహత్యాలుగా పిలవబడే వాటిని హేతవాదం మూఢనమ్మకాలుగా పరిగణిస్తుంది.

నీరు, నీటి ఆవిరి, మేఘం, మంచుగడ్డ - ఇవి ఒకే వస్తువు యొక్క నాలుగు దశలు. కాబట్టి, వీటిని ఒకదానికొకటి కారణంగానూ, కార్యంగానూ, చెప్పుకోవచ్చు. వర్షానికి కారణం మేఘాలు. మేఘాలు లేకుండా వర్షం కురిసిందని ఎవరైనా అంటే, అది అబద్ధమంటాం. ఎందువల్ల? మేఘాలకు, వర్షానికి మధ్య ఉండే కార్యకారణ సంబంధం మనకు తెలుసు కనుక. సాయిబాబా వేలుపెడితే నీరు పెట్రోలుగా మారిందని ప్రచారం చేసే మేధావులున్నప్పుడు, ఆ మోసాన్ని, గారడీని మహత్యంగా విశ్వసించే సామాన్యులుండటంలో విశేషమేమున్నది? ఎవడు వేలు పెట్టినా నీరు పెట్రోలుగా మారడం జరగదు. అది పదార్థ ధర్మాలకు, కార్యకారణ సంబంధానికి విరుద్ధమైనది. అలా జరగడానికి వీలు లేదని మనం నిర్ణయించుకోవడం కూడా హేతువాద అవగాహన క్రిందకే వస్తుంది. ఎందుకంటే, ఏది జరగడానికి వీలుందో, ఏది జరగడానికి వీలు లేదో సంభావ్యతా నియమాలనుబట్టి మనం అర్థం చేసుకోవచ్చు.

కారణ కార్యాలనేవి పూర్వోత్తర సంఘటనలకు మనం పెట్టుకొన్న పేర్లు. అంటే, సంఘటనల పరోక్షంలో కార్యకారణాలకు అర్థం లేదు. సంఘటనలు లేకపోతే, కారణ కార్యాలుండవు. నిత్య పరిణామి అయిన ఈ ప్రకృతి అవిరత సంఘటనలమయం మన జ్ఞానమంతా ఈ సంఘటనలను గురించినదే. ఆ సంఘటనలన్నీ క్రమబద్ధంగా ఉన్నాయి. ఒక సంఘటనను మరో సంఘటన అవశ్యంగా నిర్ణయించడంగానీ, ఒక సంఘటనకు ముందు మరో సంఘటన అవశ్యంగా ఉండడంగానీ జరుగుతుంది. దీన్నే మనం నియతివాదం అంటాం. ఇది కర్మవాదమూ కాదు, ప్రారబ్ధవాదమూ కాదు. నియతివాదం ప్రకృతి సూత్రాలకు సంబంధించినదే తప్ప, ప్రకృతి వెలుపలి శక్తులతో దీనికి సంబంధం లేదు. సంఘటనల క్రమాన్ని గురించిన జ్ఞానం ద్వారా మనం కోరుకున్న సంఘటనను సాధించే స్వేచ్ఛ మనకుంటుంది కాని, నియతివాదం స్వేచ్ఛకు విరుద్ధం కాదు; పైగా ఏది

ఎలా జరుగుతుందో మనకు అవగాహన లేకపోతే, సంఘటనలన్నీ అనియత పద్ధతిలో, చిందరవందరగా జరుగుతూ ఉంటే, మనం దేనినైనా స్వేచ్ఛతో ఎంపిక చేసుకొనే అవకాశం లేదు. మన స్వేచ్ఛకూ, కర్మణ్యత్వానికీ, దేన్నయినా లక్ష్యించడానికి కూడా అవకాశం లేదు. అంటే, నియతివాదం హేతువాద స్వేచ్ఛావాద సూత్రమే. నియతిని గురించిన జ్ఞానం మనకు ఉండడంవల్లనే, సంభావ్యతా భావం కూడా మన ముంగిట్లో ఉంటుంది.

మనం వివేకాన్ని వినియోగించుకున్నప్పుడు ఒక ప్రతిపాదనను అంగీకరించే హక్కు కానీ, తిరస్కరించగల తాహతు కానీ మనకుంటుంది. దాన్ని చలాయించుకోగల హక్కు ఉండటమంటే, స్వతః ప్రమాణాలని చెప్పబడుతున్న మత గ్రంథాలను నిరాకరించే హక్కు ఉండడమే. వేదాలు, బైబిలు, ఖురాను వగైరా మత గ్రంథాలు చెప్పిన వాక్యాలనో, యోగులు, స్వాములు, బాబాలు చెప్పిన అభూత కల్పనలనో – వివేకానికీ, హేతుత్వ పరీక్షకూ నిలబడకపోతే, సత్యాలని నిర్ధారణ కాకపోతే అవి ప్రమాణాలు కావని త్రోసివేయడం కూడా హేతువాదమే. అంటే, మతాన్ని ఆమోదించే పని హేతువాద విధానానికి లేదు. మతాన్ని ఆమోదించడమంటే హేతువాదాన్ని తిరస్కరించడమే. అందువల్ల, మతాన్ని సమర్థించడానికి కొందరు చేసే కుతర్కం కేవలం యుక్తీకరణం అవుతుంది తప్ప, హేతువాదం కాదు. అసలు తర్కమూ, హేతువాదమూ ఒకటి కావు. తప్పొప్పులతో నిమిత్తం లేకుండా, ఏదైనా సిద్ధాంత ప్రాతిపదికల మీదనుంచి బయలుదేరి వివాదం కొనసాగించే కార్యకారణ పద్ధతిని తర్కం అంటారు. కాని, హేతువాదం కేవలం తర్కం కాదు. అది ప్రాతిపదికల నిర్ణయానికి కూడా కార్యకారణ భావాన్ని అనుసంధిస్తుంది. అందుకు బాసటగా ఆధునిక విజ్ఞానాన్ని తీసుకొంటుంది. విజ్ఞానానికి లొంగని, విజ్ఞానం ఆమోదించని సత్యాన్ని హేతువాదం తిరస్కరిస్తుంది. కేవల తర్కానికి అలాంటి నైతిక నియమం ఉండదు.

మతమూ విజ్ఞానమే. కాని, అది ఒకప్పటి విజ్ఞానం. ఈనాటి విజ్ఞాన ప్రమాణాల ప్రకారం అది అజ్ఞానం. నిజానికి, ఏ విజ్ఞానమైనా వ్యవస్థీకరణ చెందితే, అది మతం క్రిందనే లెక్క. అది పరమ ప్రమాణమై కూర్చుంటుంది. అందువల్లనే, గతంలో ఒక మతం మీద తిరుగుబాటు జరిపిన ఉద్యమాలు తమవంతు వచ్చేసరికి తిరిగి వ్యవస్థీకృతమై మతాలుగా తీరి కూర్చున్నాయి. ఏ మతమూ, ఏనాడూ భిన్నభావాలను సహించలేదు. ప్రతి మతమూ ప్రవక్తనో, ప్రవచనాన్నో (మత గ్రంథం) పరమ ప్రమాణంగా పరిగణిస్తుంది. వివేకాన్ని వినియోగించుకొనే హక్కు, మతగ్రంథాలు నిర్దేశించిన మార్గానికి భిన్నంగా ఆలోచించే హక్కు, ప్రవర్తించే హక్కు ఏ మతమూ, ఎవ్వరికీ, ఎన్నడూ అంగీకరించలేదు. సాహసించి చలాయించుకోజూచిన ప్రతివారినీ మతం పాషండులుగా చిత్రించి శిక్షించింది. అది చరిత్ర. కాబట్టి, మత ప్రమాణాన్ని తృణీకరించడం హేతువాదంలో ప్రాథమిక దశ. ఇలా ఎందుకు అంటున్నామంటే, మతబోధలన్నీ అసంబద్ధాలతో, అసత్యాలతో కూడి ఉన్నాయి. వాటిలోని తప్పుల్ని గమనించలేనివారికి మరి దేనిలోనూ తప్పుల్ని గుర్తించగల వివేకం ఉండదు. అందుకే, కారల్ మార్క్సు సైతం విమర్శ అనేది మతవిమర్శతోనే ప్రారంభమవుతుందంటాడు. విమర్శనాత్మక మేధ పని చేయనినాడు, తప్పొప్పుల్ని వేరుచేయడం సాధ్యం కాదు. అందువల్ల, విమర్శనాత్మక మేధను వినియోగించడం హేతువాదంలో ముఖ్యాంశం. అది హేతువాదానికి ఆయుధం.

మతాలను ఎదుర్కోవడం కష్టతరమైన విషయం. ఎందుకంటే ఆయా మతాలకు రక్షణగా (ప్రవక్తలు) దేవుళ్ళను సృష్టించారు. ఆ దేవుళ్ళు సర్వశక్తిమంతులని నమ్మించారు. అంటే, అస్తికత్వం మతానికి ఆయుధమన్నమాట. మతాలను నిరాయుధం చేయాలంటే, ఆస్తికత్వం యొక్క అసంబద్ధతను వివరించాలి. నిరీశ్వరత యొక్క వాస్తవికతను చాటాలి. దైవభావం కార్యకారణవాదం ముందు చెల్లదు. ఆది కారణవాదం అనవస్థాదోషానికి దారితీస్తుంది. ఇలా అంటున్నంత మాత్రాన హేతువాదం నాస్తికత్వం కాదు. నిరీశ్వరవాదం కాదు. హేతువాదం హేతువాదమే. హేతుబద్ధంగా ఆలోచించినపుడు దైవభావం అసంగతమని తేలుతుందన్నంతవరకే హేతువాదం నాస్తిక వైఖరిని అవలంబిస్తుంది. అయితే, హేతువాదం అంతటితో ముడుచుకోదు. మానవ జీవితంలో అన్ని రంగాల్లోనూ ఎదురయ్యే అన్ని రకాల సమస్యలకూ విచక్షణాజ్ఞానాన్ని జోడించి పరిశీలిస్తుంది. నిర్ణయాలు చేసుకొంటుంది. అధికంగా లభించే విజ్ఞానాన్ని అనుసరించి మార్చుకోవలసివస్తే, ఆ నిర్ణయాలను మార్చుకొంటుంది. కొత్త నిర్ణయాలు చేసుకొంటుంది.

ఒకప్పుడు మతగ్రంథాలను శాస్త్రాలనేవారు. మత

గ్రంథాలూ, విజ్ఞాన శాస్త్రాలూ పరస్పర విరుద్ధ ధోరణులు కలవి. అలానే మతమూ, తత్వశాస్త్రమూ ఒకటి కావు. అంటే, తత్వశాస్త్రం ఆస్తికత్వంలో ఇమిడేది కాదు. ఆస్తికత్వం ప్రకృతి కారణాన్ని ప్రకృతికి వెలుపల వెదుకుతుంది. కారణమెప్పుడూ వస్తువుకు అంతర్గతంగానే ఉంటుంది కానీ, బాహ్యంగా ఉండదు. ప్రకృతికి కారణం బాహ్యంగా లేదు కాన, దొరకదు. అయినా, లేనిదాన్ని ముందుగా నమ్మి, ఆ తర్వాత దాని కొరకు వెతకమంటుంది మతం. తత్వశాస్త్రం అలా చేయదు. ప్రకృతి కారణాన్ని ప్రకృతిలోనే చూస్తుంది. దీన్నే వైశేషికులు "కారణమితిద్రవ్యే కార్యసమవాయాత్ (10-2-1) అంటూ కార్యకారణ సమవాయ సంబంధాన్ని ద్రవ్యంలోనే ఉన్నట్లు సరిగానే చెప్పారు. హేతువాదం ఈ ప్రపంచంలో కనుగొన్న కారణాల ద్వారా ఈ ప్రపంచాన్ని తాత్వికంగా వివరిస్తుంది. ఈ ప్రపంచం భౌతికమైనది కాబట్టి, భౌతికేతరమైనదేమీ లేదు కాబట్టి, హేతువాదం భౌతికవాదానికి దారితీస్తుంది. అంటే, హేతువాద విధానంలో నాస్తికత్వం తర్వాత చేరే మజిలీ భౌతికవాదం.

ప్రకృతి పరిణామం (becoming)లోని పూర్వోత్తర సంఘటనలనే కారణ కార్యాలుగా భావిస్తున్నామంటే, కారణ కార్యాలు ప్రకృతికి సంబంధించినవనీ, దానికి మరో కారణం ఉండనవసరం లేదనీ భావం. అంటే, ప్రకృతికి కారణం లేదు. అది నిత్యమైనది. ఈ అంశాన్నే వైశేషికం "సదకారణవత్ నిత్యం (4-1-1)" అన్నది. దాని వ్యక్తీకరణం కారణంగా భిన్నత్వం ప్రదర్శితమవుతున్నది. (తస్యకార్యం లింగం : 4-1-2). ఆ భిన్నత్వాన్ని కార్యకారణ రూపంలో మనం గుర్తిస్తున్నాం. (కారణభావాత్ కార్యభావః : 4-1-3). ఇదంతా సత్తా (being) కల ప్రకృతి గురించీ, ప్రకృతి పరిణామం (becoming) గురించీ చెప్పుకొన్న మాటలు, చెప్పుకోవలసిన మాటలు. ప్రకృతి యొక్క ఉనికీ, పరిణతీ (being and becoming) విడదీయరానివి. కాని, వాటి రెండింటినీ విడదీసి, కేవల ఉనికిని చూడడానికి ప్రయత్నించారు. అది వారికి దర్శనమీయలేదు. అందువల్ల ప్రకృతినే, ప్రపంచాన్నే వారు లేదన్నారు. ఇదంతా ఏమిటి అని ప్రశ్నిస్తే,

***స్వప్నమాయే యథాదృష్టే గంధర్వ నగరం యథా***
***తథా విశ్వమిదం దృష్టం వేదాన్తేషు విచక్షణై***

*(గౌడపాద కారికలు : 2-31)*

అన్నారు. మన అనుభవంలో ఉన్న విశ్వాన్ని ఇలా మిథ్యగా త్రోసిపారవేయడాన్ని హేతువాదం అంగీకరించదు. ఉన్నది, కన్నది హేతుబద్ధం కావడమే హేతువాదానికి ప్రాతిపదిక. ఇది జ్ఞానసిద్ధాంతానికి సంబంధించిన సమస్య. ఇంద్రియాలను స్పృశించే వస్తువుల గురించి తప్ప, మరి దేన్నిగురించీ మనకు జ్ఞానం లభ్యం కావడానికి వీలు లేదు. అందుకే "ఇంద్రియార్థ సన్నికర్షోత్పన్నం జ్ఞానం" (1-1-4) అన్నారు నైయాయికులు. దాన్ని వారు ప్రత్యక్ష జ్ఞానంగా వర్గీకరించారు. కాని, ప్రత్యక్షంకాని, ప్రత్యక్ష జ్ఞానం మీద ఆధారపడని జ్ఞానమేమీ ఉండదు. అంటే, పరోక్ష జ్ఞానాలుగా చెప్పబడే అనుమాన, ఉపమాన, శబ్దాది ప్రమాణాల ద్వారా లభించే జ్ఞానానికి కూడా మూలం ప్రత్యక్ష జ్ఞానమే. జ్ఞానమంతా ఇంద్రియార్థ సన్నికర్షోత్పన్నమే. అనింద్రియ జ్ఞానం అనేది కానీ, అతీంద్రియ జ్ఞానం అనేది కానీ లేదు. జ్ఞానమంతా ఇంద్రియ జ్ఞానమే. మనకు కనపడని, వినపడని, ఇతరత్రా ఇంద్రియాలకు స్ఫురించని వస్తువుల గురించి శాస్త్రీయ సాంకేతిక పరికరాలు అందించే సమాచారం కూడా ప్రత్యక్ష జ్ఞానమూలం నుంచి బయలుదేరినదే. అతీంద్రియ జ్ఞానమనేది అపనామం. అరుదుగా కనిపించే విశేష భావుకతను, ప్రదర్శించే ప్రజ్ఞను కూడా అతీంద్రియ జ్ఞానచిహ్నంగా భ్రమపడేది కద్దు. అన్ని తరహాల, స్థాయిల భావుకతకు, ప్రజ్ఞకు ఇంద్రియ జ్ఞానమే పునాది. అది వస్తువులతో భౌతిక సంబంధం వల్ల ఏర్పడుతుంది. ఒకానొకప్పుడు మెరుపుల్లాగా కొత్త అభిప్రాయాలు, అన్వయాలు మనకు తోచేది కద్దు. అవి గుప్త హేతుత్వ హఠాత్ ప్రవృత్తివల్ల అలా లభిస్తాయి. అందుకే అతీంద్రియ జ్ఞానమంటే గుప్తహేతుత్వమంటాడు ఎం.ఎన్. రాయ్.

వస్తువులు కానీ, వస్తువుల నుంచి బయలుదేరే వివిధ శక్తి ప్రసారాలు కానీ మన ఇంద్రియాల వద్దకు వచ్చి, వాటిని తాకినపుడే వాటిని గురించిన జ్ఞానం మనకు లభ్యమవుతుంది. కానీ, మన ఇంద్రియాలు వెళ్ళి ఆయా వస్తువుల్ని తాకి వాటిని గురించిన జ్ఞానాన్ని గ్రహించవు. అంటే, వస్తువులు మన ఇంద్రియాలపై ప్రభావాన్ని చూపుతాయి కానీ, ఆ వస్తువులపై మన ఇంద్రియాలు ప్రభావాన్ని చూపవన్నమాట. అంటే, మన పురాణాల్లో పేర్కొన్న దివ్యదృష్టి, శాపాలు, వరాలు వగైరాలు కేవలం కట్టుకథలు. వాటిని నమ్మి, అటువంటివాటికి శాస్త్రప్రతిపత్తి చేకూర్చడానికి బయలుదేరినవే టెలిపతీ, క్లెయిర్ వాయెన్స్, ఎక్స్ట్రాసెన్సరీ పెర్సెప్షన్, సైకోకెనెసిస్ వంటి వ్యర్థ

ప్రక్రియలు. వాటిని రుజువు చేయడానికి విశ్వవిద్యాలయాల్లో శాఖలు నెలకొల్పవచ్చు. ఆధునిక విజ్ఞాన శాస్త్రపరికరాలను అవి వినియోగించుకోవచ్చు. అంతమాత్రాన, ఆ శాఖలకు విజ్ఞానశాస్త్ర హోదా రాదు. ఎందుకంటే, ఆ ధోరణిలో సైకికల్ రిసెర్చి ప్రారంభమై 100 సంవత్సరాలు దాటినా, ఈనాటివరకూ పునఃపరిశీలన ద్వారా అది నిజమని నిర్ధారణ చేయగల ఒక్క ప్రయోగాన్నంటే ఒక్క ప్రయోగాన్నయినా, వారు చేసి చూపించలేకపోయారు. ఆ మాటే అంటాడు అమెరికన్ భౌతిక విజ్ఞాన శాస్త్ర అకాడెమీ మాజీ అధ్యక్షుడు ఎ.డబ్ల్యు. వీలర్.

కాబట్టి, ఉన్న జ్ఞానమంతా ప్రకృతిని గురించినదే. అంటే, ప్రకృతి పరిణామాన్ని గురించినదే. ఈ పరిణామంలోనే వస్తు వైవిధ్యం గోచరిస్తున్నది. ఈ పరిణామ క్రమాన్ని అర్థం చేసుకొని, ఏ సంఘటన ఏ మరో సంఘటనకు దారితీస్తున్నదో గ్రహించి, ఆ సంఘటనల సాధనకు మార్గాన్ని ఎన్నుకొనే పద్ధతినే హేతువాదమంటాం. బ్రహ్మవాదులు, భావవాదులు చెపుతున్నట్లు ఈ ప్రపంచం మన మానసిక స్థితి కాదు. ఇది వాస్తవం, నిత్యం. నిత్యమూ మారుతున్నంత మాత్రాన ఇది అనిత్యం కాదు. నిత్యం మారడమే ప్రకృతి నిత్యత్వ లక్షణం. భూతాలు ఎన్ని అనే చర్చను అలా ఉంచితే, పంచభూతాలు నిత్యం కాబట్టి, వాస్తవిక ప్రకృతి అంతా నిత్యమేనని న్యాయదర్శనం కూడా ఉటంకించింది (సర్వం నిత్యం పంచభూత నిత్యత్వాత్ : 4-1-3). అలానే సాంఖ్యం కూడా జగత్తు సత్యం కాదనడానికి కారణమేమీ లేదన్నది (జగత్ సత్యత్వ మదుష్ట కారణ జన్యత్వాత్ బాధకా భావాత్ : 6-52). ఈ జగత్తుకు కారణం వేరే లేదని న్యాయదర్శనం అన్నట్లే, అన్నిటికీ మూలం ఈ ప్రకృతియేననీ, దీనికి మరో మూలకారణం లేదనీ సాంఖ్యం కూడా అన్నది (మూలే మూలా భావదమూలం మూలమ్ 1-67). అంతేకాక, జగత్తులో ప్రతి వస్తువూ మరో వస్తువు నుంచి సిద్ధించేదే తప్ప, శూన్యం నుంచి వస్తూత్పత్తి సాధ్యం కాదని కూడా సాంఖ్యం అన్నది (నా వస్తునో వస్తు సిద్ధి : 1-78). దీన్నే గ్రీకు దార్శనికుడు ఎంపిడోకిల్స్ something cannot out of nothing అన్నాడు. ఆ విషయాన్ని ఆధునిక విజ్ఞానం రుజువులతో సూత్రీకరించిన law of conservation of mass ధృవపరుస్తుంది. దేన్నీ సృష్టించడం కానీ, నాశనం చేయడంకానీ ఏ ప్రక్రియవల్లనూ సాధ్యంకాదు. మనం సాధించగలిగేదంతా ప్రకృతి నియమాలను అనుసరించి ఒక వస్తువు నుంచి మరో వస్తువును తయారుచేయడం. శూన్యం నుంచి సృష్టి చేయవచ్చుననే సూత్రం వాస్తవ విరుద్ధం. కాబట్టి, ఈ ప్రపంచాన్ని దేవుడనే వాడొకడు శూన్యం నుంచి సృష్టి చేశాడని ప్రతి మతమూ చెబుతున్న ప్రారంభ వాక్యం అసత్యాన్ని చెబుతున్నదన్నమాట. ఈ అబద్ధాన్ని నిరాకరించడమంటే, అన్ని మతాలనూ నిరాకరించడమే. అందుకే హేతువాదం అన్ని మతాలనూ నిరాకరిస్తుంది. దైవం, బ్రహ్మం, ఆత్మ వగైరాలు వస్తుతః లేనివి కాబట్టే, వాటిని గురించిన జ్ఞానం ఎవ్వరికీ లభ్యం కావడంలేదు. అందువల్లనే, వాటికోసం వేలాది సంవత్సరాలుగా వెదకటం జరుగుతున్నది తప్ప. అవి దొరకడమనేది జరగడంలేదు. ఒకసారి దొరికితే మరి వెతకనవసరం లేదు. ఒకసారి ఒకరికి దొరికినదాన్ని గురించిన జ్ఞానం లభ్యమయితే, అజ్ఞానాన్ని ఇతరులకు పంపిణీ చేయడం కష్టంకాదు. ఇది హేతువాదం గుర్తించిన సత్యం.

హేతుత్వ శక్తి ప్రతి మానవుడికీ ఉంది. కొందరిలో లేనిదల్లా దాన్ని సక్రమమైన విజ్ఞానంతో సమన్వయం చేసే మెలకువ. ఇందుకు కారణం అలసత్వం కావచ్చు. అశ్రద్ధ కావచ్చు. సోమరితనం కావచ్చు. పజ్ఞాలోపం కావచ్చు. కాని, అన్నిటికంటె ముఖ్యకారణం వైమనస్యత. మానసిక పరాధీనత. సమాజంలోని అధిక శాతం ప్రజలు మానసిక పరాయీకరణంతో బాధపడుతున్నారు. వారి మనస్సులు వారి వద్ద ఉండవు. ఏ మతానికో, సిద్ధాంతానికో, ప్రవక్తకో, బాబాకో, నాయకుడికో, తాకట్టు పెట్టబడి ఉంటాయి. వారు చెప్పిన అంశాలు ప్రాతిపదికగా తర్కించడం కొనసాగిస్తారు తప్ప, స్వతంత్రాలోచన చేయరు. భావస్వాతంత్ర్యం చెలాయించుకోరు. విబంధంగా ఆలోచించరు. వారి హేతుత్వం నివురుకప్పిన నిప్పులా ఉంటుంది. అందువల్ల, వారి ఆలోచనా శక్తికి పట్టిన గ్రహణాన్ని వదలించాలంటుంది హేతువాదం.

మన హేతుత్వ శక్తిని సక్రమమైన జ్ఞానంతో సమన్వయం చేయడం మనం అలవరచుకోవాలి. సక్రమమైన జ్ఞానం ఎక్కడ ఉంది? మత గ్రంథాల్లో కాదు, ఆధునిక విజ్ఞానశాస్త్రంలో ఉంది. మతగ్రంథాల్లోని అజ్ఞానానికి విరుద్ధంగానే ఆధునిక విజ్ఞానశాస్త్రం బయలుదేరింది. సత్యానికి దగ్గర మదింపువేసి ఆవిష్కరించగలిగేది ఆధునిక విజ్ఞానశాస్త్రం మాత్రమే. ఆధునిక విజ్ఞానశాస్త్ర చరిత్రను అర్థం చేసుకొంటే, అది క్రమాభివృద్ధిగా తప్పుల్ని సవరించుకొంటూ ఒకవైపు చేరుతున్నట్లు తెలుతుంది.

ఇందుకు అనేక ఉదాహరణలు చెప్పుకోవచ్చు. ఖగోళ విజ్ఞానంలో తనకు ముందటివారు చేసిన తప్పుల్ని కోపర్నికస్ సవరించాడు. అతని తప్పుల్ని కెప్లర్, ఇంకా ఇతరులు సవరించారు. తనకు ముందటివారి తప్పుల్ని భౌతిక విజ్ఞానంలో న్యూటన్ సవరించాడు. అతని తప్పుల్ని ఐన్‌స్టీన్, ఇంకా ఇతరులు సవరించారు. అలానే జీవశాస్త్రంలో తనకు ముందటివారి తప్పుల్ని లామార్కు సవరించాడు. అతని తప్పుల్ని డార్విన్, ఇంకా ఇతరులు సవరించారు. అన్ని విజ్ఞానశాస్త్ర శాఖల్లోనూ, నిత్యమూ సవరణలు జరుగుతూనే ఉన్నాయి. ఒకరిని మించి మరొకరు అధికమైన, ఇంకా స్పష్టమైన వివరణలీయడానికి వీలుగా, ఎప్పటికప్పుడు సత్యానికి దగ్గరి మదింపుగా విజ్ఞానాన్ని వెలువరిస్తున్నారు. అది శాస్త్రపద్ధతి. అదే హేతువాద పద్ధతి. ఒకే అంశంపై విభిన్న వివరణలిచ్చిన శాస్త్రజ్ఞుల మధ్యనైనా, ఏనాడూ తగాదా జరగలేదు. శాస్త్రజ్ఞుడికి సత్యం వెలువడాలన్న తపన తప్ప, తాను ప్రతిపాదించిన సిద్ధాంతమే నెగ్గాలనే మొండి పట్టుదల ఉండదు. సత్యంపట్ల మక్కువ కలవారి రీతి అది. అందువల్ల, హేతువాదం శాస్త్రీయ సత్యాన్ని ఆలంబన చేసుకొంటుంది.

ఇప్పుడు మతాన్ని శాస్త్రంతో పోల్చి చూడండి. ప్రతి మతమూ తాను చెప్పినవి పరమ సత్యాలంటుంది. అవి అసత్యాలని నిర్ధారించబడినప్పటికీ, అవే సత్యాలని పట్టుకు వేలాడుతుంది. వాటి రక్షణ కోసం ఆ మతవిశ్వాసుల్లో ఆవేశోద్వేగాలను రెచ్చగొడుతుంది. ఫలితంగా భిన్న మతాలమధ్య, భిన్న శాఖీయుల మధ్య పోరాటాలు పెచ్చరిల్లుతాయి. అలా హిందువులు, ముస్లిములు, క్రైస్తవులు పరస్పరం యుద్ధాలకు దిగడమేకాక, ఆ మతాల్లోని భిన్న శాఖలవారు సైతం పరస్పరం పాశవికంగా పోరాడుకున్న సందర్భాలున్నాయి. హిందువుల్లో కులాల మధ్య కూడా అలాంటి రగడలున్నాయి. అసలేమి జరుగుతుందంటే, మతస్థుల్లో మనిషి మృగ్యమవుతాడు. అలానే కులస్థుల్లోనూ మనిషి ఉండడు. అతనికి జైవిక వారసత్వంగా వచ్చిన హేతుత్వాన్ని తర్కంగా మార్చి, తన మతాన్నీ, ఆ మతం చేసే తప్పుల్నీ, ఆ మతస్థుడిగా తాను చేసే అత్యాచారాల్నీ సమర్థించుకోవడానికి ప్రయత్నిస్తాడు. అతనికి సత్యంతో పనిలేదు. మానవతతో పనిలేదు. మతంతో అతను తాదాత్మ్యం చెందుతాడు. అందువల్ల, ఆ మతస్థుణ్ణి భావబానిసత్వం నుంచి విముక్తి చేసి మనిషిగా మార్చాలి. అందుకు అతని వివేకానికి పదునుపెట్టమంటుంది హేతువాదం.

ఆధునిక విజ్ఞానం గురించి, దాని తాత్విక ఫలితాల గురించీ తగాదా లేవదీయడం మతవాదులకొక సంప్రదాయంగా మారింది. వివిధ శాఖల్లో మనం ఆర్జించే విజ్ఞానాన్ని విజ్ఞానశాస్త్రం క్రమబద్ధం చేసి సూత్రీకరిస్తుంది. తద్వారా ప్రకృతిలో ఉన్న సర్వాన్నీ, మానవుడితోసహా సరైన పద్ధతిలో అవగాహన చేసుకోవడానికి, ఆ అవగాహనను మన జీవన తత్వ నిర్ణయంలో వినియోగించుకోవడానికి వీలవుతుంది. అయితే, శాస్త్రీయ విజ్ఞానాన్ని అన్వయించి మన భౌతిక జీవన పరిస్థితుల్ని మెరుగుపరచడానికి సాంకేతిక విజ్ఞానం బయటికి వచ్చింది. నిజానికి, శాస్త్రవిజ్ఞానంలో నుంచి సాంకేతిక విజ్ఞానం వచ్చినప్పటికీ, అవి రెండూ ఒకటి కావు. ఇందులో మొదటిది సత్యాన్ని వెలువరించేది. కాగా, రెండవది వినియోగాత్మకమైనది. ఈ శతాబ్ది ప్రథమార్థం చివరి భాగంలో అణుబాంబులు, విషబాంబులు తయారు చేసే ప్రక్రియను దేశాల రాజకీయ నాయకులు, వారి సైనిక నిపుణుల ద్వారా అమలుచేసి ప్రపంచాన్ని భీతిగొల్పారు. వాటి ప్రయోగంవల్ల మానవాళికి, జీవకోటికి చాల హాని జరిగే మాట నిజమే. కాని అందుకు శాస్త్రాన్ని నిందించటం సరైన పద్ధతి కాదు. మానవ సంక్షేమం కోసం ఉద్దేశించిన రాజకీయ సిద్ధాంతాలనుసైతం వ్యవస్థీకరించి, మతాలుగా మార్చి, జాతి మత వర్గ విద్వేషాలను రెచ్చగొట్టి, మానవజాతిని వినాశనపుటంచులకు లాగుతున్న రాజకీయ నేతలపై ఆ నింద మోపాలి. సత్యం నిష్ఠురమైనది. అయినా, విజ్ఞానశాస్త్రం సత్యదర్శనం చేయడం మానదు. హేతువాదం సత్యదర్శనంతో ఆగదు. మానవజీవన దర్శనం చేయడానికి మానవవాదంవైపు సాగుతుంది. ఈలోగా మజిలీలు చాలా ఉన్నాయి. మజిలీలనే హేతువాదంగా చిత్రించడం సరైన పద్ధతి కాదు.

ఈ ప్రసంగ పత్రంలో ప్రాచీన దర్శనాల నుంచి కొన్ని వాక్యాలు కావాలని కోట్ చేశాను. అవి ప్రమాణాలని కాదు. ముందే చెప్పినట్లు, హేతువాదం ఏ పరమ ప్రమాణాలనూ అంగీకరించదు. పెరుగుతున్న విజ్ఞానాన్ని ఆలంబనం చేసుకొని పరిణామం చెందుతుంది. ఆ లక్షణం దేశకాలాలకు పరిమితం కాదని చూపడానికే నేను ప్రాచీన దార్శనికుల్ని కోట్ చేయడం జరిగింది. భారతీయ తత్వశాస్త్రం ఎవరి నుండి వారసత్వాన్ని స్వీకరించవలసివుందో వారినే కోట్ చేశాను.

*మిగతాది 49వ పేజీలో...*

# అతి ప్రాచీన రాజధాని బోధన్

*- కందకూర్తి యాదవరావు*

ఇందూర్ – నిజామాబాద్ జిల్లాలో అందరికన్న ఎక్కువ చరిత్రగల నగరం బోధన్ రుజువు అయి ఉన్నది. ఇది 4 నుండి 5 సార్లు రాజధానిగా నిలిచినది.

భారతదేశంలో త్రేతాయుగంలో శ్రీరామచంద్రునికన్నా ముందు ఇక్ష్వాకు సూర్యవంశంలో పుట్టిన వృషభదేవుడు చక్రవర్తిగా ఉన్నాడు. అతడు మోక్షగామి అయి రాజ్యం వదిలివేశాడు. అందుకే జైన మతంలో అతను మొదటి తీర్థంకరుడు నిలిచినాడు. ఇతడు తన కూతురు బ్రాహ్మి (కుమారి) పేరిట బ్రాహ్మిలిపిని స్థిరపరచినాడు. ఇంకను ఆసి (వృత్తులు), మసి (వ్యాపారం), కృషి (వ్యవసాయం) ప్రజలకు నేర్పి, అలవర్చి సుసంపన్న నాగరికులుగా మార్చిన ఆద్యుడు అని జైనసాహిత్యం పలుకుచున్నది. అతనికి ఎక్కువ సంతానం ఉన్నప్పటికీ మొదటి ఇద్దరు యువరాజులు 1. భర్తుడు, 2. బాహుబలి ముఖ్యులు. వృషభుడు ఉత్తర భారతానికి భరతుడి రాజ్యంగా ఇచ్చెను. అతని రాజధాని అయోధ్య, దక్షిణ భారతానికి బాహుబలిని రాజ్యంగా ఇచ్చెను. అతని రాజధాని పోదనపురం. అది నేటి మన బోధన్. వృషభుడు హిమాలయానికి వెళ్లి తపస్సుతో మోక్షగామి అయ్యెను. ఇది అన్ని పురాణాలలో ఉంది. జైన సాహిత్యంలో ఇంకను అధికంగా గలదు. బౌద్ధ సాహిత్యంలో పొత్తలి, పోతన, పోదన, బోధన్, బహుధాన్యపురం, మంజరిక మండలం బోధన్‌కు పేర్లు లిఖించియున్నవి. పద్మపురము, ఏకచక్రపురం కూడ.

ఈ భరతుడు మన దేశంలోని అన్ని స్థానిక రాజులను గెలిచి, తనను చక్రవర్తిగా సమ్రాట్ చాటిచెప్పెను. కాని బాహుబలికి దక్షిణాధిపతిగా రాజ్యం ఉన్నందున అది చెల్లదు అని తెలినది. కావున యుద్ధానికి భరతుడు బోధన్‌కి తన ధర్మచక్రంతో సహా వచ్చెను. అన్నదమ్ముల కోరిక కోసం సైన్యం వాడరాదు. తమరు ఇద్దరూ కలసి మల్లయుద్ధము చేయండి అని మంత్రిమండలి చెప్పిరి. ఆ మల్లయుద్ధంలో బాహుబలి గెలిచెను. ధర్మచక్ర శాస్త్రం కూడా వారిపై ఏమీ చేయక ఇక్కడే అది నిలిచిపోయెను. ఇట్లు భారతదేశాధిపతి బాహుబలి అయినారు. రాజధాని పోతన భారతదేశానికి రాజధానిగా నిలచినది. మన బోధన్‌కి ఎంత గొప్ప కీర్తి ఇచ్చిందో చూడండి.. తదుపరి బహుబలికి పశ్చాత్తాపం కలిగి, తన పెద్ద యువరాజు హక్కు లాగుట మంచిది కాదని భావించి, కొంత కాలం తరువాత వారే చక్రవర్తి అని ఒప్పుకొనెను. జైనుల ధర్మచక్రం ఇక్కడే నిలిచిపోయెను. కావున జైనులకు ఇది కాశీసమానం. బోధన్ పుణ్యభూమి అని పంపుడు వర్ణించియున్నాడు. వృషభపుత్ర భరతుడు మొదటి చక్రవర్తి. కావున మనదేశమును భారతదేశమని పేరు ప్రతిష్ఠ కలిగినది. తదుపరి శకుంతల దుశ్యంత కుమారుడు భరతుడు వలన కూడా ఇదే పేరు బలపడినది. ఇది అంతయూ బాహుబలి పురాణంలో మరియు మన పురాణాలలో వ్రాసియున్నది. ఇట్లు మొదటి బోధన్ రాజధాని మహత్త్వము కలిగియున్నది.

అస్సక అశ్మక జనపదం దక్షిణ భారతదేశంలో ఒకే ఒకటి పెద్ద రాజ్యంగా వెలసినది. ఉత్తర భారతంలో 15 జనపద రాజ్యాలు పేరుగాంచి, చరిత్రలో నిలచినవి. అస్సక నది నాందేడ్ వద్ద గోదావరిని కలుస్తుంది. కావున అస్సకరాజ్యం అయినది. ములానదివద్ద ములకజాతి ఉండెను. అది పైఠన్ వద్ద కలదు. అశ్మకుల రాజధాని బోధన్ నగరం కలదు. దీన్ని చరిత్రకారులు వర్ణించుచున్నారు. వీరి సైన్యం మహాభారత యుద్ధంలో పాండవుల తరపున పాల్గొన్నవారు అని మహాభారతంలో వర్ణించియున్నది. అశ్మకులను శాతవాహనులు ఓడించినారు అని విద్యాభవన్ చరిత్ర మొదటి ఖండములో నోట్ కలదు. వీరి చరిత్రపై ఎన్నో వ్యాసాలు వ్రాయబడినవి. వీరి నాణాలు నాందేడు వద్ద లభించినవి. దానిపై వ్యాసం శ్రీ సముద్రగుప్త పాటిల్ గారు వ్రాసిన ఆధారం కలదు. వీరి రాజ్యంమోనోగ్రాం నాగ్‌పూర్ నివాసి చరిత్రకారుడు ప్రసిద్ధి చేశారు. వారి రాజ్యం కృష్ణ గోదావరి మధ్యలో సాగినది అని తెలియుచున్నది. శాతవాహనులు

అశ్మకులను గెలిచి, బోధన్‌ను పాలించిరి అని ఆధారాలు కలవు. రాజధాని పాలించిన రాజు నాందేడ్ జిల్లాలోని ఖంధార్ పురవరాధీశులు, రాష్ట్ర కూటులతో కలసి బోధన్ చాళుక్యులు యుండిరి. వీరి చరిత్ర స్వతంత్ర గ్రంథంగా వ్రాసియున్నదానిని సవిస్తరంగా ఇందూర్ వైభవము గ్రంథంలో సాయిరెడ్డి గారు చూపినారు. ఈ రాజులలో 2వ అరికేసరి ఆస్థానంలో పంప మహాకవి మరియు భవభూతి సంస్కృత నాటకాల రచయిత వీరి దర్బార్‌లో యుండిరి. పంపడు సమాధి బోధనలోగలదు. వారు కన్నడ భాషకు ఆదికవి. ఇతని రచనతో ప్రేరణ పొంది, నన్నయ్యగారు తెలుగు ఆద్యగ్రంథము మహాభారతం తెలుగులో రచియించి తెలుగు జాతికి ఆద్యుడుగా నిలిచియున్నారు. ఈ బోధన్ చాళుక్యులు చివరి రాజులు. వేములవాడ నుంచి రాజ్యం చేసియుండిరి.

ఖంధార్ రాజుల పతనానంతరం వారి వంశస్తులు ఒకరు కాకతీయులుగా వరంగల్ వెళ్లి కాకతీయ వంశ నామముతో పైకి వచ్చెను అని ప్రతాప రుద్ర చరిత్రయందు మరియు శివయోగి సారం గ్రంథమున వ్రాసియున్నవి. మహ్మద్ తుగ్లక్ కాకతీయులను ఓడించుటకు పోతూ వస్తూ బోధన్‌లో బసచేసి ఇచ్చటి వంద స్తంభాల గుడిని తన కురాన్ కల్మవ్రాసి పెట్టి పోయెను. 1665 వందల చివరి కాలమున ఔరంగజేబు గోలకొండకు పోతూ వస్తూ 3 సార్లు పాండవ చెరువు వద్ద బోధన్‌లో బసచేసి యుండెను. నెలరోజులు మకాము యుండెను అని ఆధారాలు కలవు. ముందు ఇందూర్ ఒక చిన్న కసుబ (పెద్ద గ్రామము). దీనిని ఇందూర్ – బోధన్‌గా గుర్తుతో బైట ప్రదేశీయులకు తెలుసు. అనగా బోధన్ కీర్తి పతాక చరిత్రలో అనాదినుండి యుండెను. నేడు కూడా ఆసియా ఖండంలో మొదటి పెద్ద చక్కెర కర్మాగారం కొరకై మరియు ధాన్యాగారం అని పేరుప్రతిష్ఠ కలదు. ఇచ్చట అశ్మకుల రాజులు నిర్మించిన మట్టికోట పేరుగాంచి, దానిని చాళుక్యులు వికసింపజేసియుండిరి. ఇచ్చట, నేటి ఏకచక్ర దేవాలయం కూడా ప్రాచీన చరిత్రకు తోడుగా ఉన్నది. ఇచ్చటి శిలాశాసనాలు చదవడానికి వీలు కాక మట్టిలో మాయం అగుటకు నేను దుఃఖించుచున్నాను. ఇచ్చట త్రవ్వకాలు సరిగ్గా సాగలేవు. శాతవాహన కాలపు 30 పెద్ద నగరాలలో బోధన్ కూడా కలదు. కోటిలింగాలు, ధాన్యకటకము, బుద్ధస్తూపాల నగరాలు కలసి 30 గలవు.

**కందకూర్తి యాదవరావు,**
**చరిత్ర పరిశోధకుడు**
**నిజామాబాదు. ఫోన్ : 964 041 1849**

---

*47వ పేజీ తరువాయి...* **బుద్ధుడు – మానవతా దృక్పథం**

వారింకా చాలా చేసి ఉండవచ్చు. లేక, వారి గ్రంథాల్లో ఎవరైనా తమ సొంత భావాలను ప్రతిక్షేపించి ఉండవచ్చు. వాటితో మనకు నిమిత్తం లేదు. ఆధునిక హేతువాదులు, లౌకికవాదులు ఆలోచించే తరహాలో రెండు సహస్రాబ్దాలకు పూర్వం కణాద, కపిల, గౌతమాదులు ఆలోచించారంటే, వారి భావాల ఔచిత్యాన్ని హేతువాదులు మదింపు వేయక తప్పదు. కాని, వారి ఆలోచనల్ని భూపాతం చేసి, వేదాంతాన్ని భావ దాస్య శృంఖలాలలో బంధించి, జ్ఞాన పునర్వికాసాన్ని అడ్డుకొని, మత పునరుజ్జీవన ధోరణిని పెంచినవారిని హేతువాదం ఉపేక్షించదు. వారినీ వారి వాదాలనూ, ఆ వాదాలకు మూలమైన సాహిత్యాన్ని క్షోదక్షమంగా పరిశీలించి, వాటిపై విమర్శలను గుప్పించి, ప్రజల ముందు ప్రదర్శించడం హేతువాదుల ప్రథమ కర్తవ్యం. ప్రజల్లో విమర్శక ప్రజ్ఞ క్షీణించి ద్వంద్వ వ్యక్తిత్వం ప్రదర్శితమవుతున్నది. వారు తమ తప్పును గుర్తించజాలని స్థితికి చేరుకున్నారు. అందువల్ల హేతువాదం కేవలం శాస్త్రీయ దృక్పథాన్ని వెల్లడించడంలో మిన్నకుండదు. నెగెటివ్‌గా మత మౌఢ్యాన్ని విమర్శిస్తుంది. పాజిటివ్‌గా శాస్త్రీయ వైఖరిని వివరిస్తుంది. ప్రాచీన దార్శనికుల నుంచి గ్రహించే మంచిని మానవ వారసత్వంగా పరిగణిస్తుంది. అది మతాల సొత్తు అని అంగీకరించదు. ఒక దార్శనికుడు చెప్పిన ఒక సూత్రాన్ని అంగీకరించినంత మాత్రాన, ఆ దార్శనికుడు చెప్పిన చెత్తాచెదారాన్నంతా అంగీకరించాలని లేదు. వాటిలో ఏవి ఎంతవరకు హేతుబద్ధమో వాటిని అంతవరకే మనం ఆమోదిస్తాం. ఎందుకంటే, వారు చెప్పిన వాటిలో అశాస్త్రీయమైనవీ, స్వయం విరుద్ధమైనవీ కూడా చాలా ఉన్నాయి. అయినా, కొన్ని మౌలిక విషయాల్లో వారు స్వతంత్రంగానూ, హేతుబద్ధంగానూ ఆలోచించారనే విషయాన్ని ఆధునిక హేతువాదరీతి పరిగణలోకి తీసుకొంటుంది. అది చారిత్రక రీతి.

# గోవు - గోపాలుడు

## (జెన్ కవిత)

*- వావిలాల సుబ్బారావు*

బౌద్ధశాఖలలో జెన్‌కు విస్తృత ప్రచారం ఉంది. బౌద్ధం ధ్యాన ప్రధానమే అయినా జెన్‌లో ధ్యానం సర్వప్రధానం కావటం వల్లనేమో ఎక్కువమంది ఆసక్తి చూపుతారు. "బోధి ధర్మ"డనే బౌద్ధ గురువువల్ల ధ్యాన ప్రధానమయిన అభ్యాసం మొదట చైనా దేశంలో ప్రవేశించింది. అక్కడి భాషోచ్చారణకు అనువుగా వారు దాన్ని "చాన్" అన్నారు. అక్కడ నుంచి జపాన్ దేశానికి విస్తరించి అదే 'జెన్'గా పేరు తెచ్చుకుంది. ఇప్పుడు 'జెన్' అనే మాటే సర్వత్రా వ్యాప్తిలో ఉంది. కాని అది ధ్యాన శబ్దానికి పర్యాయ పదం కాదు. ఒక ప్రత్యేక పద్ధతి ధ్యాన విధానంగా 'జెన్' పదం స్థిరపడింది. చైనా, జపాన్ దేశాల సంస్కృతిని, సాహిత్యాన్ని ఈ జెన్ చాలా ప్రభావితం చేసింది.

జెన్ కవితలకు ప్రధాన వస్తువు మనస్సే. ప్రకృతి మనస్సుల పరస్పర ప్రభావాలు - చిత్త ఏకతాస్థితి, శూన్యతానుభవం వీటిలోని ఏదో ఒక దశను వస్తువుగా చేసుకుంటారు రచయితలు. ''సత్యాన్ని అన్వేషించకు. ఆలోచనలను వదిలెయ్ చాలు" అన్న వాక్యం జెన్ దృక్పథాన్ని తెలుపుతుంది. ఒక కవి "తనను తాను తెలుసుకోవటమే బుద్ధ ధర్మం తెలుసుకోవటమంటే - తనను తాను తెలుసుకోవటమంటే తనను తాను మరచిపోవటమే. తనను తాను మరచిపోవటమంటే అనంత విస్తృతి గల విశ్వాన్ని ఎరగటమే" అంటాడు. ఈ పద్యంలో వాళ్ల చిత్త సాధనాక్రమం అర్థం అవుతుంది.



జెన్ సాధకులకు ధర్మగ్రంథాలు చదవటం - చర్చించటంకన్నా, ధ్యానసాధన, అనుభవసిద్ధి ముఖ్యం. పరమార్థ నిర్ణయంలో ఆచార్య నాగార్జునుడు ప్రతిపాదించిన శూన్యతనే వీళ్లూ ఆమోదిస్తారు. సమాధి విషయాలయిన వ్యాయామము - స్మృతి, సమాధులలోని చిత్తస్థితులు వీరి రచనలలో మిక్కిలిగా వర్ణించబడతాయి. బయటకు, లోపలకు జరిగే సంవాదమే మనస్సు. కనుక మనోచిత్రణలో ప్రకృతి అనివార్యమవుతుంది.

చిత్తవిషయాలను ప్రతీకలలో వర్ణించటము - మనోధర్మాలను వర్ణించటం జెన్ సాహిత్య ప్రధాన స్వభావం. వర్ణనకు ప్రతీకలను సాధనంగా తీసుకున్నప్పుడు అన్యాపదేశం, దీర్ఘరూపకం వంటి కవితాశిల్పాలు రూపొందుతాయి. చెప్పదలచిన అంశాన్ని మరొకదానిపై ఆపాదించి చెప్పటమే అన్యాపదేశం.

పరిపరివిధాల సంచరిస్తూ అదుపుకు రాని మనసును శిక్షణ లేని ఎద్దుగా, దాన్ని దారికి తెచ్చుకొనే సంకల్ప యత్నాలను గోపాలునిగ భావించి, కవితా రచనలు చేశారు కొందరు. ప్రతీకలు అవ్వే అయినా మనోదశలలోని విభిన్నతను, సాధనా క్రమంలోని వైవిధ్యాన్ని, లక్ష్యాలను ఒక్కొక్కరు ఒక్కొక్క రీతిగా వర్ణించారు.

ఒక చిత్రకారుడు జెన్ సాధన దశలను పది రేఖాచిత్రాలుగా రూపొందించాడు. అవిగూడ ప్రసిద్ధమయినాయి. పశువును, గోపాలుని ప్రతీకలుగా తీసుకొని కవితలు వ్రాసిన మరికొంతమందిగూడ ఈ చిత్రాలను తమ రచనలతో కలిపి ప్రకటించారు. అవి "పశుల కాపరి పదిచిత్రాలు" అన్న పేరుతో ఎప్పుడో 16 వ శతాబ్దిలోనే ప్రసిద్ధమయినాయి.

జెన్ కవితల రచనా శిల్పంలోని ప్రధాన గుణం, సరళత.

చటులాలంకారాలు, శబ్దాడంబరాలు ఉండవు. ప్రకృతి ఎంత సరళసుందరంగా, సహజంగా ఉంటుందో కవిత్వంలాగూడ, సాహిత్యాలంకార సామగ్రి అంత సరళంగా ఉంటుంది. అందువలన నిఘంటువులు వెతకనక్కరలేని భాష శబ్ద సామ్యాల వంటకు మసాలాలు లేని కూర్పు ఉంటుంది.

స్వాధీనం కావలసిందీ మనస్సే. అందుకు ప్రయత్నించేదీ మనస్సే. సంచరించే మనస్సుకు, స్వాధీన ప్రయత్నం చేసే బుద్ధికి మధ్య ఉండే సంభాషణే సమ్యక్ వ్యాయామం. మనసు స్వాధీనం అవుతున్నట్లే ఉంటూ దారి తప్పుతుందేమోనన్న జాగ్రత్తే సమ్యక్‌స్మృతి. ఆ పైపై దశలు సమ్యక్ సమాధి. రెండుగా విడిపోయిన మనస్సే ఈ కవితా రచనలకు వస్తువు. విశృంఖల మనస్సుకు కఠిన శిక్షణ ఇచ్చుకోవాలన్న సంకల్పమే పశువుల కాపరి. శ్వాస ప్రక్రియే ముక్కుకు వేసిన తాడు (పలుపు). తక్కినదంతా విపస్సనా ధ్యానసాధనే. ప్రథమ దశలోని మనోమాలిన్యాలను చిత్రకారుడు నల్లని ఎద్దుగా చిత్రించాడు. క్రమంగా ఎనిమిదవ పద్యం వద్దకు వచ్చేసరికి, ఎద్దు పూర్తిగా తెల్లనయినట్లు చూపాడు. అది శుద్ధచిత్తం.

ఆలోచనల విశృంఖలత, రాగద్వేషాల మొరటుతనం, నిర్దిష్ట గమ్యం లేని సంచారం, సున్నితమయిన మంగళకరమయిన భావాలను అణచివేసే నిర్లక్ష్యం మొదలయినవి మొదటి పద్యంలో సూచించబడ్డాయి.

శ్వాసమీద మనసు నిలుపగలగటం, నిరంతర జాగరూకత, రెండవ పద్యంలోను, సుదీర్ఘ కాలం సాగే యత్నం, మనసు శ్వాసపై నిలపటం మూడవ పద్యంలోను వివరించాడు.

ధ్యానం అంటే, రోజూ నియమంగా, నిర్ణీత సమయంలో కళ్లు మూసుకుని చేసే, మౌన సాధన మాత్రమే కాదు. జాగృతిలో ఉన్నంతకాలం నిర్విరామమయిన స్మృతి వ్యాయామంతో ఉండటమే ధ్యానమంటే. ఎన్నో ఏండ్లు చేయవలసిన ఆ సాధనను నాల్గవ పద్యంలో ఉంచాడు.

ఆదమరిస్తే మనసు పారిపోతుంది. మనసులోని అలలు తగ్గి, సుఖస్థానానికి చేరటమే ఇంటిదారి పట్టటమంటే. ఆలోచనలు ఆగినట్లు గుర్తించినపుడు, శ్వాసమీద ధ్యాస సడలుతుంది. అదే మనసును వదలటం. అప్పుడు తెలియని దృశ్యాలు స్పష్టాస్పష్టంగా, అసంకల్పితంగా తెరపైకి వస్తుంటాయి. ఈ దశ ఇంకా ముందరి గమ్యంవైపుకు నడిపిస్తుంది (5వ పద్యం).

మనసుకు సంచారం ఆగింది. శిక్షణ యత్నాన్ని ఆపింది బుద్ధి. వితర్క విచారాలు అన్న దశలు ఆగిపోయాయి. ఇప్పుడు ప్రీతిసుఖాలు ప్రారంభమవుతాయి. సాధనలో ప్రసన్నత కలిగి, ఇష్టం కగటమే "ప్రీతి". ఆ స్థితిలో మనసుకు స్థిమితమయిన సంతోషం కలగటం ''సుఖం''. ఈ దశలో కాలాలు వినపడతాయంటారు యోగులు. అదే శాంతిగీతం పాడుకోవటం (6వ పద్యం).

ప్రీతిని దాటి "సుఖం"లోకి ప్రవేశించాక, కాలగమనం తెలియదు. మానసిక కాలం ఆగిపోతుంది. అయినా 'సుఖం' తెలుస్తున్నది గనుక మనసు మేలుకొని ఉన్నట్లు అనుకోవాలి (7వ పద్యం).

మనసుకు ఆలోచనా సంచారం లేదు గనుక, అకుశల భావనలు లేవు. స్వచ్ఛమయిన శాంతితో ఉంది. కనుక పసరం తెల్లబడింది. బుద్ధికి ఇక ప్రయత్నం లేదు. చిత్రకారుడు మొదటి చిత్రంలో నల్ల ఎద్దును చిత్రించాడు కాని పద్యంలా అట్లే వర్ణించలేదు. ఎద్దు క్రమంగా తెల్లపడ్డట్లు చిత్రించటం చిత్రకారుడు అదనంగా చేర్చిన వివరణ (8వ పద్యం).

సంపూర్ణ ఆనంద స్థితిలో ఉన్నది మనస్సు. తన అస్తిత్వం, అనుభవం తెలుస్తున్నాయి. "తాను" – "తెలియటం" అన్న రెండు ఇంకా వేరుగానే ఉన్నాయి. 'గోడ' మిగిలే ఉంది (9వ పర్యం).

**పశువు – పశుపాలుడు – పది దృశ్యాలు**

(జపాన్ భాషలో "కకు–ఆన్‌షి" అనే కవి "పశువుల కాపరి పది చిత్రాలు" అనే శీర్షికతో పది పద్యాలు వ్రాశాడు. అతని సమకాలికుడే అయిన మరొక కవి "సెయ్‌క్యో" గూడ జెన్ బోధనలను వ్యక్తం చేయటానికి పశువు – కాపరి పోలికతో పది పద్యాలు వ్రాశాడు. పశువు క్రమంగా తెల్లపడటాన్ని ముగింపులో శూన్యలక్ష్యాన్ని ఇతడు చిత్రించాడు. వాటినే ఇక్కడ అనువాద రూపంగా కూరుస్తున్నాను. నాకు ఇంగ్లీషు అనువాదమే ఆధారం.)

1. *పొడుచుకొచ్చి, దడపెట్టే కొమ్ములతో గాలిలోకి బుసలు కొడుతున్నది పసరం*
   *కొండ దారులబడి, దూరదూరంగా, అడ్డదిడ్డంగా పరుగెడుతున్నది వెర్రెక్కి*
   *ఆ లోయ మొగదల అడ్డంగా కమ్ముకున్నది కారుమబ్బు దట్టంగా*
   *ఎవరికెరుక దాని మొరటు గిట్టలబడి మెత్తని లేత మూలిక లెన్ని నలిగాయో?*

2. నారవెంట ఒకటి నా చేతిలోనే ఉన్నది. దాని ముక్కుకు వేశాను తాడును
తీవ్రంగా గుంజుకున్నదొకసారి, తెంచుకు పారిపోదామని - దాన్ని బలంగా చరిచాను మళ్ళీమళ్ళీ
శక్తినంతా కూర్చుకొని మచ్చికకు లొంగదా పశువు - మొరటుతనం అదుపుండదు. దాని గుణమే అంత
పలుపు సడలించలేదు.. కొరడాతో చరచటానికి సంసిద్ధం ఆ గోపుడు

3. నిదానంగా అలవార్చుకు లొంగుతూ ముక్కు దారిన నడవ సిద్ధమయిందాపసరం
వాగులు దాటుతు, కొండ దారినబడి అడుగులో అడుగేస్తూ ముందు వానిని అనుసరిస్తున్నది
బిగుతు వదలక పట్టె ముకుతాడును - పట్టు తప్పించుకోనివ్వలేదు కాపరి
దినమంతా గడపెను ఎరుకతో - ఆలసటే తెలిసినట్లు లేదు

4. ఎన్నాళ్లో అలవార్చుగ ఫలితం అందివచ్చింది. పసరం వెనుదిరిగింది
అలు పెరుగని ఆటవిక నైజం చెదిరిపోయింది. చివరకు సాధువయింది
అయినా లొంగదీసేవాడింకా దానిపై పూర్తిగా నమ్మకముంచలేదు
చెట్టుకు ఎద్దును కట్టిన వెంటనే చేతనెపట్టి ఉంచాడు పదిలంగా.

5. పచ్చని తోపులనీడల, పురాతన కొండవాగు తీరాల,
పసరాన్ని ఇష్టానికి వదిలాడు, దాని సుఖం వెతుక్కొనగ
పొద్దుగూకు సమయం, పచ్చిక బయలుపై పొగమంచు జారేవేళ,
నిదానంగా పసరం వెంట నడవగా ఇంటిదారి పట్టాడు గోపుడు

6. ఆ పచ్చిక మైదానంపై తనివి చెందిన ఆ యెద్దు మేను వాల్చి కాలక్షేపం చేస్తున్నది
కొరడా దెబ్బలు, అరుపులు, మందలింపులు అక్కరలేదిపుడు
తీరుబడిగా కూర్చున్నాడా గోపాలుడు గూడ, ఆ పెద్ద చెట్టు నీడన
పొంగి పొరలే సంతోషంతో శాంతి గీతం పాడుకుంటూ.

7. ఆ సాయం వేళలో, చెట్లు బారులు తీరిన తీరాన్ని, సోమరిగా ఒరసి పారుతున్నది ఉబికి వచ్చే సెలయేరు
ఆ మసక మసక వేళ, మైదానంపై పచ్చిక పెరుగుతున్నది దట్టంగా
ఆ గోబాలుడు గంటలకొద్దీ ఏమీ గమనించక చెట్టుపై కునుకుతుంటే,
ఆకలి వేసినపుడు మేస్తూ, దప్పికయినపుడు తాగుతున్నదది
కమ్మగా కరిగిపోతున్నది కాలం

8. పూర్తిగా ఆ పసరం తెల్లనయిందిపుడు. క్రమ్ముకున్నవి తెల్లమబ్బులు
ఏ బాదరబందీలేక పూర్తిగా తీరుబడిగా ఉన్నాడు గోపుడు. అట్లే జతగాడు కూడ
చంద్రకాంతి చొచ్చుకొచ్చిన తెల్ల మబ్బులు, క్రింద పరచిన తెల్ల నీడలు
తెల్ల మబ్బులు, వెలిగే చంద్రకాంతి వాటి దారిన అవి సాగిపోతున్నవి

9. ఇక్కడే ఉన్నదాపసరం. తన కాలానికి తానే అధిపుడు ఆ గోపుడు.
అతడొక ఒంటరి మేఘం. కొండ నెత్తాలబడి సాగిపోవును నెమ్మదిగా
చల్లని వెన్నెలలో చప్పట్లు చరుస్తూ రాగాలు తీస్తున్నాడు ఉల్లాసంగా
అయినా తెలుస్తూనే ఉన్నది, ఇంటి దారికి అడ్డంగా చివరి గోడ ఇంకా మిగిలే ఉందని

10. పరసమూ లేదు. కాపరీ లేదు. కాలి జాడ గూడ లేదు
వెలిగే వెన్నెల - అంతా శూన్యం - అందులో వేవేల విషయాలు - వాటి నీడలయినా లేవు
దీని అర్థమేమని ఎవరయినా అడిగితే,
మైదానంలోని లిల్లీలు దాని మధురమయిన తాజా సువాసనల పచ్చదనంవైపు చూడు

(పూర్తి అర్థం వ్రాసిన వానికే తెలుసు. ధ్యానానుభవం ఉన్నవారికి కొంతైనా తెలుసు. తక్కినవారికి అర్థం తెలియని అందమైన మైదానం).

వావిలాల సుబ్బారావు
అమరావతి
ఫోన్ : 986 640 2973



# నేటి విజ్ఞాన యుగంలో బౌద్ధ ధర్మం

– జె. లక్ష్మిరెడ్డి

'సోవియత్ ప్రభుత్వం విచ్ఛిన్నం అయిన కొన్ని సంవత్సరాల తర్వాత మిఖాఇల్ గోర్బాచోవ్ ఒక సందర్భం 21వ శతాబ్దం బుద్ధుని శతాబ్దంగా ఉంటుంది, అని అన్నాడు. ఈ మాట ఆయన ఏ ఆంతరిక ప్రేరణతో అన్నాడో లేక ఈ మాట వెనక ఆ కాలం నాటి ఏ చారిత్రక కారణాల ఒత్తిడి ఉందో తెలియదు కానీ, ఈ మాటమాత్రం అందరినీ ఆశ్చర్యపరిచేమాటే. గోర్బాచోవ్‌లాంటి వ్యక్తిని ఈ మాట అని తీరవలసిన నిర్బంధానికి గురి చేసిన విషయం ఏమిటి? అని మనం ఆలోచిస్తే మనకు తోచేది ఒకటే – ప్రపంచంలోని అనేక మేధావులను, ఆలోచనాపరులను ప్రభావితం చేసినట్లుగానే కరుణాభావ ప్రకాశమైన బుద్ధుని సందేశమే అన్నిటినీమించి ఆయన హృదయానికి హత్తుకొని ఉండవచ్చునని. నిజానికి ఇప్పుడు ప్రపంచమంతటా బుద్ధుని సందేశానికి, ఆయన వ్యక్తిత్వానికి సంబంధించి స్వతఃప్రేరణతో ఏర్పడిన మేధోసంబంధమైన ఒక అలజడి స్పష్టంగా కనిపిస్తూంది. ప్రపంచమంతటా అన్నప్పుడు అందులో మన దేశం కూడా చేరి ఉందని చెప్పనవసరం లేదు. ఇక్కడినుంచే కదా కొన్ని శతాబ్దాల పూర్వం బౌద్ధధర్మాన్ని, బౌద్ధ దర్శనాన్ని వెడలగొట్టడం జరిగింది! అయినా దాన్ని పూర్తిగా వెడలగొట్టడం గానీ అన్ని దుష్టప్రయత్నాల తర్వాత కూడా అది పూర్తిగా ఇక్కడ నశించిపోవడం గానీ జరగలేదు.

గత కొన్ని సంవత్సరాలుగా బుద్ధునిపట్ల, బౌద్ధ ధర్మ – దర్శనాల పట్ల ఒక ప్రత్యేకమైన ఆదరణ, ఆకర్షణ పెరిగి అనేక ప్రపంచ భాషల్లో వీటి గురించి అనేక రచనలు వెలువడ్డాయి. భారతదేశం విషయానికొస్తే అన్నిటికంటే ముందు నవ బౌద్ధులు మన దృష్టిని ఆకర్షిస్తారు. వీరి అభ్యుదయం వెనక బాబా సాహెబ్ అంబేద్కర్ యొక్క యుగ ప్రవర్తక వ్యక్తిత్వం ఉంది. బాగా పరిశీలించి చూస్తే బౌద్ధధర్మం స్వీకరించాలనే ఆయన నిర్ణయం తొందరపాటులో తీసుకున్నది కాదని, బాగా ఆలోచించి, ఆచరణలో ఉన్న అన్ని ధర్మాలను పోల్చి, బేరీజువేసిన తర్వాతనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నాడని తెలుస్తుంది. ఏది ఏమైనా ఈ చారిత్రక నిర్ణయం ద్వారా బుద్ధునికి, బౌద్ధ ధర్మానికి, బౌద్ధ దర్శనానికి భారతదేశంలో ఒక కొత్త గౌరవం లభించిందని, ఒక విధంగా చాలాకాలం తర్వాత బౌద్ధ ధర్మం తన స్వంత ఇంటికి తిరిగి వచ్చిందని చెప్పవచ్చు.

బుద్ధుని ప్రేమించే మరికొందరిని బౌద్ధ ధర్మంలోని కొన్ని విశేషతలతో పాటు బుద్ధుని వైజ్ఞానికమైన జీవనదర్శనం కూడా అమితంగా ప్రభావితం చేసింది. వారికి బుద్ధుని నిరీశ్వరవాద వ్యక్తిత్వం ఆధునిక చైతన్యం యొక్క మూలప్రేరణకు దగ్గరగా ఉన్నట్లు కనిపిస్తుంది. ఈ వర్గంలో సమస్త మేధావుల వర్గాన్ని, ముఖ్యంగా రచయితల్లో అత్యధిక సంఖ్యలో ఉన్న బుద్ధానురాగులను మనం చేర్చవచ్చు. మనలను ఆశ్చర్యపరిచే ఒక విషయం ఏమిటంటే ఒక్క బుద్ధుణ్ణి వస్తువుగా తీసుకొని ప్రపంచంలోని అనేక కవులు, కథారచయితలు ఏ విధంగా రచనలు చేశారో, అలా బహుశా మరే వ్యక్తినీ తీసుకొని రచనలు చేయడం జరగలేదనే విషయం. భారతదేశం వెలుపల బుద్ధుని తీసుకొని రచించిన కవితల సంగ్రహాన్ని తయారు చేయడం ఇంతవరకు జరగలేదు.

ఆధునిక విజ్ఞాన వికాసం గుడ్డినమ్మకాల మూలాలను కదిలించింది. డార్విన్ (1809–1882) *ప్రాణుల ఉత్పత్తి* అనే పుస్తకం ద్వారా మానవుడు భగవంతుని పుత్రుడు కాదని, అతడు వానరం నుండి వికసించి, మనిషి అయ్యాడని ప్రమాణాలతో నిరూపించ ప్రయత్నించాడు. ఇక మార్క్స్ మనిషి తాను ఏ నిర్ణయం తీసుకోడానికీ స్వతంత్రుడు కాదని, అన్ని నిర్ణయాలు, తాను పుట్టి పెరిగిన ఆర్థిక వ్యవస్థననుసరించే తీసుకోగలుగుతాడని నిర్ధారించి చెప్పాడు. ఫ్రాయిడ్ వెలువరించిన మనస్తత్వ శాస్త్రం మనిషి చేసే జప–తపాలు, అతని వియోగ–వైరాగ్యాలు, అన్నీ పైపై విషయాలేనని, అతని లోపల అతనివి, యుగయుగాలుగా మానవజాతి సంతరించుకున్నవి అయిన అసంఖ్యాకమైన ప్రబల వాసనలు అణిగి ఉంటాయని ప్రతిపాదించింది, అజ్ఞాతమైన ఈ ప్రేరణలను అనుసరించే మనిషి ప్రవర్తిస్తాడని రుజువు చేయడానికి ప్రయత్నించింది. ఈ విధంగా డార్విన్ మనిషి

నుంచి అతని దైవత్వాన్ని లాక్కుంటే, మార్క్స్ మనిషి సదుద్దేశ్యానికున్న హద్దులను స్పష్టపరచాడు, ఫ్రాయిడ్ మనిషి ఆచరణ ఎల్లప్పుడు హేతుబద్ధంగానే ఉంటుందనడానికి వీల్లేదని రుజువు చేశాడు. దీంతో భగవంతునిపట్ల మానవుని నమ్మక స్వరూపం యొక్క మారిపోయింది. బుద్ధి వేసే ప్రశ్నల ఎదుట పూజ్యభావం, భక్తిభావం నిలువలేకపోయాయి.

మనిషిలో విజ్ఞానం రేకెత్తించిన జిజ్ఞాస ప్రేరణతో అతడు ప్రతి విషయాన్ని సందేహ దృష్టితో చూడడం ఆరంభించాడు. ఏ యుగంలో అయితే హేతువాదం మతం విషయంలో ఈ విధమైన సందేహ దృష్టిని అలవరిచిందో, ఆ యుగంలో వివేక సమ్మతమైన బుద్ధుని ధర్మం ప్రజాదరణ పొందడంలో ఆశ్చర్యమేముంది? నేటి మానవుని పూజ్యభావం మహాత్మత్వం పొందిన బుద్ధునిపట్లకంటే విద్రోహి, ప్రబల హేతువాది అయిన బుద్ధుని ఆలోచనలపట్లనే ఎక్కువగా కనపడుతుంది. అందువల్లనే నేటి మానవుడు ఇతర ధర్మాధినాయకులను చూసేకంటే ఎక్కువ ఉత్సాహంతో బుద్ధుణ్ణి చూస్తున్నాడు. డా. రాధాకృష్ణన్ ఒకచోట "శంక, సందేహం, నాస్తికత్వం, వీటితో కూడిన అనేక సాహిత్య రచనల్లో బుద్ధదేవుని పేరు ఎంతో ఆదరభావంతో ప్రస్తావించబడింది" అని అన్నాడు.

ప్రాచీన భారతదేశంలో ఇద్దరు సర్వోత్కృష్ట వ్యక్తులు కలిగారని, వారు కృష్ణుడు, బుద్ధుడు అని వివేకానందుడు అన్నాడు. బుద్ధుడు సామాన్య ప్రజల జీవితాల్లో నుంచి దుఃఖాన్ని తొలగించడానికి జీవితమంతా ఉద్యమించాడు. కుల మత భేదాల బంధనాల్లో చిక్కుకుపోయిన హిందూమతంలోని జడత్వాన్ని కదిలించడానికి దాన్ని తీవ్రంగా కదపడం ఆయన చేసిన సాటిలేని పని. కుల – మతాల అన్ని సంకీర్ణతలను నిరాకరిస్తూ తన బోధలతో ఆయన భారతదేశ సంస్కృతి యొక్క దివ్య భవనాన్ని నిర్మించాడు.

మానవుని దుఃఖాన్ని తెలుసుకొనే విషయంలో, దాన్ని నివారించే విషయంలో బుద్ధునికి అద్భుతమైన శక్తి ఉండేది. ఆయన కులం, లింగం, ఆధారంగా నెలకొన్న భేదభావాన్ని తిరస్కరించి, జ్ఞానద్వారాలను అందరికోసం తెరిచాడు. అలా చేసినప్పుడు ఆయన వేదాల ఎదుటగాని, అలాంటి ఏ గ్రంథం ఎదుటగాని, బ్రాహ్మణ సంప్రదాయం ఎదుటగానీ, ఏ నమ్మకాల – విశ్వాసాల ఎదుటగానీ తల వంచడానికి సమ్మతించలేదు. ఆయన ఇలా అన్నాడు – "విన్నంతనే అంగీకరించకు, వ్యక్తికి తన పై నమ్మకం, తనపట్ల గౌరవభావం తక్కువగా ఉన్నప్పుడే ఇతరులపట్ల, శాస్త్రాలపట్ల భక్తిభావం పెరుగుతుంది". కాలామ సూత్రంలో కాలాముల సందేహాన్ని తీరుస్తూ బుద్ధుడు ఇలా అన్నాడు – "కాలాములారా! ఆనవాయితీగా వస్తున్నాయనిగానీ, ఎవరో చెప్పగా విన్నామనిగానీ, మతగ్రంథాల్లో రాసి ఉన్నాయనిగానీ, ఏ మాటలను పాటించకండి. ఏ విషయాలైతే మీకు స్వయంగా అకుశలమైనవిగా తోస్తాయో, వాటిని వదలిపెట్టండి. మీకు కుశలమైనవిగా తోచిన విషయాలను స్వీకరించి వాటిని పాటించండి." ధర్మపాల సుజుకీ, కారుస్ తదితరులు ఈ సూత్రం ఆధారంగానే పాశ్చాత్య విజ్ఞానం, ప్రాచ్య ఆధ్యాత్మిక చింతన, రెండింటిమధ్య సామరస్యం స్థాపించారు. బుద్ధున్ని ఆధునిక ఆలోచనలకు పూర్వపురుషునిగానూ బౌద్ధ ధర్మాన్ని సంప్రదాయంపట్ల విధేయతకు బదులు వైజ్ఞానిక పరిశీలనాదృష్టి కలిగిన ధర్మంగానూ చూడగలిగారు.

వ్యక్తి స్వేచ్ఛకోసం వీటినన్నింటిని తిరస్కరిస్తూ ఆయన ముందుకు సాగిపోయాడు. దుఃఖార్త ప్రపంచానికి అండగా ఉండడం కోసం సర్వస్వాన్ని త్యజించి, కఠోర సాధనద్వారా ఒక సన్మార్గాన్ని అన్వేషించాడు. ఆ తర్వాత భిక్షువై క్లిష్టపరిస్థితుల్లో కూడా ప్రజల భాషలో అందరికీ ఆ దారిని బోధించడంలో జీవితం గడిపాడు. ఈ విధంగా బుద్ధుడు భగవంతుడి నుంచి ధర్మాన్ని వేరుచేసి, భగవంతునితో ప్రమేయం లేకుండానే మానవుడు ఉత్కృష్ట జీవిత శిఖరం పైకి చేరడానికి వీలుందని చెప్పాడు. మానవుని ఆంతరిక విప్లవానికి దారి చూపాడు. అలాంటి విశ్వాసాన్ని వివరించాడు, ఆచరించాడు. కేవలం బోధించడం మాత్రమే చేయలేదు. జ్ఞానానికి, జిజ్ఞాసకు చెందిన దార్శనికుడాయన. బుద్ధుడు భగవంతుని గురించి, ఆత్మ గురించి చెప్పలేదు. అవి బోధగమ్యమైన విషయాలు కావు గనక. దాదాపు రెండువేల ఐదు వందల సంవత్సరాల నుంచి ఎందరో బుద్ధున్ని ఖండించే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. అయినా అనేక దేశాల ప్రజల చైతన్యంలో బుద్ధుడు జీవించే ఉన్నాడు.

బుద్ధుడు ఇలా అన్నాడు – "ధర్మం సనాతనమైంది___ **ఏష ధమ్మో సనాతనో**. ధర్మం అంటే ఏది ఆధారంగా ఉందో అది. దేనిపైన సమస్తమూ నిలిచి ఉందో అది. బుద్ధుడు ఆత్మ అస్తిత్వాన్ని తిరస్కరించాడుగానీ మనిషి మానసాన్ని, అతనిలోని ఆధ్యాత్మిక నిర్మితిని, అతని వ్యక్తిత్వాన్ని తిరస్కరించలేదు. ఆలోచనలు, లేక మానసం మాత్రమే వాస్తవమైనదని ఆయన విశ్వసించాడు. శరీరాన్ని నడిపించేది ఆత్మ కాదు, కేవలం ఆలోచనలే అని ఆయన అన్నాడు. మనిషి ఆలోచనలకు మించి

ఆత్మ అనేది ఏదీ లేదన్నాడు. బుద్ధుని సమస్త దర్శనానికి ఆధారం 'ప్రతీత్య సముత్పాదం'. ఈ ప్రతీత్యసముత్పాదాన్నే బుద్ధుడు బోధి అంతర్లీనంగా ఉండే 'ధర్మం' అని అన్నాడు. ప్రతీత్య సముత్పాదం కార్యకారణవాదం. ఒకటి నశించిపోయిన తర్వాత మరొకటి ఉత్పత్తి కావడం అనే నియమానికే బుద్ధుడు 'ప్రతీత్య సముత్పాదం' అని పేరుపెట్టాడు. ప్రతి ఉత్పత్తికీ ఒక ప్రత్యయం ఉంటుంది. బుద్ధునిలో ప్రత్యయమూ, హేతువు సమానార్థకాలుగా కనిపిస్తాయి. ఇదే బుద్ధుని 'మధ్యమా ప్రతిపద.'

కార్యకారణ సిద్ధాంతం బుద్ధుడు ప్రపంచానికిచ్చిన వరం. ప్రతి కర్మఫలం మూలంలో కారణం ఉంది. ఈ కార్యకారణ సిద్ధాంతం మానవుని జీవితాన్ని స్వావలంబిగా చేసింది, దానికి సూక్ష్మదృష్టిని ప్రసాదించింది. దీంతో మనిషి ప్రతి సంఘటనకు, దృశ్యమానమైన ప్రతి విషయానికి, కారణం వెదకనారంభించాడు. ఇలా వెతుకుతూ అతడు ప్రకృతి యొక్క లోతైన చలనాన్ని మనసులో దర్శించసాగాడు. న్యూటన్ మొత్తం విశ్వానికి ఆధారం గురుత్వాకర్షణ శక్తి అని రుజువు చేశాడు. ఐన్‌స్టీన్ సమస్తమూ సాపేక్షం (relative) అని రుజువు చేశాడు. దీనివల్ల కూడా భగవంతునికి సంబంధించిన నమ్మకాలు పెద్దగా చలించిపోయాయి. న్యూటన్, ఐన్‌స్టీన్ లాంటి వైజ్ఞానికులు భగవంతుడిని నమ్మేవారే అయినా వారి విజ్ఞానం మాత్రం ఎల్లప్పుడు భగవంతునిపైన నమ్మకాన్ని బలహీన పరిచే పనే చేస్తూ వచ్చింది. విశ్వానికి ఆది, అంతం ఏమిటి? అనే ప్రశ్న వేసుకుంటే దీని వెనక ఉన్న కార్యకారణ సంబంధం కూడా వైజ్ఞానిక పరిశోధనల ద్వారా స్పష్టం అవుతుంది. నిరీశ్వరవాదం, అనాత్మవాదం – ఈ రెండు పరికరాల ద్వారా బుద్ధుడు అన్ని అవైజ్ఞానిక విశ్వాసాల ముళ్లపొదలను తొలగించాడు. ఎవరో ఒక భగవంతుడు మనిషి భవిష్యత్తును, ప్రపంచం భవిష్యత్తును ముందుగానే నిర్ధారించి, ఉంచాడు, అనే నమ్మకాన్ని ఆయన ఖండించాడు. రాహుల్ సాంకృత్యాయన్ ఇలా అన్నారు – "భగవంతుడు, బుద్ధుడు ఒకచోట ఉండడానికి వీల్లేదు. భగవంతుడు ఒక కల్పన మాత్రమే అనేది స్పష్టంగా తెలిసిపోయింది. ఇప్పుడు నాకు డార్విన్ వికాసవాదంలోని సత్యం అవగాహనకు వచ్చింది, అంతేకాక మార్క్స్ వాదంలోని సత్యం మెదడులోను, హృదయంలోను, చొచ్చుకుపోతున్నట్లుగా తోస్తుంది."

బుద్ధుని ప్రతీత్య సముత్పాదంలో నిత్యమైన, అనివాశి అయిన ఆత్మకు సైద్ధాంతికంగా ఏ స్థానమూ లేదు. అందువల్లనే ఆయన ఆత్మవాదాన్ని 'అవిద్య' అన్నాడు. అనిత్యం, దుఃఖం, అనాత్మ – ఈ ఒక్క సూత్రంలో బుద్ధుని దర్శనశాస్త్రం అంతా వచ్చేస్తుంది. వైజ్ఞానిక కర్మవాదాన్ని స్థాపించి, ఏదో వెనుకటి జన్మలోని ఏవో కొన్ని కర్మలకు ఈ జన్మలోని దుఃఖానికి, కష్టాలకు కారణం కాగలిగిన శక్తి ఉంటుందనే, అవి ఉండగా ఈ జన్మలోని కర్మలు ఏమీ చేయలేవనే నిరాశావాద దృక్కోణాన్ని ఆయన త్యజించాడు.

బుద్ధుడు 'మోక్షం', లేదా 'ఆత్మ యొక్క ముక్తి' అనే సిద్ధాంతం స్థానంలో 'నిర్వాణాన్ని' ప్రతిష్ఠించాడు. ఆయన నిర్వాణ స్వరూపానికి మూలాధారం ప్రాణి రాగద్వేషాగ్నిని శాంతింపచేసుకోవడం. రాగద్వేషాలు మండుతున్న అగ్నితో సమానం. రాగాగ్ని, ద్వేషాగ్ని, మోహాగ్ని మొదలైనవి శాంతించడంతో అతడు 'ముక్తుడు' అవుతాడు. లోభం, ద్వేషం, మోహం – ఇవి మొదలంటా పెకలించబడితే, మనిషి తన దుఃఖాలతోనూ దుఃఖం చెందడు. ఇతరుల దుఃఖాలతోనూ దుఃఖం చెందడు. మానసిక వ్యథను, వేదననూ అనుభవించడు. ఈ విధంగా ఈ జీవితంలోనే నిర్వాణం ప్రాప్తిస్తుంది. 'నిర్వాణం' అంటే అర్థం ఆరిపోవడం. నిర్వాణానికి అర్థం చెప్పడానికి బుద్ధుడు అగ్ని, దీపం, వీటి ఉపమానం తెచ్చేవాడు. తైలం పూర్తిగా ముగిసిపోయిన తర్వాత మునుపు మన ఎదుట వెలుగుతున్న అగ్ని ఎక్కడికి వెళ్ళిపోయిందో చెప్పలేం. అదేవిధంగా కర్మ సంస్కారాలు ముగిసిపోయిన తర్వాత జీవుడు ఏ స్థితిలో ఎక్కడికి వెళ్ళిపోతాడో చెప్పడం వీలుపడదు. నశ్వరత్వానికి సంబంధించినంత వరకు సత్పురుషులు, మహాత్ములేకాక స్వయంగా తథాగతుడు కూడా నశ్వరమైన పరమాణువులతో నిర్మితమైనవాడేనని, అలాంటివారు చనిపోయినప్పుడు వారి అంశం ఏదీ మిగిలి ఉండదని బుద్ధుడు పలుసార్లు చెప్పాడు.

నిర్వాణాన్ని గురించి చెబుతూ ఆనంద కుమార స్వామి నిర్వాణం మృత్యువు మాత్రమే కాదు, అది జీవితం యొక్క పరిపూర్ణత కూడా అని అన్నాడు. రాధాకృష్ణన్ నిర్వాణ స్థితి మృత్యువు లేక వినాశావస్థ కాదని, అది నైతికాచరణ యొక్క పరిపూర్ణత ద్వారా ప్రాప్తించే స్థితి అని అన్నాడు. నిర్వాణం వాసనల నుంచి విముక్తికి పేరు. నిర్వాణం అంటే మనిషి ధర్మ మార్గంలో దృఢంగా నడిచేంతగా తన ప్రవృత్తులపైన అదుపు కలిగి ఉండడం. దోషరహితమైన జీవితానికి మూలం నిర్వాణంలో ఉంది. నిర్వాణమే జీవితోద్దేశ్యం. ఈ లోభం, ద్వేషం నుంచి ముక్తి పొందేందుకు సాధనం మధ్యమార్గం.

ఇదే మనలను శాంతి వైపుకు, జ్ఞాన ప్రకాశం వైపుకు, నిర్వాణం వైపుకు తీసుకెళుతుంది. బుద్ధుడు తన మధ్యమార్గంలో తన కోసం అంటూ ఎలాంటి ప్రత్యేక స్థానాన్ని ఉంచుకోలేదు. ఏసుక్రీస్తు క్రైస్తవ మతంలో తాను దేవదూతనని చెప్పుకున్నాడు.

అంతేకాదు, తన్ను దేవుని పుత్రుడుగా కూడా ప్రకటించుకున్నాడు. ఇంకా ముందుకు వెళ్ళి ఎంతవరకైతే మనిషి ఆయనను భగవంతుని పుత్రునిగా స్వీకరించడో, అంతవరకు అతనికి ముక్తి కలగనే కలగదని కూడా అన్నాడు. ఇస్లాం మతంలో ఉంటూ సద్గతి పొందాలని కోరుకునేవారు మహమ్మద్ భగవంతుని చివరి దూత అనేదాన్ని స్వీకరించి తీరాలి. బుద్ధుడు తన ధర్మం విషయంలో పూర్తిగా తటస్థంగా ఉన్నాడు.

ఆయన తన వారసునిగా ఎవరినైనా నియమించడాన్ని నిరాకరించాడు. ధర్మమే ధర్మాన్ని ముందుకు నడిపిస్తుందని నమ్మాడు. ధర్మం యొక్క ప్రతిష్ఠను నిలబెట్టడానికి ప్రతిసారీ దాని సంస్థాపకుని పేరు వల్లించడం అవసరమైతే అది ధర్మం కాజాలదు. బుద్ధుడు విముక్తి కలిగిస్తానని ఎవరికీ భరోసా ఇవ్వలేదు. తను కేవలం మార్గదాతననే ఆయన చెప్పుకున్నాడుగానీ, మోక్షదాతనని చెప్పుకోలేదు. ఆయన ధర్మం ఒక అన్వేషణ, ఒక ఆవిష్కరణ. ప్రవక్తలందరూ తాము ముక్తిదాతలమని చెప్పుకున్నారు. తన్ను గురించి ఇలా చెప్పుకోకుండా, మోక్షదాతను మార్గదాత నుంచి పూర్తిగా వేరుచేసి ఉంచిన మహాపురుషుడు ఒక్క బుద్ధుడు మాత్రమే. శిక్షణ కోరి వచ్చిన వ్యక్తికి ఆయన మొట్టమొదట "శీలవంతుడుగా ఉండు, సద్వర్తనలో దృఢంగా ఉండు, తృష్ణనుంచి జన్మించే ప్రవృత్తులపైన అదుపు కలిగి ఉండు, అప్రమత్తతను అభ్యసించు" అని బోధించేవాడు. అప్రమత్తత, స్మృతి (ఎరుక) అలవడిన సాధకుడు ఆత్మసంయమి అయిన తర్వాత తథాగతుడు తర్వాతి దశలో "ఏకాంత స్థలం వెతుక్కొని ధ్యానాన్ని అభ్యసించు" అని బోధించేవాడు. సిగ్మండ్ ఫ్రాయిడ్ విజ్ఞానానికి, ధర్మానికి మధ్య ఉన్న సంబంధాన్ని విశ్లేషిస్తూ ఇలా రాశాడు – "కొపర్నికస్ ద్వారా మొదలై, గెలిలియో ద్వారా మరింత ముందుకు సాగిన విప్లవం, భూమిని కేంద్రస్థానం నుంచి తొలగించి, దాన్ని సూర్యుని చుట్టూ తిరిగే ఒక చిన్న గ్రహంగా మార్చేసింది. డార్విన్ మనిషికి, పశువుకు మధ్య ఉన్న దూరాన్ని తొలగించి, మనిషికి ఉండిన ప్రత్యేక హోదాను అంతం చేశాడు. దీంతో భగవంతుడు కూడా దాదాపు అంతరించిపోయాడు. "భగవంతుడు చనిపోయాడు" అనే నీషే మాటలో కొంత అతివాద ధోరణి కనిపించినా, భగవంతుడు జబ్బుపడ్డాడు (God is ailing) అనే ధ్వని మాత్రం అందులోంచి వెలువడుతుంది.

బుద్ధానుశాసనంలో ప్రజ్ఞ (wisdom) ఉంది, ప్రశ్నలున్నాయి, సందేహాలున్నాయి. అందువల్ల అది ప్రచారంలో ఉన్న ఇతర ధర్మానుశాసనాలకు భిన్నమైంది. ఈ మార్గంలో కర్మకాండలు, మొదలైనవాటికి ఎలాంటి చోటూ లేదు. విజ్ఞానం అనుసరించే మార్గం కూడా ఇలాంటిదే. విజ్ఞానం, బుద్ధమార్గం రెంటికీ చాలా పోలికలున్నాయి. అందువల్లనే విజ్ఞానం తెరపైకి తెస్తున్న క్రొత్త-క్రొత్త ఆవిష్కరణల ద్వారా బుద్ధుని ఆలోచనలకు బలం చేకూరుతూంది. బౌద్ధధర్మంలో మేధస్సుయొక్క వివేచన ఉంది. మేధస్సులోనే వేదన ఉంది, సంస్కారాలున్నాయి, చేతన ఉంది. వీటిని మనం అప్రమత్తతతో గమనించడం మాత్రమే చేయాలి. ఈ జ్ఞానమంతా వ్యక్తిగతమైన అనుభూతిపైన ఆధారపడి ఉంటుంది. అందువల్ల బౌద్ధధర్మం వైజ్ఞానికమైంది.

మనసు అధీనంలో ఉంటే సర్వమూ అధీనంలో ఉన్నట్లేనని, అన్ని మానసిక క్రియల్లో మనసే ప్రధానమైందని, మనసు సాధన ప్రధానమైందని బుద్ధుడు అంగీకరించాడు. నేటి విజ్ఞాన యుగంలో బుద్ధుని శ్రేష్ఠత్వం పెరుగుతూంది. ఆయన సంప్రదాయవాదికాక, మౌలికమైన ప్రజ్ఞ కలవాడు. ఆలోచనా ధోరణికి ఒక సంప్రదాయం ఉంటుంది. కానీ అన్వేషణ మాత్రం మౌలికమైందిగా ఉంటుంది. బుద్ధుడు ఒక వైజ్ఞానికుడు. విజ్ఞానం "నిరపేక్షంగా ఉండు, పక్షపాత రహితంగా పరిశీలించు", అని చెబుతుంది. బుద్ధుడు కూడా అలానే చేశాడు. ఏ విషయం పట్లనైనా విధేయత, బోధి, ఈ రెండింటిలో బుద్ధుడు బోధిని ఎన్నుకున్నాడు. ఇదే ఆయన్ను బుద్ధుణ్ణి చేసింది. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, బట్రాండ్ రసెల్, సార్త్రే, జిడ్డు కృష్ణమూర్తి అందరి తలలు బుద్ధుని ఎదుట వంగిపోయాయి. రసెల్ *How I am not a Christian* అనే పుస్తకం రాశాడు. అందులో ఆయన ఏసుక్రీస్తును నిరాకరించాడు. అయితే బుద్ధుణ్ణి నిరాకరించడం ఆయనకు కష్టసాధ్యమైంది. ఎందుచేతనంటే బుద్ధుడు వైజ్ఞానికం కాని మాట ఏదీ చెప్పలేదు కాబట్టి. బుద్ధుడు చెప్పిన మాటల్లో దేన్నైనా ఖండించడం కష్టం. అస్వీకారానికి గురి అయ్యే మాటలు ఆయన చెప్పలేదు.

ఈ కారణంచేతనే 20 వ శతాబ్దం ఆరంభం నాటికి బౌద్ధధర్మం కేవలం భాషావైజ్ఞానికులను, చరిత్రకారులనే కాక

తాము ఆచరించే ధర్మంతో అసంతృప్తి చెంది మరో ధర్మ సాధనను, జీవన విధానాన్ని అన్వేషిస్తున్నవారిని అనేకులను కూడా ఆకర్షించింది. 19వ శతాబ్దం చివరిలో థియోసఫికల్ సొసైటీ బౌద్ధధర్మానికి ప్రచారం కల్పించడంలో విశేషంగా తోడ్పడింది. షికాగోలో జరిగిన సర్వధర్మ సమ్మేళనం, ధర్మపాల్, సుజుకి, వివేకానందుడు మొదలైనవారు అమెరికాలో ఇచ్చిన ఉపన్యాసాల తర్వాత ఇతర మతాల్లోని అవైజ్ఞానికత, నియంతృత్వ పోకడలు స్పష్టంగా ఎదుటికి రావడంతో ప్రజాసమూహాల్లో బౌద్ధధర్మం పట్ల ఆదరణ పెరిగింది. భౌతిక శాస్త్రంలో జరిగిన ప్రగతి విజ్ఞానం, బౌద్ధధర్మం రెండు సామరస్యం కలిగి ఉండగలవని నిరూపించింది. విజ్ఞానం దాడికి గురై ఇతర మతాలు తడబడిపోగా, బౌద్ధధర్మానికి దానివల్ల ఎరువు, నీరు అందినట్లయింది.

బౌద్ధధర్మంలోని అన్నిటికంటే ప్రధానమైన అంశం ఏమిటంటే, అది మెదడును, కర్తను విశ్లేషణకు ఆధారంగా చేసింది. దాని ప్రకారం మెదడు మొత్తం ప్రపంచాన్ని చిత్రించగలిగే చిత్రకారుడులాంటిది. బహుశా అందువల్లనే ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌కు భవిష్యత్తులోని ధర్మం పెడసరానికి, మిథ్యాత్వానికి, అహంకారానికి, కల్పిత గాథలకు చోటులేని విశ్వధర్మంగా ఉంటుందని అనవలసి వచ్చింది. బౌద్ధధర్మం అలాంటిదే. నేటి యుగపు వైజ్ఞానిక అవసరాలు తీర్చగల ధర్మం ఏదైనా ఉంటే అది బౌద్ధధర్మమే. బ్రిటిష్ గణితజ్ఞుడు, దార్శనికుడు ఆల్‌ఫ్రెడ్ నార్త్ వైట్‌హెడ్ Applied metephysics కు ఒక పెద్ద ఉదాహరణ బౌద్ధధర్మమే అని అన్నాడు. బర్ట్రెండ్ రసెల్ బౌద్ధధర్మంలో మెదడు, పదార్థం (matter) రెండింటికి సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు లభిస్తాయని అన్నాడు. ఇంతైనా విజ్ఞానం సహాయంతో ధార్మిక సత్యాన్ని రుజువు చేయబూనడం పూర్తిగా నిరుపయోగమైన పని అని వాదించిన ఆలోచనాపరులు కూడా ఉన్నారు. విజ్ఞానానికి హృదయం లేదని, ప్రేమ గురించిగానీ, కరుణ గురించిగానీ, మెదడు స్వచ్ఛత గురించిగానీ, మానవుని ఆభ్యంతర ప్రపంచాన్ని గురించిగానీ దానికి ఏమీ తెలియదని, బౌద్ధధర్మం అలాకాక మానవుని భౌతిక, ఆధ్యాత్మిక, మానసిక, బౌద్ధిక అన్వేషణ కూడా చేసిందని అన్నాడు. బౌద్ధధర్మం జీవిత విధానం, అనుసరించవలసిన మార్గం. అది నైతిక స్వభావాన్ని ఎలా వృద్ధిచేయాలి, మెదడును ఎలా ఉన్నతీకరించాలి, సమాధిని, చరమ సత్యమైన నిర్వాణాన్ని ఎలా పొందాలి, అనేది నేర్పుతుంది, అని వారి ఆలోచన. హస్టన్ స్మిత్ (Huston Smith) బౌద్ధ ధర్మంగానీ ఇతర ధర్మాలుగానీ అందించిన తోడ్పాటు ఆధ్యాత్మిక సంకటాన్ని ఎదుర్కొంటున్న సమాజానికి ఆ సంకటాన్ని నివారించటంలో విజ్ఞానానికి సహాయపడటం అనే విషయంలోకాక, విజ్ఞానం ఇవ్వలేనివన్నీ మనిషికి ఇవ్వడంలో ఉంది, అని అన్నాడు.

ఇప్పుడు ఇంగ్లాండు నుంచి, జర్మనీ నుంచి, ఫ్రాన్స్ నుంచి, అమెరికా నుంచి బౌద్ధధర్మం గురించిన పుస్తకాలు వెలువడుతున్నాయి. హైనరిక్ హైన్ తర్వాత అందరికంటే పెద్ద జర్మన్ కవి రేనర్ మేరియా రిల్కే బుద్ధుని గురించి ఒక మంచి కవిత రాశాడు. అదేవిధంగా ఇంగ్లాండ్ కవులు జాన్ మేస్‌ఫీల్డ్, టి.ఎస్. ఇలియట్, ఎడిథ్ సిట్‌వెల్, D.B. యేట్స్ రాసిన కవితల్లో అక్కడక్కడ బౌద్ధసందర్భాలను పేర్కొనడం కనిపిస్తుంది. ఆర్థర్ వేలే ద్వారా చైనా భాష నుంచి అనువదించిన కవితల్లోని బౌద్ధభావనల స్పందన ఈ కవితల్లో కొన్నింటికి ఆధునిక కవితా సంపుటాల్లో చోటుచేసుకునే గౌరవం కూడా చేకూర్చింది. పాశ్చాత్య దేశాల్లోని బౌద్ధ ఉద్యమం కొందరు అసామాన్య ప్రతిభావంతులైన కళాకారులకు జన్మనిచ్చింది. వీరిలో రోరిక్, లామా, అనాగారిక్ గోవింద్, అర్ల్.ఎచ్. బ్రెవస్టల్ ఎక్కువ ప్రసిద్ధులు. వీరందరు బౌద్ధవిషయాలను తమ చిత్రకళలో ప్రదర్శించారు.

భారతదేశ సాంస్కృతిక నవజాగరణలో బౌద్ధ ధర్మ పునరుజ్జీవనం అనివార్యంగా చేరి ఉందని చెప్పనవసరం లేదు. బౌద్ధధర్మాన్ని సమ్యక్ రూపంలో అర్థం చేసుకొనేందుకు భారతదేశం పాలీ, సంస్కృతం, టిబెటన్, చైనా భాషల ప్రాధాన్యతను అంగీకరించింది. ఆధునిక భారతీయ భాషల అనేక రచయితలు తమతమ భాషల్లో బౌద్ధగ్రంథాల అనువాదం చేశారు. మరికొందరు బౌద్ధ విషయాల నుంచి ప్రేరణ పొంది, మౌలిక రచనలు కూడా రచించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన *నటీర్ పూజ, అభిసార్* ప్రసిద్ధ రచనలు. హిందీ కథారచయిత యశ్‌పాల్ పైన కూడా బౌద్ధధర్మ ప్రభావం పడింది. గుర్‌బఖ్ష్ సింగ్ ఎడ్విన్ అర్నాల్డ్ ఇంగ్లీషులో రచించిన *The Light of Aisa* కు *ఏశియా దా చానన్* పేరుతో చేసిన పంజాబీ అనువాదం కూడా పేర్కొనదగింది. మళయాళ కవి కుమారన్ *ఆసాన్* కు కూడా ఈ వరుసలో ప్రధానమైన స్థానం ఉంది. ధర్మానంద కోసంబీ మరాఠీలో బౌద్ధవిషయాల గురించి చాలా మంచి పుస్తకాలు రచించాడు. హిందీలో రాహుల్ సాంకృత్యాయన్, భదంత ఆనంద కౌసల్యాయన్ రచించిన బౌద్ధ గ్రంథాలు

అసామాన్యమైన ప్రాధాన్యత కలిగి ఉన్నాయి. చిత్రకళా రంగంలో అవనీంద్ర ఠాగూరు, నందలాల్ బోస్ బుద్ధుని జీవితం నుంచేకాక బౌద్ధ చరిత్ర నుంచి కూడా అనేక విషయాలు తీసుకున్నారు. మరికొందరు చిత్రకారుల కళాకృతుల్లో కూడా బౌద్ధప్రభావం మనం చూడవచ్చు.

యూరప్‌కు చెందిన ప్రసిద్ధ చింతకుడు నీషే భగవంతుడు చనిపోయాడని ప్రకటించి కూడా తర్వాత "భగవంతుని మరణం ఒక పెద్ద సంఘటన. ఈ సంఘటనవల్ల కలిగిన లోటును తాను స్వయంగా భగవంతుడు అయినప్పుడే మానవుడు పూరించగలుగుతాడు" అని అన్నాడు. ఈ జర్మన్ దార్శనికుని తర్వాత ఫ్రెంచ్ నవలాకారుడు అలబేయర్ కామూ "నవయుగ మానవునికున్న అసలు బాధ దేవుణ్ణి నమ్మకుండా అతడు సాధుపుంగవుడు (saint) కాగలడా లేదా? అన్న ప్రశ్న" అని అన్నాడు. భారతీయ సంప్రదాయంలో దీనికి జవాబు ఉంది. బుద్ధుడు సాధుపుంగవుడు. కానీ భగవంతుణ్ణి నమ్మలేదు. జైనధర్మాన్ననుసరించి పరమేశ్వరత్వం మానవుని వికాసానికి సంబంధించిన కల్పనకు పేరు. రమణ మహర్షి కూడా బుద్ధునిలాగే. భగవంతుడు చూసే, తెలుసుకునే విషయం కాదని, తెలుసుకోవలసింది "నేనెవరిని?" అనే విషయం మాత్రమేనని చాలాసార్లు అన్నాడు.

మునుపు రాముని చరితంగానీ, కృష్ణుని చరితంగానీ రాసినప్పుడు వారిని ధర్మసంస్థాపకులు, దుష్కృతి వినాశకులు అయిన భగవంతుని అవతారాలుగా చిత్రించేవారు. వృద్ధిచెందిన విజ్ఞాన ప్రభావం కారణంగానే ఇప్పుడు వారిని సంఘసంస్కర్తలుగా, ప్రజారంజకులుగా లేదా సందేహపీడితులైన మానవులుగా చూపడం జరుగుతుంది. ఖగోళ శాస్త్రజ్ఞుల కొత్త అన్వేషణల ఫలితంగా భూమి సృష్టికి కేంద్రంలో ఉందనే, భగవంతుని ప్రణాళికలో దానికేదో ప్రత్యేకమైన స్థానం ఉందనే మానవుని కల్పన చెల్లాచెదురైపోయింది. భవిష్యద్ఘటనలను ముందుగా చెప్పబూనటం దుస్సాహసమే అయినా, రానున్న కాలంలో కొన్ని శతాబ్దాల దాకా బౌద్ధధర్మం శాంతితో, సంస్కృతితో చేతులు కలిపి నడుస్తుందని చెప్పవచ్చు. సమీప భవిష్యత్కాలానికి సంబంధించినంతవరకు దాని పునరుజ్జీవనం ఎక్కువగా ఆసియా దేశాల్లోనూ, ఇతర అ-బౌద్ధ దేశాల్లోను జరుగుతుందని, దాని ఫలితంగా ప్రపంచంలో మున్ముందు ఒక గొప్ప సాంస్కృతిక నవజాగరణ పరివ్యాప్తమవుతుందని చెప్పవచ్చు. ఆధునిక ప్రపంచంలోని మూడోవంతు బౌద్ధాన్ని స్వీకరించిందే. ఇది బౌద్ధ ధర్మం చేసిన చిన్న పనేమీ కాదు. టిబెట్, మంచూరియా, మంగోలియాతో సహా చైనా, కొరియా, జపాన్, ఇండోచైనా, థైలాండ్, బర్మా, శ్రీలంక అన్ని దేశాలు బౌద్ధదేశాలే. మలేషియాను, ఇండినేషియాను బౌద్ధ దేశాలుగా భావించడానికి వీలు లేకపోయినా, అక్కడి బౌద్ధుల సంఖ్య తక్కువేమీ కాదు. మధ్య ప్రాచ్యంలోని ముస్లిం దేశాలను, రష్యాను మినహాయిస్తే దాదాపు ఆసియా అంతటా బౌద్ధమో, బౌద్ధ ప్రభావమో ఉంది. బౌద్ధధర్మ సందేశం ఆధునిక ప్రపంచంలో ఒక విశేషమైన ప్రాధాన్యతం పొంది ఉంది. ఐక్యరాజ్య సమితి ఇప్పుడు విశ్వశాంతికి సంబంధించి ఏ మాటలు మాట్లాడుతూ ఉందో, ఆ మాటలనుబట్టి చూస్తే ఇక ప్రపంచమంతా బౌద్ధ ధర్మంలో మూర్తీభవించి ఉన్న విశ్వాసాల వైపుకు తిరిగి రాబోతూందని తెలుస్తుంది. ప్రపంచ మానవులందరూ ఇప్పుడు మానవతావాదపు అతి ప్రాచీన ప్రవర్తకుల్లో ఒకనిగా భావించి, బుద్ధుణ్ణి గౌరవిస్తున్నారు. జీవితపు చరమసత్యాన్ని తెలుసుకోవడం వీలుపడదని నమ్మేవారూ బుద్ధున్ని ప్రమాణంగా భావిస్తున్నారు, చరమ సత్యంలాంటిదేదీలేదని నమ్మేవారు కూడా బుద్ధున్నే ఉదహరిస్తున్నారు.

ఈ యుగంలో ఏఏ విషయాలైతే ప్రపంచం ఎదుటకు వచ్చాయో, వాటిని చూసినప్పుడు ప్రపంచంలోని అందరు ధర్మాధినేతల్లో అత్యంత ప్రాచీన కాలంలో కూడా హేతువాదం పైన మానవుని నమ్మకాన్ని దృఢపరిచే ప్రయత్నం చేసినవాడు, మనసును భ్రమజాలంలో పట్టి ఉంచే దార్శనిక కల్పనలను వ్యర్థమైనవిగా నిర్ధారించినవాడు, భగవంతుడు, ఆత్మలాంటి బుద్ధిగ్రాహ్యం కాని విషయాలను నిరాకరించి కూడా మానవుడు ధార్మికుడుగా ఉండగలగడం సాధ్యమే అనే సందేశం ఇచ్చినవాడు, ఒక్క బుద్ధుడు మాత్రమే అని తప్పక చెప్పవచ్చు. బుద్ధునిలాంటి గొప్ప విప్లవకారుని ఎదుట నేడు మనం అందుకే తలలు వంచుతున్నాం.

జె. లక్ష్మిరెడ్డి
(హిందీ : శైలేంద్ర ప్రతాప్ సింగ్)
న్యూఢిల్లీ.
ఫోన్ : 0 981 843 1620



# అమరావతి స్తూపము

– మల్లంపల్లి సోమశేఖర శర్మ

**స్తూపము :**

స్తూపమను సంస్కృత పదమును, దిబ్బయని యర్థమిచ్చు 'థూపో'యను పాలీ పదమును సమానార్థకములు. కాని బౌద్ధ వాస్తువున ఇటికతోనో, ఱాతితోనో, కట్టిన అర్ధగోళాకారముగ నుండు సమాధివంటి ఘన నిర్మాణమునకే స్తూపమను పేరు రూఢియగుటవలన, దిబ్బయైనదెల్ల స్తూపము కాజాలదు. ఈ నిర్మాణము బౌద్ధమతము వాస్తువునకు బ్రసాదించిన విశేషము. స్తూప ప్రాముఖ్యమును దెలిసికొనుటకు, బుద్ధుని జీవితము కొంత తోడ్పడగలదు.

కుశనగరమునకు వెలుపటనున్న మకుట చందనమనుచోట బుద్ధుని శరీరమునకు దహనసంస్కారము కావింపబడెను. దహనానంతరమున మిగిలిన బుద్ధభగవానుని శరీరావశేషముల కొఱకిరుగుపొరుగు ప్రభువులకు, మల్లులకు వివాదము కలిగెను. కాని ద్రోణుడను బ్రాహ్మణుడీ కలహముడిపి దగ్ధావశేషముల నందరికి సమానముగ బంచి యిచ్చి సమాధానము గావించెను. ఆయవశేషముల నాయా ప్రభువులు తమ దేశములకు గొనిపోయి, వానిని దగిన స్థలముల భద్రపరచి వానిమీద స్తూపములను నిర్మించిరి. ఇట్టి శారీరక స్తూపములు మొదటనెనిమిది వెలసినవి. వీని ధాతుచైత్యములనియు బేరు. ధాతువు లనబడు ధాతుగర్భమని పేరు.

ధాతుగర్భ పదమునకు భ్రష్టరూపము దాగబ (దాగోబా) ధాతు గర్భము మీంది దిబ్బకు స్తూపమని పేరయినను కాలక్రమమున నీరెండు భాగములు కలిసిన సంపూర్ణ నిర్మాణమునకు స్తూపమను పేరు రూఢి యయినది. బుద్ధులు, ప్రత్యేక బుద్ధులు, అర్హతులు, చక్రవర్తులు మాత్రమే స్తూప గౌరవమున కర్హులని బౌద్ధుల మహాపరినిర్వాణ సూత్రమున దెలుపబడినను విఖ్యాతులయిన బౌద్ధాచార్యులకును స్తూపములు వెలసినవి. శారీరక ధాతువులను మాత్రమే కాక పరిభోగిక ధాతువును, అనఁగా బుద్ధుఁడు కాని, అర్హతులు కాని, చక్రవర్తులు కాని, ఆచార్యులు కాని యుపయోగించిన భిక్షాపాత్రములు, చేతికఱ్ఱలు, పానపాత్రములు – ఇట్టివానిని గూడ పదిలపరచి స్తూపములు నిర్మించుట వాడుకయయినది. కాలక్రమమున బుద్ధునితో సంబంధముగల పవిత్ర క్షేత్రములందు ధాతురహితముగనే, వట్టి స్మారక చిహ్నములుగఁ గూడ స్తూపములు వెలయుచు వచ్చినవి. స్తూపములకు సింహళమున 'దాగబ' (దాగోబా)లనియు, నేపాళదేశమున 'చైత్యము'లనియు, బర్మాదేశమున 'పెగోడా'లనియు వ్యావహారిక నామము చెల్లుచున్నది. బౌద్ధయుగమున స్తూపమున కీరీతిని ప్రాముఖ్యము కలిగెను. బౌద్ధకళయందు బుద్ధుని మహాపరినిర్వాణమునకు స్తూపమును, జననమునకు పద్మమును, పరమ సత్య ప్రబోధమునకు బోధివృక్షమును, మృగదావమునందలి బుద్ధుని మొదటి ధర్మ బోధనమునకు ధర్మచక్రమును సంకేతములయి బౌద్ధ శిల్పమునంజిత్రితములయినవి. బౌద్ధయుగమున స్తూపము బుద్ధ భగవత్ప్రీత్యర్థముగ సమర్పించునొక కానుకయై, తన్నిర్మాణము బౌద్ధ ధర్మావలంకులకు పుణ్యప్రదమయిన ధర్మకార్యమయినది.

అలంకార పరిశోభితములయి కనులు కోరగించునట్టి దివ్యసుందర విగ్రహములు, చూడముచ్చటయయిన కఱ్ఱపని, హృదయ రంజకముగఁ జేతితో వ్రాసిన చిత్రములు మొదలయిన కళావిదగ్ధములకు కృతులున్నచోటికి పోరాదని బౌద్ధులకు బుద్ధుని యాదేశమున్నను వారి నిష్కలంక హృదయములు సంసార దుఃఖమునంతరింపఁజేయ నవతరించిన ప్రేమావధి బుద్ధభగవానుని యెడల భక్తిరస ప్రపూర్ణములయి, వారి నారాధకులుగ దిద్దినవి; ఈ రీతిని కాలక్రమమున భక్తిరహితమయిన మతమున భక్తియు, ఆరాధన రహితమయిన మతమున ఆరాధనమును మొలకెత్తి, అట్టి యాదేశమునొసంగిన బుద్ధభగవానుని చుట్టునే కళానిధానములయిన మనోహర శిల్పకావ్యములెన్నియో

విరచితములై అది బౌద్ధము స్వరూపస్వభావములనే సంపూర్ణముగ మార్చివైచెను.

భక్తులయిన బౌద్ధశిల్పుల సిద్ధహస్తముల స్తూప నిర్మాణమొక కళయై క్రమ పరిణామమునొంది వన్నెయు, వాసియు గాంచెను. ఇందువలన స్తూపములలో అతి పురాతనములైన వానికిని, అటు తరువాత వెలసినవానికిని రూపకల్పమునందును, నిర్మాణ కళయందును గొంత పరిణామముండుటచేత కొన్నికొన్ని వ్యత్యాసములు కాన్పించును. ప్రజలకు బుద్ధభగవానుని యెడల భక్తి గౌరవములను, మత విషయకమగు ప్రబోధమును కలిగించుటకు బౌద్ధశిల్పులు బుద్ధజీవిత కథలను, బౌద్ధగాథలను చిత్రించుచుండిరి. బౌద్ధ గాథలు మొదట చాలా పరిమితముగనే యుండినను క్రమముగ నవి యసంఖ్యముగఁ బెరిఁగినవి. వీనిలో, ఈ జన్మమున బుద్ధుఁడయి నిర్వాణ పదవినొందిన బోధిసత్త్వుడు దయ, అహింస, ప్రేమలకు లక్ష్యముగఁ గడపిన పూర్వజన్మములకు సంబంధించిన వృత్తాంతములగు జాతక కథలను ప్రజారంజకములయినవి. ప్రపంచ కథావాఙ్మయమునందెల్ల ఈ జాతక కథావళి కడుంగడు ప్రాచీనమయినదనియేకాక, చాలా కథల కాకరములందే కలవని ప్రాచ్య పరిశోధక పండితులకు విదేశీయులును, భారతీయులునుగూడ అభిప్రాయ పడుచున్నారు. మొట్టమొదట, బౌద్ధకళ యారంభ దశలో, శిల్పమున బుద్ధుని చిత్రింపవలసివచ్చినప్పుడు భౌతికమాన విధేయములయిన నామరూపములను విడిచి, యా సాధువంతసము నిర్వాణము నొందెనని తెలుపుటకు గుర్తుగ నచ్చటి స్థలమును శూన్యముగ నుంచువారు. చిత్రాభావమే బుద్ధభావమునకు చిహ్నముగ నుండెను. కాలము గడచినకొలఁది, మొదట నీ స్థలమున బుద్ధుని శ్రీపాదములును, పిదప రూపమును చిత్రితములయినవి. బౌద్ధ స్తూప మీ విధమయిన శిల్ప సంపదతో పరిఢవిల్లుచు, కళానిధానమయి కనులకు విందొనరించుచుండెడిది. సిద్ధహస్తులయిన శిల్పులు తమ బుద్ధిని, ప్రజ్ఞను సమస్తము భగవదర్పితముగావించి కళారూపముననే భగవానుని ఉపాసించుచుండిరి.

✧ ✧ ✧

భక్తులయిన యాంధ్రదేశ కళోపాసకులు బుద్ధభగవానుని పాదపీఠిని కానుకగా సమర్పించిన యట్టి పూజాకుసుమములలో అమరావతీ స్తూపమొకటి. ఇది కృష్ణానదీ తీరమున, ఆ నది ముఖద్వారమునకు రమారమి యఱువది మైళ్ల కెగువను, ప్రాచీనాంధ్ర రాజధానీ నగరమయిన ధాన్యకటకమను నిప్పటి ధరణికోటకు తూర్పున నరమైలు దూరముననున్నది. ఇది యిప్పటి అమరావతీ గ్రామమునకు నడుమ నుండుట చేత అమరావతీ స్తూపమని దీనికిఁ బేరు కలిగినది. క్రీస్త్వారంభ శతాబ్దులలో ధాన్యాకరమని నామాంతరముఁ గల ధాన్యకటక నగరము దక్షిణాపథము నందలి నగచములలోనికెల్ల నవతంసమై ప్రఖ్యాతిఁ గాంచుటవలన నిది ధాన్యకటకట చైత్యమనియు, బౌద్ధ సంఘము నివసించుట కనువయిన విహారములు మొదలగునవనేకము లిచట నుండుట చేత ధాన్యకటక సంఘారామ మనియు బౌద్ధ వాఙ్మయమున నిది ప్రసిద్ధమైనది.

ఈ స్తూపమెప్పుడు నిర్మితమయినదో స్పష్టముగఁ దెలిసికొనుట కాధారములు లేవు. శారీరక స్తూపములెనిమిదింటిలో అశోకుఁడేడింటిని తెఱపించి యందల ధాతువులను చిన్నచిన్నవిగ పెక్కు విభాగములు గావించి, యందొకొక్క దానిమీఁద నొక్క టొకటిగ దేశమునందలి వేర్వేరు భాగములందు మొత్తముమీఁద నెనుబది నాలుగువేల స్తూపములను గట్టించినట్లు తరువాతికాలపు బౌద్ధగాథలు తెలుపుచున్నవి. కొన్ని ఇట్టి గాథల వలననే అమరావతీస్తూప నిర్మాత అశోక చక్రవర్తియని తెలియుచున్నది. ఈ గాథలు విశ్వసనీయములనుటకు ప్రమాణాంతరములు లేకపోయినను ఈ స్తూపపు రాలమీఁద మౌర్యలిపితో శాసనములుండుటవలన మౌర్య వంశమువారి పరిపాలనమున మాత్రమిది నిర్మింపఁబడి యుండుననుట నిస్సంశయము. స్తూపశల్పిమునందలి యపరిణతములయిన ప్రాచీన రీతులు, పరిణతములుగఁ గానవచ్చు నర్వాచీన వేఱుపఱిచి చూచిన యెడల, ప్రాచీనరీతులననుసరించి కూడ ఇచ్చటి ప్రాథమిక స్తూపము క్రీ.పూ. రెండు వందల ప్రాంతమున వెలసినదిగనే కన్పట్టును. అశోక ప్రేషితుఁడయి యాంధ్రదేశమున కరుదెంచిన మహాదేవ భిక్షువు స్థాపించిన చైతన్య పంథ కిది ప్రధాన పీఠమగుటచేతను, అటు తరువాతి కాలపు శాసనములం దిది మహాచైత్యమని పేర్కొనఁబడుట చేతను ఒకవేళ నిది యశోక చక్రవర్తి యాదరణమున వెలసినదన్ననవచ్చును. కాని యిది యూహామాత్రమే. ప్రారంభమున వెలసిన చైత్యము (స్తూపము) చుట్టును

కాలక్రమమున పెక్కు చైత్యములు వెలసి, యిది బహువిధాలంకార ప్రాకార పరిశోభితమయి, చూచువారలకు నేత్రపర్వ మొనరించుచు వార్త కెక్కినది.

మహాదేవుని నాఁటనుండి యీధాన్య కటక మహాచైత్య క్షేత్రము ఆంధ్ర మహాసాంఘికులకు ప్రధానమయిన పవిత్ర పీఠముగ నుండినది. ధాన్యకటకము రాజధానిగ ఆంధ్రదేశము బరిపాలించిన ఆంధ్రవంశ్యులగు శాతవాహనులు బౌద్ధమతము నాదరించి యీ చైత్యమును బెక్కు విధముఁ బెంపొందించిరి. ఈ విధమున నిది క్రీ.పూ. 200లు మొదలు క్రీ.శ. మూఁడవ శతాబ్దివఱకు, అనగా ఆంధ్ర రాజుల పరిపాలనము నంతమువఱకు నిది విభవాభిరామమయి క్రమాభివృద్ధినందుచుండెను.

**పూర్వశైల, అపర శైలములు :**

మౌర్య వంశానంతర కాలపు స్తూప శాసనములను బరిశీలించినచో నందిది 'చెతికియానం నికాయస మహాచైతియ'మనఁగా చైత్యకనికాయము యొక్క మహాచైత్యమని పేర్కొనఁబడినది. మహాసాంఘికులలో చైత్యకవాదులొకరు. ఈ బౌద్ధసంఘమును దాక్షిణాత్య బౌద్ధులు చైత్యవాద సంఘమున, ఉత్తరాది బౌద్ధులు చైత్య, శైల సంఘమని వ్యవహరించుచుండిరి. ఈ సంఘముకాక అమరావతి నాగార్జునుని కొండ శాసనములందు పూర్వశైల (పునసేలియ), అపరశైల (అపరసేలియ) నికాయములు కూడఁ బేర్కొనఁబడినవి. పూర్వశైల, అపరశైలములను పేరఁబరఁగిన యిచటి బౌద్ధ సంఘారామములు బౌద్ధ వాఙ్మయమునందు కడుంగడు ప్రసిద్ధికెక్కినవి. రమ్యహర్మ్య కళాసౌందర్యమును, ప్రకృతి దృశ్యసౌందర్యమునుగూడ నీ సంఘారామములకుఁగలదని యేడవశతాబ్దినిచ్చటి కరుదెంచిన యువాన్‌చాంగ్ అను చీనా యాత్రికుఁడు వీనిని కీర్తించియున్నాడు. ఇవి పూర్వోక్త శాసనములందుఁగొన్నిట పూర్వమహావనశైల (పువమహావన సేలియ), అపరమహావన శైల (అపరమహావన సేలియ) నామములఁ బరికీర్తితములయినవి. క్రీస్తు శకము రెండవ, మూఁడు శతాబ్దులనాఁటి 'గండవ్యూహ'మను నొక బౌద్ధ గ్రంథమున ధాన్యాకరము (ధాన్యకటకము)నకుఁ బూర్వ దిశయందు 'విచిత్రమాల ధ్వజ వ్యూహ'మను పేరఁ బ్రసిద్ధమయిన యొక మహారణ్యము కలదని చెప్పఁబడినది. దీనిననుసరించి చూడ ధాన్యకటక సమీపమున పూర్వపశ్చిమ దిశలందు మహావనావృత శైలములుండియుండు ననియు, దానం జేసియే యా శైలములందలి సంఘారామములకు పూర్వ, అపర మహావన శైలములని పేర్లు కలిగెననియు గొందరూహించుచున్నారు.

పూర్వ, అపరశైలము లేవియను విషయమున పరిశోధక పండితులలో భేదాభిప్రాయములు కలవు. పూర్వ శైలము బెజవాడయని కొందఱి మతము. ఇటీవల త్రవ్వఁగా నాగార్జునుని కొండయొద్ద బయటపడిన స్తూప సంఘారామ, ప్రాకృత శాసనాదులననుసరించి చూడ ధాన్యకటకమునకుఁ దూర్పున నున్న సంఘారామము పూర్వశైలమను పేరను, పశ్చిమమున నున్న సంఘారామము అపరశౌలమను పేరను బ్రసిద్ధములయ్యెనని యూహింపఁదగియున్నది. ఇవికాక కృష్ణానదీతీరమున కంటకశైలమని మఱియొక సంఘరామముండినట్లు శాసనములవలన విదితమగుచున్నది. ఈ కంటక శైలమే యిప్పటి ఘంటశాల. నాగార్జునకొండ, అమరావతులందలి స్తూపములవలెనే ఇచ్చటిదికూడ మహాచైత్య నామాంకితమము తనరారు చుండుటచేత, నాఁడు కృష్ణానదీ తీరమున వెలసిన సంఘారామమాదులన్నియు మహాచైత్యక పంథకు సంబంధించినవిగఁ గన్పట్టును. ఈ కారణమున చైత్యక నికాయమే పూర్వశైల, అపరశైల సంఘములుగ విడిపోయెనని కొందఱందురు; దీని నంగీకరింప మఱికొందరు పూర్వాపర శైల సంఘములవలెనే చైత్యక సంఘము కూడ ఆంధ్రదేశ మహా సాంఘికులందలి ప్రత్యేకమయిన మూఁడవ విభాగమని చెప్పుదురు. ఆచార వ్యవహారములయందును, శిక్షానియమములయందును బరస్పరము వీరికి నెట్టి భేదములు కలవో తెలియదు కాని వీర లెల్లరు నొక్క పంథకే చెందినవారని శాసనముల వలన స్పష్టమగుచున్నది.

**అంధకులు :**

ఎట్లయిన నేమి, ఆంధ్రదేశమున కరుదెంచి చాల కాలము గడచిన మీఁదట మహాసాంఘికులలో పెక్కు తెగలేర్పడినవి. పైని పేర్కొనినవికాక శాసనాధారమున రాజగరికులు లేక రాజగిరి నివాసకులని, సిద్ధాంతికులని మఱి రెండు తెగల పేర్లు తెలియుచున్నవి. ఇవి యనియు బౌద్ధగ్రంథములందును బేర్కొనఁబడినవి. హిమవత, వాజిరియ, పువ్వసేలియ, అపరసేలియ, రాజగిరీయ, సిద్ధాంతిక సంఘములు మహావంశమువలనఁ

దెలియవచ్చును. పూర్వశైల, అపరశైల, చైత్యకులతోపాటు హైమవతులు, లోకోత్తర వాదులు, ప్రజ్ఞప్తివాదులు అను మూఁడు క్రొత్త తెగలను బర్జెస్ దొర పేర్కొనియున్నాడు. ఈ తెగల పేర్లెట్టి వయి నను చైత్యక, పూర్వశైల, అపరశైల, రాజగిరిక, సిద్ధాంతిక నికాయములు కేవలము తెలుఁగు దేశపు తెలటని తెలుఁగు దేశపు ప్రాకృత శాసనములందు వీరుదాహృతులగుటవలన నిశ్చయింపవచ్చును. వీరిలోఁ గడపటి నాలుగు తెలడవారు బౌద్ధగ్రంథములందు అంధకులు అను పేరఁ బేర్కొనఁబడిరి.

**అంధకులే ఆంధ్రులు :**

క్రీస్త్వబ్దమున కించుక పూర్వమునఁ గూడ ఆంధ్రదేశమునందలి యీ ధాన్యకటక ప్రాంతము బౌద్ధమతమునకు పంటపొలమయి, బౌద్ధులకుఁ బట్టుగొమ్మగనుండెననుటకు సింహళద్వీప చరిత్రవే యాధారము. బౌద్ధ వాఙ్మయమున 'తాంబపణ్ణి' యనఁబరఁగిన సింహళద్వీపమును క్రీస్త్వబ్దమునకు రెండు వందల సంవత్సరములకుఁ బూర్వమున పాలించుచుండిన 'దుట్ఠగామణి'యను ప్రభువు అనురాధపురమున 'మహాథూపము (ర్వాన్‌వెల్లి మహాసత్తాపము)'ను నిర్మించుచుండిన సందర్భమున హిందూదేశమునందలి వేఱువేఱు ప్రాంతములనుండి అర్హతులు, ఆచార్యులు వేలకొలఁది బౌద్ధసాంఘికులతో నచ్చటికరిగిరఁట. ఇట్లు వెళ్లిన వారిలో అర్హతుఁడయిన మహాదేవుఁడొక్కఁడు. ఇతఁడు 'పల్లవ భొగ్గ'మున నుండి నాలుగు లక్షల యఱువదివేల భిక్షువులను వెంటనిడికొని వెళ్లెనఁట. భిక్షువుల సంఖ్య యతిశయోక్తియని త్రోసివేసినను, 'పల్లవభొగ్గ'మున బౌద్ధమత మత్యంతాభివృద్ధి చెందుచుండెనని యూహించుట సమంజసము కాకపోదు. 'భోగ్గ' (భొగ్గ) పదము 'మహేంద్ర భోగము', 'కవచకార భోగము', 'మహానిభోగము' అని ప్రాచీన శాసనములందు దేశ విభాగ పరముగ వాడుక చేయఁబడి నందున, 'పల్లవభొగ్గ' (పల్లవభోగ) మనునదియు నొక దేశ విభాగమయి యుండుట నిశ్చయము. దేశ విభాగమను నర్థమున 'భోగ'మునకు బదులు దేశ, విషయ, నాఁడు పదములు ప్రాచీన శాసనములందుఁ బ్రయుక్తము లగుటవలన 'పల్లవ భొగ్గ'మనునది 'పల్లవ విషయ'మని కాని, 'పల్లవనాఁడని' కాని చెప్పవలసి యుండును. 'పల్లవనాఁడే ఇప్పటి పలలనాఁడ'యినదని కొందరు చరిత్రకారుల యభిప్రాయమగుటవలన 'పల్లవభొగ్గ' యనునది 'పలనాఁ'డని నిర్ణయింపఁదగును. పల్లవనాఁడును, అందలి ధాన్యకటకమును ప్రాచీన కాలమున పల్లవులు పాలించిరని శాసనములవలనను, గాథల వలననుగూడఁ దెలియుచున్నది. త్రిలోచన పల్లవునికి ధాన్యకటకమొకప్పుడు రాజధానిగా నుండినట్లు గాథలు కలవు. కాంచీపురము రాజధానిగఁ పరిపాలనము నెఱపిన పల్లవులు ధాన్య కటకమునఁ దమ ప్రతినిధులను నిలిపి యాంధ్రాపథమును పాలించినట్లు శాసనములు తెలుపుచున్నవి. క్రీస్తుశక పల్లవునికి ధాన్య కటక మొకప్పుడు రాజధానిగా నుండినట్లు గాథలు కలవు. కాంచీపురము రాజధానిగఁ పరిపాలనము నెఱపిన పల్లవులు ధాన్యకటకమునఁ దమ ప్రతినిధులను నిలిపి యాంధ్రాపథమును పాలించినట్లు శాసనములు తెలుపుచున్నవి. క్రీస్తుశక మాఱవ శతాబ్దిని విష్ణు కుండుల విజృంభణము ననంతరమునఁగాని పల్లవులు కృష్ణానదీ తీరమును విడచి యింకను దక్షిణ దిశకు సాగియుండలేదు. స్వతంత్ర రాజ్యము స్థాపించుటకు పూర్వము కూడ ఆంధ్రరాజులయిన శాతవాహనులకు సామంతులను, సైనాధిపతులునయి, పల్లవులు ప్రాముఖ్యము గడించి బౌద్ధ గ్రంథములందు నాగదేశమని ప్రసిద్ధమయిన యీ ప్రాంతమునందలి వారితో సంబంధ బాంధవ్యములు నెఱపి వర్ధిల్లుచుండిరి. పల్లవులకు జన్మస్థలముగఁ గాక పోయినను వారికిఁగల యితర సంబంధాధిక్యమువలన 'పల్లవ భొగ్గము' (పలనాడు) అను పేరఁబరఁగిన యీ ధాన్యకటక ప్రాంతము క్రీస్త్వశబ్దమునకుఁ బూర్వమునఁగూడ బౌద్ధమతమునకు 'చేవపట్టు' నుండెనని నిరూఢమగుచున్నది. బౌద్ధమత మట్లు ప్రబలుచుండినను అమరావతీ స్తూపమునఁ గడు ప్రాచీన చిత్రము లరుదుగను, అర్వాచీనములయినవి, అనగా మొదలి స్తూపము నిర్మితమయిన రెండు వందల సంవత్సరములకుఁ దరువాతివి, అధికమగను గన్పించుటచేత మొదటినాళ్లలోకంటే తరువాతనే ఇచ్చటి స్థూపము పెంపు చెంది, గొప్ప బౌద్ధక్షేత్రముగ ప్రఖ్యాతమయినట్లూహింపవలసి యున్నది. ఆది బౌద్ధమునందద్భుత పరివర్తనము జరిగిన కాలముననే యీ స్తూపమత్యంతము పెంపుచెందుటచేత దీని పేరు పెంపులకుఁ దోడుపడిన యా పరివర్తనమును గురించి యించుక తెలిసికొనుట యావశ్యకము.

**మల్లంపల్లి సోమశేఖర శర్మ**

(రచనాకాలం : 1937)



# అశోక ధర్మశాసనాలు

**(ఆముఖం)**

*- సి.వి. రామచంద్రరావు*

### I. అన్వేషణ - ఆవిష్కరణ

క్రీ. పూ. మూడోశతాబ్దంలో మౌర్యచక్రవర్తి అశోకుడు తన ప్రజల సుఖశాంతులను, ధర్మోన్నతిని కాంక్షించి, శాశ్వతంగా ఉండే రీతిలో, శిలాక్షరంగా వేయించిన ధర్మశాసనాలు భారతదేశ శాసన వాఙ్మయంలో అపూర్వమయినవి. అశోకచక్రవర్తి జీవిత విశేషాలను గూర్చి, చరిత్రనుగూర్చి, అతని కాలంలోని పాలనా విశేషాలనుగూర్చి, సాంఘిక, మత పరిస్థితులనుగూర్చి, అన్నిటినీమించి అతను తన సామ్రాజ్యంలోనూ, ఇరుగుపొరుగు రాజ్యాలలోను వ్యాప్తి చేయటానికి సమకట్టిన ధర్మాన్నిగూర్చి అనేక విషయాలను మనకు ఎరుకపరచే ఈ శాసనాలు కాలగమనంలో కనుమరుగయిపోయాయి. క్రీ.శ. అయిదో శతాబ్దంలో, భారతదేశాన్ని దర్శించిన చైనా బౌద్ధ యాత్రికుడు ఫాహియానూ, ఏడో శతాబ్దంలో భారతదేశాన్ని దర్శించిన మరొక చైనా బౌద్ధ యాత్రికుడు హ్యూయన్‌త్సాంగూ, వారు రచించిన యాత్రా గ్రంథాలలో తాము దర్శించిన అశోక నిర్మితాలైన స్తూపాలను, శాసన స్తంభాలను కొన్నిటిని పేర్కొన్నారు. కాని వాటినిగూర్చి వారు ఎక్కువగా ఏమీ చెప్పలేకపోయారు. వాటి లిపిని గుర్తించి, వాటిని చదివి, వాటిలోని విషయాన్ని తెలుపగల భారతీయుడెవ్వడూ ఆనాటికే వారికి లభ్యపడ్డట్లు లేదు. అందుచేత వాటిలోని విషయమేమిటో వారికి అవగతం కాలేదు. వారి తరువాతి కాలంలో, ఈ శాసన శిలలను, స్తంభాలను, భారతదేశంలోని పండితులు, పామరులు, వెయ్యేండ్లకు పైబడి, పందొమ్మిదో శతాబ్దం వరకు, పూర్తిగా విస్మరించారు. అశోక శాసనాలనేవి కొన్ని ఉన్నాయి అనే విషయాన్నే భారతీయులందరూ మరచిపోయారు. ఆధునిక యుగంలో వీటిని వెలుగులోనికి తెచ్చి, వాటి లిపిని గుర్తించి, శాసన పాఠాలను చదివి, అందులోని విషయాలను చరిత్రతో సమన్వయించి, అశోక చక్రవర్తి చరిత్రను, మహోన్నతము ఉదాత్తము అయిన అతని వ్యక్తిత్వాన్ని, ఘనతను ప్రపంచానికి వెల్లడించి, భారతీయ సంస్కృతికి, చరిత్రకు ఎనలేని ఔన్నత్యాన్ని చేకూర్చి, భారతీయులందరికీ ప్రాతఃస్మరణీయులైనవారు పాశ్చాత్యులైన ప్రాచ్య పండితులు.

ఆధునిక యుగంలో అశోక శాసనాల ఉనికిని మరలా కనుక్కోవటం, వాటికైన అన్వేషణ ఆసక్తికరమైన ఒక గొప్ప సాహసగాథ. తన సామ్రాజ్యంలో, ప్రజలు దండిగా చేరే చోట్లలో, యాత్రాకేంద్రాలలో, రహదారుల కూడళ్ళలో, జనసమ్మర్దాలయిన రాష్ట్ర రాజధానులలో, పాలనాకేంద్రాలలో అశోక చక్రవర్తి, 'ధర్మలిపులు' 'ధర్మశ్రావణాలు' అనే పేరుతో ఈ శాసనాలను శిలలపై, శిలాస్తంభాలపై చెక్కించాడు. అట్లాటి స్థలాలలో, ఎక్కువమంది ప్రజలు తన ధర్మసందేశాలను చదివి, ఉత్తేజం పొందాలనీ, వాటిలోని ధర్మాలను ఆచరించాలనీ ఆకాంక్షించాడు. కాని, చరిత్రగతిలో, కాలగతిలో, అశోక శాసనాలున్న ఈ స్థలాలు అనేకం, జనశూన్యాలై, నామరూపరహితాలై, దారీ తెన్నూ లేని స్థలాలైపోయాయి. కుగ్రామాలైపోయాయి; అడవులైపోయాయి. అయితే, అశోక శాసనాలు అవి ఉన్న స్థలాలు అన్నీ ఇలా మారుమూలలలో కనుమరుగైపోలేదు. ఢిల్లీ సుల్తాన్ అయిన ఫీరోజ్ షా తుగ్లక్ (క్రీ.శ. 1351-88), నేటి హర్యానాలోని తోప్రాలో, ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ఉన్న అశోక శాసన స్తంభాలను చూచి, ఆ స్తంభాల నిర్మాణాన్ని మెచ్చుకొని, క్రీ.శ. 1356లో (అంటే అశోకునికి పదహారు వందల ఏండ్లు తర్వాత), వాటిని ఢిల్లీకి తరలించినట్లు మధ్యయుగ ముస్లిం చరిత్రకారుడు షంసిసిరాజ్, తారీఖ్-ఇ-ఫిరోజ్ షాహీ అనే తన చరిత్ర

గ్రంథంలో పేర్కొన్నాడు. అట్లే కౌశాంబీలోని ఒక స్తంభశాసనాన్ని అక్బర్ అలహాబాద్‌కు తరలించినట్లు తెలుస్తుంది. ఒక్కొక్కటి, సరాసరిన, 50 అడుగుల ఎత్తు, 50 అంగుళాల చుట్టుకొలత కలిగి, 30 నుంచి 50 టన్నుల బరువు ఉన్న ఈ స్తంభశాసనాలలో, తోప్రాలో లభించిన దానిని ఢిల్లీ చేర్చటానికి ఫిరోజ్ షా చేసిన విశేష ప్రయత్నాలను షంసిసిరాజ్ పేర్కొన్నాడు. తోప్రాస్తంభాన్ని ఢిల్లీ చేర్చటానికి, ఫిరోజ్ షా, 42 చక్రాలతో ఒక పొడవైన బండిని తయారుచేయించాడని, ఒక్కొ చక్రానికి కట్టిన మోకును 200 మంది మనుషుల చొప్పున లాగి, ఆ స్తంభాన్ని యమునా తీరానికి చేర్చారని, దాదాపు 5000 నుంచి 7000 మణుగుల ధాన్యాన్ని మోయగల పెద్ద పడవలు చాలా వాటిమీద దానిని యమున దాటించి ఢిల్లీ (ఫిరోజాబాద్)కు చేర్చారని షంసిసిరాజ్ తెలుపుతాడు. ఇట్టి ప్రయత్నమే చేసి మీరట్ వద్ద ఉన్న అశోక స్తంభ శాసనాన్ని కూడా ఫీరోజ్ ఢిల్లీకి చేర్చాడు. ఆ కాలంలో ప్రజలు వాటిని పాండవ మధ్యముడైన భీముని చేతి కర్రలని చెప్పుకొనేవారని కూడా సిరాజ్ తెలుపుతాడు. తోప్రా స్తంభాన్ని ఢిల్లీ చేర్చిన తర్వాత, ఫిరోజ్ కొంతమంది పండితులను పిలిచి, ఆ స్తంభం మీద రాసి ఉన్న దానిని చదివి చెప్పమన్నాడు. ఎవ్వరూ దానిని చదువలేకపోయారు. కాని కొంతమంది తెలివైనవారు, రాజును మెప్పించటానికై, ఫీరోజ్‌షా తుఘ్లక్ అనే మహమ్మదీయ రాజు అవతరించేదాకా, దాని స్థానాన్నుంచి ఆ స్తంభాన్ని మరెవ్వరూ కదలించలేరని రాసి ఉందని చెప్పారట! ఫీరోజ్ తర్వాత, 1398లో ఢిల్లీపై దండెత్తిన తైమూర్ ఈ స్తంభాలను చూచి, ఇటువంటి అద్భుత స్మృతి స్తంభాలు ప్రపంచంలో మరెక్కడా లేవని మెచ్చుకొన్నాడని కూడా సిరాజ్ తెలుపుతాడు. ఫీరోజు కాలంనాటికి, అశోక శాసనాల ఉనికిగానీ, వాటి లిపిగానీ, భాషగానీ భారతీయులకు పూర్తిగా ఎరుకలో లేకుండా పోయినాయని పైన పేర్కొన్న ఉదంతం స్పష్టం చేస్తుంది. ఇట్లా కొన్ని శతాబ్దాలుగా ప్రపంచం విస్మరించిన అశోక శాసనాల ఉనికినీ, వాటి లిపినీ మరలా తెలుసుకోవటమనేది, ఆధునిక యుగ చారిత్రక అన్వేషణలో, పరిశోధనా జిజ్ఞాసలో, అత్యంత ఆశ్చర్యకరమైన, ఆసక్తికరమైన, ఆహ్లాదకరమైన ఘట్టం. ఈ లిపిని గుర్తించి అశోక ధర్మశాసనాలలోని పదజాలాన్ని చదివిన తర్వాత, వాటిని సరిగా అర్థం చేసుకొనే సమస్య చాలాకాలం అట్లే మిగిలిపోయింది. అశోక శాసన పరిశోధనకు సంబంధించి – శాసనాల ఉనికిని కనుక్కోవటం, వాటి లిపిని తెలుసుకోవటం, వాటిని చదివి శాసన పాఠాలను అర్థం చేసుకోవటం, ఆ శాసన పాఠాలలోని వివిధ విషయాలను చరిత్రతో సమన్వయించటం మొదలయిన రంగాలలో రెండు శతాబ్దాలకు మించిన ప్రగతిని, దానిలోని వివిధ ఘట్టాలను, ఈ ప్రగతిని సాధించిన పరిశోధకులను, పండితులను గూర్చి చెప్పవలసి ఉంటుంది. ఇక్కడ ఈ ప్రగతిలోని ప్రధాన ఘట్టాలను కొన్నింటిని మాత్రమే పేర్కొంటాము.

1750 ప్రాంతంలో క్రైస్తవ ఫాదరీ టిఫెన్ థేలర్ (Padre Tiffenthaler) ఢిల్లీ వద్ద గల, ఢిల్లీ – మీరట్ అశోక శాసన స్తంభంలోని కొన్ని భాగాలు చూడటంతో, అశోక శాసన అన్వేషణ, వాటిని కనుక్కోవటం ప్రారంభమయింది. నాటినుంచి అనేకులయిన పాశ్చాత్య పండితుల జిజ్ఞాస, అన్వేషణ, సాహసం, కృషి ఫలితంగా 1837 నాటికి బరాబర్ గుహాశాసనాలు, ఢిల్లీ–తోప్రా, అలహాబాద్–కోసం స్తంభశాసనాలు, గిర్నార్, షాబాజ్‌ఘడీ శిలాశాసనాలు గుర్తించి, వాటి ప్రతులను *Asiatic Researches* మొదలయిన పత్రికలలో ప్రచురించటం జరిగింది. ఈ శాసనాల ప్రతులు ఆధారంగా, కలకత్తాలో టంకశాల అధికారిగా ఉన్న జేమ్స్‌ప్రిన్సెప్, అశోక శాసనాల వర్గీకృత అక్షర పట్టికను రూపొందించి దానిని 1834లో, Journal of the Asiatic Society of Bengalలో ప్రచురించాడు. అప్పట్లో ప్రిన్సెప్ అశోక శాసనాలలోని అన్ని అక్షరాలను గుర్తించలేకపోయాడు; హల్లుల తర్వాత వచ్చే ఆ, ఏ లను, అనుస్వారాన్నీ తెలిపే అక్షరాలను మాత్రమే ఊహించగలిగాడు. మరో ఆర్నెల్ల అధ్యయనం తర్వాత య, వ, న లను మాత్రం గుర్తించగలిగాడు. 1837 అశోక శాసన పరిశోధనలో చిరస్మరణీయమైన సంవత్సరం; జేమ్స్‌ప్రిన్సెప్ ఢిల్లీ–తోప్రా స్తంభశాసనాన్ని పూర్తిగా చదివి, తాను చదివిన పాఠాన్ని,



Emperor Ashoka faints into the arms of his queens at the sight of the Bodhi tree. A modern photograph capturing the detail that earlier depictions missed. (Photo by Andrew Whittome)

దాని ఇంగ్లీషు అనువాదాన్ని *Journal of the Asiatic Society of Bengal,* Vol.VIలో ప్రచురించాడు. అప్పటికే లౌరియా అరరాజ్, లౌరియా నందన్‌ఘడ్ స్తంభశాసన పాఠాల ప్రతులు ప్రిన్సెప్ దగ్గర ఉండినాయి. ఆ యేడే, మేజర్ పి.యల్. ప్యూ తీసిన శాసనపు అచ్చులు ఆధారంగా, ప్రిన్సెప్ ఢిల్లీ–మీరట్ స్తంభశాసనాన్ని, రాణి స్తంభశాసనాన్ని "లిథోగ్రాఫ్" చేసి ప్రకటించాడు. ఆ సంవత్సరంలోనే, ఒరిస్సాలోని భువనేశ్వర్‌కు అనతి దూరంలో, మారుమూలగా ఉన్న ధౌళివద్ద అశోకశాసనాలను లెఫ్టినెంట్ కిట్టో కనుక్కొన్నాడు.

1838లో అశోకశాసన అధ్యయనం ఇతోధికంగా ముందుకు సాగింది. గిర్నార్, ధౌళీలవద్ద లభించిన అశోక శాసనాల పాఠాలను జేమ్స్‌ప్రిన్సెప్ తులనాత్మక అధ్యయనం చేసి, అవి లిపిలో, భాషలో, విషయంలో ఒకటిగా ఉన్నట్లు కనుక్కొని, వాటిని చదివి, వాటి పాఠాలను ఇంగ్లీషు అనువాదాలతో *Journal of the Asiatic Society of Bengal,* Vol.VIIలో ప్రచురించాడు. తరువాతి కాలంలో 1840–1879 మధ్య సహస్రాం, బభ్రా, జౌగడా, కాల్సీ, బైరాత్, రూపనాథ్ శిలాశాసనాలు, రాంపూర్వా స్తంభశాసనం కనుక్కోవటం జరిగింది. 1879లో కన్నింగ్‌హ్యాం (Maj. Gen. Cunningham) నాటికి లభ్యమయిన అశోక శాసనాలన్నిటినీ Corpus Inscriptionum Indicarum (భారతదేశ శాసన సంచయం) Vol.VIలో ప్రచురించాడు. ఈ ప్రచురణ అశోక శాసన పరిశోధనలో, అధ్యయనంలో విశిష్టమైన సంఘటన; 1850ల వరకు ప్రిన్సెప్, బర్నూఫ్, విల్సన్ మొదలైన పండితులు చేసిన కృషి అశోక శాసన అధ్యయనంలోని మొదటి ఘట్టంగా భావిస్తే, ఈ ప్రచురణతో దానిలోని రెండోఘట్టం ప్రారంభమయిందని చెప్పవచ్చు. 1925లో హుల్ట్‌జ్ష్ (Hulzsch) పైన పేర్కొన్న *Corpus*ను (శాసన సంచయాన్ని) పునఃసంశోధితంగా, కొత్త 'ఎడిషన్'గా ప్రచురించటంతో, అశోక శాసన అధ్యయనం మరొక ఘట్టానికి చేరి ముందుకు సాగింది. 1925 నాటికి సోపారా, మాన్‌సెహ్రా, నిగలీసాగర్, రుమ్మిందై, సారనాథ్, మాస్కీల వద్దగల అశోక శాసనాలనూ, మైసూరు రాజ్యంలోని అశోక శాసనాలను మూడింటినీ కనుక్కోవటం జరిగింది. 1880–1925 కు మధ్యగల కాలంలో అశోక శాసన అధ్యయనం చాలా ముందుకు జరిగి, ఆ శాసనాలను గూర్చి, అశోక చరిత్రను గూర్చి Senart, Buhler, Frank, V.A. Smith, Fleet, Michelson, Luders, F.W. Thomas, Hultzsch, A.C. Woolner మొదలయిన పాశ్చాత్య పండితులు, డి.ఆర్. భండార్కర్, కె.పి. జయస్వాల్, బి.యం. బారువా మొదలయిన భారతీయ పండితులు, ఫ్రెంచి, జర్మన్, ఇంగ్లీష్ భాషలలో రాసిన అనేక గ్రంథాలు వెలువరించిటం జరిగింది.

జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, కలకత్తాలో అధికారిగా ఉండిన ఎ. ఘోష్, కర్నూల్ జిల్లాలో భూగర్భ నిక్షిప్తమయిన లోహాలకై అన్వేషిస్తూ, ఆ జిల్లాలో, పత్తికొండ తాలూకాలో, ఎర్రగుడి అనే గ్రామం వద్ద గల గుట్టలమీద ఉన్న అశోక శాసనాలను 1928లో కనుక్కొన్నాడు. ఆ శాసనాలలోని 'దేవానం.. పియదసి' అనే అక్షరాలను గుర్తుపట్టి, ఇవి అశోకునికి చెందినవని తెలుసుకొన్నాడు. ఎర్రగుడిలో అశోక శాసనాలను కనుక్కొన్న విషయాన్ని, పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్, 1929 ఫిబ్రవరి 11న పత్రికాముఖంగా లోకానికి వెల్లడించాడు. సుప్రసిద్ధ తెలుగు సాహిత్య మాసపత్రిక *భారతి,* 1929 సెప్టెంబర్ సంచికలో, "అశోక శాసనాలు – రాయలసీమ" అనే శీర్షికకింద ఈ శాసనాలనుగూర్చి మల్లంపల్లి సోమశేఖరశర్మగారు చక్కని వ్యాసం రాసి ఉన్నారు; శాసనంలో కొంతభాగం యొక్క ఫోటోనుకూడా ప్రచురించారు. ఎర్రగుడికి అతి దగ్గరగా (3.3 కి.మీ. దూరంలో) ఉన్న రాజుల మండగిరిలో అశోకుని మొదటి, రెండో లఘుశాసనాలు లభించాయి. 18వ శతాబ్దం చివరి పాదంలో కల్నల్ కాలిన్ మెకంజీ వీటికి, పండితులయిన కావలి వెంకటబొర్రయ్య మొదలయిన తన 'అసిస్టెంట్ల'చేత నకళ్ళు తీయించాడు. కాని నకళ్ళు తీసినవారు వీటిని అశోక శాసనాలుగా గుర్తించలేదు. వీటిని మద్రాసు ఓరియంటల్ మ్యానుస్క్రిప్ట్ లైబ్రరీలోని "మెకంజీ మ్యానుస్క్రిప్ట్"లో Local Records, Vol.29. Sheet 28, Title 55లో చూడవచ్చు. ఈ విషయాన్ని 1946లోనే ఒక జిజ్ఞాసువు, భారత ప్రభుత్వ శాసనాధికారి దృష్టికి తెచ్చినా, శాసనశాఖవారు రాజుల మండగిరిని 1952దాకా గుర్తించలేకపోయారు; 1953 డిసెంబర్‌లో శాసనశాఖవారు ఈ శాసనాలకు నకళ్ళను తీశారు. 1947లో భారతదేశం స్వతంత్రమయింది. 1925 నుంచి 1950 వరకు, కారణాలేమైనా, కొత్త స్థలాలలో అశోకశాసనాలను కనుక్కోవటం జరుగలేదు. 1950లతో ప్రారంభించి, 1980 వరకు గల ముప్పైఏండ్ల కాలంలో మన పండితుల యొక్క ప్రభుత్వ శాసనశాఖ వారియొక్క అన్వేషణా

ఫలితంగా అశోక శాసనాలున్న అనేక నూతన స్థలాలను కనుక్కోవటం జరిగింది. ఇటీవలి కాలంలో, బళ్ళారి జిల్లాలో ఉన్న నిట్టూరువద్ద 1977లోనూ, ఆ నిట్టూరుకు అతి సమీపంలో ఉన్న ఉదెగోళంవద్ద 1978లోనూ, అశోకుని లఘు శిలాశాసనాలను కనుక్కొన్నారు. మనకు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, అశోక శాసన అన్వేషణలో జరిగిన ఈ కృషిని; శాసనాలు లభించిన స్థలాలను, ఈ కింది అశోక శాసన సమీక్షలో పేర్కొని ఉన్నాము.

**II. చారిత్రక సమీక్ష :** భారతదేశ చరిత్రకు సంబంధించి నేటికి లభించిన విస్తార శాసన సంచయంలో అశోక శాసనాలు చారిత్రకాధారాలుగా ఎనలేనివి. వెలలేనివి. అఖండ భారతదేశంలో తూర్పున పుండ్రనగరం (నేటి బంగ్లాదేశ్‌లో, బోగ్రా, జిల్లాలో కరతోయానది ఒడ్డున ఉన్న మహాస్థాన్) నుంచి పడమట పురుషపురం (పెషావర్, పాకిస్తాన్) వరకు, దక్షిణాన కర్నాటకం నుంచి ఉత్తరాన కాశ్మీరం వరకు వ్యాపించి ఉండిన అశోక సామ్రాజ్యంలో పలుతావుల ఈ శాసనాలు లభించాయి. భారతదేశపుటెల్లలను దాటి, అశోక సామ్రాజ్యంలో అంతర్భాగంగా ఉండిన ఆఫ్ఘనిస్తాన్‌లో అశోక శాసనాలు లభ్యమయినాయి. అశోకుని ఆజ్ఞమేరకు అతని మాటలలో, అతని పాలనా వత్సరాలను పేర్కొంటూ, శిలలలో గండరించిన అశోకుని స్వీయచరిత్రగా ఈ శాసనాలు అమూల్యమయినవి, అపురూపమైనవి. ఈ శాసనాలలో అశోకుడు తన ధర్మాశయాలను, పాలనాశయాలను తనకు తానై వివరణాత్మకంగా తెలిపి ఉన్నాడు. ఈ శాసనాల ఉనికి అశోక సామ్రాజ్య సరిహద్దులను మనకు ఎరుకపరచి దాని విస్తృతిని తెలుపుతుంది.

**భాష :** భారతదేశంలో నేటికి లభించిన అశోక శాసనాలన్నీ ప్రాకృతభాషలో రాయబడినాయి. ఆనాటి ప్రజల వ్యవహార భాషలకు ప్రాకృతమన్నది సామాన్య నామం. అశోక శాసనాలు, అశోక సామ్రాజ్యపు ప్రాక్ పశ్చిమాల మధ్యగల కొద్ది వ్యావహారిక భాషాభేదంతో, సామ్రాజ్యానికంతా రాజధాని అయిన పాటలీపుత్రంలో అధికార భాషగా వాడిన మాగధీ ప్రాకృతంలో రాయబడినాయి. భారతదేశానికి వెలుపల ఉండి, అశోకుని సామ్రాజ్యంలో చేరి ఉండిన ఆఫ్ఘనిస్తాన్‌లో లంపాక లేక లంఘమాన్ అనేచోట లభించి అశోకునిదిగా తలచబడిన ఒక శాసనం అరమైక్ భాషలో రాయబడింది (ఈ 'అరమైక్' జీసస్ క్రైస్తు మాతృభాష). ఆఫ్ఘనిస్తాన్‌లోనే కందహార్ వద్ద లభించిన ఒక శాసనం ద్విభాషా శాసనంగా, గ్రీక్, అరమైక్ భాషలలో ఉంది. అక్కడే లభించిన మరివొక అశోక శాసనం గ్రీకు భాషలో ఉంది.

**లిపి :** అఖండ భారతదేశపు సరిహద్దుల లోపల, ఒక్క వాయవ్య ప్రాంతంలో లభించిన అశోక శాసనాలలో తప్ప, మిగిలిన అన్ని ప్రాంతాలలో లభించిన శాసనాలు బ్రాహ్మీలిపిలో రాయబడినాయి. పర్షియా (ఇరాన్)కు దగ్గరగా ఉన్న వాయవ్య ప్రాంతంలో లభించిన శాసనాలు మాత్రం పర్షియన్ – అరమైక్ భాషా సంబంధమైన ఖరోష్ఠి లిపిలో రాయబడినాయి. బ్రాహ్మీలిపి ఎడమ నుంచి కుడికి రాయబడుతుంది. ఖరోష్ఠి లిపి కుడి నుంచి ఎడమకు రాయబడుతుంది. పోగా, కర్నాటక రాష్ట్రంలోని బ్రహ్మగిరిలో లభించిన లఘు శిలాశాసనంలో, శాసనమంతా బ్రాహ్మీలిపిలో ఉండి, చపడ అనే లిపికారుడు దానిని లిఖించాడని తెలిపే "చపడనే లిఖితే లిపికరేణు" అనే చివరి పంక్తి మాత్రం ఖరోష్ఠి లిపిలో రాయబడింది. ఆంధ్రదేశంలో ఎఱ్ఱగుడి (పత్తికొండ తాలూకా, కర్నూలుజిల్లా; గుత్తి స్టేషనుకు సుమారు 14 కి.మీ.) వద్ద లభించిన అశోకుని లఘు శిలాశాసనంలోని కొన్ని పంక్తులు. బ్రాహ్మీలిపిలో, కుడి నుంచి ఎడమకు, ఎడమ నుంచి కుడికి వరుస క్రమంలో, "బూస్ట్రో ఫెడాన్" (వృషభగతి లేక ఎద్దు దున్నే పద్ధతి) పద్ధతిలో రాయడం జరిగింది.

కొన్ని వేల ఏండ్లుగా, భారతదేశంలో, వాని లిపి ఏమో, వాని భాష ఏమో గుర్తింపబడక, కొండలలో, గుట్టలలో, మారుమూల ప్రదేశాలలో, గ్రామాలలో మరుగునపడి మనము మరచిపోయిన అశోక శాసనాలను క్రీ.శ. 1837లో ఈస్టిండియా కంపెనీ కొలువులో టంకసాల అధికారిగా ఉండిన ప్రాచ్య విజ్ఞానవేత్త జేమ్స్ ప్రిన్సెప్ మొట్టమొదటగా గుర్తించి, వాని పాఠాలను ప్రచురించి వాని ప్రాముఖ్యాన్ని పండిత లోకానికి తెలిపినది మొదలుగా, ఇటీవలివరకు, అశోక శాసనాలనేకం బయల్పరచడం జరిగింది. ఇటీవలి కాలంలో 1977లో బళ్ళారి జిల్లా సిరుగుప్ప తాలూకాలోని నిట్టూరువద్ద, 1978లో నిట్టూరుకు నైఋతిగా అయిదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉదెగోళం వద్ద అశోకుని శిలాశాసనాలను కనుగొన్నారు. కాలక్రమంలో, అన్వేషణా ఫలితంగా, అశోక శాసనాలు ఇంకా లభించే అవకాశం ఉంది.

డా. సి.వి. రామచంద్రరావు

*(సనాతన ధర్మ ప్రతీకలు అశోక ధర్మశాసనాలు)*

# తెలుగులో బౌద్ధ రూపకాలు

*- దామెర వేంకట సూర్యారావు*

**క్రీ.** పూ. 3వ శతాబ్దికి ముందే ఆంధ్రలో బౌద్ధం పాదుకున్నా తెలుగు సాహిత్యంలో ఆధునిక యుగారంభంలోనే బౌద్ధ గ్రంథాలు వెలువడటం ప్రారంభమైంది. 1902 వరకు బౌద్ధం మీద తెలుగులో ఒక్క గ్రంథమైనా వెలువడలేదు. తెలుగు సాహిత్యంలో బౌద్ధ ఇతివృత్తాలలో గ్రంథాలు వెలువడటం తిరుపతి వేంకట కవులు 1902లో రాసిన బుద్ధచరిత్రతో ప్రారంభమైంది. ఈ మార్పుకు చాలా కారణాలున్నాయి. సమాజంలో వచ్చిన అనేక పరిణామాలు బౌద్ధ పునరుజ్జీవనానికి దోహదం చేశాయి. సామాజిక విలువల పరివర్తన, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలపై అనురక్తి, మానవతావాదం, వర్ణవ్యవస్థ నిరసనం, తెలుగు సాహిత్యంపై ఆంగ్ల సాహిత్య ప్రభావం, జాతీయోద్యమంలో భాగంగా అహింసాయుత పోరాటం మొదలైన విషయాలు తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేశాయి. వివిధ ప్రక్రియల్లో బౌద్ధరచనలు అవతరించాయి. బౌద్ధం ప్రభావంతో తెలుగులో చాలా దృశ్యకావ్యాలు వెలువడ్డాయి. ఈ నాటకాలు, నాటికలను బుద్ధచరిత్ర రూపకాలూ బౌద్ధధర్మ రూపకాలు అని రెండు విధాలుగా వర్గీకరింపవచ్చును. బుద్ధుని జీవితంలోని ఘట్టాలను చిత్రించిన రూపకాలు కొన్ని కాగా, కొందరు నాటక కర్తలు బౌద్ధధర్మాన్ని, తత్వాన్ని ప్రతిబింబించే రూపకాలు రచించారు.

**బుద్ధ బోధ సుధ :** తెలుగులోని బుద్ధ నాటకాల్లో ఇది మొదటిది. ప్రఖ్యాత నాటకకర్త, 'సాక్షి' వ్యాస సంపుటాలతో ప్రసిద్ధుడైన పానుగంటి లక్ష్మీనరసింహరావు 1910లో ఈ నాటకం రచించారు. నాటక పీఠికలో కవి 'శ్రీ బుద్ధశంకర రామానుజానందతీర్థ చైతన్యాది మతకర్తల బోధనములు జనులకు సుబోధకమగునట్లు వ్రాయదలచి మహత్తర పురుషుడని ఎన్నబడిన, బుద్ధాచార్యుని బోధనల విందు పొందుపరచితిని' అని రాసారు. తన *ది డైలాగ్స్ ఆఫ్ బుద్ధ*, రైస్ డేవిడ్స్ *బుద్ధిజమ్, బుద్ధిస్ట్ ఇండియా*, మాధవాచారి *సర్వదర్శన సంగ్రహం*, లక్ష్మీనర్సు నాయుడు గారి *ఎసెన్స్ ఆఫ్ బుద్ధిజం* గ్రంథాలు చదివి చేతనైనంతవరకు గ్రహించి రాశానని పేర్కొన్నారు. ఈ నాటకంలో 10 అంకాలున్నాయి. ప్రాచీన నాటక లక్షణాలను అనువదించి రాయబడిన నాటకం ఇది. ఇందులో బుద్ధుడు, కౌండిన్యుడు, ఆనందుడు, పురాణ కశ్యపుడు, దేవదత్తుడు, అంగులీమాలుడు, అంబట్టుడు, అజాతశత్రువు మొదలైన పాత్రలున్నాయి. అజాతశత్రువుకు బుద్ధుడు అష్టాంగమార్గం బోధించడంతో నాటకం ముగుస్తుంది.

**ఆత్రేయ - కొండముది :** 'గౌతమబుద్ధ' పేరుతో ఐదారు నాటకాలు వెలువడగా ఆచార్య ఆత్రేయ, కొండముది గోపాలరాయ శర్మ గారి నాటకాలు సాహిత్యపరంగానూ, ప్రదర్శనపరంగానూ ప్రసిద్ధమైనాయి. ఆత్రేయగారి నాటకం 1943లో వెలువడింది. ఈ నాటకానికి *ది ఎడ్వంచర్స్ ఆఫ్ ది బ్లాక్ గర్ల్ ఇన్‌సెర్చ్ ఆఫ్ గాడ్* అనే బెర్నార్డ్‌షా కథ ప్రేరణ అని మొదలి నాగభూషణ శర్మ పేర్కొన్నారు. ఈ నాటకం కావ్యంవలె సాగిన రూపకం. ఇందులో 10 దృశ్యాలున్నాయి. అందరికీ తెలిసిన సిద్ధార్థుని జ్ఞానోదయ గాథను సరికొత్తగా మలచటం నాటకంలోని ప్రత్యేకత. క్రీస్తు జననంలోవలె బుద్ధ జనన సందర్భంలోనూ ఒక నక్షత్రం ప్రవేశిస్తుంది. పాత్రలు ప్రతీకాత్మకంగా సూచించబడినాయి. గోపాలరాయ శర్మ గారి నాటకంలో 5 అంకాలున్నాయి. బుద్ధుని జీవితంలోని ప్రధాన సంఘటనలు దృశ్యాలుగా మలచబడ్డాయి.

చల్లా నారాయణ శాస్త్రి గారి 'విశ్వజ్యోతి' పద్యనాటకం. అర్నాల్డు ఆంగ్ల కావ్యాన్ని తిరుపతి వేంకట కవుల బుద్ధచరిత్రను ఆధారంగా తీసుకొని ఈ దృశ్య ప్రబంధం రాసినట్లు కవి పేర్కొన్నాడు. నాటకంలో మనోజ్ఞమైన కల్పనలున్నాయి. బండ్ల సుబ్రహ్మణ్య కవిగారు సంస్కృత నాటక సంప్రదాయాన్ని అనుసరించి 7 అంకాల నాటకం రచించారు. ఈ నాటకంలో సిద్ధార్థుడిలో వైరాగ్యం మొలకెత్తడానికి కారణభూతుడైన చెన్నడు సిద్ధార్థునికి ప్రథమ గురువు. రూపనగుడి నారాయణ రావు సౌందరనంద నాటకం రచించారు. పింగళి - కాటూరు

కవుల కావ్యం సౌందరనందం ఈ నాటకానికి మాతృక. సౌందరనందంలో లేని దేవదత్తుడు, మరికొన్ని పాత్రలు ఈ నాటకంలో ఉన్నాయి. హేతువాది అయిన మలయశ్రీ 1973లో 'శాంతిపథం' నాటకం రచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు అకాడెమీ కలిసి నిర్వహించిన నాటక పోటీల్లో ఉత్తమ నాటకంగా బహుమతి పొందింది. ఇంటర్మీడియట్ విద్యార్థులకు కొంతకాలం పాఠ్యగ్రంథమైంది. ఈ నాటకంలో పద్యాలూ పాటలూ ఉన్నాయి. అశోకధర్మ చక్రము, బౌద్ధ హర్షవర్ధనుడు మొదలగు పద్యకావ్యాలు రచించిన మన్నె నాగేశ్వరరావుగారి 10 అంకాల పద్యనాటకం 'కమలాకుమారుడు'. నాటకంలో కవి సామాజిక స్పృహ, సామ్యవాద దృష్టి ద్యోతకమువుతున్నాయి.

**బౌద్ధ ధర్మ ప్రతిపాదిత రూపకాలు :** మల్లాది అవధాని 'జగజ్యోతి' నాటిక రాశారు. బుద్ధుని దంతకాంతులే జగజ్యోతి. దంతాన్ని బుద్ధుని బోధనకీ, కరుణకీ ప్రతీకగా స్వీకరించారు. సుగతుని నిర్వాణానంతరం భద్రపరచిన బుద్ధుని దంతంమీద కళింగరాజు గుహాశివుడు దంతపురాన్ని నిర్మించిన ఉదంతం ఈ నాటకంలో ఉంది. 'తిష్యరక్షిత' పేరుతో ప్రసిద్ధ నవలా కథారచయిత బుచ్చిబాబు నాటకం రాశారు. లైంగిక సహజాతానికి, మతానికి ఘర్షణను ఈ నాటకంలో చిత్రించారు. అశోకుడి మూడవ భార్య తిష్యరక్షిత. బుచ్చిబాబు ఈ నాటకాన్ని బౌద్ధ నేపథ్యంలో రాసిన బౌద్ధదర్శనాధారంగా రాయలేదు. ఆత్రేయ మలో నాటకం 'అశోక సామ్రాట్'. చండాశోకుడు ధర్మాశోకుడుగా పరివర్తితమైన తీరును ఈ నాటకంలో రచయిత ప్రదర్శించారు. పాకాల రాజమన్నార్ 'నాగుపాము' నాటకం అజంతా గుహలు, బౌద్ధవిహారం నేపథ్యంగా సాగుతుంది. ఇందులో శిల్పి నాగసుందరుడు నాయకుడు. ఆంధ్ర రాజ తనయ జయశ్రీ నాయిక. దుఃఖానికి కారణం తృష్ణ అని కామం శారీరక సుఖాపేక్ష అని ఈ కారణాన్ని నిర్మూలిస్తే దుఃఖం నశిస్తుందని ఈ నాటకం సందేశం. అద్దేపల్లి రామమోహనరావు 'సంఘం శరణం గచ్ఛామి' పేరుతో వచన కవితా నాటకం రచించారు. బుద్ధుడు యజ్ఞం చేస్తున్న బింబిసారునిలో పరివర్తన తీసుకురావడానికి కరుణతత్వాన్ని ఆవిష్కరించాడు. 'ఒక ప్రాణి మరో ప్రాణిని బాధించడం, తన అభ్యుదయ నిశ్రేణకను తన చేతులారా విరగ్గొట్టటం ఒక జీవి వేరొక జీవిని హింసించడం తన గుండెలో తానే నిశిత ఖడ్గాన్ని పొడుచుకోవటం' అంటాడు కవి.

**జి.వి. కృష్ణారావు రూపకాలు**

ప్రముఖ హేతువాది డా. జి.వి. కృష్ణారావు బౌద్ధం ఇతివృత్తంగా 'బొమ్మ ఏడ్చింది' ప్రతిక్రియ రూపకాలు రచించాడు. 'బొమ్మ ఏడ్చింది' నాటకం గతంలో నాగార్జున విశ్వవిద్యాలయంలో పాఠ్యగ్రంథంగా ఉండేది. గౌతమ పుత్ర శాతకర్ణి భిక్షాటన నిషేధించి బౌద్ధభిక్షువులను చెరసాలలో పెట్టించటం, రాజప్రాసాదంలో బొమ్మ ఏడుస్తూ ఉండటం ఇందులో ఇతివృత్తం. నాగార్జునుడు సుహృల్లేఖలో రాజుకు న్యాయం గురించి శిక్షా సంస్కరణల గురించి వివరిస్తాడు. ఇందులో నాగార్జునుడి పాత్ర చాలా ఉదాత్తంగా చిత్రించబడిన కథాంశం యొక్క చారిత్రకత సందేహాస్పదం 'ప్రతిక్రియ' నాటిక. 'ప్రతిక్రియ' అంటే దెబ్బకు దెబ్బతీయడం. బౌద్ధం ప్రతిక్రియ ఎలా ఉంటుందో విలక్షణంగా రచయిత చిత్రించారు. కౌశాంబి నగరంలో రాహులుడనే బాలుడు హేమచంద్రుడనే సంపన్నుడివద్ద సేవకుడుగా ఉంటాడు. తన యజమాని ఆజ్ఞపై అతడికి పాదుకలు తెస్తుండగా బాలుడు శరీరం మీది చెమట చుక్కలు పాదరక్షలపై పడి యజమాని ఆగ్రహానికి గురౌతాడు. హేమచంద్రుడు అహంకారంతో బాలుణ్ణి కొట్టి, చెప్పులను పారవేయిస్తాడు. బాలుడు ఆ చెప్పులను తానే దాచుతాడు. బౌద్ధ గురువులవద్ద శిష్యరికం చేసి జ్ఞానం సంపాదించి పరిణత చెంది, బౌద్ధవిహారానికి కులపతి అయ్యాడు. అప్పుడతని పేరు విశ్వంకరుడు. హేమచంద్రుడు బౌద్ధం స్వీకరించాలనుకొని ఉత్సవం ఏర్పాటు చేస్తాడు. ఆ ఉత్సవంలో విశ్వంకరుడు హేమచంద్రుని పాదాలకు పాదరక్షలు తొడుగుతాడు. భిక్షువు తన పాదరక్షలు ధరింపజేయడంలో ఒకనాటి సంఘటన హేమచంద్రుని మనస్సులో మెదలి చలించిపోయాడు. ఇటీవల నందమూరి లక్ష్మీపార్వతి 'శ్రమణకం' నాటకం స్త్రీవాద దృక్పథంలో రాశారు. ఈ నాటకం ప్రదర్శించబడింది. 'సౌందరనందం' కావ్యం ప్రభావంలో ఈ నాటకం రచించబడింది. బౌద్ధం ప్రభావంతో గేయ రూపకాలు, నృత్య నాటికలు కూడా వెలువడటం విశేషం. పోలవరపు కోటేశ్వరరావు 'గౌతమ బుద్ధ' యక్ష గాన నాటికను, ఆచార్య బేతవోలు రామబ్రహ్మం 'సౌందరన నందం' నృత్యనాటికను రచించారు. బౌద్ధం స్ఫూర్తితో ఈ విధంగా తెలుగు రూపక సాహిత్యం పరిపుష్టమయింది.

డా. దామెర వేంకట సూర్యారావు
మధురానగర్, విశాఖపట్నం. ఫోన్ : 988 518 8431



ప్రపంచ సాహిత్యంలో

# జాతక కథలు

**పిటకాల్లో జాతక కథల స్థానం :**

బౌద్ధ సాహిత్యం మొత్తం మూడు ప్రధాన భాగాలుగా ఉంది. అవి,

1. వినయపిటక (భిక్షు నియమాలు)

2. సుత్త పిటక (బుద్ధుని బోధనలు)

3. అభిధమ్మపిటక (అత్యున్నత బౌద్ధ తత్త్వ దర్శనం)

వీటిలో సుత్త పిటకంలో 5 సంకలనాలున్నాయి. అవి,

1. దీఘనికాయ . 2. మజ్ఝిమ నికాయ 3. సంయుత్త నికాయ 4. అంగుత్తర నికాయం 5. ఖుద్ధక నికాయం.

వీటిలో ఖుద్ధక నికాయం లో 10 భాగాలున్నాయి. అవి,

1. ఖుద్ధక పాఠ (బౌద్ధ సుత్తాలు)

2. దమ్మపథ (423 గాథల సంకలనం)

3. ఉదానం (బుద్ధుని ఉపదేశ గాథల సంకలనం)

4. ఇతి వుత్తక ('నేను ఇలా విన్నాను' అని చెప్పే బుద్ధుని బోధనలగురించి మరొకరు చెప్పే గాథల సంకలనం)

5. సుత్తనిపాత (సూత్రాలు)

6. విమానవత్థు (స్వర్గ భవన వర్ణన)

7. పేతవత్థు (పాపాలవల్ల పొందే దుఃఖాలు)

8. థేరగాథ (బౌద్ధ భిక్షువుల గాథా సంకలనం)

9. థేరిగాథ (బౌద్ధ భిక్షుణీల గాథా సంకలనం)

10. జాతకాలు (బుద్ధుని పూర్వ జన్మలకు చెందిన కథలు)

**బౌద్ధ కథా సాహిత్యం :**

బౌద్ధంలో రెండు రకాల కథా సాహిత్యం వుంది.

ఒకటి: జాతక కథలు.

రెండు: అవదాన కథలు

వీటిలో జాతక కథలు చాలా పురాతనమైనవి. క్రీస్తుపూర్వం 5వ శతాబ్దం నుండి ఈ కథలు ఉన్నట్లు ఆధారాలున్నాయి. జాతక కథలు బుద్ధుని జన్మలకు సంబంధించిన కథలు.

*'జాయత ఇతి జాతిః'* అంది అమరకోశం. అంటే పుట్టినది, ప్రాదుర్భవించినది అని. బుద్ధుని పూర్వజన్మల పుట్టుకకు సంబంధించిన కథలు కాబట్టి వీటిని జాతక కథలంటారు. ఇంతకు ముందు 24 మంది బుద్ధులు పుట్టినట్లు బౌద్ధ సంప్రదాయం చెప్తుంది. దీపంకరుడు, కౌండిన్యుడు, మంగళుడు, సుమనుడు, రేవతుడు, శోభితుడు, అనోమదస్సి, పదుమ, నారదుడు, పద్మోత్తరుడు, సుమేధుడు, సుజాతుడు, పియదస్సి, అత్థదస్సి, సిద్ధార్థుడు, తిష్యుడు, పుష్పుడు, విపదశుృడు, శిఖుడు, వెస్సభూ, కుకుసంధుడు, కోణాగమనుడు, కాశ్యపుడు– ఈ 24 మంది గతకాల బుద్ధులని సింహళ దేశ చరిత్ర గ్రంథమైన 'మహావంశ' పేర్కొంది. ఒక్కొక్క కాలచక్రంలో ఒక్కో బుద్ధుడు పుట్టుకొస్తాడు అంటుంది బౌద్ధ సంప్రదాయం. ప్రస్తుతం మనం చెప్పుకునే బుద్ధుడు శాక్యముని. రాబోయే కాలంలో మరి కొందరు బుద్ధులు వస్తారంటుంది ఈ సంప్రదాయం. దీనిని బట్టి, బుద్ధులు పుట్టడానికి ముందు 'బుద్ధత్వం' అనేది ఒక పరిణామ క్రమంలో వచ్చిన మహోన్నత మానవీయతే అని మనకు అర్థం అవుతుంది.

మరి, బౌద్ధం అనాత్మవాదం గదా. 'ఆత్మ'ను ఒప్పుకోదు, అలాగే పునర్జన్మనూ ఒప్పుకోదు గదా! అనే సందేహం కలగక మానదు. బౌద్ధులు పునర్జన్మను అంగీకరించరు. కానీ 'పునర్భవాన్ని' అంగీకరిస్తారు.

'పునర్జన్మ' అంటే 'ఒకే ఆత్మ కొత్త కొత్త శరీరాల్ని ధరించడం. ఒకే ఆత్మ తిరిగి తిరిగి పుట్టడం'.

మరి, పునర్భవం అంటే? జీవ చైతన్యం లేదా విజ్ఞాన చైతన్యం ఒక పరిణామ ప్రవంతిగా జీవుల్లో ప్రవహించడం. విజ్ఞానం కొత్త మారుతూ నూతన పుంతలు తొక్కడం.

**బుద్ధత్వం ఒక పరిణామ ప్రక్రియ :**

పరిణామ మంటే క్రమ క్రమ మార్పు. ఉదాహరణలు కొన్ని చూద్దాం.

1. చెట్లకు పూవులు పుట్టడం: ఈ ప్రక్రియ ఒక్క రోజులోనో, ఒక్క జీవితకాలంలోనో సాధ్యం కాదు. కొన్ని వేల మార్పులు జరిగి 'పూవు' అనే ఒక భాగం పుట్టింది.

2. కోతులకు తోకలు పోవడం: ఈ మార్పు కూడా తెల్లారేసరికి జరగలేదు. దానికీ కొన్ని లక్షల సంవత్సరాలు పట్టింది.

మొత్తంగా పరిణామ వాదం చెప్పేది ఇదే. మార్పు అనివార్యం. ఒక మార్పు మరో మార్పుకు తోడవుతుంది. ఆ మార్పు మరో మార్పుకు కారణం నిలుస్తుంది. ఇలా మార్పులు జరిగి... జరిగి... ఒక నూతనత్వం సిద్ధిస్తుంది. కోతి మనిషయ్యింది ఇలాగే. అలాగే...



3. మానవ సమాజం : మన సమాజం కూడా ఆదిమ దశ, ఆటవిక దశ, అనాగరక దశ, నాగరక దశ, బానిస దశ, రాచరిక దశ, పెట్టుబడిదారీ దశల నుండి సామ్యవాద దశల్లోకి మారుతూ వచ్చింది. మారిన ప్రతి సమాజంలో , గతకాల సమాజంలోని 'క్రూరత్వాలు', 'నియంతృత్వాలు' తగ్గిపోతూ, మానవత్వం పరిమళించే సామ్యవాద భావాలు పెరుగుతూ వచ్చాయి.

అంటే, మానవత్వం కూడా మానవజాతికి తెల్లారే సరికో, మరునాటికో వచ్చిపడింది కాదు. అదీ ఒక క్రమపరిణామంగా సంక్రమించిందే.

ఈ క్రమ పరిణామాన్నే బౌద్ధం 'ప్రతీత్య సముత్పాదం' అంటుంది. అంటే, ఒక దాని వలన మరొకటి పొంది పుట్టడం.

**దశ పారమితల పరిపూర్ణత్వమే బుద్ధత్వం :**

బుద్ధత్వం అంటే గొప్ప మానవత్వం. ఈ గొప్ప మానవత్వం కూడా ఏదో ఒక వ్యక్తికో, ఒక కాలానికో, ఒక జన్మకో 'వచ్చి పడింది' కాదు. వచ్చి పడేదీ కాదు. అలా వచ్చిపడితే అది ప్రతీత్య సముత్పాదానికి సరిపోయేదీ కాదు. మానవత్వం కూడా క్రమ క్రమ వికాసం చెందిందే. బుద్ధత్వం కూడా అనేక పరిణామాల ద్వారా వచ్చిందే అని చెప్పడానికే ఈ జాతక కథలు బౌద్ధంలో వచ్చాయి. మానవత్వం పరిపూర్ణత్వం చెందడానికి ప్రతివ్యక్తీ దశ పాతమితలను పాటించాలి. దానం, శీలం, నిష్కామ, ప్రజ్ఞ, వీర్యం, క్షాంతి, సత్యం, అధిష్ఠానం(సడలని సంకల్పం), మైత్రి, ఉపేక్ష అనేవే ఆ దశ పారమితలు . వీటిని క్రమంగా బోధిసత్త్వుడు అలవరుచుకొని, మహోన్నత మానవునిగా క్రమేపీ పరిణామం చెంది పూర్ణజ్ఞానుడు, పరిపూర్ణ మానవీయ మూర్తిగా మారడం ఈ కథల్లో కనిపిస్తుంది.

ఈ మానవీయ దశల్ని చెప్పే కథలే జాతక కథలు. నిజం చెప్పాలంటే వీటిని బుద్ధుని పునర్జన్మకు సంబంధించిన కథలుగా గాక, కంటే బుద్ధత్వం, మానవీయతల క్రమ పరిణామానికి చెందిన కథలుగా అర్థం చేసుకోవాలి.

'బుద్ధునికి కూడా బుద్ధత్వం ఊడిపడలేదు. సమాజ పరిణామంలో భాగామే' అని చెప్పడం కోసమే ఈ కథలు పుట్టాయి. మానవ సమాజంలో నైతిక పునాదిని పటిష్టపరచి, మానవజాతి మొత్తాన్ని మానవీయ కోణంలోకి తీసుకురావడం కోసమే ఈ కథలు అవసరం అయ్యాయి. అందుకే–

ఈ కథల్లో బుద్ధుని పేరు బోధిసత్త్వుడు అని మాత్రమే వుంటుంది. ఈ 24 మంది పూర్వబుద్ధుల (బోధిసత్త్వుల) కథల్ని 547 కథలుగా మలచారు.

ఈ కథలు ఒకే కాలంలో వచ్చినవి కావు. దాదాపు 600 సంవత్సరాల కాలంలో(క్రీస్తు పూర్వం 500 సంవత్సరాలనుండి, క్రీస్తు శకం ఒకటో శతాబ్దం వరకు) రూపొంది వుంటాయని పండితులు భావిస్తున్నారు.

విశేషం ఏమిటంటే–

ప్రపంచంలో కథా సాహిత్యానికి పునాదిరాళ్ళు ఈ జాతక కథలే.

# సురాపాన కథ

– టి. సీతారామి రెడ్డి

ఒకసారి సద్ధర్మాన్ని గ్రహించి, అప్రమత్తంగా జీవించగలరనే ఉద్దేశ్యంతో శ్రావస్తిలోని ఉపాసకులైన కొందరు గృహస్థులు తమతమ భార్యలను మహా ఉపాసికయైన విశాఖమాత వద్దకు పంపారు. వారు విశాఖతోపాటు భగవానుని దర్శించటానికి ప్రతిరోజూ వెళ్ళివస్తుండేవారు. ధర్మం వింటూ ఉండేవారు. ఆమెతోపాటే ఉద్యానవనంలో కూడ విహరిస్తూ ఉండేవారు. ఇంతలో సురాపాన సప్తాహమనే 'మారుని' పండుగ వచ్చింది. ఆ ఏడు రోజులపాటు వీర త్రాగుబోతులంతా కుండలు కుండలు సురను ఖాళీచేసి మత్తులో తూలిపోయారు. ఆడవారికి కూడ సుర పట్ల మక్కువ కలిగింది. కానీ వారు తమ భర్తల ముందు త్రాగలేక కోరికను అణచుకొని మిన్నకుండిపోయారు. వారం రోజులు గడిచిపోయాయి. మగవారు ఎవరి పనుల్లో వారు మునిగిపోయారు. విశాఖమాత వద్దకు వెళ్ళి వచ్చే స్త్రీలు చాటుగా సురాపానము చేయాలనుకున్నారు. దానికోసం వారు విశాఖమాత ఉద్యానవనాన్ని ఎన్నుకున్నారు. ఉద్యానవనంలో విహరించటానికి విశాఖమాత అనుమతి కోరి కేరింతలు కొడుతూ ఉద్యానవనం చేరుకున్నారు. చాటుగా తెచ్చుకున్న 'సుర'ను పానం చేశారు. మత్తులో జోగుతూ విహరించసాగారు.

విశాఖ వారిని చూసి "శ్రమణ గౌతముని ముఖ్య ఉపాసకురాలు తన చెలులకు ఇలాంటి దుష్కర్మలను నేర్పిస్తుందని ప్రజలు నిందలు వేయగలరు" అని ఆలోచించి, వారిని మందలించి చికిత్సాలయానికి పంపింది. ఈ విషయం ఆ స్త్రీల భర్తలకు తెలిసింది. తాము సురాపానము చేసినందుకు పశ్చాత్తాపపడి, తాము మరలా శీలం తప్పబోమని వారి భార్యల ముందు వాగ్దానం చేశారు. వారిని కూడా తప్పు చేసినందుకు మందలించి క్షమించారు. కానీ మరో సందర్భంలో ఆ స్త్రీలంతా మధువు పట్ల మక్కువకలిగి మళ్ళీ మాత ఉద్యానవనాన్నే ఎన్నుకోవాలనుకున్నారు. కానీ వీరి సంగతి పసిగట్టి విశాఖ వారికి అనుమతి ఇవ్వలేదు. తరువాత ధర్మం వినాలని వారు పదేపదే ప్రాధేయపడగా వారిని భగవానుని దర్శనానికి వెంట తీసుకువెళ్ళింది. కానీ వారు పువ్వులు, ఫలాలతోపాటు మధువును కూడా వెంటతెచ్చుకుని విహారానికి చేరుకున్నారు. సమయం చూసుకుని చాటుగా మద్యపానం చేశారు. తాగిన మత్తులోనే కొందరు గానం చేస్తూ, కొందరు నృత్యం చేస్తూ భగవానుని ముందుకు వచ్చారు. విశాఖ ఆశ్చర్యపోయింది. వారి చిత్త బలహీనతకు ఎంతో జాలిపడింది. ధర్మోపదేశం చేసి, వారిని దారిలో పెట్టమని భగవానుని ప్రార్థించింది.

ఇదంతా మారుని పన్నాగమని తెలుసుకున్న భగవానుడు వారి మత్తును వదలగొట్టటానికి బుద్ధి విద్యను ప్రయోగించి, గాడాంధకారాన్ని సృష్టించాడు. అప్పుడు ఆ స్త్రీలకు మరణ భయం కలిగి మత్తంతా వదలిపోయింది. వారి చిత్తాలు ధర్మం గ్రహించటానికి అనువుగా మారాయి. భగవానుడు ఈ గాథను పలికాడు:

***"కోను హాసో కిమానన్దో, నిచ్చం పజ్జలితో సతి ।***
***అన్ధకారేన ఓనద్ధా, పదీపం న గవే సథ ॥"***

*ధమ్మపదం జరావర్గం – 146*

ఎక్కడ అన్నీ ప్రతి క్షణం జ్వలించిపోతున్నాయో అక్కడ నవ్వుకు, ఆనందానికి తావెక్కడుంది. ఈ అవిద్యాంధకారాలు ఆవహించిన మీరు జ్ఞాన ప్రకాశపు దీపాన్ని ఎందుకు వెదకరు?

ధర్మబోధ విన్న ఆ మహిళలు, ఆర్య అష్టాంగ మార్గంలో పయనిస్తూ ధర్మాన్ని ఆచరిస్తూ ధన్యులయ్యారు.

ఈ సందర్భంలో విశాఖ భగవానుని ఇలా అడిగింది: "భంతే ఇదంతా పాపకరమైన మదిరాపాన ప్రభావమేకదా! కుల స్త్రీలు కూడ దీని ప్రభావానికి లోనయ్యారు. సర్వజ్ఞ సంబుద్ధుని ముందు ఇంగిత జ్ఞానం కోల్పోయి అనుచితంగా ప్రవర్తించారు. భగవాన్ అలాంటి ఈ సురాపానం ఎప్పుడు ఆరంభమైంది."

"విశాఖా! ఈ సురా ప్రభావం అలాంటిదే! దీని ఉచ్చులో పడ్డ ఎవరైనా పండిత, పామర భేదం లేకుండా ధనవంతులు, పేదవారు అనే తారతమ్యం లేకుండా గొప్పవారు, సామాన్యులు అనే తేడా లేకుండా మార్గభ్రష్టులౌతారు. సుర ఉత్పత్తి ఇలా జరిగింది:"

"పూర్వ కాలంలో హిమాలయ పర్వత శ్రేణుల్లో అడవిలో నివాసముండే 'సురా' అనే ఆటవికుడు ఒకరోజు దట్టమైన అడవిలో తిరుగాడసాగాడు. అడవిలో తిరుగుతూ తిరుగుతూ అలసిపోయాడు. దాహం వేసి, ఒక చెట్టు క్రింద కూర్చున్నాడు. ఆ చెట్టు క్రింద ఒక లోతైన గుంట ఏర్పడి ఉంది. దానిలో వర్షపు నీరు నిలువ ఉన్నాయి. సమీపములోని ద్రాక్షపళ్ళు, విప్పపూలు, ఉసిరికాయలు, మిరపకాయలు, రావి ఆకులు నీటిలో పడ్డాయి. సూర్యరశ్మికి ఆ నీరు మరిగి ఒకరకమైన ఎర్రని ద్రవంగా మారిపోయింది. ఆ అడవికి చుట్టుప్రక్కల ఉన్న పొలాల నుండి తెచ్చుకున్న ధాన్యపు కంకులను ఆ చెట్టు కొమ్మలపై కూర్చుని కొన్ని పక్షులు ధ్యాన్యాన్ని తినే సమయంలో కొన్ని గింజలు ఆ గుంటలో పడడం జరిగింది. అన్నింటి సారం నీటిలో కలవటంవల్ల, ఆ నీరు రక్తవర్ణంగా మారిపోయింది. బాగా దాహంగా ఉన్న 'సుర' అనే ఆటవికుడు ఆ ద్రవాన్ని త్రాగాలనుకున్నాడు. కానీ అది విషతుల్యమైనదేమో అనే భయం కలిగి, అలాగే ఆగిపోయాడు. ఇంతలో తాపానికి తాళలేక అక్కడ తిరుగాడే కొన్ని జింకలు ఆ నీటిని త్రాగటం జరిగింది. తాగిన కొద్దిసేపటికే అవి స్పృహతప్పి, కింద పడిపోయాయి. 'సురా' అది విషమేనని నిశ్చయించుకున్నాడు. ఎండ ఎక్కువగా ఉండటంతో ఆ చెట్టు క్రిందే కొంతసేపు శయనించాడు. మెలకువ వచ్చి చూసేసరికి పడివున్న లేళ్ళన్నీ ఒక్కొక్కటిగా లేచి, వెళ్ళిపోవడం కనిపించింది. ఆ గుంటలో నిద్ర వశం కాదని నిశ్చయించుకుని దాహం తీర్చుకోడానికి ఒక దోసిలి నిండా ఆ ద్రవం తీసుకుని త్రాగాడు. అతనికి మత్తు ఆవహించింది. ఆకలి వేయటంతో అక్కడే స్పృహతప్పి పడివున్న జింకను పట్టుకుని కాల్చి, ఆ మాంసమును తినటానికి సిద్ధం చేసుకున్నాడు. పెద్ద ఆకులతో ఒక దోనెను తయారు చేసుకుని దాని నిండా ఆ ద్రవాన్ని నింపుకుని జింక మాంసాన్ని ఒక కర్రకు వ్రేలాడ తీసుకుని సమీపంలో వున్న 'వరుణ' అనే తపస్వి ఆశ్రమానికి వెళ్ళాడు. ఇద్దరూ ఆ ద్రవాన్ని త్రాగి, మాంసాన్ని తిన్నారు. మొదటిసారిగా 'సురా' అనేవాడు 'వరుణ' అనేవాడు పానం చేశారు కనుక ఆ ద్రవానికి 'సురా' అని, 'వారుణి' అనే పేర్లు వచ్చాయి.

వారిద్దరూ ఆ ద్రవ్యాన్ని దగ్గరలోని నగరానికి తీసుకువెళ్ళి అమ్మకం చేయసాగారు. ఒకరోజు ఆ నగరాన్ని పాలించే రాజు ఆ ద్రవాన్ని సేవించి మత్తులో తేలిపోయారు. ప్రతిరోజూ దాన్ని ఇవ్వవలసిందిగా వారిని కోరాడు. దాంతో ఆ అమ్మకందారులిద్దరూ ఆ ద్రవాన్ని అందరికీ అమ్మటం కోసం ఎక్కువగా తయారు చేయటం నేర్చుకున్నారు. తయారు చేసిన దాన్ని కుండలలో నిల్వ ఉంచి ముంతలతో అమ్మసాగారు. ఈ విధంగా మొదలైన సురాపాన వ్యసనం ఒక తరం తరువాత మరొక తరం జంబూద్వీపం అంతా వ్యాపించింది.

ఒకప్పుడు సర్వమిత్రుడనే రాజు జంబూద్వీపాన్ని పరిపాలిస్తూ ఉండేవాడు. కళ్యాణమిత్రులు తోడు లేకపోవటంతో అధర్మానికి మిత్రుడయ్యాడు. సురాపానానికి మిత్రుడై ప్రజల క్షేమం వదలి దేశాన్ని క్షామానికి గురిచేశాడు. యథారాజ, తథా ప్రజ అన్నట్లు ప్రజలు కూడా వారుణి మైకంలో మునిగి పగటి చుక్కల వల్లో పడ్డారు. రాజ్యంలో నీతినియమాలు ఉల్లంఘించబడ్డాయి. అరాచకం ప్రబలింది.

జంబూద్వీపం ఇలా భ్రష్టుపట్టిన సమయంలో బోధిసత్త్వుడు శక్రుడుగా దేవలోకంలో జన్మించాడు. శీలవ్రతాన్ని ఏమాత్రం తప్పని బోధిసత్వుడు పరహిత ఉద్యమాన్ని మర్చిపోకుండా తన దృష్టిని దేవలోక సుఖాల నుండి మరల్చి జంబూ ద్వీపం వైపుకు సారించాడు. దుఃఖంలో ఉన్న ఆ ప్రజలపై కరుణ వెల్లివిరిసింది. రాజును, ప్రజలను ధర్మమార్గంలో పెట్టి రక్షించాలనుకున్నాడు. తన ఇంద్రజాలంతో, దైవబలంతో, బుద్ధిమహిమతో వర్షాలను కురిపించాలనుకోలేదు. ప్రజలచేతే, రాజుచేతే ధర్మాన్ని ఆచరింపజేసి, దాని ఫలితంగా ప్రకృతి శాంతిస్తుందని తెలియపరచాలనుకున్నాడు. శాంతించిన ప్రకృతి దేశాన్ని సుభిక్షం చేస్తుందని తెలియజేయాలనుకున్నాడు. ధర్మాచరణకు, ప్రకృతికిగల కార్యకారణ సంబంధాన్ని నిరూపించాలనుకున్నాడు.

వెంటనే ఆయన బ్రాహ్మణ వేషాన్ని ధరించి, ఒక పూర్ణకుంభాన్ని చేతపట్టుకు సర్వమిత్రుని రాజ్యసభలో ప్రవేశించాడు. ఆ సమయంలో రాజు తన తాగుబోతు మంత్రులతో రస చర్చలో ఉన్నాడు. వారు అనేక మధిర విశేషాలను, వాటి లక్షణాలను విశ్లేషిస్తున్నాడు. ఏ మధువు ఎక్కడెక్కడ దొరుకుతుందో దానికై ఎంతెంత సొమ్ము వెచ్చించాలో కొత్తకొత్త పన్నులు ఎలా విధించాలో చర్చిస్తున్నారు. అప్పుడు హఠాత్తుగా తమ ముందు ప్రత్యక్షమైన తేజోపురుషుని చూసి అవాక్కయ్యారు. అసంకల్పితంగానే

అందరూ లేచి, చేతులు జోడించి నమస్కరించారు. అప్పుడాకట్టుకునే గంభీర స్వరంతో సభాసదులనుద్దేశించి ఇలా అన్నాడు :

"వేపచిగురుటాకులపై ఉన్న ఈ పూర్ణకుంభాన్ని ఎవరు కొంటారో ముందుకు రండి. పూలమాలలతో అలంకరించిన ఈ మృత్తికాభాండాన్ని అమ్మటానికి వచ్చాను. మీలో ఎవరు కొంటారో ముందుకు రండి."

అప్పుడు 'సర్వమిత్రుడు' అలా అడిగాడు : "మీరు బాలసూర్యునిలా, లోకబంధువునిలా, జగన్మింత్రునిగా ప్రకాశిస్తూ ఉన్నారు. సౌమ్యంగా చంద్రశిలిలా వెలిగిపోతున్నారు. బ్రాహ్మణునివలె బ్రహ్మతేజస్సుతో ఉన్నారు. అలా వెలిగిపోతున్న మీరు చిత్రంగా ఈ మట్టి కడవను అమ్ముకోవడానికి రావడం ఆశ్చర్యంగా ఉంది. ఏదో ఒక సత్కార్యాన్ని సాధించటానికే మహాపురుషులు వేంచేస్తూ ఉంటారు. ఈ కుంభంలో ఏముందో తెలియజేసి మారుతూ హలాన్ని పోగొట్టండి."

"అయితే వినండి – ఇహ, పర దుఃఖాలను కౌగిలించుకోవాలనుకుంటే ఈ పూర్ణకుంభాన్ని కొనండి. దుఃఖమంటే భయం లేనివారు ధైర్యంగా ముందుకు వచ్చి, ఈ కుంభాన్ని కొనవచ్చు."

"మహానుభావా ఇది చాలా ఆశ్చర్యంగా ఉంది. అమ్ముకునేవాడెవడైనా సరుకు దోషాలను కప్పిపుచ్చి మంచి దోషాలనే ప్రచారం చేస్తాడు. ఒక్కోసారి లేని గుణాలను కూడా కల్పించి సరుకునమ్ముకుంటారు. మీరు సత్యకాలపువానివలె ఉన్నారు. ఇది కొంటే శుభం కలుగదు అని ముందే చెపుతున్నారు. ఇంతకీ ఈ పూర్ణకుంభంలో ఏముంది, దీనిని మేము ఏ వెలకు కొనగలము అని రాజు అడిగాడు.

*న సప్పికుమ్భో నపి తేలకుమ్భో,*
*న ఫాణితస్స న మధుస్సకుమ్భో ।*
*కుమ్భస్స వజ్జాని అనప్పకాని,*
*దోసే బహూకుమ్భగతే సుణాథ ॥*

"ఇది నేతికుండ కాదు. తియ్యని చెరకు పాకంతో ఇది నింపబడలేదు. దీనిలో అమృతం అంతకన్నా లేదు. ఇది ఎన్నో దోషాలతో నిండి ఉంది. ఇందులో పులిసి కంపుకొట్టే దరిద్ర ద్రవం ఒకటి ఉంది. ఓ రాజా! దీనిని మీలో ఎవరైనా కొనటానికి ముందుకు రండి."

"ఓ రాజా! స్వచ్ఛమైన స్వాతిచినుకులతో నిండి, దాహం తీర్చే కుండ కాదిది. పవిత్ర గంగోత్రి నుండి తెచ్చిన జలంతో నిండిన కుంభం కాదిది. మధురాతి మధురమైన పంచామృతాలతో నిండిన కుంభం కాదిది. ఆయుష్షును పెంచే ఆవునెయ్యి ఇందులో ఆవగింజంతైనా లేదు. చంద్రుని తలదన్నె తెల్లదనం, చల్లదనం కలిగిన పాలు ఒక్క చుక్క కూడా లేవు. జరా, మరణాలను అదుపు చేసే ఆ మయమ్ములను నిర్మూలించే ఓషధి ఒక్కటి కూడా లేదు."

*గలెయ్య యం పిత్వా పతే పపాతం,*
*సోబ్భం గుహం చన్దనియో ।*
*బహుమ్పి భుఞ్జేయ్య అభోజనెయ్యం,*
*తస్సాపుణ్ణం కుద్భుళ్లిల్లం మియం కిణాథ ॥*

"దేనిని పీకలదాకా తాగి, తూలుతూ తూలుతూ, పడుతూ లేస్తూ నడవవచ్చో దేనిని తాగి మురుగ్గుంటల్లోనూ, రహదారి ప్రక్క గోతుల్లోనూ, చెరువుల ఒడ్డున అపస్మారకంగా పడిపోవచ్చో, దేనిని తాగి తినరానిదల్లా తినవచ్చో అలాంటి సురతో నిండిన భాండమిది. మీలో ఎవరైనా ధైర్యంగా ముందుకు వచ్చి కొనవచ్చు."

"ఎప్పుడు మనిషిలా బ్రతకడం విసుగనిపిస్తే వింత పశువులా ప్రవర్తించాలనుకుంటే ఈ హీనరసాన్ని కొంచెం పుచ్చుకోవచ్చు. మీ ఇరుగు, పొరుగువారి ముందు పలుచనవ్వాలనుకుంటే, మిమ్ములను చూసి ప్రజలు పొట్ట చక్కలయ్యేలా పగలబడి నవ్వాలనుకుంటే ఈ పలుచని పానీయాన్ని పదేపదే పుచ్చుకోవచ్చు. మీరంటే ఈర్షపడేవారు, మీ శత్రువులు సంతోషంగా ఉండాలంటే ఈ దుర్గంధ దరిద్ర ద్రవాన్ని కొంచెం సేవించవచ్చు. మళ్ళీ మన తాతలనాటి కోతిలా, కుప్పిగంతులు వెయ్యాలనుకుంటే, ఆ గంతులకు లయబద్ధంగా డాండడం డాంమ్మని దరువు వెయ్యాలనుకుంటే, నోటికొచ్చిన మంచిమంచి బూతు పాటలను, ప్రాసలతో యమకాలంకారాలతో పాడాలనుకుంటే, యమపురుకి చేర్చే ఈ తయోతీర్థాన్ని కొంచెం త్రాగవచ్చు. ఇలాంటి అశుభ ద్రవంతో నిండిన ఈ అభద్ర భాండాన్ని ముందుకు వచ్చి ప్రీతిగా కొనాలనుకుంటే ముందుకు రండి, భలే మంచి చౌకబేరము."

*యంపిత్వా చిత్తస్మిమనేసమానో ఆబాణ్ణతీగోఖి భక్ఖిసారీ ।*
*అనాథమానో ఉపగాయతి నచ్చతి చ, తస్సాపుణ్ణాం కమ్భామిమం కిణాథ ॥*

"ఏది తాగితే చిత్తం చంచలమౌతుందో అడవి దున్నవలె ఇష్ట వచ్చినది తింటూ, ఇష్ట వచ్చినరీతిన తిరుగుతూ

ఉండవచ్చో, తెలివి తప్పి కోతివలే ఎగురుతూ గంతులు వేస్తూ, నోటికి వచ్చినట్లు పాడుతూ ఊరేగవచ్చో అలాంటి ఊరిన పుల్ల ద్రవంతో నిండిన ఈ సురాభాండాన్ని కొనటానికి రండి."

*యం వే సివిత్వా అచెలోవ నగ్గో,*
*చరెయ్య గామె బిసిఖన్తరాని ।*
*సముళ్హచిత్తో అతివేలసాయీ,*
*తస్సాపుణ్ణాం కుమ్భమియం కిణాథ ॥*

"ఏది తాగితే నగ్నంగా వీధులలో తిరుగవచ్చో రోజులు కొలది స్పృహ లేకుండా ఏ చీకటి గుహల్లోనో పడి నిమరపోవచ్చో అలాంటి పాపిష్టి పానీయముగల ఈ కుంభాన్ని కొనటానికి రండి."

"పుట్టినప్పుడు బట్ట కట్టలేదు, పోవునప్పుడు వెంట రాదు, మధ్యలో ఎందుకు నగుబాటు అనే నగ్నతత్వానికి అద్దంపట్టేలా నడివీధులలో నగ్న, అర్ధ నగ్న ప్రదర్శనలు ఇప్పించగల ఈ మహాద్భుత, మహిమాన్విత మాదకద్రవ్యాన్ని మరో లోకాన్నుండి మరీమరీ తెచ్చాను. మత్తులో లోకాన్ని మరవాలనుకొన్నవారు రండి, ముందుకు వచ్చి కొనండి."

*యం వే పివిత్వా అగ్గిదండా,*
*సయన్తి, అథోసిగాలేహిపి ఖాదితాసే ।*
*బంధం వధం భోగ జాని ఇబ్బేన్తి,*
*తస్సాపుణ్ణం కుమ్భమిదుం కిణాథ ॥*

"దేనిని తాగిన తరువాత అగ్ని దహిస్తున్నా కూడా స్పృహ తెలియదో, దేనిని తాగితే తిన్నది అరక్క వాంతి చేసుకుంటాడో వాంతి పక్కనే శుచి, శుభ్రం లేకుండా పడి వుంటాడో, ఆ అసహ్యమైన వమన పదార్థాన్ని పక్కనే కుక్కలు నాకుతున్నా పట్టించుకోని అపస్మారక స్థితిలో పడివుంటాడో, ఏది తాగితే సంపదలు హరించుకుపోతాయో, ఏది తాగితే మరణం ముందుకు జరుగుతుందో అలాంటి నికృష్ట పానీయపు కృష్ణభాండాన్ని కొనటానికి రండి."

*యంవేపీత్వా ఉక్కట్ఠో ఆవిలక్ఖో,*
*మమేవ సబ్బాప్తథవీతిమఞ్ఞే*
*నమేసమో చాతురన్తోపి రాజా!*
*తస్సాపుణ్ణం..... కిణాథ ॥*

"దేనిని తాగితే ఎర్ర ఎర్రని కళ్ళల్లో అహంకారపు పొరలు కమ్ముతాయో, అహం అంతరిక్షాన్ని తాకుతుందో ఈ సమస్త భూచక్ర వలయమంతా తనదేనని తన్నులాటకు దిగుతాడో మహామహా చక్రవర్తులు కూడా తన కాలి గోటికి సాటిరారని ప్రగల్భాలు పలుకుతాడో అలాంటి చీడపట్టిన ద్రవంతో నిండిన చీకటి భాండమిది."

*మానాతిమానా, కలహానిపేసు,*
*దుబ్బణ్ణినీ నగ్గయినీ పలాయినీ ।*
*చోరాన ధుత్తాన గతీ నికేతో,*
*తస్సాపుణ్ణ... కిణాథ ॥*

"దేనివల్ల మానాభిమానాలు మంటకలుస్తాయో, కలహపుటగ్ని రాచుకుంటుందో, దేనివల్ల ఆగకుండ అబద్ధాలు చెప్పవచ్చో, దేనివల్ల వర్ణం చెడిపోతుందో, ఏది దిగంబరంగా నర్తింపచేస్తుందో, దేనివల్ల ధూర్తులౌతారో, దొంగలౌతారో, దగాకోరులౌతారో అలాంటిదాని నివాసమే ఈ నిండు నిశిభాండము.

*ఇద్ధాని పీతాని కులాని అస్సు,*
*అనేక సాహస్సధనాని లోకే*
*ఉచ్ఛిన్న దాయజ్జకతాని మాయ*
*తస్సాపుణ్ణం... కిణాథ*

"దేనివల్ల వేలాదిమంది సంపన్నులు, ఆపన్నులయ్యారో సమృద్ధి శాలురు నిరుద్ధులయ్యారో ఎందరెందరు తమ కులాలను భ్రష్టుపట్టించారో అలాంటి కుళ్ళిన ద్రవంతో నిండిన కుండ ఇది."

*ధఞ్ఞం ధనం రజితం జాతరూపం, ఖేతం,*
*గవం యిత్థ నివాసయన్తి*
*ఉచ్ఛేదనీ, విత్తవతం, కులానం,*
*తస్సాపుణ్ణం... కిణాథ*

"ధన ధాన్యాలను, వెండి బంగారాలను, పాడిపంటలను ఏది హరించగలదో, ఏది ధనికులను దరిద్రులుగా చేయగలదో అలాంటి సురతో నిండిన స్వాహా భాండమిది. దీనిని కొనటానికి రండి."

*యం వే పిత్వా దిత్తరూపోవ పోసో,*
*అక్కో సతి మాతరం పితరఞ్చ*
*సస్సుమ్పి గణ్హేయ్య అథోపి సుణ్ణం,*
*తస్సాపుణ్ణం... కిణాథ*

"ఏ మధురసాన్ని తాగి మనిషి మదోన్మత్తుడై మాత పితలను మరీమరీ అవమానిస్తాడో వావి వరసలు మరచి, కూడని వారి పొందు కోరతాడో, కోపంతో, పూనకంతో ఊగిపోతాడో అలాంటి పాడు పానకంతో నిండిన పాత్రను కొనటానికి సిద్ధంగా ఉన్నారా.. రండి."

*యం పిత్వా దిత్తరూపావ నారీ,*
*అక్కోసతి ససురం సామికఞ్చ*
*దాసమ్పి గణ్హే పరిచారకమ్పి,*
*తస్సాపుణ్ణం... కిణాథ*

"ఏ పులిసిన ద్రవాన్ని త్రాగి, స్త్రీలు మర్యాదను మరచి, అత్తమామలను అవమానిస్తారో, కానీ వారి పొందుకోసం అర్రులు చాస్తారో అలాంటి మలిన ద్రవంతో నిండిన మట్టికుండ ఇది. దీనిని కొనటానికి రండి."

*యంవేపి విత్వాన హనెయ్యుపోసో,*
*ధమ్మే ఠితం సవణం బ్రహ్మణం వా*
*గచ్ఛే అపాయమ్పి తతోనిదానం,*
*తస్సాపుణ్ణం... కిణాథ*

"ఏ పాడు పాకం పానం చేసి, శ్రమణులకు, బ్రాహ్మణులకు ఒక మనిషి కీడు చేయగలుగుతాడో, చివరకు హత్యకూడ చేయగలుగుతాడో, ఆ కర్మఫల స్వరూపంగా నరకంలో పడతాడో, అలాంటి హానికరమైన హాలాహల సమమైన దుర్గంధ రసంతో నిండిన ఈ హరించే భాండాన్ని తగుదునమ్మా అని కొనటానికి రండి."

*యం వే పివిత్వా దుచ్చరితం చరన్తి / కాయేవ వాచాయి*
*నిరయం వజన్తి దుచ్చరితం చరిత్వా / తస్సాపుణ్ణం... కిణాథ*

"దేనిని పీకలదాకా తాగితే శరీరం, వాణి, మనస్సు అదుపుతప్పి ప్రజలు దుష్కర్మలు చేస్తారో ఫలితంగా నరకంలో భవాన్ని పొందుతారో అలాంటి దానితో నిండిన పూర్ణభాండమిది. కొనటానికి కోరికోరి రండి."

*హిరీమనాసి అహిరీకభావం / పాతుం కరోన్తి మదనాయి*
*మత్తా / ధీరాసి సన్తా బహుకం భణన్తి / తస్సాపుణ్ణం... కిణాథ*

"దేనిని తాగి సిగ్గు, లజ్జ వదలి కప్పలవలె బెకబెకమని వాగుతారో, మేరుపర్వత సమధీరత్వాన్ని కోల్పోయి మేకపోతు గంభీరత్వాన్ని ప్రదర్శిస్తారో అలాంటి ప్రగల్భ రసగర్భ భాండమిది. రండి, రయ్యిన వచ్చి కొనండి."

"ఎంత బుద్ధిమంతుణ్ణయినా ఇంతలో మార్చగల మహిమాన్విత మాదకమ్మిది. సాటిలేని మేటి దుఃఖదాయకమ్మిది. పూర్వ యాదవులు దీనిని త్రాగి స్మృతిని కోల్పోయి పరస్పర బంధుత్వాలను కూడా మరచి ఒకరినొకరు దర్భకర్రలతో మోదుకొని చచ్చారు. అలాంటి ఉన్మాదినీ ఊటద్రవమిది. రండి కొనండి. ఆలసించిన ఆశాభంగం. అసత్యాన్ని సత్యమని పలకాలనుకుంటే తగని పనిని తగుదునమ్మాయని ప్రీతిగా చెయ్యాలనుకుంటే రండి, శాపం మూర్తీభవించిన ఈ కుంభాన్ని కొనండి. ఓ రాజా! కొంటావా?'' అని బోధిసత్వుడు రాజును సమీపించి అడిగాడు.

తనకు బుద్ధిచెప్పటానికే తన పూర్వ పుణ్యంకొలది ఈ మహాత్ముడు వచ్చాడని రాజుకు తెలిసివచ్చింది. సిగ్గుతో తల వంచుకుని ఒక్క మాట కూడా మాట్లాడలేకపోయాడు.

"ఓ రాజా! ఈ మద్యం శీలాన్ని హరిస్తుంది. కీర్తిని తుడిచిపెడుతుంది. సిగ్గు, లజ్జలను తరిమివేస్తుంది. మంచి మనసును కూడా మలినం చేస్తుంది. ప్రతి మంచి గుణాన్ని దెబ్బతీస్తుంది. దీన్ని నీవెలా త్రాగుతూ ఉండగలవు" అని సూటిగా బోధిసత్వుడు ప్రశ్నించాడు.

"వాత్సల్యంతో బిడ్డకు తండ్రి హితవు చెప్పినట్లుగా, ప్రియ శిష్యునికి గురువు బోధ చేసినట్లుగా నా హృదయానికి హత్తుకొనే విధంగా, యుక్తియుక్తంగా మీరు వెల్లడించిన విషయాలు నా కళ్ళు తెరిపించాయి. నేను మీకు చాలా ఋణపడి ఉన్నాను. మీ అమృత హస్తాల్లో ఉన్న ఈ సురాభాండం, అమృత భాండమవుతుంది. దీనిని నా సంప్రజ్ఞత్వాన్ని నిలబెట్టేందుకు ప్రతీకగా నా సింహాసనంపై అధిష్ఠించి నా శీలాన్ని కాపాడుకుంటాను. దీనికి ధర "నాదుశ్శీలాన్ని వదలి శీలవ్రతం పాటిస్తాను" ఇదే నా ప్రతిజ్ఞ. కనుక ఓ మహాత్మా, తామెవరో వివరించి నన్ను కనికరించ ప్రార్థన" అని సర్వమిత్రుడు వేడుకున్నాడు. బోధిసత్వుడు సంతోషించి తన నిజస్వరూపం ధరించి, ఆ సురాభాండాన్ని అమృత కలశంగా మార్చి సర్వమిత్రానికిచ్చి శీలమే అమృతమని బోధించి, అంతర్ధానమయ్యాడు.

**జాతకపాల - కుంభజాతకం**

**మాదకద్రవ్య బాధితులకు 'విపశ్యనా' పరిష్కారం :**

మాదక ద్రవ్యాలకు అలవాటు పడినవారిని ఆరోగ్యవంతులుగా చేయటానికి అలవాట్లను నివారించటానికి సమాజంలో, రకరకాల చికిత్సాపద్ధతులు వ్యాప్తిలో ఉన్నాయి. మాదకద్రవ్యాల నిషేధం ప్రభుత్వ బాధ్యత. కానీ ఏవి కూడ అంత సంతృప్తికరంగా లేవు.

తృష్ణే దురలవాట్లకు మూలకారణమని మనస్తత్వ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, వైద్యులు ఒక నిశ్చయానికి వచ్చారు. రకరకాల తృష్ణవల్ల ఎవరైనా ఈ అలవాట్లకు బానిసలౌతారు. మాదకద్రవ్యాన్ని తీసుకున్నప్పుడు

మనఃశ్శరీరాలతో కలిగే సూక్ష్మ బయోకెమికల్ రియాక్షన్ వల్ల కలిగే సంవేదనలను (సెన్సేషన్స్) అనుభూతి చెందుతారు. ఆ అనుభూతిపట్ల తృష్ణతో వాటికి బానిస అవుతారు. ఈ సంవేదనల అనుభూతిని సూటిగా ఎదుర్కొనగలిగితే ఈ దురలవాట్లను ఎదుర్కొనవచ్చు. ఈ పనిని బుద్ధభగవానుడు నేర్పించిన విపశ్యనా భావనలో నేర్చుకుంటాము. "సబ్బేధమ్మా వేదనాసమోసరణ" అని భగవానుడు చెప్పాడు. అంటే మనోధర్మాలన్నీ సంవేదనల నుండి పుట్టి గిట్టుతాయి. ఈ సాధనలో శరీరంలో కలిగే సంవేదనలపై సమతను నేర్చుకుంటూ మనస్సుయొక్క లోలోతుల్లోని సంస్కారాల మూలపుటేర్లను పెరికివేయటం సాధ్యమవుతుంది. మాదక ద్రవ్యాలపట్ల ఏర్పడిన గాఢ సంస్కారాలు కూడ పెరికివేయబడతాయి. అంటే సురాపానం వల్ల కలిగే సుఖసంవేదనలపట్ల మోహానికి సంబంధించిన సంస్కారాలు అంతరాంతరాలలో దాగి ఉంటాయి. అవి విపశ్యనవల్ల బైటకి పెల్లుబికి వస్తాయి. వాటిని సమతతో చూసేకొలది నిర్వీర్యమైపోతాయి.

ఎవరైన ఒక వ్యక్తి మాదకద్రవ్యాల సేవనం ఆపినప్పుడు, సంస్కారాల ప్రభావంవల్ల భరింపరాని సంవేదనల ప్రవాహం మొదలౌతుంది. ఈ ప్రవాహపు తాకిడి తాళలేక మళ్ళీ ఆ వ్యక్తి మాదకద్రవ్యాల బారినపడతాడు. విపశ్యనలో సాధకుడు సంవేదనల ప్రవాహాన్ని సమతతో ఓర్చుకుంటాడు కనుక అలవాటు నుండి బైటపడతాడు. ఇదే ప్రజ్ఞయొక్క ఉదయం.

1981–1982 సంవత్సరాలలో విపశ్యన సాధకులచే స్థాపించబడి విజయవంతంగా నడుపబడుచున్న రెండు రీహాబిలిటేషన్ సెంటర్ల గురించి తెలుసుకుందాం! ఒకటి ఆస్ట్రేలియాలోని పెర్త్ సైరెనియన్ హౌస్. రెండవది స్విట్జర్లాండులో జ్యూరిచ్ వద్ద స్మార్ట్ ఎగైన్ అనే ఎడిక్షన్ థెరపి సెంటర్. ఇందులో పనిచేసేవారంతా గతంలో ఈ అలవాట్లకు లోనైనవారే. వారంతా ఇప్పుడు వాటినుండి బైటపడి, సేవాదృక్పథంతో ప్రశాంతంగా పనిచేస్తున్నవారే!

**సురాపానం నుండి బైటపడిన బర్మా అధ్యక్షుడు :**

బర్మా రాజరికంలో పుట్టిన రాజకుమారునికి బంగారు ఉగ్గుగిన్నెతో స్వచ్ఛమైన ద్రాక్షసారాను పట్టడం ఆనవాయితి. అలా ఉగ్గుతో సురను త్రాగడం అలవాటు అయినవాళ్ళు పెరిగి పెద్దై మద్యపానంలో మునిగి తేలతారనటంలో ఆశ్చర్యం ఏముంది? బ్రిటీషువారి నుండి బర్మా విముక్తం అయినపుడు గణతంత్ర రాజ్యం ఏర్పడింది. కానీ, బర్మా ప్రెసిడెంటుగా బర్మా రాజరికంలోని ఒక వ్యక్తిని ఎన్నుకోవటం జరిగింది. ఒకరోజు బర్మా ప్రధాని అధికారికంగా కొందరికి విందు ఏర్పాటు చేసి, దానికి బర్మా ప్రెసిడెంటును ఆహ్వానించాడు. ఒక్క నిముషం కూడా మద్యాన్ని వదలని బర్మా అధ్యక్షుడు నిండుగా తాగి, విందులో పాల్గొన్నాడు. అక్కడ కూడ మళ్ళీ మద్యం సేవించి, పీకల దాకా తిని, చివరి నిమిషంలో అందరి అతిథుల ముందు భళ్ళున వాంతి చేసుకున్నాడు. అధ్యక్షుని రాజరికపు పరువంతా వాంతితోపాటు నేలపాలైంది. ఇద్దరు సహాయకులతో మెల్లగా ఇంటికి చేరుకున్నాడు.

రాత్రి జరిగినదానికి సిగ్గుపడుతూ తరుణోపాయం వెదకాలనుకోవడంతోనే శుభోదయం అయింది. ఆ కాలంలో బర్మా అకౌంటెంట్ జనరల్ సెక్రటరీగా పనిచేస్తున్న విపశ్యనాచార్యుడు శ్రీ ఉబాఖిన్ గురించి విన్న బర్మా అధ్యక్షుడు ఆయన వద్ద విపశ్యన విద్యను నేర్చుకోవడానికి వెళ్ళాడు. విపశ్యన శిక్షణను సరిగ్గా అర్థం చేసుకొని సమర్థవంతంగా సాధనచేసి శిబిరం నుండి బైటకు వచ్చాడు. ఇంటికి వెళ్ళే త్రోవలో ఒక త్రాగుబోతు ఆయన ప్రక్కగా వెళ్ళటం జరిగింది. ప్రెసిడెంటుగారు ఆ త్రాగుబోతు వాసనను కొంచెం కూడా భరించలేకపోయాడు. అతన్ని దూరంగా వెళ్ళమని పెద్దగా హెచ్చరిక చేశాడు. తనలో వచ్చిన మార్పుకు తనే ఆశ్చర్యపోయాడు. ఆయన సురాపాన దురలవాటు నుండి పూర్తిగా బైటపడ్డాడు.

**ఉపసంహారం :**

మహాభిషక్ అంటే మహావైద్యుడని అర్థం. ఆ పేరుతోనే బుద్ధభగవానుని పిలిచేవారు. ఆయన ప్రపంచానికి ఇచ్చిన అద్భుతమైన ఔషధం (విపశ్యన) వల్ల ఎందరో తమ దుఃఖాల నుండి రోగాల నుండి ముక్తిపొందారు. అనంతమైన మైత్రిని, ప్రేమను, కరుణను, ఉపేక్షను గుమ్మరించారు. జీవితంలో ఎంతో సాఫల్యాన్ని, సమతను సాధించారు. ఈ విపశ్యన ప్రయాణం ఏదో కేవలం అడ్డదారిలో పోవడం కాదు. నిరంతర సాధన సహజ మార్గంలో చేయుటంవల్లే శుభం సాధ్యమౌతుంది. దీనివల్ల తమ మేలు తాము చేసుకోవటమే కాకుండా తమ కుటుంబానికి ఇరుగు, పొరుగు వారికి, సమాజానికి కూడా మేలు చేసినవారౌతారు.

**టి. సీతారామిరెడ్డి**

హైదరాబాద్. ఫోన్ : 949 133 6258

# శాలిహుండం

- బెందాళం క్రిష్ణారావు

కళింగ సీమలో అశోకుడు అడుగు పెట్టక ముందు నుంచే అటు మహానది నుంచి ఇటు గోదావరి నదివరకూ నేల నాలుగు చెరగులా బౌద్ధ ధర్మం ప్రజల జనజీవనంలో అంతర్భాగంగా విలసిల్లుతోంది. దానికి నిదర్శనాలుగా బౌద్ధ ధర్మ సామాజిక చారిత్రక చిహ్నాలు ఎన్నో కళింగాంధ్రలో నిలచి ఉన్నాయి. వాటిలో వంశధార నదీతీరంలోగల శాలిహుండం ఒకటి. బౌద్ధధర్మం పల్లవించిన సుప్రసిద్ధ చారిత్రక క్షేత్రంగా శాలిహుండం ఉంది. బౌద్ధ ఆరాధనలకు, బిక్షువుల ఆవాసాలకు స్తూపాలు, చైత్యాలు, గుహాలయాలు, విహారాలు వంటివాటిని ఎక్కువగా నదీతీరాల్లో కొండలపై నిర్మించారు. ఈ శాలిహుండం కూడా అటువంటివాటిలో ఒకటి అని చరిత్రకారులు భావిస్తున్నారు. ఈ బౌద్ధ క్షేత్రంలో ఐదు విహార సముదాయాలు, స్తూపాలు వివిధ ఎత్తులలో, పరిమాణాల్లో నిర్మించారు. క్రీస్తుపూర్వం 261లో అశోకచక్రవర్తి కళింగ ప్రాంతంపై దండయాత్ర జరిపి యుద్ధఫలితాలను చూసి తీవ్ర మానసిక క్షోభతో బౌద్ధ ధర్మాన్ని తన జీవనమార్గంగా స్వీకరించిన విషయం ఒక చారిత్రక ధార్మిక పరిణామం. ఆ నేపథ్యంలోనే శాలిహుండంలో ఈ బౌద్ధక్షేత్ర నిర్మాణం మొదలై ఉంటుందని ఒక అంచనా. అశోకుని పాలనలో బౌద్ధ ధర్మ ప్రచారం ఒక ప్రధానమైన అంశం. ఆ సమయంలోనే బౌద్ధధర్మం ఖండాంతరాలకు విస్తరించింది. శాలిహుండం బౌద్ధ స్థవిర ధర్మ ప్రవచక కేంద్రంగా ప్రారంభమైనట్లు తెలుస్తోంది. క్రీస్తుపూర్వం మూడో శతాబ్దంలో ప్రారంభమైన శాలిహుండం బౌద్ధధర్మ ప్రవచక కేంద్రం క్రీస్తు శకం 7,8శతాబ్దాలలో తాంత్రిక ప్రక్రియలతో కూడిన వజ్రయానానికి ఆలంబనగా నిచింది.



**వంశధార నదీతీరంలో :**

శ్రీకాకుళం జిల్లా గార మండలంలోని శాలిహుండం ఒక గ్రామం. వంశధార నదీతీరంలోని ఈ గ్రామం ప్రాచీన కాలం నుంచే బౌద్ధ క్షేత్రాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. భౌగోళికంగా 18.13-84.15 అక్షాంశాల మధ్య ఈ గ్రామం ఉంది. జిల్లా కేంద్రమైన శ్రీకాకుళానికి ఈ బౌద్ధక్షేత్రం 22 కిలోమీటర్ల దూరంలో ఉంది. సుమారు 200 అడుగులు ఎత్తైన కొండపై ఈ బౌద్ధక్షేత్రం ఉంది. “శాలిహుండం” అనే పదబంధం అనునది ఒడియా, తెలుగు భాషల సమ్మిళితంగా భావిస్తారు. తెలుగులో ‘శాలి’ అనగా వరి లేదా బియ్యం అని అర్థం, హుండం అంటే ఒడియాలో కొండ లేదా కుండ అని అర్థం చెబుతారు. దీనిని బట్టి శాలిహుండం అంటే బియ్యం/ వరిధాన్యం/ కొండ లేదా కుండ అని అర్థం వస్తోంది.

ఒక కుమ్మరి బాలుడు ఈ ప్రాంతంలోనే పుట్టి పెరిగాడని, ఆ సమయంలో తాను ఆడుకోవడానికి మట్టితో రథాలు, ఏనుగులు, గుర్రాలు, సైనికుల బొమ్మలను తయారు చేసాడని, ఆ తర్వాత ఉజ్జయిని ప్రాంతాన్ని పాలించే శాలివాహన విక్రమార్కుడు ఈ ప్రాంతంపై యుద్ధానికి వచ్చాడని చెబుతారు. ఆ సమయంలో బొమ్మలన్నీ నిజాకృతిని ధరించి శాలివాహన విక్రమార్కుడిని పరాజితునిగా చేసాయని ఒక కథనం. అప్పటి నుంచే ఈ గ్రామానికి, కొండకు కాలక్రమేణా శాలిహుండం అనే పేరువచ్చిందని ప్రచారం. ఈ కథనంలో నిజానిజాలు ఎలా ఉన్నా ఇప్పటికీ వంశధార నదికి అవతలవైపున ఉత్తరతీరంలో ఉన్న ఒంత మండలం (వనిత మండలం) గ్రామంలో అధిక శాతం మంది కుమ్మరి సామాజిక వర్గానికి చెందినవారే ఉండడం, 1950-60

మధ్యకాలంలో ఎర్రమట్టితో చేసిన ఏనుగులు, రథాలు, అలంకరించబడిన గుర్రాలు, సైనికుల బొమ్మలు ఆయా పరిశోధకుల తవ్వకాలలోనూ, రైతులు పొలాలు దున్నే సమయంలోనూ తరచుగా బయటపడుతుండడం విశేషం. మరో కథనం ప్రకారం శాలిహుండం బౌద్ధ విహారం ఉన్న స్థలంలో ఒకప్పుడు ఒక మహారాజు ఉండేవాడని, అతడు తన వనితలైన రాణులను, ఉంపుడుగత్తెలను, పనివారిని వంశధార నదికి అవతల ఉన్న ఊరిలో ఉంచాడని అందువల్లే ఆ గ్రామానికి 'వనిత మండలం' అనే పేరువచ్చిందని అంటారు. ప్రస్తుతం పోలాకి మండలంలో ఉన్న ఈ గ్రామానికి వెళ్లడానికి వీలుగా వేసిన పురాతనమైన రాళ్ల శిథిలాలు ఈనాటికి కూడా నదిలో నీరు లేనప్పుడు కన్పిస్తాయి. గార మండలంలోని ప్రాచీన వైష్ణవ క్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథస్వామి ఆలయంలో క్రీస్తు శకం 1260 సంవత్సరానికి చెందిన స్తంభశాసనంలో శాలిహుండం గ్రామం పేరును 'సలివేందం' లేదా 'శాలివేందం'గా పేర్కొన్నారు. శ్రీకూర్మనాథస్వామి ఆలయ నిర్వహణకు, నిత్యపూజలకు తూర్పుగాంగ సామంతరాజులు ఈ గ్రామాన్ని కానుకగా ఇచ్చినట్లు ఇదే కాలక్రమంలో శాలిహుండంగా రూపాంతరం చెంది ఉంటుందని కొంతమంది భావిస్తున్నారు. కాగా శాలిహుండం కొండ ప్రాంతంలో బయటపడిన తవ్వకాలలో లభ్యమైన రెండు శంఖాలపై చెక్కిన 'సాలిపేడక, సాలిపడక లేదా శాలి పటక' అనే పదాలు "శాలిహుండం" గ్రామనామాన్ని స్థిరీకరిస్తున్నాయి. ఇందులో 'శాలి' అనగా బియ్యం లేదా ధాన్యం, 'పేడక, పటక' అనే పదాలు ఊరు అనే అర్థాన్ని ఇస్తాయని భాషావేత్తలు భావిస్తున్నారు. ఆ రోజుల్లో ఈ ప్రాంతం ధాన్యం లేదా బియ్యాన్ని నిలువచేసే, విక్రయించే ప్రదేశం కావొచ్చని అర్థం చేసుకోవచ్చు. ప్రాచీన ఓడరేవుల్లో ఒకటైన కళింగపట్నం ఈ గ్రామానికి దగ్గర్లో ఉండడం వలన శాలిహుండం బియ్యం వ్యాపారంలో ప్రధానకేంద్రంగా ఉండేదని తెలుస్తోంది. ఒకప్పుడు ఈ ప్రాంతం శాతవాహనుల పాలనతో సంబంధం కలిగి ఉండేదని మరికొంతమంది చెబుతున్నారు. దీనికి తార్కాణం శాతవాహనుల రాజధాని ధాన్యకటకం కూడా శాలిహుండం అనే అర్థాన్ని ఇస్తోంది. ఈ ప్రాంతంలో పురావస్తు శాస్త్రవేత్తల తవ్వకాల్లో లభించిన కొన్ని మట్టిపాత్రలపై ఉన్న లిపిని అనుసరించి ఈ కొండని మహెూదకపర్వతమని కూడా వ్యవహరించేవారు.

**గిడుగు కృషితో వెలుగులోకి :**

వ్యవహారిక తెలుగు భాషోద్యమకర్త గిడుగు వేంకట రామమూర్తి కృషితోనే శాలిహుండం చరిత్ర వెలుగులోకి వచ్చింది. 1919లో గిడుగు రామమూర్తి శాలిహుండంలోని అవశేషాలను పరిశీలించి పురాతత్వ శాఖకు తెలియజేసారు. అప్పటి భారత ప్రభుత్వ శిలాశాసనాధికారి 1919లోనే శాలిహుండంలోని శాసనాలను, విగ్రహాలను తనిఖీచేసి తవ్వకాలు జరపాలని ఆదేశించారు. ఆయన సూచనలపై ఆనాటి కేంద్ర పురాతత్వ సర్వే దక్షిణమండల పురాతత్వ సర్వే దక్షిణ మండల పురాతత్వవేత్త డిలాంగ్ హష్టు కొండ శిఖరంపై తవ్వకాలు జరిపి పలు తాంత్రిక శిల్పాలను, రెండు చిన్న స్తూపాలను, ఒక మహాస్తూపాన్ని, గజపృష్టాకార స్తూపాన్ని , చైత్యాన్ని, వర్తులాకారంలో మరొక స్తూపాన్ని కనుగొన్నారు. తర్వాత 1943-47 మధ్యకాలంలో పురాతత్వశాస్త్రవేత్త టి ఎన్ రామచంద్రన్ తవ్వకాలు జరిపించారు. ఈ తవ్వకాలలో గతంలో కనుగొన్న బుద్ధచైత్యము, గజపృష్టాకార ఉద్దేశిక స్తూపము పూర్తిగా వెలుగులోకి వచ్చాయి. మహా చైత్యం వెనుక ఇటుకలతో రూపొందించిన సంపూర్ణస్తూపం నుండి రెండు దీర్ఘచతురస్రాకారం, ఒకటి వర్తులాకారం ఉన్న శిలాపేటికలు లభించాయి. వాటిలో స్వర్ణపుష్పాలు, ధాతువులు, అస్థికలు లభించాయి. ఈ అస్థికలు బౌద్ధగురువులవి కావొచ్చని భావిస్తున్నారు. అనంతరం మరోసారి రాయప్రోలు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో తవ్వకాలు జరిగాయి. 1955 వరకూ జరిగిన ఈ తవ్వకాలలో శాలిహుండం సంస్కృతికి చెందిన మూడు దశలు వెలుగు చూసాయి. తవ్వకాలలో కొండపైనా, పరిసరాల్లో లభించిన విగ్రహాలను, శిల్పాలను, వాటి అవశేషాలను సమీపంలో గల మ్యూజియమ్‌లో భద్రపరిచారు. పురావస్తు శాస్త్రవేత్తల తవ్వకాలలో లభించిన వాటిని కొన్నింటిని మాత్రమే సంగ్రహించుకోగలిగారు. వాటికి సరైన రక్షణ లేని కారణంగా, రాళ్లకోసం కొండను కొంతవరకూ తవ్వేయడం వలన, ఇళ్ల నిర్మాణాలకు ఈ రాళ్లను తరలించడం వలన ఈ స్థలానికి నష్టంకూడా కొంత జరిగింది. ఆ తర్వాత ఆలస్యంగా మేలుకున్న ప్రభుత్వం శాలిహుండంను బౌద్ధ విహారక్షేత్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు ప్రారంభించింది. ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతోంది.

**పురాతత్వ పరిశోధనల్లో :**

పురాతత్వ పరిశోధనల ఫలితంగా శాలిహుండం క్రీస్తుపూర్వం 3వ శతాబ్దం నుంచి క్రీస్తు శకం 8వ శతాబ్దం వరకూ విలసిల్లిందని స్పష్టమౌతోంది. క్రీ.పూ.3వ శతాబ్దం నుంచి క్రీ.పూ.1వ శతాబ్దం వరకూ ఇటుకలతో నిర్మించిన వేదికలు, ఇటుకలతో ఇతర నిర్మాణాలు లభించాయి. రెండో దశ తవ్వకాలలో క్రీ.శ. 1వ శతాబ్దం నుండి క్రీ.శ.4వ శతాబ్దం వరకూ నిర్మించిన చైత్యాలు, విహారాలు, స్తూపాలు, స్వస్తిక్ పద్ధతిలో ప్రవేశ ద్వారాలు, రాతి చప్టాలు, బుద్ధుని పాదాల శిల్పాలు, ధర్మచక్రం, బోధివృక్షశిల్పం, ఎర్రమట్టితో రూపొందించిన అలంకృత గుర్రాల శిల్పాలు, ఆవుదూడ చిత్రాలతో ఉన్న ఫలకములు, వివిధ పాత్రలు లభించాయి.

మలిదశ తవ్వకాలలో క్రీ.శ.4వ శతాబ్దం నుంచి 8వ శతాబ్దం వరకూ జరిపిన నిర్మాణాలు, అంతకు ముందు దశలలో ఉపయోగించినవి కూడా లభించాయి. వాటిలో పేర్కొనదగ్గవి స్తంభములతో వస్తువులు ఉంచిన వర్తులాకారపు వోటివ్ స్తూపాలు, కొండరాళ్లతో కట్టిన బాహ్య రక్షణ గోడలు, బ్రాహ్మీలిపి కదిలి గుండ్రంగా ఉన్న టెర్రకోట ముద్రలు, గుడ్డు ఆకారంలో బ్రాహ్మీలిపి చెక్కిన స్టీటైల్ సీల్(ముద్ర) వంటివి. వీటితోపాటు క్రీస్తుశకము 7,8 శతాబ్దాలకు చెందిన శిలాశాసనాలు వివిధ ఆకృతులతో, వివిధ పరిమాణాలతో రకరకాల మట్టి పాత్రలు కుండపెంకులు, శాసనములతోనూ, శాసనములు లేకుండా లభించాయి. లోపల ఖాళీ స్థలములో చక్రము, ఇరుసు పద్ధతిలో బుద్ధుని పుట్టుక, పరిత్యాగం, జ్ఞానోదయం, ధర్మచక్ర ప్రవర్తనం, మహా పరినిర్వాణంనకు సంబంధించిన అయిన వేదికలు, ఆయన స్తంభాలు వంటివి కూడా ఉన్నాయి. దక్షిణ భారతదేశంలోని అమరావతి, భట్టిప్రోలు, ఘంటసాల, నాగార్జున కొండ, జగ్గయ్యపేట, గుమ్మడిదుర్రు, అల్లూరు, గుడివాడ తదితర ప్రాంతాల్లో గల స్తూపం లాంటిది ఒక్కటి మాత్రమే బయటపడింది. మిగిలిన స్తూపాలన్నీ ఖాళీస్థలాలు లేని విధంగా ఇటుకలతో దృఢంగా ఉత్తర భారతదేశ శైలిలో రూపొందించినట్లు పురాతత్వ శాస్త్రవేత్తలు కనుగొన్నారు.

**ప్రత్యేకతలు :**

శాలిహుండం ప్రాచీన థేరవాద శాఖకు సంబంధించిన బుద్ధ సంస్కృతికి అలవాలంగా ఉంది. ఆ శాఖ బుద్ధున్ని దేవునిగా చిత్రీకరించేందుకు సమ్మతించకపోవడంతో బుద్ధుని జీవితాన్ని ప్రతిబింబించే సన్నివేశములు మినహా జాతక కథల చిత్రీకరణతో ఉన్న శిలాఫలకాలు, ఇతర బౌద్ధ క్షేత్రాల వలె స్తూపాల గుమ్మటం వంటివి లేవు. స్తూప నిర్మాణ శైలిలో స్వల్ప ప్రత్యేకతలు కనిపిస్తున్నాయి. ఇక్కడ లభించిన బౌద్ధ అవశేషాలను బట్టి శాలిహుండం ఉత్తర భారతదేశ, దక్షిణ భారతదేశ బౌద్ధ నిర్మాణ శైలికి సంస్కృతికి కూడలిగా నిలిచింది. అంతేకాకుండా మధ్యధరా సముద్రం చుట్టూగల రాజ్యాలతో సంబంధాలను కలిగి ఉండేదని స్పష్టమౌతోంది. శాలిహుండం కొండ శిఖరముపై 26 మీటర్ల వ్యాసార్థంతో 58×28×8 సెంటిమీటర్ల కొలతలు గల ఇటుకలతో బంకమట్టితో వృత్తాకార మహాచైత్య స్తూపాన్ని నిర్మించారు. ఇది వ్యాసార్థానికి తగిన నిష్పత్తిలో స్తూపం చాలా ఎత్తుగా ఉండివుండవచ్చు. అయితే కాలక్రమంలో దీని శిఖరం(డోమ్) శిథిలమయినట్లు తెలుస్తోంది. క్రీస్తుపూర్వం 1వ శతాబ్దానికి చెందినట్లు భావిస్తున్న స్తూపాల్లో బయల్పడిన మూడు అంతర్గత వలయములు, లోపల వృత్తం 12ఆకు కమ్ములతో ఉంది. మధ్యవృత్తం 24 ఆకు కమ్ములతో, బయట వృత్తం 36 ఆకు కమ్ములతో ధర్మచక్రం రూపంలో నిర్మాణం చేశారు. అయితే ఈ స్తూపాలను ఎలాంటి శిల్పాకృతులు, చక్రాలతో అలంకరించలేదు. శాలిహుండం కొండపైన తూర్పున విహార ప్రారంభంలో కొన్ని మొక్కలు, స్తూపాల ఆనవాళ్ల మధ్యగా ఉన్న మెట్లు లేని దారి, దానికి ఇరువైపులా ఉత్తర, దక్షిణ భాగాలలో ఏనుగు వెనుక భాగంలాగా (గజపృష్ఠాకారంలో) చైత్య శిథిలాలు వాటిలో స్తూపాలు కనిపిస్తాయి. వీటికి దగ్గరలో వంటగదుల ఆనవాళ్లు ఉన్నాయి. ఇంకొంచెం పైన ఉత్తరాన వంశధార నదివైపు చక్రస్తూపం మధ్యలో ఒక స్తూపం, ఒక గుండ్రని చైత్యం కనిపిస్తాయి. ఇంకా పైకి వెళితే లోపల స్తూపంలేని మహాచైత్యం దాని వెనుక ముఖ్యమైన పెద్ద స్తూపం, ఒక వేదిక ఉన్నాయి. చైత్యాలలో, విహారాలలో నేలకు సున్నపుగారతో గచ్చువేశారు. చైత్యాలుగల ఈ విహారం క్రీస్తుపూర్వం 300 సంవత్సరాలనుంచి క్రీస్తు శకము 700 సంవత్సరాల కాలము వరకు సుమారు 10,11 శతాబ్దాల కాలములో మంచి ఉచ్ఛస్థితిలో ఉంటుందని చరిత్ర కారులు భావిస్తున్నారు.

ఈ విహారంలో అనేకమంది బౌద్ధ గురువులు, బిక్షువులు ఉండేవారని తెలుస్తోంది. ఈ విహారంలోని కొన్ని స్తూపాలను వెండితోను, స్ఫటికంతోను చిరు స్తూపాకారాలలో

తయారుచేయబడిన నాలుగు భరిణలలో స్వర్ణ పుష్పాలతో పాటుగా బౌద్ధ అవశేషాలు దొరికాయి. దీనివల్ల ఈ శాలిహుండం బౌద్ధ ధర్మ ప్రచారంలో కీలకపాత్ర వహించి ఉంటుందని భావిస్తున్నారు. ప్రాచీన కాలంలోనే ఒక ప్రముఖ బౌద్ధ క్షేత్రంగా వెలిసిన శాలిహుండం సమీప కళింగపట్నం రేవులోకి వచ్చిన నావలలోని విదేశీ వర్తకులు, నావికులు, ప్రయాణీకులు సందర్శించేవారిని తెలుస్తోంది. తూర్పు గాంగుల పాలన కాలంలో కళింగ దేశాన్ని సందర్శించిన చైనా యాత్రికుడు హుయాన్‌త్సాంగ్ ఈ శాలిహుండాన్ని తిలకించినట్లు చరిత్ర స్పష్టం చేస్తోంది. ఈ బౌద్ధక్షేత్రంలో లభించిన శాతవాహన కాలం నాటి సీసపు నాణాలు, కుషానుల నాణాలు, రాగి నాణాలు, రంధ్రమున్న వెండి నాణాలు ఒకవైపు బొమ్మలతో మరోవైపు బ్రాహ్మీలిపిలో ఉన్నవి. ఇవి శాలిహుండంనకు రోమ్ దేశంతో ఉన్న సంబంధాలను బలపరుస్తున్నాయి.

శాలిహుండం కొండ ఏటవాలులో తగిన స్థలం ఉన్నచోట విహారాలను నిర్మించారు. వివిధ దశలలో ఒక క్రమపద్ధతిలో కట్టడాలు కట్టకపోవడం వలన కొండ పైభాగాన చిన్న చిన్న వేదికలపై స్తూపాలను గుంపులుగా నిర్మించారు. వివిధ కొలతలతో ఉన్న ఇక్కడి స్తూపాలను సున్నం, ఇసుక మిశ్రమాన్ని రాతి తిరగలితో అనేక మార్లు రుబ్బి సున్నగా గార తయారుచేసి గోడలకు పూతగా వాడారు. కంకరను గారతో కలిపి సున్నపు కాంక్రీటుగా ఫ్లోరింగ్‌కు వాడారు. బౌద్ధ భిక్షువులు నివాసం ఉండటానికి ప్రార్థనలు చేసుకోవడానికి స్తంభాలతో కూడిన విహారాలను అనేక చిన్న గదులతో కొండ ఉత్తర దిశ ఏటవాలు ప్రాంతంలో నిర్మించారు. నీరు బయటకు పోవడానికి సహజసిద్ధమైన రాతిమీద కాలువలను తొలిచారు. బయట కనపడకుండా మూయబడిన కాలువలను నీరు పోవడానికి ఏర్పాటు చేసినవి తవ్వకాలలో బయటపడ్డాయి. ధాన్యపు గింజలను పిండి చేయుటకు వంటగది నేలమీద అమర్చిన రాతితో తయారయిన తిరగలి భోజనాలయం బయటపడ్డాయి. కొండ శిఖరం నుంచి దిగువ వరకు 430అడుగుల పొడవు గల రహదారి, దీనికి ఉత్తరంగా స్తూపాల సమూహాలకు దిగువ 100 అడుగుల పొడవుతో రాళ్లతో మలిచిన దారులు బయటపడ్డాయి. ఈ రహదారిలో 30 రాళ్లపై బ్రాహ్మీలిపితో చెక్కిన అక్షరాలు ఉన్నాయి.

ఈ అవశేషాలలో చెక్కిన అక్షరాలు బ్రాహ్మీభాష పుట్టుక, అభివృద్ధిని వివిధ శాఖల బౌద్ధ ధర్మ వ్యాప్తి కాలాన్ని తెలియజేస్తున్నాయి. భవన నిర్మాణం, వాస్తు కలను పరిశీలిస్తే వివిధ సాంప్రదాయాలకు, ప్రాచీన సంఘారామాలకు, సంస్కృతికి శాలిహుండం ప్రధాన కేంద్రంగా భాసిల్లింది. ఇక్కడ లభించిన విగ్రహాలలో మూడు తలలతో అనేక చేతులతో, ఏడు గుర్రములతో లాగుతున్న రథములో స్వారీ చేసే సూర్యదేవుని పోలిన స్త్రీ దేవత మరీచీ, మరియన్, తార, జంభల, అవలోకితేశ్వర, సింహాసనముపై కూర్చొన్న మంజుశ్రీ, ధ్యానబుద్ధుడు, అపరాజిత, వజ్రధర విగ్రహాలు ప్రముఖమైనవి.

ఈ విగ్రహాలు ప్రాచ్య సాంప్రదాయ అనుగుణంగా మలిచినట్లు తెలుస్తోంది. వజ్రయాన తాంత్రిక ప్రక్రియలను సంతరించుకుని హైందవ దైవాలకు ప్రతిరూపంగా కల్పించి చెక్కిన అనేక బౌద్ధ దేవతలకు సంబంధించిన విగ్రహాలెన్నో తవ్వకాలలో బయటపడ్డాయి. వజ్రయాన తాంత్రిక బౌద్ధ శాఖకు శాలిహుండం కేంద్రమై నిలిచిందని అధ్యయనవేత్తలు భావిస్తున్నారు. హీనయాన బౌద్ధ నుంచి చివరి వజ్రయాన తాంత్రిక బౌద్ధం వరకు ఫరిడవిల్లిన బౌద్ధ సంస్కృతికి శాలిహుండం ప్రతీకగా నిలుస్తోంది. ఇంతకు ముందు పేర్కొన్న విగ్రహాలతో పాటు జ్ఞాన బుద్ధుడు, అక్షోభ్య బుద్ధ, భవిష్య బుద్ధ, అమితాభ బుద్ధ, జైనతీర్థంకర, దండాయుధపాణి, భవిష్యబుద్ధ, చతుర్భుజ అపరాజిత, షడ్భుజరేచీ విగ్రహాలు కూడా లభించాయి. దేశ, విదేశాలకు చెందిన వివిధ బౌద్ధశాఖలకు శాలిహుండం ప్రధాన కేంద్రంగా నిలిచింది. శాలిహుండంలో తొలి మౌర్యుల కాలంలో వేళ్లూనిన బౌద్ధం శాతావాహనుల కాలంలో ఉచ్ఛస్థితికి చేరుకుంది.

ఈ బౌద్ధక్షేత్రంపై మరింత లోతైన పరిశోధన జరిగితే చరిత్రకు సంబంధించి, బౌద్ధ ధర్మ వికాసానికి సంబంధించి కొత్త విశేషాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

బెందాళం క్రిష్ణారావు
శ్రీకాకుళం. ఫోన్ : 730 643 4888



# బౌద్ధము – సాధన

– బి.వి. భద్రగిరీష్

అవతంసక సూత్రంలోని పదహారవ అధ్యాయంలో, సాధన గురించి ఈ విధంగా వివరించబడింది.

అప్పుడు బోధిసత్త్వుడైన సువర్ణప్రజ్ఞ, సత్యజ్ఞాని అనే బోధిసత్త్వుడితో ఇలాపలికాడు. "సమస్త విశ్వాలలో బోధిసత్త్వులైనవారు, బుద్ధుల బోధనలను అనుసరిస్తూ, కాషాయం ధరించి, ప్రవజ్య స్వీకరించి భిక్షువులుగా జీవిస్తున్నారు. వీరు శుద్ధమైన ధర్మసాధనను ఎలాసాధిస్తారు? అర్హత్వ స్థాయి నుండి అనిర్వచనీయమైన నిర్వాణ స్థాయిని ఎలా పొందగలరు?"

అప్పుడు సత్యజ్ఞాని ఇలా పలికాడు. "మహాత్ములైన బోధిసత్త్వులారా! ధర్మ సాధనను సాగించేటప్పుడు, జాగరూకులై దశ విషయాలనుల క్ష్యంగా చేసుకొని ధ్యానం సాగించాలి. అవి, శరీరం, శారీరక చర్య, వాక్కు, వాగ్వినియోగం, మనస్సు, మానసికచర్య, బుద్ధుడు, ధర్మం, సంఘం మరియు సూత్రములు. వారు ఈ విధంగా ధ్యానించాలి: ధర్మసాధనంటే శరీరమేనా? అలాగే ధ్యానిస్తూ, చివరకు ధర్మసాధనంటే బోధనలేనా? అని ప్రశ్నించుకోవాలి.

శరీరమే ధర్మసాధనైతే, అది సరైనది కాదు, ఎందుకంటే అది సత్యబోధన కాదు. అది కళంకమైనది, అశుద్ధమైనది, దుర్వాసనలతో కూడియుండేది, జుగుప్సాకరమైనది, సంకర్షణాకరమైనది, పరిమితమైనది, శవంగా మారుతుంది, సూక్ష్మజీవులతో కూడియుండేది.

శారీరకమైన చర్య గనుక ధర్మసాధనైతే, నడవడం, కూర్చోవడం, నిలబడడం, పడుకోవడం, అన్ని దిక్కులకు చూడడం అవుతాయి. వాక్కుగనుక ధర్మసాధనైతే శబ్దం, శ్వాశ, ఛాతి, నాలుక, పెదవులు, ఉచ్ఛ్వాస నిశ్వాసలు, శ్వాసనిలపడం, వదిలివేయడం, హెచ్చుతగ్గులు, స్పష్టత మరియు అస్పష్టత వంటివి ధర్మసాధన అని భావించవలసి వుంటుంది.

వాగ్వినియోగమే ధర్మసాధన అయితే, అప్పుడు అభినందనలు, క్లుప్త వివరణలు, విస్తృత వివరణలు, ప్రతీకాత్మక వివరణలు, సూటి వివరణలు, పొగడ్త, విమర్శ, నిర్వచనం, సంప్రదాయక వివరణ మరియు స్పష్టవివరణలు వంటివి ధర్మసాధన అని భావించవలసి వుంటుంది.

మనస్సు గనుక ధర్మసాధన అయితే, అప్పుడు విచారణ మరియు విశ్లేషణ, వివేచన మరియు వివిధ వివేచనలు, భావన మరియు వివిధ భావనలు, ఆలోచన మరియు వివిధ ఆలోచనలు, భ్రాంతితో కూడిన చర్యలు మరియు స్వప్నాలు వంటి విధర్మ సాధన అని భావించవలసి వుంటుంది.

మానసిక చర్యలే ధర్మసాధన అ యితే అప్పుడు అభిప్రాయాలు, శీతోష్ణాలు, ఆకలిదప్పులు, బాధాసంతోషాలు, సుఖదుఃఖాలు వంటి విధర్మ సాధన అని భావించవలసి వుంటుంది.

బుద్ధుడే గనుక ధర్మసాధన అయితే, భౌతిక శరీరం బుద్ధునిగా భావించాలా? సంవేదన బుద్ధుడా? భావన బుద్ధుడా? కర్మబుద్ధుడా? అతీంద్రియ శక్తులు బుద్ధుడా? చర్యలు బుద్ధుడా? కర్మఫలాలు బుద్ధుడా? అని ప్రశ్నించుకోవాలి.



ధర్మమే గనుక ధర్మసాధన అయితే లయం బోధనా? నిర్వాణం బోధనా? జన్మరాహిత్యం బోధనా? ఆరంభరాహిత్యం బోధనా? అనిర్వచనీయత్వం బోధనా? వివక్షారాహిత్యం బోధనా? కర్మరాహిత్యం బోధనా? సంయోగరాహిత్యం బోధనా?

అని ప్రశ్నించుకోవాలి. సంఘమే గనుక ధర్మసాధన అ యితే, పవిత్ర స్నానానికై వెళ్ళడం సంఘమా? పవిత్ర స్నానఫలం సంఘమా? ఏకపునరాగమనం సంఘమా? ఏకపునరాగమన ఫలం సంఘమా? మహాభినిష్క్రమణం సంఘమా? మహాభినిష్క్రమణ ఫలం సంఘమా? ప్రవ్రజ్య స్వీకరణ సంఘమా? ప్రవ్రజ్య స్వీకరణఫలం సంఘమా? అభిజ్ఞలు సంఘమా? సమాపత్తులు సంఘమా? అని ప్రశ్నించుకోవాలి.

సూత్రములే గనుక ధర్మసాధన అయితే, ప్రవ్రజ్యాదాన హోమం సూత్రములా? శుద్ధతకై ప్రశ్నించడం సూత్రములా? సత్ప్రవర్తన బోధించడం సూత్రములా? త్రిశరణములు పఠించడం సూత్రములా? ఆచార్యుడు సూత్రములా? ఉపాధ్యయుడు సూత్రములా? శిరోముండనము చేయించుకొనుట సూత్రములా? కాషాయాంబరము ధరించుట సూత్రములా? భిక్షాస్వీకారం సూత్రములా? సమ్యక్జీవనము సూత్రములా? అని ప్రశ్నించుకోవాలి.



ఇలా ధ్యానించిన తర్వాత, శరీరముపై భ్రాంతి నిత్యజించి, సాధనపై మోహం త్యజించి, ధర్మంపై అనవసర వివేచన త్యజించి, భూతకాలం గతించినదిగా, భవిష్యత్తు ఇంకా రానిదిగా, వర్తమానం శూన్యంగా గుర్తించి, కర్త అనేవాడెవడూ లేడనీ మరియు ఫలం అనుభవించేవాడు కూడా లేడనీ; ప్రస్తుత కాలం స్థిరమైనదనీ, వేరొక కాలం చలనం లేనిదనీ – ధర్మసాధన అనే పేరుతో పిలవబడేది ఏది? ధర్మసాధన ఎక్కడినుంచి పుడుతుంది? ఎక్కడవుంది? దేహమంటే ఏమిటి? ఎవరిచే ఆచరించబడుతుంది? అది అసలు వుందా? లేదా? అది ఒక రూపమా? రూపరహితమా? సంవేదనా? సంవేదనారహితమా? భావనా? భావనారహితమా? కర్మా? కర్మరాహిత్యమా? స్పృహా? స్పృహ కాదా? ఇలా భావించుకొని, ధర్మసాధన యొక్క సత్యస్వరూపం ఊహించరానిది గనుక, భూత, వర్తమాన, భవిష్యత్కాలాలకు చెందిన విషయాలన్నీ శూన్యమే గనుక, బుద్ధికి ఎలాంటి బంధమూ లేదు గనుక, మనస్సుకు అవధి లేదు గనుక, కార్యాచరణ పరిధి అద్వంద్వమైనది గనుక, లభ్యమైన మార్గం స్వేచ్ఛాపూరితమైనది గనుక, రూపరహితమైన సత్యాన్ని అంగీకరించడంవల్ల, రూపరహితమైన సత్యాన్ని ధ్యానించడం వల్ల, బుద్ధుడు బోధించిన మార్గం సమభావనతో కూడినదని తెలుసుకోవడం వల్ల, బుద్ధత్వం పొందడానికి కావలిసిన అన్ని గుణాలు పొందడమనేది ధర్మసాధనగా చెప్పబడుతోంది.

అలాగే దశ విషయాలపై జ్ఞానాన్ని పెంపొందింప జేసుకోవాలి. "ఏదిసత్యం, ఏది అసత్యం? భూత, వర్తమాన, భవిష్యత్కర్మ ఫలాలు, అన్నిరకాల ధ్యానము, ముక్తి, సమాధి; శక్తుల ఉత్తమ అధమ గుణాలు, సమస్త ప్రజ్ఞలు, సమస్త విశ్వాలు, సమస్త మార్గాల లక్ష్యం, నిరాటంకమైన అతీంద్రియ శక్తి, గత జన్మల సంపూర్ణ జ్ఞానం, సంస్కారాలను శాశ్వతంగా నిరోధించగలగడం. బుద్ధులకుండే ఈ దశ శక్తులను ధ్యానిస్తూ, ప్రతి శక్తిలోనూ అగణనీయమైన అర్థాలున్నాయని తెలుసుకొని, వాటి గురించి ప్రశ్నించాలి. తెలుసుకున్న తరువాత, సాధకుడు జీవులపట్ల మహా కరుణను, దయను పెంపొందింపజేసుకొని, వారిని త్యజించకుండా పరిశీలించాలి. నిరంతరం బోధనలపై ధ్యానిస్తూ, ప్రతిఫలాపేక్ష లేకుండా ఉత్తమమైన కర్మలనాచరిస్తూ, దృగ్విషయాలన్నీ స్వప్న సాదృశ్యమైనవని, భ్రాంతి పూర్వకమైనవనీ, ప్రతిబింబా మాత్రమనీ, ప్రతిధ్వని మాత్రమనీ, ఇంద్రజాల జనితమనీ భావించాలి.

సాధకులంతా ఇటువంటి జ్ఞానంతో మమేకమైతే, వారు విషయాలపట్ల ద్వంద్వ భావనలను విసర్జించగలుగుతారు మరియు బోధిసత్వ బోధనలు స్పష్టమవుతాయి; ప్రథమ సంకల్పంతోనే వారు నిర్దిష్టమైన నిర్వాణం పొందాలుగుతారు, అన్ని విషయాలు మనస్సు యొక్క స్వభావమని గ్రహించి, ధర్మకాయాన్ని పొంది ఇతరుల సహాయం లేకుండా జ్ఞానాన్ని పొందుతారు.

బి.వి. భద్రగిరీష్
ఫోన్ : 991 215 6560





# 'జాగరూకులై' ఉండండి

– ఎఫ్.ఆర్.కె. అలెగ్జాండర్

గౌతమబుద్ధుడి దుఃఖనివారణపై ఇచ్చిన అన్నిరకాల ఉపన్యాసాలలో ఉన్న ముఖ్యమైన సందేశం "ఎల్లవేళలా మెలకువతో ఉండండి, సతిని ప్రతిష్ఠాపనం చెయ్యండి" అని చెబుతూ తన శిష్యులకు ఉపదేశించేవారు. అంతేకాకుండా సతిని దేనిపైన ప్రతిష్ఠించాలి, ఏ విధంగా సతిని అభివృద్ధిపరచుకోవాలి అన్న అనేక విషయాలు ఆయన ద్వారా చెప్పబడిన సతిపట్ఠాన సూత్రంలో చాలా వివరంగా బోధించారు. దీనిని క్లుప్తంగా సంక్షిప్త సారాంశాన్ని పాఠకులకు అందచెయ్యడం ఈ వ్యాసం యొక్క ప్రధాన ఉద్దేశ్యం.

మనసు గురించి ఎప్పుడు చెప్పినా బుద్ధుడు మూడు విషయాలను ప్రధానంగా తెలియచేసేవారు.

1. మీ మనసును తెలుసుకోండి – మీ మనసు మీరు అతి సమీపంలో మీలోనే ఉన్నప్పటికీ దాని గురించి మీకు ఏమీ తెలియదు.

2. మీ మనసును మీరే సంస్కరించుకోండి. మనసు మన స్వాధీనంలో ఉండదు. ఇది గత జన్మలలో కలిగిన చెడు అలవాట్లకు బానిస. అలాంటి మనసును సంస్కరించి క్రమశిక్షణలో పెట్టటం అంత సులభంకాదు. అది మూర్ఖంగా మొండితనంతో తనకు ఇష్టమైన వ్యవహారాన్ని నడిపించుకొనడానికి అలవాటుపడి ఉంది. కానీ పట్టుదలతో సాధనచేసి మనసును సులభంగానే మన స్వాధీనంలోకి తెచ్చుకొన వీలుంది.

3. మీ మనసును మనోవికారాల బంధనాల నుండి విడుదల చెయ్యండి. రాగ, ద్వేష, మోహాలనే అకుశల చిత్తధర్మాల కారణంగా మీ మనసు అనేక మనోవికారాల బంధనంలో చిక్కుబడి ఉంది. ఆ బంధనాలను సాధన ద్వారా ఇప్పుడే ఇక్కడే కూకటివ్రేళ్ళతో సహా పెకలించి పారవేసి మనసును బంధనాలనుండి విడుదల చెయ్యాలి. ఇలా విడుదల అయిన మనసు స్వేచ్ఛావాయువులను పీల్చుకోగలుగుతుంది. ఇలా చెయ్యాలి అంటే మనసులో సతి అనే ధర్మాన్ని సాధకులు అభివృద్ధి చేసుకోవాల్సి ఉంటుంది. సతి అనేది బుద్ధుడి మాతృభాష అయిన పాళీ పదం. సతి అంటే మెలకువ, అప్రమత్తత, ఎరుక అని తెలుగులోకి అనువదించవచ్చును. మనసును ఎల్లవేళలా వర్తమానంలో మెలకువగా ఉంచటం అనేది సరియైన పద్ధతిలో ఉండాలి అని బుద్ధుడు ప్రబోధించేవారు. అంటే అలా మనసును మెలకువగా ఉంచినప్పుడు వర్తమానంలో రాగ, ద్వేష, మోహాలు జాగృతం కాకుండా జాగ్రత్తవహించాలి అని అర్థం.

నేటి భారతీయ భాషల్లో 'సతిని' స్మృతి లేక జ్ఞాపకశక్తి అన్న అర్థంలో వాడుతున్నారు. కానీ విపశ్యనాధ్యాన సాధనలో సతికి పైన చెప్పిన అర్థమే సరియైనది. ఈ సతిని మనసులో జాగృతంచేసి అభివృద్ధిపరుచుకున్నప్పుడు మనసు మన స్వాధీనంలోకి వచ్చి మనోవికారాల బంధనాలను తెంచుకొనడానికి ఒక గొప్ప పరికరంగా పనిచేస్తుంది. బంధనాలను త్రెంచుకొన్న మనసు స్వాతంత్ర్యం పొంది తన సహజ స్వభావాన్ని ప్రదర్శించగలుగుతుంది. మనసును సాటిలేని ఉన్నతస్థాయికి చేర్చడానికి సతి ఒక కేంద్రబిందువుగా పనిచేస్తుంది. నిర్వాణాన్ని ప్రాప్తించుకోవడానికి సతి ప్రతిష్టాపన ఒక్కటే మార్గమని బుద్ధుడు ప్రబోధించేవాడు.

అన్ని రకాల బౌద్ధ సాంప్రదాయాలలో సతి ఎంతో ప్రాముఖ్యత సంతరించుకొని ఉంది. పాళీ నిభాయస్ అనే గ్రంథాన్ని శ్రద్ధగా పరిశీలించినవారికి మనసులో సతి జాగరణవలన అవి మనకు నిత్యజీవితంలో ఎలా ఉపయోగపడగలవో స్పష్టంగా విశదమవుతుంది. సతిని అత్యంత సమీపంనుండి పరిశీలించడానికి వీలవుతుంది. సతి అనే ధర్మం మనస్సు యొక్క విధాలపై ఎలా ఆధారపడి ఉంటుందో అర్థమవుతుంది. సతిని ప్రతిష్టించడం ధ్యానసాధనలో ఎంత అవసరమో ఎంత ఉపయోగమో బోధపడుతుంది. సతిపై అవగాహనను పెంచుతుంది. సతికి సరియైన అర్థం ఏమిటో పరిశీలిద్దాం.

సతి అన్నది పాళీ భాషలోని పదం. దీన్ని తెలుగులోకి అనువదించి చెప్పినప్పుడు సతి అంటే ప్రకటింపబడుతున్న సత్యంపట్ల మెలకువ, అప్రమత్తతతో కూడిన ఎరుక. ధర్మాచరణంలో ధర్మం పరిపుష్టం కావడానికి సతిని అభివృద్ధిపరచుకొనవలసిన అవసరం ఎంతగానో ఉంటుంది. సతిని సంస్కృతంలో స్మృతి అని అనువదించారు. స్మృతి అంటే జ్ఞాపకశక్తి. సతికి జ్ఞాపకశక్తికి ఉన్న సంబంధాన్ని బుద్ధుడు పాళీభాషలో నిర్వచనరూపంలో చెప్పాడు. విపశ్యన ధ్యాన సాధనలో జ్ఞాపకశక్తి మనకు అంతగా అవసరం ఉండదు. ధ్యానంలో జ్ఞాపకం ఉంచుకోవలసింది ఒక్కటే ఉంటుంది. ఏ ఆలంబనను ఆధారంగా చేసుకొని ధ్యానం చేస్తున్నామో దాని జ్ఞాపకం ఎల్లవేళలా ఉండాలి. ధ్యానం శరీరం, మనసు రెండింటితో చేస్తాం కాబట్టి శరీరానికి, మనసుకు సంబంధించిన సత్యాన్ని, అసత్యంనుండి పారిపోకుండా ఉండాలన్న విషయాన్నే జ్ఞాపకం ఉండేలా చూసుకోవాలి. సతిని కేవలం ఈ రకంగా మాత్రమే జ్ఞాపకశక్తిగా, స్మృతిగా పోల్చవచ్చును. పాళీభాషలో ఉన్న ఉపదేశాల్లో స్మృతి మంతుడి గురించి వర్ణిస్తూ అతడు చాలాకాలం క్రితం చెప్పినదానిని తు.చ తప్పకుండా జ్ఞప్తికి తెచ్చుకొని చెప్పగల నేర్పరి అని చెప్పాడు. ఆనందుడు బుద్ధుని ప్రధాన శిష్యుడు. ఇతడు గొప్ప స్మృతిమంతుడిగా వర్ణించాడు. ఈ ఆనందుడు బుద్ధుడికి వ్యక్తిగత ప్రధాన శిష్యుడుగా సహాయకుడిగా సేవలు అందించాడు. బుద్ధుడు ఎక్కడికి వెళ్ళినా ఆనందుడు వెంట ఉండేవాడు. ఇతడిలో సతి అనే గుణం అత్యున్నత స్థాయిలో ఉండేది. అందువలన బుద్ధుడు చెప్పిన ధర్మోపదేశాలను ఎప్పుడు అడిగినా ఫలానాచోట బుద్ధుడు ఇలా చెప్పాడు అని ఆనందుడు జ్ఞాపకం తెచ్చుకొని బుద్ధవాసిని పదిమందికీ తెలియచేసేవాడు. సతి అనే గుణమే ఆనందుని అత్యున్నత స్థాయిలో నిలబెట్టింది. బుద్ధుడు పరినిర్వాణం పొందిన తరువాత బుద్ధుడు ఇచ్చిన ధర్మోపదేశాలన్నింటిని గ్రంథస్థం చెయ్యాలని వాటిని భావితరాలవారికి అందించాలని బుద్ధుని ప్రధాన శిష్యులు సంకల్పించుకున్నప్పుడు వారు ఆనందుడిని పిలిచి అన్ని ధర్మోపదేశాలను తిరిగి చెప్పించుకొని గ్రంథస్థం చేసారు. ఆయన చెప్పిన ధర్మోపదేశాల సంఖ్య దాదాపు 80,000 ఉన్నాయని చెబుతారు. చూసారా ఆనందుడిలో సతి లేక స్మృతి ఎంత ఉన్నత స్థాయిలో ఉందో! ఇలాంటి పరిస్థితుల్లో సతిని స్మృతి లేక జ్ఞాపకశక్తిగా గుర్తించబడింది. ధ్యానసాధనలో సతి అనేది జ్ఞాపకశక్తిగా ఉపయోగపడనప్పటికీ లౌకిక వ్యవహార విషయాల్లో సతి, జ్ఞాపకశక్తిగా బాగా ఉపయోగపడుతుంది. సతికి సరియైన అనువాదం స్మృతి కాజాలదు కానీ సతి ధర్మం అభివ్యక్తి చెందుతున్నప్పుడు జ్ఞాపకశక్తి కూడా దానికి అనుచందంగా అభివృద్ధి చెందుతుందని తెలుసుకోవచ్చును.

గతంలోని ఒక విషయాన్ని జ్ఞాపకం చేసుకోవాలనుకుంటే ఆ విషయం జరుగుతున్నప్పుడు పరిశీలకుడిలో సతి జాగృతమై ఉన్నప్పుడే ఆ విషయం మనసులో వివరంగా ముద్రించబడి ఉన్నప్పుడే మళ్ళీ ఆ విషయాన్ని ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు వివరంగా జ్ఞాపకం తెచ్చుకోవడానికి వీలవుతుంది. ఇలా విషయాలను మనసు ద్వారా గ్రహించి, సంగ్రహించి ముద్రించుకోవడానికి మనసులో ఆ విషయాలను ముద్రించడానికి సరిపడే స్థలం ఉండాలి. దీనికొరకు మనసు విశాలంగా ఉండాల్సిన అవసరం ఎంతగానో ఉంది. జ్ఞాపకశక్తి అధికంగా ఉన్నవారిలో సతితోపాటు విశాలమైన మనసు కూడా ఉండాలన్న సంగతిని అందరూ తెలుసుకోవాలి.

**సతికి విశాలమైన మనసుకు ఉన్న సంబంధం :**

విశాలమైన మనసు జ్ఞాపకశక్తికి ఒక ప్రధాన అవసరం. ఎందుకంటే విశాలమైన మనసులోనే బాహ్యంగా జరిగే సంఘటనలు వివరంగా ముద్రించబడగలవు. దాచబడగలవు. అవసరం పడినపుడు మనసులోని అలా ముద్రించబడిన కోణం ఆవిష్కరింపబడి అక్కడ ఉన్న విషయాలు తు.చ తప్పకుండా జ్ఞాపకానికి వస్తాయి. జ్ఞాపకశక్తి అధికంగా కలవారిలో సతి అన్న ధర్మం వారికి తెలియకుండానే అధికంగా

ఉంటుంది. వీరు ఏ విషయమైనా ఎంతో మెలకువతో, అప్రమత్తతో గమనిస్తూ విశాలమైన మనసులో ముద్రించుకోగలుగుతారు. అలా విశాలమైన మనసులో ముద్రించబడిన విషయాలను ఎప్పుడు కావాలనుకుంటే జ్ఞప్తికి తెచ్చుకోగల శక్తి జ్ఞాపకశక్తి అధికంగా కలవారికి, ఏకసంథాగ్రాహులకు ఉంటుంది. అందువలన సతితో కూడిన జ్ఞాపకశక్తికి విశాలమైన మనసుకు అవినాభావ సంబంధం ఉంటుంది. ఒక విషయం జరుగుతున్నప్పుడు మనసులో ముద్రింపబడుతున్నప్పుడు తిరిగి ఆ విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకుంటున్నప్పుడు కూడా సతి అనే ధర్మం మనసులో అత్యున్నత స్థాయిలో ఉండాల్సిన అవసరం ఎంతగానో ఉంటుంది. స్మృతి అనే జ్ఞాపకం గతానికి సంబంధించింది. సతి ఎల్లవేళలా వర్తమానానికి సంబంధించినది. అప్రమత్తత, మెలకువ, ఎరుక అన్నది వర్తమానంలోనే ఉండగలుగుతుంది. గతంలోనూ, భవిష్యత్తులోనూ సతి ఉండజాలదు.

ఎప్పుడైనా ఒక విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకోవాలనుకుంటే కొంత సమయం పడుతుంది. వెంటనే జ్ఞాపకం రాదు. మనసుపై ఎంత ఒత్తిడి కలిగించినప్పటికి ప్రయోజనం ఉండదు. ఎందుకంటే మనసుపై వత్తిడి కలిగిస్తే అది కుచించుకుపోతుంది. ఎంత ఎక్కువ ఒత్తిడి కలిగిస్తే మనసు అంత ఎక్కువగా కుచించుకుపోవడం జరుగుతుంది. ఈ కారణంగా విషయం జ్ఞాపకం రాకుండాపోతుంది. అందువలన జ్ఞాపకం తెచ్చుకోవలసిన విషయాన్ని ఆలోచించి మనసుపై ఎలాంటి ఒత్తిడి కలిగించకుండా రిలాక్స్‌డ్‌గా ఉంచాలి. ఒత్తిడి లేని మనసు వెంటనే విశాలమవుతుంది. జ్ఞాపకం తెచ్చుకోవలసిన విషయం ముద్రించబడి ఉన్న కోణం తొందరగా ఆవిష్కరింపబడి విషయం వివరంగా జ్ఞాపకం వస్తుంది. నాటి ఊట పైకి ఉబికివచ్చినట్లుగా జ్ఞప్తికి తెచ్చుకోవలసిన విషయం మనసు లోలోతుల్లో నుంచి పైకి ఉబికి వస్తుంది. ఈ కారణంగా సతికి, జ్ఞాపకశక్తికి ఉన్న సంబంధం విశాలమైన మనసు మాత్రమే అని తెలుసుకోవాలి. కుచించుకుపోయిన మనసులో సతి జాగృతం కాజాలదు. ఈ కారణంగానే ధ్యానసాధనలో శరీరాన్ని వదులుగా రిలాక్స్‌డ్‌గా ఉంచాలని చెబుతారు.

సతికి, విశాలమైన మనసుకు ఉన్న సంబంధాన్ని అందరికీ అర్థంకావడానికి అనేక ఉదాహరణల ద్వారా తెలియజేసారు.

1. ఉదాహరణకు ఒక పశువుల మందను కాసే పశువుల కాపరి పొలాలన్నీ పంటపొలాలతో నిండి ఉన్నప్పుడు తన మందలోని పశువులను ఎంతో సతితో కూడిన మెలకువతో అప్రమత్తతతో ప్రతి పశువును ఒక కంట కనిపెడుతూ పశువులను మేపుతాడు. ఎందుకంటే ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నప్పటికీ ఏదో పశువు తప్పించుకొనిపోయి పంటపొలాల్లో పడి పంటలను నాశనం చేస్తాయని అలా జరగకుండా అతడు ఎంతో జాగ్రత్త తీసుకుంటూ ప్రతి పశువును అదిలించుకుంటూ, కనిపెడుతూ ఉండి పశువులను మేపుతాడు. ఒక్క పశువు కూడా తన దృష్టినుండి తప్పించుకోవడానికి వీలు లేకుండా చేస్తాడు. పంటపొలాల్లో పంటల కోతలు పూర్తి అయి పంటలు రైతుల ఇళ్ళకు చేరిన తరువాత పశువులకాపరి కాస్త రిలాక్స్ అవుతాడు. అతడికి కొంత వెసులుబాటు లభిస్తుంది. అతడు హాయిగా ఒక చెట్టు నీడన కూర్చొని దూరంనుండే పశువులను గమనిస్తూ మేపుతాడు. దీనివల్ల పశువుల కాపరి పని సులువు అవుతుంది. ఈ రెండు సందర్భాలలో సతి యొక్క స్థాయిని పాఠకులు గ్రహించవచ్చును. మొదటి సందర్భంలో సతి తీక్షణత అధికంగానూ రెండవ సందర్భంలో సాధారణంగాను ఉంచుకోవడానికి పశువుల కాపరికి వీలవుతుంది. పంటలు ఉన్నప్పుడు ప్రతి ఒక్క పశువును జాగ్రత్తగా గమనించాల్సిన అవసరం ఉంది. పంటలు లేనప్పుడు అన్ని పశువులను ఒక్క పశువుగా మార్చుకొని పశువులను కాపలా కాయడం అనేది విశాలమైన మనసు ద్వారానే జరుగుతుంది.

2. ఇంకో ఉదాహరణలో ఒక పరిస్థితిలో లీనం కాకుండా బయటినుండి చూసి తెలుసుకొనడానికి ఎత్తైన శిఖరంగల ప్రాంతానికి వెళ్ళేవాడు ఏ విధంగా సతిని మెలకువతో సాధన చేస్తాడో తెలియజేయబడింది. ఈ ఎత్తైన శిఖరం యొక్క ఉదాహరణవలన ఒక విషయాన్ని అన్నివైపుల నుండి చూసి దానికి సంబంధించిన అన్నిరకాల అంశాల వివరాలను తెలుసుకొని పరిపూర్ణ జ్ఞానాన్ని సంపాదించే విధానం తెలుపబడింది. ఒకే తలంపై ఉండి ఒక విషయాన్ని దగ్గరనుండి చూసినదానికన్నా దానికన్నా ఎత్తైన ప్రదేశానికి వెళ్ళి ఆ విషయాన్ని పరిశీలించడంవలన ఆ విషయానికి చుట్టూ ఉన్న అన్ని కోణాలు తేటతెల్లమై విషయం స్పష్టంగా కూడా జరుగుతుంది. మనసులో సతి జాగృతమై అభివృద్ధి చెందుతున్నప్పుడు అంతర్ముఖంగా ప్రత్యక్షమైన విషయానికి

మనసుకు మధ్య కొంత దూరం ఏర్పడటంవలన ఆ విషయాన్ని మనసు నలువైపులా చుట్టుముట్టి దానిని సతితో కూడిన మెలకువతో అప్రమత్తతో తెలుసుకొని దాని ఎరుకలో ఉంటుంది. ఇలా నిరంతరంగా జరుగుతున్నప్పుడు మనసులో సతి జాగృతమై అభివృద్ధి చెందుతుంది. ఇక్కడ దూరం అంటే రెండు వస్తువుల మధ్యనున్న దూరం అని అర్థంకాదు. ధ్యానంలో ప్రత్యక్షమైన విషయంపై సాధకుడు ఎలాంటి రాగద్వేషాలు లేకుండా బయటి వ్యక్తి చూసినట్లుగా తటస్థంగా చూసినప్పుడు సాధకుడు ప్రత్యక్షమైన విషయాన్ని అంటిపెట్టుకొనకుండా దూరంగా ఉంచగలుగుతాడని అర్థం.

3. మరొక ఉదాహరణలో ఒక రథచోదకుడు రహదారిగుండా రథాన్ని తోలుతున్నప్పుడు ఎంతో మెలకువను, అప్రమత్తతను, ఎరుకను ప్రదర్శించాల్సివస్తుంది. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సమతుల్యంగా అశ్వాలను పర్యవేక్షిస్తూ అశ్వాలను అదిరిస్తూ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ రథాన్ని నడిపించుతాడు. ఎప్పుడు ఏ అశ్వాన్ని అదిలించాలి దేనిని ఆపాలి, ఎక్కడ వేగం పెంచాలి, ఎక్కడ వేగం తగ్గించాలి అనే విషయాలను చోదకుడు ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకుంటూ ఎంతో మెలకువతో అప్రమత్తతను, ఎరుకను ప్రదర్శించుకుంటూ రథాన్ని నడిపించినప్పుడే రథం విజయవంతంగా తన గమ్యానికి చేరుతుంది.

ఇలా సమతుల్యంతో నిండిన పర్యవేక్షణ సతితో స్వభావసిద్ధంగా ఉంది. ఈ సతి ఇతర చిత్తధర్మాలతో కలసి పనిచేస్తున్నప్పుడు ఈ విషయం స్పష్టంగా అనుభవానికి వస్తుంది. సతితో కలిసి పనిచెయ్యడానికి ఐదు చిత్తధర్మాలు ఎల్లవేళలా తయారుగా ఉంటాయి. అవి శ్రద్ధ, వీర్యం, సతి, ఏకాగ్రత మరియు అమోహం (తెలివి, జ్ఞానం). ఈ ఐదు చిత్తధర్మాలు ఒకదానిలో మరొకటి సునిశితంగా సమతుల్యతను సాధించాల్సిన అవసరం ఎంతగానో ఉంటుంది. వాటిలోనే ఒక్కటి సమతుల్య పరిమాణంకన్నా అధికారంగా ఉన్నా అది ముక్తిమార్గ ప్రయాణంలో ఆటంకాలు కలిగిస్తుంది. సతి ఈ ఐదు చిత్తధర్మాలకు మధ్యస్థ స్థానం ఆశ్రమించి ఉంటుంది. అందువలన సతి మిగిలిన నాలుగు చిత్తధర్మాలను, చక్కగా నియంత్రించి సమతుల్యతను సాధిస్తుంది. ఏ చిత్తధర్మమైన సరియైన పరిమాణంలో లేకపోతే దానిని సతి మెలకువతో తెలుసుకుంటుంది. ఇంకో ముఖ్య విషయం ఏమంటే సతికి అతి లేదు. అది ఎంత ఉంటే అంత మంచిది. అందువలన సాధన ద్వారా సతిని ఎంత పెంచుకుంటే అంత ఎక్కువగా సాధకుడికి మేలుచేస్తుంది. ఇది అన్నివేళలా అన్ని పరిస్థితులకు పనికివస్తుంది. సాధకుడికి ఎంతో లాభం చేకూర్చుతుంది. ఈ విషయాన్ని పైన చెప్పిన ఐదు ఉదాహరణల ఆధారంగా స్పష్టంగా తెలుసుకొనవచ్చును. ఇలా సతికి మరియు విశాలమైన మనసుకు ఉన్న అవినాభావ సంబంధాన్ని తెలియచేస్తుంది.

**సతి మరియు విషయ అవగాహన :**

సతి అనే చిత్తధర్మాన్ని మనసికారం అనే చిత్తధర్మంతో పోల్చవచ్చును. మనసికారం అన్నిరకాల చిత్తాలలో అన్నిరకాల మానసిక స్థితుల్లో ఉంటుంది. మనసికారం అంటే ఒక విషయంపై దృష్టిని కేంద్రీకరించడం. ఎలాంటి చిత్తంలోనైనా మనసికారం లేనిదే విషయం బోధపడదు. సాధారణ మనసికారంలో మొదట కొన్ని చిరుక్షణాల్లో ఇంద్రియానికి విషయం ఎదురైందన్న కేవలం తెలుసుకుంటుంది. ఆ తరువాత చిత్తం ఆ విషయాన్ని గుర్తుపట్టటం, విలువకట్టటం, ఇష్టాఅయిష్టాల ప్రకారంగా రాగద్వేషాలను సృష్టించుకుంటూ విషయాన్ని పూర్తిగా అవగాహన చేసుకుంటూ ముద్రించుకుంటుంది. ఈ ప్రక్రియ జరుగుతున్నప్పుడు సతియొక్క తీక్షణతపై విషయ పరిజ్ఞానం ఆధారపడి ఉంటుంది. సతి సరియైన విధంగా లేకపోతే ఒక్కోసారి ఒకవిషయం ఎంతసేపటికీ సరిగా అర్థంకాకుండా ఉంటుంది. మరికొన్నిసార్లు సతి తీక్షణంగా ఉన్నప్పుడు విషయం చాలా తొందరగా లిప్తపాటులో చూసీచూడగానే అవగాహన కలుగుతుంది. ఈ ప్రక్రియకు మనసికారం అనే చిత్త ధర్మం తోడ్పడుతుంది. సతి అనే చిత్తధర్మం అభివృద్ధి చెందినప్పుడు ధ్యానంలో ఎదురైన ఏ విషయమైనా ఉన్నదానిని ఉన్నట్లుగా అవగాహన చేసుకొని తటస్థంగా ఉండగలగటం సాధ్యమవుతుంది.

సతిని ఇంకా బాగా అర్థంచేసుకోవాలనుకుంటే బుద్ధుడు విషయ అవగాహనను ఏ విధంగా విశ్లేషించి తీసుకోవాలో చెప్పిన విషయాలను తెలుసుకోవాల్సి ఉంటుంది. బుద్ధుడు చెప్పిన ధర్మోపదేశాల్లో ఈ విషయం మాటిమాటికీ చర్చించబడింది. ఇంద్రియ విషయ విజ్ఞానం ఇంద్రియాలకు ఎదురైన ఇంద్రియ విషయాల స్పష్టతపై ఆధారపడి ఉంటుంది. కన్నులకు కనబడే రూపాలు, చెవులకు వినబడే శబ్దాలు మొదలగువాటిని విశ్లేషించి ఇష్టాఅయిష్టాలను తెలుసుకోవడం

అన్నది ఈ విధంగానే జరుగుతుంది. ఇంద్రియ విషయాలను చిత్తం ద్వారా గ్రహించి విలువకట్టి అది ఇష్టమైనదా కాదా అని నిర్ణయించుకొని వాటిని అనుభూతిని పొందడంలో రెండు విషయాలు ఉన్నాయి. ఒకటి ఇంద్రియ విజ్ఞానం రెండు ఇంద్రియ విషయ అనుభవం. ఈ రెండింటి జాగరణకుగల మధ్య సమయంలో జరిగే అనేక సంఘటనలు ఇంద్రియ విషయాలను గ్రహించి వ్యక్తికి ఉన్న అవగాహనాజ్ఞానంపై ఆధారపడి ఉంటుంది. ఆ వ్యక్తి విషయాన్ని ఏ విధంగా అవగాహన చేసుకున్నాడో ఏ విధంగా ప్రపంచాన్ని అనుభూతిని పొందుతున్నాడు అన్నది తెలిసివస్తుంది. ఇంద్రియ విషయ పరిజ్ఞానంతో కూడిన అనుభూతి ఆ వ్యక్తి యొక్క ఇష్టాఅయిష్టాలు మరియు వాటిపై అతనికిగల గతానుభవాలపై ఆధారపడి ఉంటుంది. అతడు గతంలో ఆ విషయాన్ని పూర్తి మెలకువతో గ్రహించాడా లేక పరధ్యానంలో ఉండి గ్రహించాడా అన్నదానిపై అతడి గతానుభవం ఆధారపడి ఉంటుంది. అతడిలో జమకూడి ఉన్న విషయపరిజ్ఞాన అనుభవం కూడా సతి యొక్క తీవ్రతపైననే ఆధారపడి ఉంటుంది. సతి సరియైన విధంగా లేకపోయినట్లయితే ఆ వ్యక్తి పక్షపాత బుద్ధితో ఇష్టమైన విషయాన్ని అయిష్టమైనదానిగాను, అయిష్టమైనదానిని ఇష్టమైన విషయంగాను గుర్తించే అవకాశం చాలా ఎక్కువగా ఉంటుంది. గతంలోని పరిస్థితులకు వర్తమానంలో విషయాన్ని గ్రహిస్తున్నప్పుడు ఉన్న పరిస్థితులకు తేడా ఉండే అవకాశం కూడా చాలా ఉంటుంది. ఆ వ్యక్తిలో నిద్రాణంలో ఉండే అనుశాయి క్లేశాలవలన ఆ వ్యక్తి స్పృహ లేని స్థితిలో విషయాన్ని గ్రహించడం అన్నది జరుగుతుంది. నిద్రాణంలో ఉండే అనుశాయిక్లేశాలు సామాన్య వ్యక్తులను పరధ్యానంలో పడేస్తూ ఉంటాయి. ఈ సమయంలో జరిగే విషయపరిజ్ఞానం పరిపూర్ణంగా ఉండదు. ఇలాంటి తెలివిలేనితనం అప్పుడే పుట్టిన శిశువులో కూడా ఉంటుంది అని బుద్ధుడు ఉపదేశించాడు. వ్యక్తుల్లో నిద్రాణంలో ఉండే అనుశాయిక్లేశాలు ఏడు విధాలుగా ఉంటాయని చెప్పబడింది. వాటిలో మొదటి రెండు అనుశాయి క్లేశాల గురించి ఇక్కడ తెలుసుకుందాం. ఇంద్రియ భాగాలపై ఉండే ఇష్టాఅయిష్టాలకు వ్యక్తుల్లో ఉండే అనుశాయి క్లేశాలే కారణమవుతాయి. సుఖంగా ఉండే ఇంద్రియ భోగాలు సుఖాన్ని కలిగిస్తున్న కారణంగా వాటిపై ఇష్టం ఏర్పడుతుంది. అలాకాకుండా అనుభవిస్తున్న ఇంద్రియ అనుభూతులు బాధగా ఉండి దుఃఖాన్ని కలిగిస్తే వాటిపై అయిష్ట ఏర్పడుతుంది. అనుశాయిక్లేశాలు వ్యక్తుల్లో వారికి తెలియకుండానే పనిచేస్తుంటాయి. ఇదే దీనిలోని పెద్దసమస్య. అంటువలన అనుశాయి క్లేశాలు ఇంద్రియ విషయాల అనుభవంపై ఆధిపత్యం వహిస్తున్నప్పుడు వాటిని సతితో అప్రమత్తతతో మెలకువతో తెలుసుకోగల నేర్పు సాధకుడికి ఉండాలి. దీనికి సతి ఒక గొప్ప పరికరంగా పనిచేస్తుంది. సతి సమయంలో ఇంద్రియ విషయానుభూతి సుఖంగా ఉన్నా, దుఃఖాన్ని కలిగిస్తున్నా ఎలాంటి ప్రతిక్రియ చెయ్యకుండా సాధకుడు కేవలం తెలుసుకోవాలి. తటస్థంగా వాటిని గమనిస్తూ ఉండాలి. అలా చెయ్యగలిగితే ఇంద్రియ విషయాలపై లోలోపలినుండి ఆధిపత్యం వంగిస్తున్న అనుశాయి క్లేశాలు ఎరుకలోనికి వస్తాయి. వీటిని తెలియకుండా చేసే అడ్డుతెరలు తొలగిపోతాయి. ఈ స్థితిలో మనకు తెలియకుండా అంతర్ముఖంలో జరిగే ఎన్నో విషయాలు మనకు అనుభూతిపరంగా తెలిసివస్తాయి. అందువల్ల నిరంతర ధ్యానసాధన ద్వారా సతిని అభివృద్ధిపరచుకోవాలి. ఇంద్రియ విషయానుభూతులు ఏ విధంగా రాగద్వేషాలను కలిగిస్తున్నాయో వాటిని ఏ విధంగా అధిగమించాలో అన్న విషయం ధ్యానాలలో బోధపడుతుంది.

ధ్యానసాధనలో సతిని అభివృద్ధి పరచుకున్న సాధకుడు లిప్తపాటులో విషయాల ఇష్టాఅయిష్టాలను తెలుసుకోగల స్థాయికి ఎదుగుతాడు. ఇలాంటి స్థితి రావాలంటే ఎదురైన విషయాన్ని సరియైన విధంగా విశ్లేషించి అవగాహన కలిగించుకొని ప్రతిక్రియ చెయ్యకుండా తటస్థతను పెంచుకోవడంలో కృతకృత్యుడు కాగలిగి ఉండాలి. విషయాన్ని సరియైన విధంగా ఉన్నది ఉన్నట్లుగా అవగాహన చేసుకోవడం అంటే మాటలు కాదు. దానికి ఎంతో వివేకం, విశ్లేషణాశక్తి ఉండాలి. ఇటువంటి అవగాహనాశక్తి అభిజ్ఞాన శక్తికన్నా గొప్పది అని చెప్పబడింది. ఇలాంటి సతిని అభివృద్ధి పరచుకోవడానికి ఇంద్రియ భోగాలపై విరక్తి పెంచుకోవలసివస్తుంది. ఇది ఎంతో కష్టమైనపని. ఇది ఒక్కసారి సంకల్పించుకున్నంత మాత్రాన లభించదు. నిరంతర సాధనతో దానిని సాధకుడు సాధించాల్సి ఉంటుంది. ఇక్కడ సాధకుడు ఇంద్రియ విషయాలను గ్రహిస్తున్నప్పుడు కేవలం తనని ఎంతో మెలకువతో అప్రమత్తతో తెలుసుకుంటూ ప్రతిక్రియ చెయ్యకుండా తటస్థంగా ఉండాల్సివస్తుంది. సతిని

ఇంద్రియ ద్వారాలవద్ద ఈ విధంగా అభివృద్ధి చేసుకునే ప్రయత్నంలో ఇంద్రియ విషయాలను పూర్తిగా త్యజించకూడదు. అలా చెయ్యలేంకూడా. ఇంద్రియ విషయాలు ఉంటాయి కానీ సాధకుడు ప్రతిక్రియ చెయ్యకుండా విషయాన్ని కేవలం తెలుసుకోవడం మాత్రమే చెయ్యాలని అర్థం. ఈ విషయంలో బుద్ధుడు ఈ క్రిందివిధంగా ఉపదేశించాడు. ఒక వ్యక్తి కనులకు కనబడినదానిని చూడకుండా, చెవులకు వినబడేదానిని వినకుండా ఉండగలిగి ధ్యానసాధన చెయ్యగలిగినట్లయితే పుట్టు గుడ్డివారు, చెవిటివారు కూడా ధ్యానసాధకులు కాగలిగి ఉండేవారు. కాని అలా జరగదు. కంటికి కనబడ్డవి చూడాలి, చెవికి వినబడ్డవి వినాలి కాని వాటిని విశ్లేషించి ప్రతిక్రియ చెయ్యకుండా ఉండటంలోనే సాధకుడి నేర్పరితనం ఇమిడి ఉంటుంది. సతిని నిరంతరంగా సాధనద్వారా ఎలాంటి ఆటంకం లేకుండా అభివృద్ధి చేసుకోవడంద్వారా ఇంద్రియ విషయాలపై మనసు యొక్క ఆధిపత్యాన్ని తగ్గించవచ్చును. ఇక్కడ ఈ విషయాన్ని విశదీకరించడానికి ఒక ఉదాహరణ చెప్పబడింది. నగర ద్వారాలను కాపలాకాసే ద్వారపాలకుల విధినిర్వహణ చేసే విధానాలద్వారా ఉదహరించారు. పురాతనకాలంలో భారతదేశంలో ప్రతి నగరానికి ప్రవేశద్వారాలు ఉండేవి. నిజమైన నగరవాసులు మాత్రమే ఆ ద్వారాలగుండా నగరంలోకి రాగలుగుతారు. నగరంలోకి ద్వారపాలకులు అతి జాగ్రత్తగా గమనిస్తూ నిజమైన పురజనులకు నగరం లోపలికి ప్రవేశించడానికి అనుమతినిచ్చేవారు. దీనికొరకు ద్వారపాలకులకు పురజనులందరిని గుర్తుపెట్టుకోవలసిన అవసరం ఎంతగానో ఉండేది. అలా గుర్తుపెట్టుకొని పురజనులు కానివారిని ద్వారపాలకులు ఆటంకపరచి నగర ప్రవేశాన్ని అడ్డుకునేవారు. దానికొరకు ద్వారపాలకులు తమ సతిని ఎంతో ఉన్నతస్థాయిలో ఉంచుకునేవారు. అందరితో పరియచాలు పెంచుకొని వారితో మాట్లాడుతూ వారితో సన్నిహితంగా ఉండేవారు. ఇలాంటి ప్రక్రియ సతి అభివృద్ధిలో ఇంద్రియ ద్వారాల దగ్గర జరుగుతుంది.

సతియొక్క ఉన్నతస్థితిని చెప్పడానికి బాహియా అనే సంచార సన్యాసి యొక్క దృష్టాంతం ఇవ్వబడింది. బాహియా అనే సంచారసన్యాసి తాను ముక్తుడనని భ్రమపడుతూ ఉండేవాడు. కాని ఎవరో వచ్చి అయ్యా తమరు ఇంకా ముక్తి పొందలేదు. ముక్తిమార్గాన్ని బుద్ధుడు అందరికీ నేర్పిస్తున్నాడు. మీరు ఆయన దగ్గరకు వెళ్ళి ముక్తిమార్గాన్ని నేర్చుకొని సాధనచేసి యుక్తినా ప్రాప్తించుకోండి అని సలహా ఇచ్చాడు. బాహియా కురువృద్ధుడు అయినప్పటికీ బుద్ధుడి ద్వారా ముక్తిమార్గాన్ని నేర్చుకోవాలన్న దృఢసంకల్పంలో అత్యధిక దూరాన్ని కూడా లెక్కచెయ్యకుండా నడుచుకుంటూ వెళ్ళాడు. ఆ సమయంలో బుద్ధుడు భిక్ష కొరకు నగరంలోకి వెళ్ళాడన్న సంగతి తెలుసుకొని వెంటనే పరుగుపరుగున నగరంలోకి బుద్ధుడిని కలుసుకోవడానికి వెళ్ళాడు. అదృష్టవశాత్తు అతడు బుద్ధుడిని ఒక రహదారిపై అయ్యా! నాకు మోక్షమార్గాన్ని నేర్పించమని వేడుకున్నాడు. బుద్ధుడు కరుణాహృదయంతో బాహియా నిజస్థితిని దివ్యదృష్టితో తెలుసుకొని మోక్షమార్గ సాధనా విధానాన్ని క్లుప్తంగా అక్కడికక్కడే తెలిపాడు. బాహియా గొప్ప జ్ఞాని కావడంతో బుద్ధుడు క్లుప్తంగా చెప్పిన మోక్షమార్గాన్ని అర్థంచేసుకున్నాడు. అక్కడే రోడ్డుప్రక్కన ఆసీనుడై ధ్యానంలో మునిగిపోయి పరిపూర్ణ సతిలో మెలకువతో ఎంతో అప్రమత్తతతో సాధనచేసి అప్పటికప్పుడు మోక్షాన్ని ప్రాప్తించుకున్నాడు. ధన్యుడయ్యాడు. బుద్ధుడు బాహియాకు మోక్షమార్గాన్ని క్లుప్తంగా ఈ క్రిందివిధంగా బోధించాడు.

"మీరు ఎప్పుడైనా దేనినైనా చూస్తారు. అక్కడ కేవలం చూడటం మాత్రమే ఉండాలి. దేనినైతే వింటారో అప్పుడు అక్కడ కేవలం వినడం మాత్రమే ఉండాలి. దేనినైతే ఇంద్రియాల ద్వారా గ్రహిస్తారో అప్పుడు అక్కడ కేవలం గ్రహింపు మాత్రమే ఉండాలి. దేనినైతే తెలుసుకుంటారో అప్పుడు అక్కడ కేవలం తెలుసుకోవడం మాత్రమే ఉండాలి. దానిలో మీరు లీనంకాకూడదు. లీనం కాకుండా ఉన్నప్పుడు మీరు దానిలో ఉండరు. వాటి మధ్యలోనూ ఉండరు. ఇలా జరిగినప్పుడు మాత్రమే దుఃఖనివారణ జరిగి మోక్షప్రాప్తి సిద్ధిస్తుంది."

బుద్ధుడు చెప్పిన సంక్షిప్త ముక్తిమార్గం యొక్క గూఢర్థం ఏమంటే కన్ను, చెవి, ముక్కు, నాలుక, చర్మం మరియు మనస్సు అనే ఈ ఆరుఇంద్రియ ద్వారాల్లో ఏ క్షణంలో ఏ ద్వారానికి ఏ విషయం తటస్థపడితే అనగా కంటికి రూపం, చెవులకు శబ్దం, ముక్కుకు వాసన, నాలుకకు రుచి, చర్మానికి స్పర్శ మనసుకు ఆలోచన తాకితే ఆ క్షణంలో సాధకుడికి దాని ఎరుక ఉండాలి. కేవలం ఎరుక మాత్రమే ఉండాలి. ఏ క్షణంలో ఏది జరుగుతుంటే, ఆ క్షణంలో సాధకుడికి దాని

ఎరుక ఉండాలి. కేవలం ఎరుక మాత్రమే ఉండాలి. ఏ క్షణంలో ఏది జరుగుతుంటే, ఆ క్షణంలో దాన్నే తెలుసుకోవాలి. కేవలం తెలుసుకొని ఎలాంటి ప్రతిక్రియా చెయ్యకుండా తదిన్దంగా ఉండిపోవాలి. ఎప్పుడైతే నేను, నాది పరంగా అనుభూతుల గుర్తింపు ఉండదో అప్పుడే సాధకుడికి మోక్షమార్గం ఆవిష్కరింపబడటం ప్రారంభమవుతుంది. ఇలా విమోచనమార్గం ఆవిష్కరింపబడుతున్నప్పుడు అవి అన్నిరకాల అనుబంధాలకు అతీతంగా ప్రవర్తిస్తూ వాటిలో లీనంకాకుండా, ప్రతిష్ఠింపబడకుండా ఉన్నప్పుడు సాధకుడు ఇక్కడ ఉన్నా అక్కడ ఉన్నా లేక రెంటికి మధ్యన ఉన్నా ఏమీ తేడాకనబడదు. ఆ స్థితిలో మోక్షమార్గం అన్నిరకాల దుఃఖాలను అధిగమించి ప్రయాణం కొనసాగిస్తుంది.

బాహియా ఎంతో సాధనచేసిన గొప్ప జ్ఞాని కావడంవలన బుద్ధుడు చెప్పింది వెంటనే అర్థమై సాధనకు ఆసీనుడు కాగానే అసంకల్పితంగానే అతడిలో మోక్షమార్గ జ్ఞాన వెలుగు ప్రకాశించింది. కాని అందరికీ అలా జరగదు. ఇతరులకు ఈ మోక్షసిద్ధి నిరంతర సాధనవల్ల మాత్రమే క్రమక్రమంగా లభిస్తూ ఉంటుంది.

ఇక్కడ ఇంకో ఉదాహరణ ఈ విషయాన్ని విశదీకరించడానికి చెప్పబడింది. అడివిలో తిరిగే అడవి ఏనుగును స్వాధీనపరచుకోవటం ఒక్కసారిగా వీలుకాదు. అలా చెయ్యడం ఎవ్వరి తరం కాదు. ఆ అడవి ఏనుగును క్రమక్రమంగా వివిధ మార్గాలద్వారా నియంత్రించి లొంగదీసుకోవలసివస్తుంది. అడవిలో పెరిగిన ఏనుగుకు ఎన్నో అలవాట్లు పుట్టినప్పటినుంచి దానికి అలవాటు అవుతాయి. వాటిని తొలగించి మానవ సమాజంలో తిరిగే సాధుజంతువుగా మార్చడానికి ఎంతో ప్రయాసపడాల్సి ఉంటుంది. సాధనలో సతి యొక్క అభివృద్ధి కూడా ఇలాగే క్రమక్రమంగా జరుగుతుంది. ఇలా అభివృద్ధి సతి ఉన్నప్పుడు ఎంతో మెలకువ, అప్రమత్తత, ఎరుక సాధనలో లభిస్తాయి. ఈ విధంగా సాధకుడికి సతి గొప్ప పనిముట్టుగా పనిచేస్తూ సేవలు అందిస్తుంది. మనసుయొక్క దృష్టి శరీర కదలికలపై కేంద్రీకరించబడి ఉన్నప్పుడు ప్రతీ కదలికను మనసు గుర్తించగలుగుతుంది. అలా మనసుయొక్క దృష్టి వేరొకదానిపై కేంద్రీకరింపబడి ఉన్నప్పుడు మనసులోని ఆలోచనల యొక్క ప్రవాహవేగం తగ్గిపోతుంది. మనసులోని చంచలత్వం తగ్గుముఖం పడుతుంది. ఇతర బాహ్యవిషయాలను కూడా మనసు పట్టించుకోవటం మానేస్తుంది. ఆ స్థితిలో సాధకుడు తన మనసును శరీరంపై బంధించి ఉంచుతాడు. దానిపైనుండి దృష్టి మరల్చనివ్వడు. దానితో మనసులో బాహ్యవిషయాలపై వైరాగ్యం అభివృద్ధి చెందడం ప్రారంభమవుతుంది. మనసులోని చంచలత్వం పూర్తిగా తొలగిపోయినప్పుడు జీవితంలో కలిగే అనేక మార్పులు, చేర్పులు, సుఖాలు, దుఃఖాలు అన్నింటినీ మనసు తట్టుకొని సమతుల్యతతో నిలబడగులుగుతుంది.

శరీరంపై సతితో దృష్టి కేంద్రీకరించి మెలకువతో ఉండేవి వనాన్ని వివరించడానికి ఒక ఉదాహరణ చెప్పారు. ఒక మనిషి ఒక పెద్ద గినె నిండా నూనెతో నింపి నెత్తిమీద పెట్టుకుని నడుస్తూ ఒక్క చుక్క కూడా క్రింద పడకుండా ఎంతో మెలకువతో, అప్రమత్తంగా నడుస్తున్నప్పుడు దారిలో ఒక అందమైన అమ్మాయి పాటలు పాడుతూ డ్యాన్సులు చేస్తూ పురజనులను ఆనందపరుస్తున్నప్పటికీ దానిని పట్టించుకోకుండా ఆ మనిషి ముందుకు నడుస్తాడు. ఎందుకంటే ఒక్క నూనెచుక్క క్రింద ఒలికితే అతడి తల నరకడానికి తలా ఒక కత్తి పట్టుకొని అతడి వెంట నడుస్తున్నాడు. అందువలన ప్రాణభయంతో వాడు పూర్తిగా దృష్టిని శరీరంపై కేంద్రీకరించి అతి జాగ్రత్తగా అడుగులు వేస్తూ ఎంతో మెలకువను ప్రదర్శిస్తూ నూనె క్రిందవలకకుండా జాగ్రత్త వహిస్తూ ఉంటాడు. అలాంటి స్థితిలో అందమైన అమ్మాయిచేసే నాట్యం అతడి దృష్టిని ఆకర్షించలేకపోయింది. నూనెను తలపై పెట్టుకున్నవాడు సాధకుడు ఏమీ కాదు. మాములు సామాన్య మానవుడు, కానీ ఏమాత్రం పొరపాటు జరిగినా అది తనకు ప్రాణహాని కలిగిస్తుందన్న భయంచేత అతడు ఎంతో అప్రమత్తతను, మెలకువను పరిస్థితుల ప్రభావంవలన ప్రదర్శించగలిగాడు. ఇదే సతిలో ఉన్న గొప్పతనం.

ఇంకో ఉదాహరణలో సతి శక్తిని వివరించడానికి చెప్పబడింది. ఒక బలమైన స్తంభానికి ఆరు అడవి జంతువులను బంధించి ఉంచితే అవి ఎంత సంఘర్షణ జరిపినప్పటికీ అవి తన బంధాన్ని విడిపించుకోలేకపోతాయి. అలా అవి అలసిపోయేదాకా పోరాడి చివరకు శక్తి లేకపోవడంవలన నీరసించి అవి ఎప్పుడో ఒకప్పుడు విధిలేక నేలపై కూలబడి విశ్రాంతి తీసుకుంటాయి. సరిగ్గా ఇదేవిధంగా మనసును శరీరంపై బంధించినప్పుడు జరుగుతుంది. సాధన

ద్వారా మనసు అలసిపోయి తన చంచల అలవాట్లను మానుకొని శరీరం ఒక్కదానిపైననే దృష్టి ఉంచి సాధన చెయ్యడానికి సహకరిస్తుంది. ఇలాంటి స్థితిలో మనసులో రాగద్వేషాలు జాగృతమైనప్పటికీ ప్రతిక్రియ చెయ్యకుండా తటస్థంగా ఉండగలుగుతుంది. ఈ స్థితిలో మనసులో చంచలత్వం అదుపులోకి వస్తుంది. సాధకుడు మనసును శరీరంపై బంధించి ఉంచగలుగుతాడు. నగర ద్వారాల దగ్గర కాపలాకాస్తున్న ద్వారపాలకుల్లో మెలకువలో ఉన్న శక్తిని వెలికితీస్తుంది. ఒక్క గతితో కూడిన మెలకువ అప్రయత్తతలో కూడిన ఎరుక సంచార సన్యాసి బాహియా విషయంలో కొద్దిపాటి సాధన ద్వారా మోక్షానుభవాన్ని కలిగించింది. సతితో కూడిన మెలకువ ద్వారా బాహ్యంగా ఉన్న అనేక ఆకర్షణలను ఎదుర్కొని తొలగించుకోగల శక్తి సాధకులకు కలుగుతుంది.

**మనసుకు హృదయానికి ఉన్న సంబంధం :**

సతిని శరీరంలో లేక మనసులో ఎక్కడైనా ప్రతిష్టించడాన్ని బుద్ధుడు సతిపట్ఠానం అని చెప్పాడు. సతి అంటే పైన చెప్పినట్లుగా మెలకువ, అప్రమత్తత ఎరుక పట్ఠానం అంటే ప్రతిష్ఠించడం. పాళీ భాషలో పట్ఠానం అంటే ప్రత్యయం లేక కారణం అని అర్థం. సతిపట్ఠానాన్ని రెండురకాలుగా చెప్పవచ్చును. మనసును ఒక విషయంపై తదేకంగా దృష్టిని కేంద్రీకరించి ఎంతో మెలకువతో అప్రమత్తతతో గమనిస్తూ ఆ విషయాన్ని ఎరుకలో ఉంచుకోవడాన్ని మరియు అలాంటి సతిని ఆ విషయంపై నిరంతరంగా బంధించి ప్రతిష్ఠించటాన్ని సతిపట్ఠానం అని చెప్పారు. ఇంకోవిధంగా అర్థం చెప్పుకున్నప్పుడు ఏఏ కారణాలవల్ల మనసులోని సతి శరీరంపై స్థాపించబడుతుందో మెలకువతో అప్రమత్తతతో తెలుసుకోవడాన్ని సతిపట్ఠానం అని చెప్పారు.

సతిని ప్రతిష్ఠించడానికి నాలుగు విధాలైన అంచనాలు ఉన్నాయి. 1. శరీరం, 2. వేదనలు, 3. మనసు, 4. చిత్తధర్మాలు. సతిపట్ఠాన సాధనావిధానం వివరంగా సతిపట్ఠాన సుత్తంలో బుద్ధుడు వివరంగా విశదీకరించి చెప్పాడు. ఈ నాలుగు అంచనాలు సాధకులు తనకు అనుకూలంగా ఉన్నవాటిని ఉపయోగించి సాధనచేసి సతిని ప్రతిష్టించుకోవాలని చెప్పారు.

**I. నాలుగురకాల సాధకులకు పనికి వచ్చే నాలుగు రకాల ఆలంబనాలు ఇలా ఉన్నాయి :**

1. రాగద్వేషాలకు అధిక ప్రాముఖ్యతనిచ్చే సాధకులు శరీరం మరియు వేదనలపై దృష్టిని కేంద్రీకరించి సతిని ప్రతిష్ఠించుకోవాలి.

2. తర్కవాదులు చేయు సాధకులు మనసుపైన లేక మనసులోని ధర్మాలపైన దృష్టిని కేంద్రీకరించి సతిని ప్రతిష్ఠించుకోవాలి.

3. ఎల్లవేళలా ఆలోచిస్తూ ప్రతిక్రియలు చేసే సాధకులు వేదనలు, ధర్మాలపై దృష్టిని కేంద్రీకరించి సతిని వాటిలో ప్రతిష్ఠించాలి.

4. ఎల్లవేళలా అతి జాగ్రత్తను ప్రదర్శిస్తూ అన్నింటిపట్లా ఆచితూచి వ్యవహరిస్తూ ఉంటారో అలాంటి సాధకులు శరీరం యొక్క స్థూలకదలికలపై తన స్థూల మానసిక స్థితిగతులపై దృష్టి కేంద్రీకరించి సతిని ప్రతిష్ఠించాలి అని చెప్పబడింది. సతిపట్ఠాన ఈ క్రింది నాలుగు చిత్రభ్రాంతులపై దృష్టిని కేంద్రీకరించి సతిని ప్రతిష్ఠించవచ్చునని చెప్పారు. దీనిప్రకారంగా ఏదైతే ఆకర్షణ లేకుండా ఉంటుందో అసంతృప్తిని కలిగిస్తూ ఉంటుందో ఏదైతే అనిత్యమైనదో ఏదైతే నాది కాదు దానిని ఆకర్షణీయమైనదానిగా సంతృప్తి కలిగించేదానిగా శాశ్వతమైనదానిగా, నేను, నాది అనే భ్రమ కలిగించేదానిలా చిత్తభ్రాంతి కలిగిస్తూ ఉంటుంది. నిజానికి ఎవరైతే సతిని శరీరంపై ప్రతిష్ఠింపగలిగారో అలాంటివారికి శరీరంలో ఎలాంటి ఆకర్షణతోకూడిన సౌందర్యం ఏదీ లేదని తెలిసివస్తుంది. వేదనలపై సతిని ప్రతిష్ఠించినప్పుడు అనిత్యమైన సుఖసంతోషాలతో శాశ్వతమైనది ఏదీ లేదని తెలిసివస్తుంది. చిత్తంపై సతిని ప్రతిష్ఠించినప్పుడు మనసుకు కలిగే అన్నిరకాల అనుభవాలు, అనుభూతులు అనిత్యాలే అని తెలిసివస్తుంది. చిత్తంలోని ధర్మాలపై సతిని ప్రతిష్ఠించినపుడు తనలో నేను, నాది అనే శాశ్వతమైనది ఏదీ లేదని అలా ఉందనుకోవడం కేవలం తన భ్రమ మాత్రమే తప్ప మరింకేదీ కాదని తెలిసివస్తూంది.

బుద్ధుడి ఉపదేశాల్లో మనస్సు అత్యధిక ప్రాధాన్యత వహిస్తుంది. మానవుల్లో జ్ఞానాన్ని అత్యంత ఉన్నత స్థాయికి చేర్చడమే బుద్ధుడి ఉపదేశాల లక్ష్యం. ఈ కారణంగా బుద్ధుడి ఉపదేశాలన్నీ ఎంతో సరళంగా అందరికీ అర్థమయ్యేవిధంగా ఉంటాయి. వాటిలో అర్థంకాని రహస్యం అంటూ ఏదీ ఉండదు. మానవులందరికీ పనికివచ్చే విషయాలే బుద్ధుడి బోధనల్లో ఉంటాయి. అందువల్ల వీటికి అంతం ఉండదు. అవి మానవుల హృదయాలలో అత్యంత సమీపంలో

ఉంటాయి. బుద్ధుడి బోధనలు మనసులోనే ప్రారంభమవుతాయి. అన్ని బోధనలకు మనసే కేంద్రబిందువుగా ఉంటుంది. ఇది మొదలయితే చిత్తంయొక్క విముక్తి పవిత్రత, నిర్మలత్వం అంత్యమవుతుంది.

క్రైస్తవుల మతగ్రంథమైన బైబిల్ ఇలా ప్రారంభించబడింది – "భగవంతుడు స్వర్గాన్ని సృష్టించాడు. భూమిని కూడా సృష్టించాడు. బౌద్ధమత సాహిత్యంలో ప్రసిద్ధికెక్కిన గ్రంథం ధమ్మపాదం కూడా ఇలాగే ప్రారంభమవుతుంది. దీనిప్రకారంగా మనిషిలోని మనసు అన్నింటినీ గ్రహిస్తుంది. వాటిపై ఆధిపత్యం వహించి కొత్త ప్రపంచాన్ని సృష్టించుతుంది. ఈ సత్యాన్ని ఇంతవరకు ఎవరూ ఖండించలేదు. క్రైస్తవమతం ఊహాలోక పరిధిని దాటి విహరిస్తూ ఉంటే బౌద్ధమతం మనిషి హృదయంలోకి చొచ్చుకొనిపోయి మానవాళికి అత్యంత సమీపంలో ఉంది. ఎందుకంటే మనసుకన్నా మనిషికి సమీపమైన వస్తువు మరింకోటి ఏదీ లేదు. మనసు ద్వారానే మనిషి బాహ్యప్రపంచాన్ని తెలుసుకోవాలి. ఎందుకంటే మనసు లేని శరీరం శవం అవుతుంది. ప్రాణం లేని శవం ఏం తెలుసుకోగలుగుతుంది? అందువలన మనసును అర్థంచేసుకోగలిగితే ప్రపంచంలోని అన్నింటినీ అర్థంచేసుకొనవచ్చును అని మహాయాన బుద్ధత్వంలో చెప్పబడింది (రత్న–మేఘసూత్ర).

మనసునుండే అన్నీ వెలువడుతున్నాయి. నాటి ఊటవలె అవి మనసు లోలోతుల్లోనుండి పైకి ఉబికివస్తాయి. అన్నిరకాల పుణ్య, పాప విషయాలు, కుశల అకుశల ధర్మాలు అన్ని చిత్తం ద్వారానే మనకు తెలిసివస్తాయి. ఇవన్నీ మనిషి అంతర్ముఖంలోనే వెలువడి మనిషిని లొంగదీసుకుంటాయి అని ధమ్మపాదంలో మొదటి రెండు శ్లోకాలలో చెప్పబడింది. అనేక సందర్భాలలో బుద్ధుడు ఈ క్రిందివిధంగా ప్రబోధించాడు.

"ఏదైతే పాపం అని చెప్పబడిందో అది పాపంతోనే సంబంధం ఏర్పరచుకొని ఉంటుంది. ఆ స్థితిలో చిత్తంలో ఏది జాగృతమైనప్పటికీ అది పాపానికి సంబంధించినదే అవుతుంది."

"ఏదైతే పుణ్యం అని చెప్పబడిందో అది పుణ్యంతోనే సంబంధం ఏర్పరచుకొని ఉంటుంది. ఆ సమయంలో చిత్తంలో ఏది జాగృతమైనప్పటికీ అది పుణ్యానికి సంబంధించినదే అవుతుంది."

*(అంగుత్తర నికాయ)*

**ఆంగ్ల నుంచి అనువాదం**
**డా. వోలేటి శ్రీనివాసాచార్యులు**
**హైదరాబాద్.**
**ఫోన్ : 996 369 8956**

## ఇక మనిషైనట్లే!

ఔనూ!
మనిషి మనిషెట్లా అవుతాడు!?
మూజూస్తే కోరికల కంపు
ముట్టుకుంటే దుఃఖం బొట్లుబొట్లుగా రాలుతూ
అతని చరిత్రా
కోరికల కంపే!
చరిత్రనిండా దుఃఖపు మరకలే!!
'రంగురంగుల' సిద్ధాంతాల వాసనలు పూసుకుని
అబ్బురపరచే ఆదర్శాల వేషాలు వేసుకొని
'మనిషివేషం'లో ఉన్న ఈ మనిషి

ఔనూ
మనిషెట్లా అవుతాడు!?
బౌద్ధంలో మునగాలి
కోరికల కంపు కొట్టుకుపోతుంది!
ధర్మంలో దూకాలి
దుఃఖం చిన్నచిన్నగా చిట్లిపోతుంది!
సంఘంలో చరించాలి
ఇక మనిషైనట్లే!!

**అలజంగి మురళీధరరావు**
**విశాఖపట్నం. ఫోన్ : 944 033 5461**

# అంగుళీమాల

వ్యాఖ్యాత : మంగలి ఉపాలికి, వీధులూడ్చే సునీతునికి, అస్పృశ్యులైన స్వపాక, సుప్రియులకు, నిమ్న జాతులవారైన సుమంగళ మొదలగువారికి, కుష్టురోగి సుప్రబుద్ధునికి దీక్ష యివ్వటమే కాకుండా యశునికి, కాస్యపులకు, సారిపుత్రుడు మొగ్గలన్నలకు, బింబిసార మహారాజుకు అనాథ పిండితునకు, జీవకునికి, రాష్ట్రపాలకునికి, శాక్యులకు, ఇంకా అనేకమందికి దీక్షనిచ్చాడు తథాగతుడు. వలదని వారించినా వినకుండా గజదొంగ అంగుళీమారుడున్న ప్రాంతానికి బయలుదేరాడు ఒంటరిగా.

అంగుళీ : ఈ భయంకర కీకారణ్యంలో ఈ కొండలు, బండలు దాటి రాగల మానవుడెవరైనా ఉన్నాడా?
ఇప్పటికి పదిరోజుల నాడొకపాంథుడు దొరికాడు. వాడికుత్తుక నాకత్తికి ఎరగాలించాను. వాడి బొటనవ్రేలు శరీరాన్నుండి నరికి అంగుళిమాలలో కూర్చి ధరించాను. ఇప్పటికి 999 మందిని చంపి బొటనవ్రేళ్ళు దండగా గుచ్చాను. ఇంకొకటి కూర్చితే వేయి అవుతాయి. గురుదక్షణకు సరిపోతుంది.
(నవ్వు. అంగుళిమాల చూసుకుంటాడు)

పాట : అంగుళిమాల ధరించినవాడిని
అంగుళీమాలుడని పేరున్నవాడిని
నను కాదనగలవాడెవడు?
ఈ అడవిని దాటే మొనగాడెవరు?
(దూరంగా చూస్తాడు)
ఎవరా వచ్చే పరివ్రాజకుడు!
చీవరము దాల్చినాడు (కాషాయము కట్టినాడు)
పెద్దపెద్ద చెవులున్నాయ్
కలువలంత కనులున్నాయ్
నిర్భీతిగ నడచివచ్చు
నిర్భాగ్యుడు వీడెవడు?
తలకొట్టేస్తా
బొటనవ్రేలు నరికేస్తా
మాలలోన వ్రేలు చేర్చి
మెడలో ధరించేస్తా **(నవ్వు)**
ఎవరా పాంథుడు
చిరునవ్వులు చిందు ముఖం
ఏనుగులా నడక ఘనం
నిలువెల్లా నిర్భీతి
వస్తున్నాడిటువైపే
వలలో పడిపోయినాడు
ప్రాణంపై తీపిలేదా?
బ్రతుకుపైన మమతలేదా?
చూస్తా వీడి సోకుదనం
వేస్తా ఒక్క కత్తివేటు
తలతెగి నేలపడే పాటు
చూస్తా! చూస్తా!
చూపిస్తా నా తడాఖా

ఏయ్! బాటసారి! ఆగు! ఆగు!
ఎంత పరుగెత్తినా అందుకోలేకుంటి.
ఆగరా! పాంథా! ఆగు
అడుగు ముందుకేయబోక
అరచని వినపడదా నీకు.



గౌతముడు : ఎవరు నాయనా నీవు?
నేనిక్కడనే ఉన్నాను.
రా వత్సా! రా!

అంగుళీ : **(దగ్గరకు వెళ్తాడు. కత్తి జారిపోతుంది)**
ఎవరు స్వామీ మీరు?
కత్తి జారిపోయింది.
కాలు కదలనంటోంది
మనసులోని కాఠిన్యం
మటుమాయం అయింది
**(ఇంకా దగ్గరకు వస్తూ)**
ఏమీ యీ దివ్యమంగళరూపం!
ఏమీ యీ పున్నమి వెన్నెల తేజం!
మీ దర్శనమే నాకు సౌభాగ్యం! మీ సాంగత్యమే జన్మసాఫల్యం! **(నమస్కరించి)**
అందుకోదేవా నా నమస్కారం

గౌతముడు : వత్సా!

(ప్రతిధ్వని) హింస హింసను ప్రేరేపిస్తుంది.
ప్రేమ సత్ఫలితాలనిస్తుంది.
ద్వేషించి దూరంగా జరుగకు.
ప్రేమామృతాన్ని పదిమందికీ పంచు.
స్వార్థచింత తొలగించు.

అంగుళీ : **(తలవంచి నమస్కరిస్తాడు)**
**(శిష్యులు వస్తారు. బుద్ధం శరణం అంటూ చేరతారు. గౌతముడు అభయముద్రతో నిలబడతాడు)**

గౌతముడు : **(నిలబడి ఉండటం గమనించి అంగుళీమాలుడు ఆసనం తెచ్చివేస్తాడు. గౌతముడు దానిపైన కూర్చుంటాడు)**
సాధకులారా! నేటినుండి అంగుళీమాలుడు మనతోనే ఉంటాడు.

శిష్యుడు : అటులనే తథాగతా!

గౌతముడు : పరివ్రాజకులరా!

(ప్రతిధ్వని) అహంవలన స్వార్థం పెరుగుతుంది. వైయుక్తిక స్వార్థచింతనకు మానవులు దూరంగా జరగాలి. సృష్టిలోని ప్రతివస్తువుతో ఏకత్వ భావాన్ని అలవరచుకోవాలి. అవినాభావాన్ని అంతరంగంలో సమకూర్చుకోవాలి. అంగుళీమాలధారీ! అహింసా మార్గాన్ని అలవరచుకో. మానవసేవలో ప్రాణం పోయినా సహించు. సత్యసిద్ధి కోసం సదా శ్రమించు. నిర్వాణ మార్గంలో పయనించు.

***(– పోలవరపు కోటేశ్వరరావు)***

# వేదిక

## సంభవాని

ఉత్తమ పురుషలో అందరూ కథలు వ్రాయరు. దానివల్ల ఇబ్బందులూ, సబ్బందులూ ఉంటాయి. అయితే కొందరు ఉత్తమ పురుషలోనే బాగా వ్రాయగలుగుతారు. భావావేశం చిక్కబడి, ఘనీభవించి ఒత్తిడి తీవ్రతకు చిట్లి, పగిలి, పేలి రంగుల శకలాల అనంతాకాశమై విస్తరించుకున్నపుడు వికలమైన శకలాలను ఏరుకుంటూ, రంగుల్ని రసరూపాల్లో గుర్తుపడుతూ, నిరాకారాలకు ఆకారాల్ని ఆపాదించుకుంటూ, వసంతాల కలల రంగుల్ని అద్దుకుంటూ అబద్ధాలు చెప్పలేని అద్దాల అసలు హృదయాల్ని వెతుక్కుంటూ, ఆ ప్రయత్నంలో అప్రయత్నంగా స్ఫురించే కవిత్వాలు, తత్త్వాలు, దారాల్లేకుండా అల్లబడ్డ హారాలై, మారుతాల రుతాల్లో కొట్టుకుపోయి ఏ పదపీఠాన అర్పితమో!

అంతరంగ మథనానికి వ్యథార్తి రూపం ఇవ్వాలంటే కవితా సతి చేలాంచలాల కోసం తడువుకోక తప్పదు. భావం క్లిష్టమైనపుడు భాష చిక్కబడి కవితారూపం తీసుకుంటుంది. జీవితం సంచలనాత్మక సంఘటనల సమాహారమైనపుడు జీవితంలో అన్నీ తొందరగా జరిగిపోతున్న భావన కలుగుతుంది. ప్రేమైకజీవితానికి మరీను. ప్రేమ ఒక తత్త్వంగా జీవితాన్ని ఆవరించుకున్నప్పుడు ఇంకాను. మొదటి అనాటమీ క్లాసులో తొట్టెలో ఫార్మాల్డిహైడ్ ద్రవంలో తన రహస్యాలను కనుక్కోమని ఆహ్వానిస్తున్నట్టనిపించిన జీవరహిత శరీరం. ఎడిమా ఎఫెక్టుతో, హఠాత్తుగా, అనుకోకుండా బెజవాడ బారేజీమీద, కారు వెనుక సీట్లో, తన ఒళ్లో కళ్ల వెలుగు ఆరిపోయిన తన భర్త స్వరూపం. జాలంలాంటి కాలం తన ఋతు సమాహార హారాలతో జీవన వృక్షానికి మరల వసంత శోభను అద్దినపుడు, రసరంగుల హేల హృదయాన్ని ఉక్కిరిబిక్కిరి చేసినపుడు, సాంత్వనతో హృదయ పీఠాన్ని జాజులతో రోజాలతో అలంకరించి అధినాథుని కోసం అనవరతం నిరీక్షణే జీవితం అయినప్పుడు...

అక్షరాల ఆలాపనల్లో అంతరంగ స్వరూపుణ్ణి గుర్తుపట్టే ప్రయత్నంలో. ఎప్పుడో... ఎక్కడో.. జాడల నీడల్ని పట్టుకుని, హృదయపుళ్లెంలో పంచభక్ష్యపరమాన్నాల ప్రేమవిందును అందుకోమని అర్థించినపుడు, అంతనిస్సంకోచంగా, నిర్మలంగా అందించిన అర్పణను అందుకోవాలంటే ఎంత ధైర్యంకావాలీ! అక్షరాల అక్షయ హృదయాన్ని ఆలంబనగా చేసుకుని ఆవలి హృదయాంతఃకరణను అర్థం చేసుకునే ప్రయత్నంలో, అక్షరాలే కాదు – ప్రకృతీ సహకరిస్తుంది.

Nature sympathises with man అన్నాడు కదా ప్రకృతి ఆరాధకుడు వర్డ్స్‌వర్త్! జీవితంలో అన్నీ తొందరగా జరిగిపోయినట్టనిపించినా, అనుభూతుల ఆనందాల బరువును మోయవలసి వచ్చినప్పుడు, ఆనందాల సందోహాల సందేహాల్లో కాలం అడుగులు తడబడినపుడు వేగం ఆగిపోతుంది. ఆదివారం రావడానికి అంత ఆలస్యం! మరి! ప్రేమ ఆవరించిన కనుల్లోంచి ప్రియమైనవాళ్లని చూసినప్పుడు, అవతలివాళ్ల ప్రెజెంటేషన్ అలా ఉంచితే మన పెరసెప్షన్ ఓ రూపాన్నిచ్చుకుంటుంది. 'తన ప్రేమమూర్తిని కలిసిన మర్నాటి ఉదయం, ఎంత ఉల్లాసంగా ఉంది.. ముంగిట ముగ్గుల దగ్గర్నుంచి, తూర్పున బంగారు దుమ్మువరకు, లేమావి చిగుళ్ళు, మామిడి పిందెలు, లేని అతణ్ణి సృజించడానికీ... చుక్కల వెలుతురూ చివరికి దిగంతాన కాషాయ విషాదం – అన్ని ఆమె హృదయ సంక్షోభాన్ని ఆవిష్కరించేవే– రాని అతణ్ణి రప్పించడానికీ' ప్రేమ ప్రవాహపు పరవళ్లు సృజన శక్తులు విత్తనాన్ని ముంచెత్తి, ప్రతిసృష్టికి సంకేతించినపుడు వసంతం వెల్లివిరిస్తుంది! ఈ కథనంలో ఒక రహస్యం ఉంది మనం గమనిస్తే – రచయిత కథన సంకేతాలను ఎంతో మార్మికంగా ఆవిష్కరించారు. కథానాయిక భావుకురాలని మొదట వాక్యంలోనే సూచనలున్నాయి. అతని (శివ) జుత్తు పెరగదో, పెరగనివ్వడో, ఇది అతని 'న్యూరో' బాధకు సంకేతం. ఫార్మాల్డ్ హైడ్ తొట్టెలోని 'కట్టె' కథలోని విషాదానికి సంకేతం. ఆమె ప్రేమస్వరూపుడు 'దాదాపు నా వయస్సే. పల్చబడుతున్న జుట్టు' – ఇదీ అతని హెమటోమాకి సంకేతమే! కథనంలో మారుతున్న రుతువులన్నీ కథానాయిక మానసిక స్థితికి ప్రతిబింబాలే. కానీ, ప్రతి జీవిత కథకూ విధి తనదైన మలుపునూ, ముగింపునూ ఇస్తుంది. Hematoma Burr hole evacuation జీవితాన్ని హరిత లతానికుంజాల నుండి సమాధుల పెనం మీదికి విసిరేసినప్పుడు హృదయ దిగంతాలు కాషాయ దుఃఖంలో ముంచివేయబడతాయి. ప్రాణదీపాన్ని నిలపడంకోసం ప్రేమపాశాలు తెగిపోతాయి! జీవన వలయం మళ్లీ మొదటికొస్తుంది. "ప్రతి జీవితమూ భగవంతుడు స్వయంగా వ్రాసిన చిత్రమైన కథ'' అన్నారెవరో! అవుననడానికీ, కాదనడానికీ మనమెవరం??

*– బి.వి. రామిరెడ్డి*

# వేదిక

**మిసిమి** డిసెంబరు 2015 సంచికలో ప్రచురితమైన 'దేవాసుర యుద్ధం'లోని కొన్ని విశ్లేషణలపై ప్రతిస్పందన.

1. "దస్యులు అసుర నేపథ్యానికి చెందిన గ్రామీణ వ్యావసాయిక జనజాతులు అనే ఊహకు అవకాశముంది" అన్నారు. ఆ తర్వాత అసురులపై స్థానిక శక్తుల తిరుగుబాటు ప్రక్రియ గురించి రాస్తూ వైవాహిక సంబంధాలతో ఒనగూడిన రాజకీయ సమీకరణల గురించి చెప్పారు. ఆ సందర్భంలో, "అసురులపై యుద్ధం శ్రమదోపిడీ వ్యవస్థపై స్థానికుల తిరుగుబాటు అనుకుంటే హైహయులకు రాక్షసుల సహకారం వలసవాదుల ప్రతిచర్యగా భావించవచ్చు" అన్నారు. ఇక్కడ స్థానికులు ఎవరు? వలసవాదులు ఎవరు? గ్రామీణ వ్యావసాయిక జనజాతులలో రెండు వర్గాలున్నాయా? అనే సందేహం కలుగుతుంది. వారు స్థానికులా కాదా? అనేవీ స్పష్టంగా లేదు. శ్రమదోపిడీ వ్యవస్థ అసురులదా? దేవగణాలదా?

2. త్రేతాయుగం గురించి చెబుతూ ఇక్ష్వాకుల ప్రయత్నాలు వివరిస్తూ "సస్యశ్యామలమైన నేలను ఎడారిగా మార్చిన తాటకిని చంపి, ఆ భూములను మునుపటి స్థాయికి తేవటం తాటక వధలో ముఖ్యాంశం" అన్నారు. తాటక వధలో ముఖ్యాంశం వర్ణ ధర్మ పరిరక్షణ – గోబ్రాహ్మణ హితమూను. సేద్యపు వ్యవస్థను అది ప్రతిబింబించదు. తాటకను చంపించటానికే విశ్వామిత్రుడు తాటక వనానికి రామలక్ష్మణులను తీసుకువెళ్లాడు. తాటక బ్రహ్మ వర ప్రభావం వల్ల జన్మించింది. యక్షి, కామరూపిణి. తాటక భర్త – సుందుడు – అగస్త్యుని వల్ల మరణించాడు. అదేమిటని అడగటానికి వెళ్లిన తాటకనూ ఆమె కొడుకునూ అగస్త్యుడు శపించాడు. తాటక వికృత రూపంతో నరమాంసం తింటూ ఉండవలసి వచ్చిన శాపం అది. ఆమెను రామలక్ష్మణులు (ఇక్ష్వాకు రాకుమారులు) ముక్కు చెవులు కోసి గుండెల్లోకి బాణాలు వేసి చంపారు. "గోబ్రాహ్మణ హితార్థాయ" – "చతుర్వర్ణ హితార్థాయ" దేశ స్వాస్యసుఖాయచ – అంటూ (బాలకాండ 24–26 సర్గలో) తాటకవధ ఉత్తమం అని విశ్వామిత్రుడు ముని – పురోహిత వర్గ ప్రతినిధిగా రాముని తొందరపెట్టాడు. తాటక సహస్ర నాగబలం కలది. 'నాగబలం' అంటే ఏనుగుల బలం అని కాదు. నాగులు/నాగ సైనికుల బలం అని అర్థం. నాగులు అసుర వర్గంలోనివారు. తాటక యక్షి – యక్షులూ అసుర వర్గానికే చెందుతారు. శాపాలతో రాక్షసలయ్యేది వారే. తాటక వధ వర్ణ ధర్మ వ్యవస్థను క్షత్రియుడైన రాముడు రక్షించటాన్ని సూచిస్తుంది.

తాటక జీవించి ఉండగా భీకరంగా కనిపించిన ఆ వనం తాటక చనిపోగానే చైత్రవనంలాగా మనోహరంగా మారిపోవటం విజేతల మానసిక విభ్రమం – ఉద్వేగం మాత్రమే. జయించినవారే చరిత్ర రాస్తారు అని నానుడి.

***డా. బి. విజయభారతి***, హైదరాబాదు

---

✧ "... నాది తమిళనాడులోని హోసూరు ప్రాంతం. వెంటేశపురం అనే చిన్నగ్రామం! ప్రాథమిక విద్య తెలుగు మాధ్యమంలో మా ఊర్లోనే చదివాను. హోసూరులో ఉన్నత పాఠశాల విద్య తెలుగు మాధ్యమంలోనే, తెలుగు అధ్యాపక శిక్షణ పొంది, (హోసూరులోనే అప్పుడు శిక్షణా పాఠశాల ఉండేది) అధ్యాపకుడిగా ఉద్యోగంలో చేరాను. అధ్యాపకవృత్తిలో ఉంటూనే మద్రాసు విశ్వవిద్యాలయం నుండి తెలుగులో బి.ఏ. మరియు ఎం.ఏ పట్టాలు పొందాను. దాదాపు 30 సంవత్సరాల పాటు అధ్యాపకుడిగా ఉండి సహాయ ప్రాథమిక విద్యాధికారిగా ఉన్నత పదవిపొంది 7 సంవత్సరాలుగా పనిచేసి పదవీవిరమణ పొందాను. తర్వాత కొడుకు ఉద్యోగ రీత్యా బెంగుళూరులో స్థిరపడ్డాను. తెలుగు భాషంటే నాకు ఎనలేని అభిమానం. తెలుగు పత్రికలంటే, పుస్తకాలంటే ప్రాణం...

... కొద్ది రోజుల క్రితం బంధువుల పెళ్ళి కొరకు పలమనేరు వెళ్ళడం జరిగింది. అక్కడ పుస్తక విక్రేత వద్ద **మిసిమి** పత్రిక చూసి కొనుక్కున్నాను. కొత్త పత్రికేమో అనుకున్నాను. కాని 27వ ఏట అడుగిడిన పత్రిక అని తెలిసి ఆశ్చర్యపోయాను. గతంలో ఎన్నడో, ఎక్కడో మీ పత్రికను ఒకసారి కొని చదివినట్టు లీలగా గుర్తొచ్చింది. అట్ట కాగితంపై నాలుగు రమణీయ వర్ణ చిత్రాలు, లోపల ఆకట్టుకునే విషయాలు, ముచ్చటైన ముద్రణ, సాధారణ తెలుగు పత్రికలో కనబడని తెలుగుదనం నన్ను ఆకట్టుకొంది. వెంటనే చందాదారుడిగా చేరాలని సిద్ధమైపోయాను...

... నేడే మీకు సంవత్సర చందా రూ. 300/– ఇ.ఎమ్.ఓ పంపాను. అది మీకు ఈ ఉత్తరం చేరడానికి ముందే అంది యుంటుందని భావిస్తున్నాను. **మిసిమి** పత్రికను మార్చి 2016 నుండి ఒక సంవత్సరం పాటు పంపవలసినదిగా

కోరుతున్నాను. నేనుంటున్న ప్రాంతంలో తపాలా బట్వాడా సక్రమంగా జరగడం లేదు. ప్రస్తుతం పనిచేస్తున్న తపాలా మనిషి పత్రికలను గాని ఉత్తరాలను గాని సక్రమంగా చిరునామా దారులకు అందించడం లేదు. మోసపూరిత ప్రవృత్తి అతనిది. పోస్ట్‌మాస్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితంలేదు. కాబట్టి నేనొక ఉపాయం చేశాను. పత్రికను నా నివాస చిరునామాకు కాకుండా మాకుగల అంగడి చిరునామాకు తెప్పించుకోగోరుతున్నాను. మా అంగడి చిరునామా ఈ ఉత్తరంలో పొందుపరుస్తున్నాను. ఆ చిరునామాకు ***మిసిమి*** ని పంప ప్రార్థన..."

**– ఆర్. శ్రీనివాస్,** *బెంగుళూరు*

✧ "... మీరు రాసిన *కథలెందుకు ?* చాలా బాగుంది. ముఖ్యంగా తొమ్మిది పాయింట్లతో కథంటే ఏమిటి, ఎలా వుండాలి, ఎలా వుంటే బాగుంటుందనంటూ మీ అభిప్రాయాలు చక్కగా చెప్పారు. అక్షరాలకు కథ ఆటమైదానం వంటిది. బాగుంది వర్ణన. కథకులు తమ అనుభవాలను భావితరాలకు కథనం ద్వారా అందిస్తారు. మనం కథలో సృష్టించే పాత్రలు ప్రేమ, దేవతలు, దెయ్యాలు అన్నీ మన చుట్టూవున్న నిజాలకు అస్పష్టమైన రూపాలే! అంటూ కథలకు సంబంధించి ఎన్నో జీవిత సత్యాలు చెప్పుకొచ్చారు. సృజనాత్మకతకు నెలవైన సాహిత్య ప్రక్రియల్లో కథది అగ్రస్థానం. తక్కువ పరిధిలో ఎక్కువ అంశాలను సంక్షిప్తీకరించి, ఆకర్షణీయంగా, ఆసక్తిదాయకంగా ఎంత మంది రచయితలు చెప్పగలుగుతున్నారు? ఎంత మంది సాంఘిక బాధ్యతతో కథారచనలు చేస్తున్నారు? ఇవన్నీ ఇప్పుడు మన ముందున్న ప్రశ్నలు... మీరు ***మిసిమి***లో కథలు, కవితలు ప్రచురించాల్సిన ఆవస్యకత వుందా అంటూనే మన కథలు ఇంకా మట్టిగోడలు గీకుతున్నాయేమిటి? ఇంకా ఆధునికమనే కవితలు ఊరు చెరువు దాటలేదేమిటి? అనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. అటువంటి కథలకు, కవితలకు చాలా చాల పత్రికల్లో ప్రముఖస్థానం ఎటూ వుంది కదా! ***మిసిమి*** ఈ పాతికేళ్ళ ప్రస్థానంలో వాటి జోలికి వెళ్ళకుండానే పాఠకుల మనసుల్లో సుస్థిర స్థానాన్ని ఏర్పరుచుకోలేదా? కొత్తగా వాటిని ప్రచురించటం వల్ల ***మిసిమి***ప్రత్యేకత కొంత తగ్గుతుందేమో! ఆలోచించండి. ***మిసిమి***లాటి పత్రిక ఒక్కటే ***మిసిమి***లాగా నడుస్తోంది. అందుకు మీ అందరి కృషి మెచ్చుకోదగింది. దీనినిట్లాగే కొనసాగనీయండి.... నాగార్జున సాగర్ కట్టడం గూర్చి అందించిన వ్యాసం నిజంగా చెరగని జ్ఞాపకం. చాలా బాగుంది. ఆధునిక దేవాలయం వెనుక కథనంతా కళ్ళకు కట్టినట్లు చూపిన కె. వెంకటేశ్వర్లు గారికి అభినందనలు. మాంటిసోరి కోటేశ్వరమ్మగారి గురించి, *ల్యాబ్ కేస్* వ్యాసాలు బాగున్నాయి... డా. ఈమని శివనాగిరెడ్డి గారి *ఎల్లోరా కైలాసనాథాలయం* బాగుంది. 80వ పేజీ రాష్ట్రకూట రాజైన మొదటి కృష్ణుడు కీ. 776 నుండి 773 వరకు పాలించి... అని తప్పుగ ప్రచురింపబడినట్లుంది. 783 వరకు అని వుండాలేమో! ఒకసారి పరిశీలించండి... ***మిసిమి***ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్న మీ అందరి కృషి అభినందనీయం..."

**– విజయబక్ష్,** *మండపేట*

✧ "... నాటకం సమాజహితం కోసం– సమాజంలో మార్పుకోసం. *కన్యాశుల్కం* నాటకం ఒక శతాబ్దాన్నే కదిలించింది. గొప్ప ప్రయోగం!... ఆ నాటకం ప్రభావంతో కన్యాశుల్కం సాంప్రదాయం అంతరించిపోయింది. వరకట్న ప్రభావం పెరిగిపోయింది. తెలుగునాటకరంగం వున్నంత వరకు కన్యాశుల్కంలో – అప్పారావుగారు జీవిస్తూనే వుంటారు...
... తరువాత కాలంలో కాళ్లకూరి నారాయణరావుగారి *చింతామణి* కూడా అంతటి ప్రభావాన్ని సమాజంలో కల్గించిందన్న మాట వాస్తవం! ఈనాటికీ చింతామణి జీవిస్తూనే వుంది...
ఓ రకంగా ఆనాటి సమాజంపై విరుచుకుపడింది. ఈనాడు నాటకంలో మూల రచనను వదలివేసి అసభ్య శృంగారంలో నడుస్తున్నది. ప్రజలు ఆదరిస్తున్నారు... ఈ నాటక ప్రభావంతో కళావంతులు కనుమరుగైపోయారు. *మధుసేవ* చాలా గొప్ప రచన. గొప్ప నాటకం సుమా! సమాజం మధుసేవలో మునిగిపోతున్నది. ఈ నాటక ప్రయోజనం చాలా అవసరం. నారాయణరావుగారు – అప్పారావుగారు – వీరేశలింగంగారు సమాజాన్ని ఆరోగ్యవంతం చెయ్యాలనే తపస్సుతో వ్రాసారు. జాతిని చైతన్య వంతం చేశారనడంలో సందేహం లేదు.... ఇక – ***మిసిమి*** లో ప్రతి రచనా బావుంటుంది. నా గుండెను కదిలిస్తుంది. ఒక్కరోజు ఆలస్యమయితే గుండె తహతహలాడిపోతుంది. మీ కృషి ఫలిస్తుంది. రవీంద్రనాథ్  ఆశయాన్ని సమర్థంగా నిర్వహిస్తున్నారు. విజయోస్తు!..."

**– చెరుకువాడ వెంకట్రామయ్య,** *విస్సాకోడేరు*

# చదవండి...

– ఎన్నార్కె




✦ **శ్రీ ధూర్జటి శతకము :** తెలుగు పద్య సాహిత్యంలో ప్రౌఢ కవులుగా పేరుగాంచిన శ్రీ పోకూరి కాశీపత్యవధాని రచన. స్వయం కృషితో సంస్కృతాంధ్ర నేర్చుకున్నారు. గద్వాల సంస్థానంలో ఆస్థాన కవిగా పనిచేశారు. ఈ విద్వత్ కవి జీవిత విశేషాలతో పాటు ఈ శతక పద్యాల అర్థ తాత్పర్యాలతో ఈ పుస్తకం ప్రచురించారు. ప్రౌఢ కవిత్వాన్ని మెచ్చేవారికిదొక వెలలేని కానుక.
*పేజీలు : 72, వెల : ₹ 40/–, ప్రతులకు – ఫోన్ : 9399962118*




✦ **నానీ పంచశతి కవిత్వం :** రచయిత ఎన్.సి. హెచ్ చక్రవర్తి. జీవితంలోని వాస్తవ సత్యాలను అందంగా, నానీల రూపంలో వెలువరించారు. రాబోయే తీరంలో పాఠకులు దీనిని quotable quotes గా గ్రహించ వచ్చు. *పేజీలు : 185, వెల : ₹ 75/–, ప్రతులకు – ఫోన్ : 93999 58069*

రచయిత నాగరాజు రామస్వామి ప్రపంచ దేశాలను దర్శించి ప్రపంచ సాహిత్యాన్ని చదివి ఆకళింపు చేసుకొని తనదైన శైలిలో కొన్ని స్వీయ రచనలు, కొన్ని అనువాద కవితలు ప్రచురించారు. వీరు కొంత కాలం శాంతినికేతన్‌లో శిక్షణ పొందిన వ్యక్తి. వీరి రచనలలో కథావస్తువు, శైలి, భావన, చిత్రణ, కవితాశక్తి ప్రతి అణువులో నిభిడమై ఉన్నాయి. కవిత్వంలో సాంద్రతతో పాటుగా గ్రాంథిక పదాల ఎంపిక ఎక్కువగా కనపడుతుంది. ప్రౌఢ వచనం వ్రాసినా మనసు ఆకట్టుకొనేలా ఉంది.




✦ 1. **ఈ పుడమి కవిత్వం ఆగదు :** జాన్ కీట్స్ కవితా వైభవం. నాగరాజు రామస్వామి అనువాద కవిత్వం. ఆంగ్లసాహిత్యంతో పరిచయమున్న వారెవరైనా కీట్స్‌ను చదవకుండా, చదివిన తరువాత అతన్ని పదే పదే స్మరించకుండా ఉండగలరా? అతని మధుర కవిత్వాన్ని తెలుగు వారికి అందించాలనే ఒక తపనతో అనువాదం చేశారు రచయిత. ఒక భాషలో పేరు తెచ్చుకున్న రచనకు మరొక భాషలో అనుసృజన సిన్సియర్‌గా చేయటం అగ్నిపరీక్షే! ఆయన కొన్ని పద సంకేతాలను కొత్తగా సమకూర్చారు. Romantic ను రమ్మాంతిక మని, Sensual Poet ను ఐంద్రిక కవి – అని ఇలా అసలు అర్థానికి దగ్గరగా అనువదించారు. కీట్స్ రచనలో పాటు షెల్లీ వ్రాసిన ఎలిజీకి అనువాదాన్ని కూడా ఇందులో చేర్చారు. *పేజీలు : 130, వెల : ₹ 140/–, ప్రతులకు – ఫోన్ : 9100229604*





నాగరాజు రామస్వామి

✦ 2. **గూటికి చేరిన పాట :** ఇది స్వీయ కవితానుభూతి.
*పేజీలు : 120, వెల : ₹ 120/–, ప్రతులకు –*




✦ 3. **అనుధ్వని :** ఇందులో అనేక కవితా సాంప్రదాయలు కాన వస్తాయి. పూర్వ పరిష్ట కవులు, సాదీ అరేబియన్ కవులు, ఓమాన్ కవులు, సమకాలీన భారతీయ కవులు డా॥ టి. ఆర్. చక్రవర్తి మున్నగు వారి ఆంగ్ల కవితల అనువాదాలు. ఇందులో భాష సరళంగా సాగిపోయింది. సమకాలీన భారతీయ కవిత్వం మీద ప్రచురించిన ఒక ప్రత్యేక సంచిక నుంచి అనేక అనువాదాలు చేశారు. *పేజీలు : 124, వెల : ₹ 60/–, ప్రతులకు –*




✦ 4. **అనుస్వరం :** వెల : 100/– పేజీలు : 122 తెలుగులో గ్లోబలైజేషను వల్ల ఏర్పడ్డ సంస్కృతిక జీవితపు ఖాళీలు అనేక కోణాలలో దర్శించి మానసికమైన అనుభూతులు, అనుబంధాలు, అనుభవాలను రంగరించిన కవితా సమ్మేళనం. ప్రతీ ప్రాంతీయతకు ప్రత్యేకతలు, అస్తిత్వాలు ఉంటాయి. ఇది భాషలో యాసను సృష్టిస్తాయి. అనువాదకునికి రెండు భాషలు తెలిసి ఉండటమే కాదు. వాటిలోని సామెతలను, ఇడియమును విగ్గటించే నేర్పు ఉండాలి. ఇవి కవిలో ఉండబట్టే అనువాదాలు రాణించాయి. మృత్యు సంకేతన మధ్యలో కూడ సౌందర్యాన్వేషణ వీడని కవి పుంగవులు వీరు. ఇందులో మొత్తం 57 గీతాలున్నాయి. అమ్మంగి వారు ముందు మాట చదవదగింది.
*పేజీలు : 120, వెల : ₹ 120/–, ప్రతులకు –*




✦ **మదన్ మోహన్ మాలవీయ :** సీతారాం చతుర్వేది హిందీ మూలానికి జె.లక్ష్మిరెడ్డి తెలుగు అనువాదం చేశారు. భారత ప్రభుత్వపు సమాచార – ప్రసార మంత్రిత్వశాఖ, భారతదేశ ప్రగతిలోను, స్వాతంత్ర పోరాటంలోను ప్రముఖపాత్ర వహించిన మహనీయుల వ్యక్తిత్వానికి దర్పణంగా, వారి గురించి సాధికారంగా రాయగలిగినవారికే ఆ బాధ్యత అప్పగించారు. దీన్ని అంతే ఉన్నతంగా అనువదించారు రెడ్డిగారు.

*పేజీలు : 150, వెల : ₹ 120/– ప్రతులకు – ప్రచురణల విభాగం – సమాచార – ప్రసార మంత్రిత్వశాఖ భారత ప్రభుత్వం ఢిల్లీ.*



✦ **జ్ఞాపకం చేసుకోండి ఎప్పుడైనా... (అమరవీరుల ఉత్తరాలు):** 1857 నాటి ప్రథమ భారత స్వతంత్ర సంగ్రామం నుండి 1930 నాటి భగత్‌సింగ్ వరకు అనేకమంది విప్లవ వీరులు దేశ దాశ్య విముక్తి కోసం తమ ప్రాణాలను లెక్కచేయకుండా పోరాటం సాగించారు. ఆ సమయంలో వారు తమ ఆత్మీయులకు వ్రాసుకున్న ఉత్తరాలలో మనకు వారిలోని దేశభక్తితోపాటుగా భావోద్వేగంతో కూడిన అనేక అంశాలను తెలుసుకునే వీలు కల్పిస్తుంది ఈ పుస్తకం. రాణీ లక్ష్మీభాయ్, నానాసాహెబ్, అహ్మద్ అలీఖాన్, రామ్‌విలాస్ బిస్మిల్, బోసు మొదలైనవారి ఉత్తరాలు చదివితే రక్తం ఉడుకెత్తుతుంది. భగత్‌సింగ్ అతని మిత్రుల గురించి ఎక్కువ పేజీలు కేటాయించబడ్డాయి. ఒక తరంవారి చిత్తశుద్ధి, త్యాగనిరతికి ఇవి ప్రత్యక్ష సాక్ష్యాలు. ఇది అనువాదం కాదన్నంతగా అనుసృజన చేశారు జె. లక్ష్మిరెడ్డి.

*పేజీలు : 170, వెల : ₹ 130/– ప్రతులకు – ప్రచురణల విభాగం – సమాచార – ప్రసార మంత్రిత్వశాఖ భారత ప్రభుత్వం ఢిల్లీ.*




✦ **కవిసేన మేనిఫెస్టో (ఆధునిక కావ్యశాస్త్రమ్) :** గుంటూరు శేషేంద్రశర్మ. ఎంతోకాలం నుంచి ఎంతోమంది ఎదురుచూస్తున్న ఈ *కవిసేన మేనిఫెస్టో* మూడవ ముద్రణ చూడముచ్చటగా మార్కెట్‌లోకి వచ్చింది. కవిత్వం ఒక శబ్దశిల్పమా? కవిత్వం ఒక ఆత్మకళా? కవి అవడానికి పాండిత్యం ఎందుకు? లాంటి విషయవిశ్లేషణలు ఎవరినైనా దీర్ఘాలోచనలో పడేస్తాయి. చదివి, ఆలోచించదగ్గ పుస్తకం.

*పేజీలు : 250, వెల : ₹ 300/– ప్రతులు అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలులో లభ్యం.*


తల్లావఝ్ఝుల పతంజలి శాస్త్రి




తల్లావఝ్ఝుల పతంజలి శాస్త్రి పురావస్తు శాస్త్రంలో పి.హెచ్‌డి చేసి అధ్యాపక వృత్తిని చేపట్టి ప్రకృతిపైనున్న మమకారంతో పూర్తి పర్యావరణ కార్యకర్తగా రాజమహేంద్రవరంలో ఎన్విరాన్‌మెంట్ సెంటర్‌ను స్థాపించి ప్రజలలో పర్యావరణం పట్ల అవగాహనను పెంచుతున్నారు. లలిత కళలపై ప్రత్యేక అభిమానమేకాదు మంచి పట్టు ఉంది. తెలుగు నుడికారంపై తనదైన ప్రత్యేక శైలిఉంది. విషయాన్ని చెప్పటంలో మంచి ఉత్కంఠత కలిగిస్తారు. అందుచేతనే వీరి రచనలు ఒక్క బిగిని చివరంటూ చదివిస్తాయి. అంతేకాదు పదేపదే చదవాలనిపిస్తాయి. ఈ మధ్యనే వారు మూడు పుస్తకాలను ప్రచురించాడు. ఇందులో మొదటిది ***వీరనాయకుడు*** ఇది రాజమహేంద్రవరం. నెల్లూరు, కొలనువీడు లాంటి మూడు ప్రాంతాలలో వీరనాయకుడు, బేతప్పలాంటి వీరులు చాళుక్యుల పాలనలో జరిపిన మంత్రాంగం రాజ్యాధ్యక్షతలకు సంబంధించిన ఒక చారిత్రాత్మక వృత్తాంతం. దీనిని కళ్ళకు కట్టినట్లుగా, ఆ నది ఆచార వ్యవహారాలు మనం దగ్గరుండి చూస్తున్నట్లు, అనుభూతి పొందేలా రచన చేశారు. సాహితీ ప్రియులు, చరిత్రను ప్రేమించే వారు తప్పక చదవ దగిన రచన. *పేజీలు : 85, వెల : ₹ 50/–.*




✦ **నలుపెరుపు :** కథాసంపుటి. ఇందులో మొత్తం 12 కథలున్నాయి. ఒకటి భూతకాలానికి చెందినది. జీవితాన్ని మాత్రమే పట్టుకుని ప్రయాణించే సాహిత్యం ఎప్పుడూ ఉంటుంది. చేదైన జీవితము, తేనెైన హృదయము ఆయన సాహిత్యంలో ప్రధాన లక్షణం. *పేజీలు : 100, వెల : ₹ 100/–.*




✦ **గేదెమీది పిట్ట :** పేరు చూస్తూనే ఇందులో వ్యంగ్యం అర్థమవుతుంది. ఇది వర్తమాన సాంఘిక నవల. ప్రస్తుత సమాజంపై ఒక పరిశీలన.

*పేజీలు : 120 వెల : ₹ 100/–. పై మూడు పుస్తకాలు చినుకు పబ్లికేషన్స్ వారి ప్రచురణ.*

# మిసిమి విజ్ఞానదాయకం

**మిసిమి** పత్రిక ప్రతి నెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని
ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా ₹ **300/-** తోపాటు పంపండి.
బయటి చెక్కులకు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు అదనంగా ₹ **50/-** కలపండి.

1. **పేరు :** ..............................................................
2. **చిరునామా :**
   ఇం.నెం. ..............................................................
   వీధి ..............................................................
   ఊరు ..............................................................
   పిన్ ..............................................................
   సెల్ ..............................................................
3. **సంతకం :** ..............................................................

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |



రెండు సంవత్సరాల చందాదారులకు (₹ **600+50/-**) *ఏరియల్ (షెల్లీ)* గ్రంథం బహుమతి



మూడు సంవత్సరాల చందాదారులకు (₹ **900+50/-**) *బైరన్ (జీవిత కథ)* గ్రంథం బహుమతి





నాలుగు సంవత్సరాల చందాదారులకు (₹ **1200+50/-**) *నా కథ చార్లీ చాప్లిన్* గ్రంథం బహుమతి



అయిదు సంవత్సరాల చందాదారులకు (₹ **1500+50/-**) **మిసిమి 2013/2014** సంచికల బౌండ్ పుస్తకం బహుమతి

**మిసిమి**
మాసపత్రిక

**మీరు బహుమతిగా పంపండి**

మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవేకదా! మీకు ప్రియమైనవారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు **మిసిమి**ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీరూ ఒక బహుమతిని పొందవచ్చు. ప్రక్కన వున్న పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంపిక చేసుకోండి. దాన్ని మీకు బహుమతిగా పంపిస్తాం. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితులకోసం చందా **మిసిమి** పేర ₹ 300/- పంపండి. వారి పూర్తి చిరునామా ఈ ప్రక్కగడులలో ఇవ్వండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని పలకరించినట్లే మంచి సారస్వతంతో....

**ఈ క్రింది బహుమతి పుస్తకాలలో**
**మీకు కావలసిన పుస్తకాన్ని ఎంచుకోండి**

1. పారాయణ వర్గ, 2. నేనొక ప్రవాహాన్ని (అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి), 3. బుద్ధ–ధమ్మ–సంఘ (జె. లక్ష్మీరెడ్డి), 4. బుద్ధుని సూత్రసముచ్చయం, 5. మానవీయ బుద్ధ, 6. యతిగీతం – వివేకానందుడు (గజ్జెల మల్లారెడ్డి), 7. అంతర్వీక్షణం, 8. దూరతీరాలలో, 9. అగాధం, 10. ఓ ఖైదీ వీరగాథ, 11. నాలో నేను (వి. అశ్వినీకుమార్), 12. **మిసిమి** వ్యాసాలు (డా. ఇన్నయ్య).

**బహుమానంగా పంపవలసినవారి చిరునామా :**
..............................................................
..............................................................
..............................................................


**మిసిమి**
మాసపత్రిక
**Kala Jyothi Process Pvt. Ltd.,**
Musheerabad, Hyderabad - 500 020. Ph. 040-27645536.



అజంతా గుహ – 1

MISIMI / **మిసిమి** / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2015-17
Date of Posting: On 29th & 30th of every month.
Date of Publication: 25.04.2016



ప్రజ్ఞాపారమిత